

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15
సంచిక: 217

శనివారం 22-4-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | VIJAYAWADA | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



సమతా మమతల పర్వం రమజాన్

'ఫిత్రా' పరమార్థం

పవిత్ర రమజాన్ మాసంలో ఆచరించబడే అనేక సత్కార్యాల్లో 'ఫిత్రా' ఒకటి. ఫిత్రా అన్న పదం ఇఫ్తార్ నుండి వచ్చింది. ఫిత్ర్ అంటే ఉపవాస విరమణ అన్నమాట. 'సదఖయే ఫిత్ర్' అంటే రోజా విరమణకు సంబంధించిన దానం అని అర్థం. ధర్మశాస్త్ర పరిభాషలో 'సదఖయే ఫిత్ర్' అంటే ఉపవాస దీక్షలు పాటించేటప్పుడు జరిగిన లోపాలకు, పొరపాట్లకు పరిహారంగా రమజాన్ నెలలో విధిగా చెల్లించవలసిన దానం అన్నమాట. రోజాలు విధిగా నిర్ధయించిన నాటినుంచే ఫిత్రాలు కూడా తప్పనిసరిగా చెల్లించాలని ముహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహివసల్లం ఆదేశించారు.

మారిన కాలాన్ని, నేటి పరిస్థితుల్ని దృష్టిలో ఉంచుకొని ఆహార పదార్థాలు, వస్త్రాలు, నగదు ఏ రూపంలో అయినా ఫిత్రా చెల్లించవచ్చు. కనుక పవిత్ర రమజాన్ మాసంలో చిత్తశుద్ధితో అన్నిరకాల ఆరాధనలు ఆచరిస్తూ, ఫిత్రాలను కూడా బాధ్యతాయుతంగా నెరవేర్చాలి. ఈ పవిత్ర మాసంలో ఏదో ఒక రకంగా, ఎంతో కొంత ప్రయోజనం చేకూర్చి, తమ పరిధిలో కొందరి మోముపైనైనా చిరునవ్వులు చూడగలిగితే అంతకంటే మహాభాగ్యం ఇంకేముంటుంది! అల్లాహ్ అందరికీ రమజాన్‌ను సద్వినియోగం చేసుకునే సద్బుద్ధిని ప్రసాదించాలని కోరుకుందాం.

మానవ జీవితంలో ఆనంద సమయాలు చాలా ఉంటాయి. వాటిలో పండుగలు ప్రధానమైనవి. అనాదిగా ఇవి చలామణిలో ఉన్నవే. ముస్లిం సోదరులు జరుపుకునే ఈ పండుగ (ఈద్) అలాంటిదే. రమజాన్ నెలతో దీనికి సంబంధం ఉండడంతో అదే పేరుతో ప్రసిద్ధి గాంచింది. నిజానికి రమజాన్ అన్నది సంవత్సరంలోని పన్నెండు నెలల్లో తొమ్మిదవ నెల పేరు. దీనికింతటి ప్రత్యేకత ప్రాప్తం కావడానికి కొన్ని కారణాలున్నాయి. సర్వ మానవాళికి మార్గదర్శక గ్రంథమైన పవిత్ర ఖురాన్ రమజాన్ మాసంలోనే అవతరించింది. మానవజాతికి వెలుగును, జ్ఞానకాంతిని ప్రసాదించే దివ్యజ్యోతి రమజాన్ మాసంలో అవతరించిన కారణంగా దీనికింతటి గౌరవం, ఘనత, పవిత్రత ప్రాప్తమయ్యాయి. మానవుల శారీరక, మానసిక, ఆధ్యాత్మిక వికాసానికి అద్భుతంగా ఉపకరించే 'రోజా' (ఉపవాసవ్రతం) అనే గొప్ప ఆరాధనను కూడా దైవం ఈ నెలలోనే విధిగా చేశాడు. ఇది జనహృదయాల్లో భయభక్తులు జనింపజేసి, మానవీయ విలువలను, సుగుణాలను పెంపొందిస్తుంది. పాపకార్యాలు, దుర్మార్గాల వైపు మనసు పోకుండా కాపాడుతుంది. ఉపవాసం వల్ల సహనశక్తి పెరుగుతుంది. జాలి, దయ, కరుణ, త్యాగం, పరోపకారం లాంటి సుగుణాలు అలవడతాయి. స్థితిపరులు ఉపవాసం పాటిస్తే, పేదసాదల ఆకలి బాధను వారు అనుభవ పూర్వకంగా తెలుసుకోగలుగుతారు. ఇలా మరెన్నో మానవీయ, నైతిక సుగుణాలను మానవుల్లో పెంపొందింపజేసే ఏర్పాటు చేసిన విశ్వప్రభువుకు కృతజ్ఞతగా నెల రోజుల ఉపవాసాలను ముగించి షవ్వాల్ నెల మొదటి తేదీన ఈద్ జరుపుకుంటారు. ఇక పోతే, వెయ్యి నెలలకంటే విలువైన రాత్రి అని చెప్పబడిన 'లైలతుల్ ఖద్ర్' కూడా రమజాన్ లోనే ఉంది. అందుకని శక్తివంచన లేకుండా ఆరాధనలు, సత్కార్యాలు ఆచరిస్తారు. దానధర్మాలు చేస్తారు. రమజాన్ మాసాంతంలో ఫిత్రాలు చెల్లించి ఈద్ నమాజుకు వెళతారు. ఆ రోజు దైవం తన భక్తులకు నెలరోజుల సత్కార్యాలకు అనంతమైన ప్రతిఫలం ప్రసాదిస్తాడు. 'ఈద్' దేవుని మన్నింపు లభించే మహత్తర శుభదినం. మనిషి ఎలాంటి స్థితిలోనైనా పశ్చాత్తాప హృదయంతో దైవం వైపు మరలితే, అలాంటి వారిని దైవం తన కారుణ్య ఛాయలోకి తీసుకుంటాడు.

ఆయన కరుణామయుడు, కృపాశీలుడు. ఈద్ తప్పులు, పొరపాట్లకు క్షమాపణ కోరుకునే రోజు. జరిగిన తప్పుల పట్ల సిగ్గుపడుతూ, ఇకముందు తప్పులు చేయబోమని, దైవమార్గంపై స్థిరంగా ఉంటామని సంకల్పం చెప్పుకునే రోజు. కనుక దేహంలో ప్రాణం ఉండగానే దైవం ఇచ్చిన సదవకాశాన్ని వినియోగించుకొని, సన్మార్గం వైపుకు మరలాలి. ఒక విషయం సత్యమని తెలిసినా, దానికి అనుగుణంగా తమ జీవితాలను మలచుకోడానికి చాలామంది ముందుకు రారు. ఇదే మానవుల బలహీనత. దీన్ని అధిగమించడంలోనే విజ్ఞత, వివేకం దాగి ఉన్నాయి.ఈ నెల్లాళ్ళూ ఎంతటి నియమ నిష్ఠలతో గడిపారో ఇకముందు కూడా ఇదే స్ఫూర్తి కొనసాగిస్తామని ప్రతిన బూనాలి. ఈద్ పర్వదినం సందర్భంగా ఇలాంటి దృఢ సంకల్పం చెప్పుకుంటే అది నిజమైన పండుగ రోజు అవుతుంది. జీవితాల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిసే శుభదినం అవుతుంది. ఒకవేళ ఈ విషయాల పట్ల శ్రద్ధ వహించకపోతే ఈద్ సౌభాగ్యానికి దూరమయ్యే ప్రమాదం కూడా ఉంది. కనుక ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, దైవానికి కృతజ్ఞతలు చెల్లిస్తూ పవిత్ర జీవితం గడిపే ప్రయత్నం చెయ్యాలి.

ఈ విధంగా నెల్లాళ్ళ పాటు అన్ని నియమ నిబంధనలు పాటిస్తూ, రమజాన్ శుభాలతో పునీతమయ్యే మహాభాగ్యాన్ని కలిగించినందుకు ఈద్ రోజున దైవానికి కృతజ్ఞతా స్తోత్రాలు చెల్లించుకుంటారు. పండుగ రోజు వేకువ ఝామునే నిద్ర లేచి, స్నానపానాదులు ముగించుకొని ప్రాతఃకాల ఫజర్ నమాజు చేస్తారు. ఉన్నంతలోనే మంచి దుస్తులు ధరించి, అత్తరులాంటి సువాసనలు వినియోగిస్తారు. ఈద్ గాలో సమావేశమై సామూహికంగా దైవానికి కృతజ్ఞతా స్తోత్రాలు చెల్లిస్తూ ఈద్ నమాజ్ చేస్తారు. తమ అపరాధాలను మన్నించమని, సన్మార్గాన నడపమని దుఆ (వేడుకోలు) చేస్తారు. సమస్త మానవాళి సుఖసంతోషాలను కాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు ఆచరిస్తారు. వ్యాధుల బారినుండి, అప్పుల బారినుండి, శత్రువు బారినుంచి, దుష్టపాలకుల బారినుంచి, కరవుకాటకాల నుంచి, దారిద్ర్యం నుంచి తమను, తమ దేశాన్ని, యావత్ భూప్రపంచాన్ని రక్షించమని, విశ్వమానవాళినంతటినీ కాపాడమని కడు దీనంగా విశ్వప్రభువును వేడుకుంటారు.స్నేహితులు, బంధువులు, ఇరుగుపొరుగు, పరిచితులు, అపరిచితులందరితోనూ సంతోషాన్ని పంచుకుంటారు. 'ఈద్ ముబారక్' అంటూ శుభాకాంక్షలు తెలుపుకుంటారు. ఈవిధంగా ఈదుల్ ఫిత్ర్ పండుగ సమాజంలో ఒక చక్కని సుహృద్భావపూర్వకమైన, ప్రేమపూరితమైన, సామరస్య కుసుమాలను వికసింపజేస్తుంది. మానవీయ విలువల పరిమళాన్ని వెదజల్లుతుంది. దైవభక్తిని, దైవభీతిని, బాధ్యతాభావాన్ని, జవాబుదారీతనాన్ని, ఇంకా అనేక సుగుణాలను జనింపజేస్తుంది.

ఈదుల్ ఫిత్ర్ శుభాకాంక్షలతో...

– యండి. ఉస్మాన్ ఖాన్

ఈద్ నమాజ్ ఇలా...

అందరూ ఈద్ గాహ్‌కు చేరుకున్న తరువాత వరుస క్రమంలో బారులు తీరి నిలబడతారు. ఇమాం అగ్రభాగంలో నిలబడి ఆరు, లేక పన్నెండు అదనపు తక్బీర్‌లతో రెండు రకతులు నమాజ్ చేయిస్తాడు. ప్రారంభంలో రెండు రకతుల ఈద్ నమాజ్ సంకల్పం చేసుకున్న తరువాత, 'అల్లాహు అక్బర్' అని రెండు చేతులూ పైకెత్తి నాభిపై, లేక గుండెలపై కట్టుకోవాలి. తరువాత 'సనా' పఠించి, మళ్ళీ 'అల్లాహు అక్బర్' అని పలికి చేతులు పైకెత్తి కిందికి వదిలెయ్యాలి. ఇలా రెండుసార్లు చేసి మూడవసారి చేతులు కట్టుకోవాలి. ఇప్పుడు ఇమాం సూరె ఫాతిహా తరువాత, మరొక చిన్న సూరానో, లేక కొన్ని వాక్యాలో పఠించి రుకూ, సజ్దాలు చేస్తాడు. తరువాత రెండవ రకతు కోసం నిలబడి మళ్ళీ సూరె ఫాతిహా, మరికొన్ని వాక్యాలు పఠించి, మూడుసార్లు 'అల్లాహు అక్బర్' అంటూ మూడుసార్లూ చేతులు పైకెత్తి కిందికి వదిలేస్తారు. నాలుగోసారి 'అల్లాహు అక్బర్' అంటూ రుకూ చేస్తారు. తరువాత సజ్దాలు చేసి, అత్తహియ్యాత్, దురూద్‌లు పఠించి ముందు కుడి వైపుకు, తరువాత ఎడమ వైపుకు సలాం చెప్పడంతో, ఆరు అదనపు తక్బీర్‌లతో రెండు రకతుల ఈద్ నమాజ్ ప్రక్రియ ముగుస్తుంది. ఈ అన్ని సందర్భాల్లో వెనుక బారులు తీరిన భక్తులంతా ఇమామును అనుసరిస్తారు. ఈద్ నమాజులో అజాన్, అఖామత్‌లు ఉండవు. తరువాత ఇమాం మింబర్ (వేదిక) ఎక్కి ఖురాన్, హదీసుల వెలుగులో ప్రస్తుత పరిస్థితులను అన్వయిస్తూ సమాజానికి మార్గదర్శక సందేశం ఇస్తాడు. తరువాత దుఆతో ఈద్ ప్రక్రియ సంపూర్ణమవుతుంది.



బ్యూటిప్స్

పాదాల సంరక్షణా ముఖ్యమే

చాలా మంది ముఖానికి, వస్త్రధారణకు ఇచ్చిన ప్రాధాన్యత పాదాలకు ఇవ్వరు. పాదాల సంరక్షణను గాలికి వదిలేస్తే సుతిమెత్తగా ఉండాల్సిన పాదాల మడిమ భాగాలు పగుళ్లవల్ల అందవికారంగా తయారవుతాయి. అంతేగాక తీవ్రంగా బాధిస్తాయి కూడా. కాబట్టి కొన్ని చిన్నచిన్న చిట్కాలు పాటించడం ద్వారా ఈ సమస్య నుంచి బయటపడొచ్చు.

పాదాల అందానికి చిట్కాలు..



- పగిలిన పాదాలకు తేనె చక్కని మాయిశ్చరైజర్‌గా పనిచేస్తుంది. పాదాలకు పగుళ్లు ఉన్నచోట కొద్దిగా తేనె రాసుకొని అరగంట తర్వాత శుభ్రం చేసుకుంటే ఫలితం ఉంటుంది.
- కొబ్బరి నూనె కూడా పొడి చర్మానికి తేమను అందించి తాజాగా మారుస్తుంది. రాత్రిపూట నిద్రపోయే ముందు పాదాలకు కొబ్బరినూనె రాసుకుంటే పగుళ్ల బాధ తగ్గడమేగాక అందంగా ఉంటాయి.
- ఇక ఫంగల్ ఇన్‌ఫెక్షన్ వల్ల కూడా మడిమలు పగులుతాయి. అప్పుడు వెనిగర్ కలిపిన నీటిలో పాదాలను కొద్దిసేపు ఉంచితే సమస్య క్రమంగా తగ్గిపోతుంది.
- అంతేగాక పగిలిన పాదాలకు ఓట్‌మీల్, పాల మిశ్రమం కూడా మంచి ఔషధంలా పనిచేస్తుంది. ప్రతివారం ఈ మిశ్రమాన్ని పాదాలకు రాసుకుంటే పగుళ్లు మాయమవుతాయి.



ఓట్ మీల్‌తో...



స్నానం చేయడానికి కొద్దిగా ముందు చర్మానికి ఓట్‌మీల్‌ని పాలతో కలిపి స్క్రబ్‌లా రాయండి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తే చాలు చర్మం నిగారింపుతో మెరిసిపోవడం ఖాయం. స్నానం తర్వాత.. మీ శరీరాన్ని టవల్స్‌తో తుడవడం కంటే సహజంగానే ఆరిపోయేలా చూసుకోండి. ఇలా చేస్తే చాలు.. అందమైన చర్మం మీ సొంతం. స్నానం చేసే నీటిలో ఓ టీ స్పూన్ బేకింగ్ సోడా వేయండి. ఆ తర్వాత 15, 20 నిమిషాల తర్వాత ఆ నీటితో స్నానం చేయండి. ఇలా చేయడం వల్ల మీ చర్మానికి వడదెబ్బ ప్రభావం దూరం అవుతుంది.

ఇంటిప్స్

- ఫ్రిజ్‌లో ఒకోసారి ఐస్ గడ్డలుగా పేరుకుపోతుంటుంది. అలా ఐస్ పేరుకుని పోకుండా ఉండాలంటే చిన్న కప్పులో కొద్దిగా ఉప్పు వేసి దానిని ఫ్రిజ్‌లో ఉంచండి.
- ఫ్రిజ్‌లో ఐస్ ట్రేలు పెట్టేటప్పుడు ఆవనూనె రాస్తే ట్రేలు ఒకదానికొకటి అతుక్కోవు.
- ఫ్రిజ్‌లు, బీరువాలు వంటి వాటిని తడిబట్టతో తుడవకూడదు. అలా తుడవడం వల్ల మరిన్ని మరకలు ఏర్పడతాయి. పరిశుభ్రమైన తెల్లని పొడి బట్టతో లేదా మంచి తెల్లటి కాగితంతో బాగా రుద్దుతున్నట్టుగా తుడిస్తే శుభ్రంగా మెరుస్తాయి. ఉంటాయి.
- పుట్టగొడుగులను పేపర్ బ్యాగ్‌లో నిల్వ చేస్తే ఎక్కువకాలం తాజాగా ఉంటాయి.
- ఫ్రిజ్‌లో నిల్వ ఉంచే మీగడకు టీ స్పూన్ పంచదార కలిపితే తాజాగా ఉంటుంది



మటన్ రోగన్ జోష్

కావలసినవి:
మటన్ – కిలో; పాలు– కప్పు; కుంకుమ పువ్వు– చిటికెడు; నెయ్యి– అర కప్పు; ఇంగువ – అర టీ స్పూన్; జీలకర్ర– టీ స్పూన్; దాల్చిన చెక్క – 2 అంగుళాల ముక్క; నల్ల యాలకులు – 5; మిరియాలు – టీ స్పూన్; ఎండుమిర్చి– 4; పెరుగు– 150 గ్రా; గోధుమపిండి– టేబుల్ స్పూన్; శొంఠిపొడి – 2 టీ స్పూన్‌లు; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి; ధనియాల పొడి– టేబుల్ స్పూన్; కశ్మీరీ మిరపపొడి– టేబుల్ స్పూన్; సోంపు పొడి– టేబుల్ స్పూన్; కొత్తిమీర తరుగు – టేబుల్ స్పూన్.



రంజాన్ స్పెషల్ రెసిపీ

తయారీ:
- మటన్‌ను శుభ్రం చేసి పక్కన పెట్టుకోవాలి.
- పాలను వేడి చేసి అందులో కుంకుమ పువ్వు వేసి పక్కన ఉంచాలి.
- ప్రెషర్ పాన్‌లో నెయ్యి వేడి చేసి దాల్చిన చెక్క, యాలకులు, మిరియాలు, ఇంగువ, జీలకర్ర, ఎండుమిర్చి వేసి సన్న మంట మీద వేయించాలి. అవి వేగిన తరవాత అందులో మటన్ వేసి కలిపి మూత పెట్టి మీడియం మంట మీద ఐదారు నిమిషాల సేపు ఉంచాలి. ఇప్పుడు మూత తీసి అర కప్పు నీటిని పోసి మూత పెట్టి పది– పదిహేను నిమిషాల సేపు ఉడికించాలి.
- మరొక పాత్రలో పెరుగు, గోధుమ పిండి కలిపి అందులో కుంకుమ పువ్వు కలిపిన పాలు, ఉప్పు, సోంపు పొడి, ధనియాల పొడి, కశ్మీరీ మిరప్పొడి, శొంఠిపొడి కలిపి ఈ మొత్తం మిశ్రమాన్ని మటన్ మిశ్రమంలో కలిపి చిక్కదనం చూసుకుని అవసరమైతే మరికొంత నీటిని కలిపి, ప్రెషర్ పాన్ మూత పెట్టి ఐదారు విజిల్స్ వచ్చే వరకు ఉడికించాలి.
- వేడి, ప్రెషర్ తగ్గిన మూత తీసిన కొత్తిమీర తరుగు చల్లి వెంటనే మూత పెట్టాలి. ఈ మటన్ రోగన్ జోష్ చపాతీ, పుల్కాలతోపాటు అన్నంలోకి కూడా బాగుంటుంది.

---

* కృషి

చేతులే నేస్తాలుగా...

కష్టమంటే ఏంటో తెలియని చిన్నతనం. ఊహ తెలియకముందే పెళ్లి పేరుతో జీవనం. ఆదుకోని అయినవారు. అయినా చేతులున్నాయి కదా! అంటూ కొత్త జీవనం వైపుగా అడుగులు వేసి నేడు అందరితో శభాషని అనిపించుకుంటోంది ఆటోడ్రైవర్ సీతాదేవి. రోడ్లు ఊడ్చే పని నుంచి ఆ ఢిల్లీ రోడ్ల మీదే ఆటో నడుపుతూ, ముగ్గురు పిల్లలను చదివిస్తున్న సీతాదేవి 'ఎన్నో ఒడిదుడుకుల జీవితం. కానీ, సొంత చేతులనే నమ్ముకున్నాను' అని చెబుతోంది.



ఆటో నడుపుతున్న సీతాదేవి

"నేను మా అమ్మనాన్నలకు కొడుకుల కంటే తక్కువేమీ కాదని నిరూపించుకున్నాను. కొన్నేళ్ల క్రితం కష్టం వచ్చిందని పుట్టింటికి వెళితే, ఆదరించలేదు. అలాగని వారి మీద కోపం తెచ్చుకోలేదు. మా అమ్మనాన్నలది బీహార్. అక్కడే ఎనిమిదో తరగతి చదువుతుండగానే పెళ్లి చేశారు. ఆ వయసులో నాకెలాంటి తెలివితేటలు లేవు. నా భర్తతో కలిసి ఢిల్లీ వెళ్లిపోయాను. కానీ, ఆయన ఉద్యోగం గుజరాత్‌లో. పెళ్లయ్యాక ఐదేళ్లయినా పిల్లలు పుట్టలేదని అత్తింటిలో వేధింపులు. నన్ను వదిలేయమని నా భర్తతో బంధువులంతా చెప్పారు. ఆ యేడాదే గర్భవతిని అని తెలియడంతో నా పట్ల మా అత్తింటివాళ్ల ప్రవర్తనలో మార్పు వచ్చింది. కానీ, నా భర్త ఉద్యోగం పోవడంతో కుటుంబపరిస్థితి పూర్తిగా క్షీణించింది. అప్పుల్లో కూరుకుపోయారు. ఎనిమిది నెలల గర్భవతిని. పూట గడవని పరిస్థితి. ఉన్న వస్తువులన్నీ అమ్ముకోవాల్సి వచ్చింది. పుట్టింటికి వెళితే గడపతొక్కనివ్వలేదు. తిరిగి ఢిల్లీ వెళ్లిపోయాను. తినడానికి ఏమీ లేని పరిస్థితి. మూడు రోజులు మంచినీళ్లు తాగి పడుకున్నాను. తెలిసినవారి ద్వారా రోడ్లు ఊడ్చే పని దొరికింది. దీంతో మరో చిన్న ఇంటికి మారిపోయాం. పురిటిబిడ్డను తీసుకునే పనికి వెళ్లేదాన్ని. ఆ సమయంలో మా అన్న రావడంతో కొద్దిగా వస్తువులు కొన్నాను. వచ్చే కొద్దిపాటి ఆదాయంతో పిల్లలకు పూట గడుస్తుంది కానీ, ముమ్ముందు రోజులెలా గడవాలా... అని ఆలోచించేదాన్ని. నాలుగు ఇళ్లలో వంటపని చేయడం ప్రారంభించాను. ఆదాయం బాగానే ఉండటంతో స్వీపర్ పని వదిలేశాను.



■ పగలు వంటలు

నాకు వండడం తెలుసు. కానీ, వెరైటీ వంటలు చేయడం రాదు. వంటల పుస్తకాలు కొని, చదివి వెరైటీ వంటలు నేర్చుకొని, ఇళ్లలో చేయడం మొదలుపెట్టాను. అలా నెలకు 10 నుంచి 12 వేల రూపాయల వరకు వచ్చేవి. ఈ సంపాదనతో నా ముగ్గురు పిల్లల పోషణ బాగానే చూసుకోగలిగాను.

■ రాత్రిళ్లు ప్లాస్టిక్ సంచులు

ప్రయత్నం లేకుండా మన తలరాతలో ఏది రాస్తే అది జరుగుతుందనుకోవడం తప్పు. పగలు వంటలతో పాటు రాత్రి ఇంటి వద్దే ప్లాస్టిక్ బ్యాగులు కుట్టేదాన్ని. పదకొండు వందల రూపాయలతో పాత మెషిన్ కొని, బ్యాగులు కుట్టేదాన్ని. మెటీరియల్ ఎక్కువ మొత్తంలో తీసుకొచ్చి, వేరేవాళ్లకు కూడా పని ఇవ్వడం మొదలుపెట్టాను. అలా పదివేల ప్లాస్టిక్ సంచులు కుట్టించి ఇస్తే, సంచికి ఇరవై ఐదు పైసలు వచ్చేవి. ఈ సంపాదనతో బీహార్‌లో ఇల్లు కట్టుకున్నాను.

> పని చిన్నదనీ, పెద్దదనీ అనుకోవద్దు. అలాగే, మన చుట్టూ ఉన్న జనం ఏం మాట్లాడుతారో కూడా పట్టించుకోవద్దు. పూర్తి విశ్వాసంతో పని చేస్తే చాలు. ఒకరోజున విజయం కచ్చితంగా వస్తుంది.
> – సీతాదేవి

■ బిజీ బిజీ

చేతుల నిండా పనులు. నా రోజులు డబ్బుతో నిండిపోవడం మొదలయ్యాయి. వడ్డీ వ్యాపారుల నుంచి తీసుకున్న అత్తమామల రుణం తీర్చేశాం. మా అమ్మనాన్నల లక్షన్నర అప్పు కూడా తీర్చి కొడుకుల కంటే నేనేమీ తక్కువ కాదని నిరూపించుకున్నాను. నాకు ముగ్గురు కొడుకులున్నారు. ఇద్దరు కాలేజీలో, ఒకరు పదోతరగతి చదువుతున్నారు. నా సంపాదనతోనే పిల్లలను చదివిస్తున్నాను.

■ డ్రైవింగ్‌లో శిక్షణ

దాదాపు పదేళ్ల క్రితం గృహహింసపై మా ప్రాంతంలో అవగాహనా కార్యక్రమం జరుగుతోంది. అప్పుడు ఓ లాయర్ మాట్లాడుతూ " మహిళలు గృహహింసను ఎందుకు అనుభవించాలి, భర్తపై ఆధారపడకుండా మహిళలు తమ కాళ్లపై తాము నిలబడగలరు అని వివరించారు. ఆ సమయంలోనే అమ్మాయిలు డ్రైవింగ్‌లో శిక్షణ తీసుకోవచ్చు అని చెప్పారు. దీంతో ఆ ఫౌండేషన్ వాళ్లు ఇచ్చిన ఆరు నెలల డ్రైవింగ్ శిక్షణ తీసుకున్నాను. అదే సంవత్సరం నేను ప్రొఫెషనల్‌గా డ్రైవింగ్ ప్రారంభించాను. అయితే, పిల్లల్ని చూసుకోవడం ఇబ్బందిగా ఉందని కొంతకాలం తర్వాత డ్రైవింగ్ మానేశాను. ఎనిమిదేళ్ల తర్వాత ఈ–ఆటో నడిపే అవకాశం వచ్చింది. కల్కాజీ మెట్రోలో ఈ–ఆటో ప్రారంభించినప్పుడు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకున్నాను. ఇప్పుడు నెలకు 15 వేల రూపాయలు వస్తాయి. ఉదయం 10 గంటలకు ఈ–ఆటోతో మెట్రో పార్కింగ్ నుంచి బయల్దేరుతాను. సాయంత్రం 5 వరకు నడుపుతున్నాను.

పని చిన్నదనీ, పెద్దదనీ అనుకోవద్దు. అలాగే, మన చుట్టూ ఉన్న జనం ఏం మాట్లాడుతారో కూడా పట్టించుకోవద్దు. పూర్తి విశ్వాసంతో పని చేస్తే చాలు. కొంతమందికి మనం నచ్చకపోవచ్చు. అందుకు చింతిస్తూ కూర్చోకుండా, పనిని చేస్తూనే ఉండాలి. ఒకరోజున విజయం కచ్చితంగా వస్తుంది'అని చెబుతున్న సీతాదేవి కృషి ఎంతోమంది మహిళలకు స్ఫూర్తిదాయకమని చెప్పాలి.

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 217


శనివారం 22-4-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'నా అక్కలూ..చెల్లెళ్లు... తమ్ముళ్ల కళ్లలో వెలుగులు చూసినపుడే నా నిజమైన పుట్టిన రోజు'





దేశ ప్రయోజనాలే పరమావధి

ప్రభుత్వ అధికారులు తీసుకొనే ప్రతి నిర్ణయానికీ దేశ ప్రయోజనాలే పరమావధి కావాలని ప్రధాని నరేంద్ర మోదీ ఉద్బోధించారు.

వివరాలు 6లో ▸



కోర్టులో కాల్పుల కలకలం

ఢిల్లీలోని సాకేత్ కోర్టు ఆవరణలో లాయర్ దుస్తుల్లో వచ్చిన వ్యక్తి ఓ మహిళపై కాల్పులు జరిపి పరారయ్యాడు.


వివరాలు 6లో ▸



2022లో మండిన ఎండలు

ఇప్పటిదాకా ఆరో అత్యంత వేడి సంవత్సరంగా 2022 రికార్డుకెక్కిందని ప్రపంచ వాతావరణ సంస్థ తెలిపింది.

వివరాలు 6లో ▸



ఉగ్రవాదుల కోసం ముమ్మర వేట

జమ్మూకశ్మీర్‌లో జవాన్లను పొట్టనపెట్టుకున్న ఉగ్రవాదుల కోసం భారత సైన్యం డ్రోన్లు, జాగిలాలు, హెలికాప్టర్లతో గాలిస్తోంది.

వివరాలు 6లో ▸

అవినీతికి తావివ్వద్దు

ఉన్నత స్థాయి సమీక్షలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్

- రిజిస్ట్రేషన్, టౌన్ ప్లానింగ్, మండల, గ్రామ, వార్డు సచివాలయాల్లో అవినీతి లేకుండా చర్యలు తీసుకోండి
- ఎవరికి ఫిర్యాదు చేయాలో సూచిస్తూ బోర్డులు పెట్టండి
- మెరుగైన విధానాలతో యంత్రాంగంలో సమర్థత పెంపు
- తద్వారా పన్ను చెల్లింపు దారులకు చక్కటి సేవలు
- మానవ ప్రమేయాన్ని తగ్గించి.. సాంకేతిక విధానాలపై దృష్టి
- వచ్చే సమావేశం నాటికి మార్పులు కనిపించాలి
- డ్రగ్స్, మత్తు పదార్థాలపై మరింతగా దృష్టి పెట్టండి
- ప్రతి జిల్లాలో ప్రతి 15 రోజులకోసారి మాక్ డ్రిల్ చేపట్టాలి
- రవాణా శాఖలో మెరుగైన విధానాలు తీసుకురావాలి



సాక్షి, అమరావతి: ఏ ప్రభుత్వ శాఖలోనూ అవినీతికి తావు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. రిజిస్ట్రేషన్లు, టౌన్ ప్లానింగ్ విభాగాలు, మండల కార్యాలయాలు, గ్రామ, వార్డు సచివాలయాలు సహా అన్ని చోట్ల కూడా అవినీతికి ఆస్కారం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అవినీతి నిరోధక శాఖను మరింత క్రియాశీలకంగా ఉంచాలని సూచించారు. ఆదాయార్జన శాఖల మంత్రులు, ఉన్నతాధికారులతో శుక్రవారం సీఎం క్యాంపు కార్యాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఆదాయాలను

మిగతా 2వ పేజీలో ▶

> పౌరులకు సేవలు అందించడంలో అత్యంత పారదర్శకత ఉండాలి. అవినీతిపై ఎవరికి ఫిర్యాదు చేయాలన్న దానిపై ఏసీబీ నంబర్లను ఆయా కార్యాలయాల్లో ప్రముఖంగా కనిపించేలా హోర్డింగ్స్ తరహాలో ప్రదర్శించాలి. మానవ ప్రమేయాన్ని తగ్గించి, పారదర్శకతను పెంచే సాంకేతిక విధానాలపై అధ్యయనం చేసి.. వాటిని అమల్లోకి తీసుకు రావడంపై ప్రధానంగా దృష్టి పెట్టాలి. అప్పుడే ప్రజలకు సత్వరం మంచి సేవలు అందుతాయి. ఉద్యోగుల్లో సమర్థత పెరగడంతోపాటు ప్రభుత్వానికి ఆదాయమూ పెరుగుతుంది. వచ్చే సమీక్షా సమావేశం నాటికి మంచి మార్పులు కనిపించాలి.
>
> – సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

రిజిస్ట్రేషన్ సేవలు ఇక సులభతరం

- ఇ–స్టాంపింగ్ సేవలను వర్చువల్‌గా ప్రారంభించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- ప్రజలే నేరుగా స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లింపు
- స్వయంగా దస్తావేజుల తయారీ, రిజిస్ట్రేషన్

2లో

• ఎస్... వైనాట్ 175

ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ క్లీన్‌స్వీప్

టైమ్స్‌నౌ –ఈటీజీ సర్వే వెల్లడి

ఇప్పటికిప్పుడు ఎన్నికలొస్తే 24 -25 ఎంపీ స్థానాలు ఖాయం

- కేంద్రంలో మూడోసారీ కమల వికాసమే
- బీజేపీ కూటమికి 292–338 సీట్లు, కాంగ్రెస్ కూటమికి 106–144, ఇతరులకు 66–96
- ప్రధాని అభ్యర్థిగా మోదీకి 64% మంది మద్దతు.. రాహుల్‌కు 13%, కేజ్రీవాల్‌కు 12%, నితీశ్‌కు 6%, కేసీఆర్‌కు 5% ఓట్లు
- విపక్ష సారథిగా రాహుల్‌కు 29%, కేజ్రీవాల్‌కు 19%, మమతకు 13%, నితీశ్‌కు 8%, కేసీఆర్‌కు 7% మద్దతు

6లో

ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం ఖాయమని టైమ్స్‌నౌ–ఈటీజీ సర్వే వెల్లడించింది. ఇప్పటికిప్పుడు ఎన్నికలొస్తే 24 నుంచి 25 లోక్‌సభ స్థానాల్లో ఆ పార్టీ విజయం సాధిస్తుందని పేర్కొంది. రాష్ట్రంలో 25 ఎంపీ స్థానాలున్న సంగతి తెల్సిందే. అంటే వైఎస్సార్‌సీపీ మొత్తం క్లీన్ స్వీప్ చేస్తుందని ఈ సర్వే వెల్లడించింది. పేదలకు ఆలంబనగా నిరంతరాయంగా కొనసాగుతున్న సంక్షేమ పథకాలు, జనాభాలో దాదాపు 90 శాతం మందికి నేరుగా అందుతున్న నగదు, అవినీతికి తావులేని స్వచ్ఛమైన పారదర్శక పాలన.. జనాదరణను మరింతగా పెంచాయని వైఎస్సార్‌సీపీ నమ్ముతోంది. అందుకే 175 అసెంబ్లీ స్థానాల్లోనూ విజయం సాధించడం అసాధ్యమేమీ కాదని ఆ పార్టీ ముందునుంచీ చెబుతోంది. తమకు క్షేత్రస్థాయిలో పరిస్థితి తెలుసు కాబట్టే 'వైనాట్ 175' అంటున్నామని ఆ పార్టీ నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు. కాగా, కేంద్రంలో బీజేపీ కూటమి మూడోసారి అధికారంలోకి రానుందని సర్వే వెల్లడించింది. ఆ కూటమి 292 నుంచి 338 సీట్లు గెలుస్తుందని పేర్కొంది.



న్యూస్‌రీల్

మే 15 నుంచి బీజేపీ ప్రచార భేరి



ప్రధాని మోదీ పరిపాలన, రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం అందిస్తున్న తోడ్పాటును వివరిస్తూ మే నెల 15 నుంచి జూన్ 15 వరకు ప్రచార భేరి కార్యక్రమం చేపట్టనున్నట్లు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాధవ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై మే 5 నుంచి 15 వరకు పోరాటం చేయనున్నట్లు చెప్పారు.

వివరాలు 3లో ▸

రేపు అప్పన్న చందనోత్సవం



సింహగిరిపై శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం జరిగే ఈ కార్యక్రమానికి లక్షన్నర మంది వస్తారని ఆలయాధికారులు అంచనా. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చే సాధారణ భక్తులకే పెద్ద పీట వేస్తూ వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.

వివరాలు 3లో ▸

టీటీడీ విజిలెన్స్ వలలో ఎమ్మెల్సీ సాబ్జీ



ఫోర్జరీ ఆధార్ కార్డులతో తన సిఫార్సు లేఖలపై వేరే రాష్ట్రాలకు చెందినవారికి తిరుమలలో శ్రీవారి దర్శనం చేయిస్తున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ శుక్రవారం టీటీడీ విజిలెన్స్ వలకు చిక్కారు. ఆయనే స్వయంగా ఫోర్జరీ ఆధార్ కార్డులతో భక్తులను దర్శనానికి తీసుకెళ్తుండగా విజిలెన్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు.

వివరాలు 3లో ▸

పార్టీలు చిన్నవి.. ప్రభావం పెద్దది

- ప్రధాన పార్టీలకు తలనొప్పిగా మారిన చిన్న పార్టీలు
- కర్ణాటక అసెంబ్లీ బరిలో 83 పార్టీలు.. 50 స్థానాల్లో చిన్న, కొత్త పార్టీల ప్రభావం

6లో

వివేకాపై కక్ష గట్టింది ఆ ఇద్దరే..

ఆస్తి, రాజకీయ వారసత్వం కోసమే కుట్ర

- సంచలన విషయాలను వెల్లడించిన వివేకానందరెడ్డి రెండో భార్య షేక్ షమీమ్.. సీబీఐకి ఇచ్చిన వాంగ్మూలంలో స్పష్టీకరణ
- ఆస్తిపై కన్నేసిన అల్లుడు–చిన బావమరిది నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి
- రాజకీయ వారసత్వం కోసం కక్షగట్టిన పెద్ద బావమరిది నర్రెడ్డి శివప్రకాశ్‌రెడ్డి
- నాతో రెండో వివాహాన్ని వారు తీవ్రంగా వ్యతిరేకించారు
- మా అబ్బాయిని రాజకీయ వారసుడిగా ప్రకటిస్తానన్న వివేకా
- దాంతో నన్ను, వివేకానందరెడ్డిని కూడా బెదిరించారు.. వివేకా చెక్ పవర్ తొలగించి మరీ వేధించారు
- వైఎస్ వివేకా చుట్టూ వాళ్ల మనుషులే ఉండేవారు
- శివప్రకాశ్‌రెడ్డి చెప్పడంతోనే ఆధారాలు ధ్వంసం చేసిన ఎర్ర గంగిరెడ్డి



సాక్షి, అమరావతి: 'మాజీ ఎంపీ వైఎస్ వివేకానందరెడ్డికి ఆయన ఇద్దరు బావమరుదులు నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి, నర్రెడ్డి శివప్రకాశ్‌రెడ్డి నుంచే ముప్పు ఉండేది. ఆస్తి, రాజకీయ వారసత్వం కోసం వారే ఆయనపై కక్షగట్టారు'.. అని వివేకానందరెడ్డి రెండో భార్య షేక్ షమీమ్ స్పష్టంచేశారు. 'వివేకానందరెడ్డి హత్య తరువాత శివప్రకాశ్‌రెడ్డి ఆదేశాలతోనే ఎర్ర గంగిరెడ్డి ఘటనా స్థలంలో ఆధారాలను ధ్వంసం చేశారు' అని కూడా ఆమె తేల్చిచెప్పారు. ఈ హత్య కేసులో షమీమ్ 2020 అక్టోబరులోనే సీబీఐకి ఇచ్చిన వాంగ్మూలం తాజాగా వెలుగులోకి వచ్చింది. వివేకానందరెడ్డితో తన రెండో వివాహం.. దానిపై ఆయన కుమార్తె సునీత, అల్లుడు–చిన్న బావమరిది నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, పెద్ద బావమరిది నర్రెడ్డి శివప్రకాశ్‌రెడ్డి ఎంతగా విభేదించింది.. తనను ఎంతగా బెదిరించిందీ.. వివేకానందరెడ్డిని ఎంతగా వేధించింది మొదలైన సంచలనాత్మక విషయాలను ఆమె సవివరంగా తన వాంగ్మూలంలో

మిగతా 3వ పేజీలో ▶

దేశీయ డేటా సెంటర్ సామర్థ్యంలో..

25% వాటా లక్ష్యం

విశాఖలో 100 మెగావాట్ల అదానీ డేటా సెంటర్

- దీంతోపాటు ఐటీ పార్క్, స్కిల్ సెంటర్, రిక్రియేషన్ సెంటర్ ఏర్పాటు
- రూ.7,210 కోట్ల పెట్టుబడితో 14,825 మందికి ఉపాధి కల్పన
- వాక్ టు వర్క్ విధానంలో రెసిడెన్షియల్, సోషల్ ఇన్‌ఫ్రా అభివృద్ధికి అనుమతి
- ఉత్తర్వులు జారీచేసిన రాష్ట్ర ప్రభుత్వం
- మే 3న సీఎం జగన్ చేతుల మీదుగా భూమి పూజ



అదానీ డేటా సెంటర్ నమూనా

సాక్షి, అమరావతి: దేశీయ డేటా సెంటర్ సామర్థ్యంలో కనీసం 20 నుంచి 25 శాతం వాటాను చేజిక్కించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా రూ.45,920 కోట్ల పెట్టుబడితో 138 డేటా సెంటర్లు ఉన్నాయి. ఈ డేటా సెంటర్లు 11 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో 737 మెగావాట్ల సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. 2025 నాటికి ఈ డేటా సెంటర్ల సంఖ్య 183కు చేరడం ద్వారా 24 మిలియన్ చదరపు అడుగులతో 1,752 మెగావాట్ల సామర్థ్యానికి విస్తరిస్తుందని అంచనా వేస్తున్నారు. ఇందులో కనీసం 20 నుంచి 25 శాతం వాటాను చేజిక్కించుకోవడంలో లక్ష్యంగా రాష్ట్రంలో డేటా సెంటర్లను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపింది. ఇందులో భాగంగా అదానీ గ్రూపు వైజాగ్ టెక్‌పార్క్ లిమిటెడ్ పేరుతో 100 మెగావాట్ల డేటా సెంటర్ ఏర్పాటుకు అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. విశాఖపట్నం కాపులుప్పాడ వద్ద సుమారు 130 ఎకరాల్లో రూ.7,210 కోట్ల పెట్టుబడితో డేటా సెంటర్‌తోపాటు ఐటీ, బిజినెస్ పార్క్, స్కిల్ సెంటర్, రిక్రియేషన్ సెంటర్లను అదానీ గ్రూపు అభివృద్ధి చేయనుంది. దీనిద్వారా 14,825 మందికి

మిగతా 2వ పేజీలో ▶



సామాజిక న్యాయమే పరమావధి

- ప్రపంచ స్థాయి రాజధాని కంటే పేదల సంక్షేమమే మాకు ముఖ్యం
- హైకోర్టు ధర్మాసనానికి నివేదించిన రాష్ట్ర ప్రభుత్వం
- అక్కడ కనీసం 5 శాతం భూమిని కేటాయించాలని చట్టం చెబుతోంది
- గత ప్రభుత్వ పెద్దలు మాత్రం అక్కడ ధనికులకు మాత్రమే చోటన్నారు
- అందుకే మాస్టర్ ప్లాన్‌లో 5 శాతం భూమి కేటాయించలేదు
- ఆ తప్పు పునరావృతం కాకూడదనే చట్ట సవరణతో ఆర్ 5 జోన్ సృష్టి
- ప్రభుత్వం హైకోర్టు తీర్పును ధిక్కరిస్తోందన్న రైతుల తరపు న్యాయవాదులు
- అందరి వాదనలు విని తీర్పు రిజర్వ్ చేసిన ధర్మాసనం

2లో



'పీఎస్‌ఎల్‌వీ-సీ55' కౌంట్‌డౌన్ ప్రారంభం

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో), న్యూ స్పేస్ ఇండియా సంయుక్తంగా తిరుపతి జిల్లా సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి శనివారం మధ్యాహ్నం 2.20 గంటలకు పీఎస్‌ఎల్‌వీ–సీ55 ఉపగ్రహ వాహకనౌకను ప్రయోగించనున్నారు. ఈ మేరకు శుక్రవారం కౌంట్‌డౌన్ ప్రక్రియను ప్రారంభించారు.

12లో

ఇదండీ సంగతి



పరిస్థితులు బాగోలేవట! అలాగే రోడ్ షోల్లో, ర్యాలీల్లో, సభల్లో సుడిగాలి పర్యటనల్లో పాల్గొంటూ గెలిపించాలట సార్!

దళితుల పైకి కార్యకర్తలను రెచ్చగొట్టిన చంద్రబాబు

వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై టీడీపీ కార్యకర్తల దాడి

- రాళ్లు, ఇనుపరాడ్లు, చెప్పులు విసిరిన తెలుగు తమ్ముళ్లు
- వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు తీవ్రగాయాలు
- లోకేశ్ వ్యాఖ్యలకు వైఎస్సార్‌సీపీ నేతలు, దళితుల నిరసన
- మంత్రి సురేశ్‌ను, దళితులను దూషించిన చంద్రబాబు
- ఆ వెంటనే దాడులకు దిగిన టీడీపీ కార్యకర్తలు
- ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంలో ఘటన

యర్రగొండపాలెం: దళితులపై అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు, దళితులపై దాడులు చేసేలా తమ కార్యకర్తలను రెచ్చగొట్టారు టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు. దీంతో టీడీపీ కార్యకర్తలు రెచ్చిపోయారు. వైఎస్సార్‌సీపీ నేతలు, దళితులపై రాళ్లు, కర్రలు, ఇనుప రాడ్లతో దాడి చేశారు. ఈ దాడిలో వైఎస్సార్ సీపీ నేతలు ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. మరికొందరికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్ర గాయాలైన వైఎస్సార్‌సీపీకి చెందిన జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాషా, పెద్దారవీడు మండలంలోని కంభాలపాడు సర్పంచ్ బెజవాడ ఆదాం, మరొకరిని ఆస్పత్రికి తరలించారు. చంద్రబాబు మాజీ ముఖ్యమంత్రి అయి ఉండీ దళితులపైకి కార్యకర్తలను రెచ్చగొట్టడంపై తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంలో శుక్రవారం ఈ సంఘటన జరిగింది. శుక్రవారం యర్రగొండపాలెం వస్తున్న

మిగతా 7వ పేజీలో ▶



ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంలో రాష్ట్ర మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేశ్ ఆధ్వర్యంలో శాంతియుత నిరసన తెలుపుతున్న దళిత నాయకులు

గవర్నర్ రంజాన్ శుభాకాంక్షలు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ముస్లింలు అందరికీ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. భక్తి, దాతృత్వానికి రంజాన్ ప్రతీకని ఆయన పేర్కొన్నారు. శాంతి సౌభ్రాతృత్వాలతో వెల్లివిరిసేలా సమాజాన్ని ఖురాన్ బోధనలు తీర్చిదిద్దాయన్నారు. ఈ మేరకు రాజ్‌భవన్ వర్గాలు శుక్రవారం గవర్నర్ పేరిట ఒక ప్రకటన విడుదల చేశాయి.

ముస్లిం సోదరులకు ముఖ్యమంత్రి జగన్ 'ఈద్ ముబారక్'

సాక్షి, అమరావతి: ముస్లింలకు ఎంతో పవిత్రమైన రంజాన్ పండుగ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు (ఈద్ ముబారక్) తెలిపారు. మానవాళికి హితాన్ని బోధించే రంజాన్ పండుగ.. సామరస్యానికి, సుహృద్భావానికి, సర్వమానవ సమానత్వానికి, కరుణకు, దాతృత్వానికి ప్రతీక అని ముఖ్యమంత్రి జగన్ ఆ సందేశంలో పేర్కొన్నారు. కఠోర ఉపవాస దీక్షలతో క్రమశిక్షణ, దానధర్మాలతో దాతృత్వం, సామూహిక ప్రార్థనలతో ధార్మికచింతన, ఐకమత్యం.. ఈ పండుగ మానవాళికి ఇచ్చే సందేశమని తెలిపారు. పవిత్ర దివ్య ఖురాన్ అవతరించిన ఈ మాసంలో కఠిన ఉపవాస దీక్షలకు రంజాన్ ఒక ముగింపు వేడుక అని పేర్కొన్నారు. ముస్లిం సోదరులు చేసే ప్రార్థనలు సఫలం కావాలని, అల్లాహ్ దీవెనలతో రాష్ట్ర ప్రజలకు సకల శుభాలు కలగాలని ఆకాంక్షించారు. మనిషిలోని చెడు భావనల్ని, అధర్మాన్ని, ద్వేషాన్ని రూపుమాపే గొప్ప పండుగ రంజాన్ అని ముఖ్యమంత్రి జగన్ తన సందేశంలో పేర్కొన్నారు.

అనకాపల్లి జిల్లాకు ప్రధానమంత్రి ఉత్తమ అవార్డు

కలెక్టర్‌కి అవార్డు అందించిన ప్రధాని మోదీ



ఢిల్లీలో విజ్ఞాన్ భవన్‌లో ప్రధాని మోదీ చేతుల మీదుగా అవార్డు తీసుకుంటున్న అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి

సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, అనకాపల్లి: ఆయుష్మాన్ భారత్ పథకాన్ని సమర్థవంతంగా నిర్వహించినందుకు గాను అనకాపల్లి జిల్లాకు ప్రధానమంత్రి ఉత్కృష్ట అవార్డు లభించింది. శుక్రవారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో 16వ సివిల్ సర్వీసెస్ డే, 2023 సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన జిల్లాలకు ప్రధాని మోదీ అవార్డులను అందజేశారు. ప్రధానమంత్రి అవార్డ్స్ ఫర్ ఎక్స్‌లెన్స్ ఇన్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్–2022 లో భాగంగా ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్ కేటగిరీలో విజేతగా నిలిచిన అనకాపల్లి జిల్లా తరఫున కలెక్టర్ రవి సుభాష్ పఠాన్‌శెట్టి ఈ అవార్డును అందుకున్నారు. కాగా, 2006లో ప్రవేశపెట్టిన ఈ అవార్డును అసాధారణమైన, వినూత్నమైన సేవలు అందించిన జిల్లాకు అందిస్తారు. వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నందుకు గుర్తింపుగా ఈ అవార్డు లభించిందని, రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ఈ గుర్తింపు లభించేందుకు దోహదపడిందని కలెక్టర్ చెప్పారు.

ఉచిత పంటల బీమా పథకానికి జాతీయ గుర్తింపు

వ్యవసాయ శాఖ అధికారులను అభినందించిన సీఎం జగన్



జ్ఞాపికను చూపుతున్న సీఎం జగన్, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు గోపాలకృష్ణ ద్వివేది, హరికిరణ్

సాక్షి, అమరావతి : డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకానికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఇటీవల రాయ్‌పూర్‌లో జరిగిన పీఎంఎఫ్‌బీవై జాతీయ సదస్సులో ఇన్నోవేషన్ కేటగిరీలో వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ హరికిరణ్‌కు కేంద్ర వ్యవసాయ కార్యదర్శి మనోజ్ అహూజా ప్రత్యేక ప్రశంస పత్రం అందజేశారు. వ్యయసాయ శాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, ఆ శాఖ స్పెషల్ కమిషనర్ సి.హరికిరణ్ సీఎం క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి జగన్‌ను కలిసి భారత ప్రభుత్వం అందజేసిన జ్ఞాపికను చూపించారు. ఈ సందర్భంగా సీఎం అధికారులను అభినందిస్తూ, భవిష్యత్తులో మరింత సమర్థవంతంగా పని చేయాలని, దిగుబడుల అంచనాలలో టెక్నాలజీ వినియోగం పెంచాలని దిశా నిర్దేశం చేశారు. సాగు చేసిన ప్రతి ఎకరా పంట వివరాలను అత్యంత పారదర్శకంగా ఈ–క్రాప్ ద్వారా నమోదు చేయడం, తద్వారా ఉచిత పంటల బీమా పథకం అమలుతో యూనివర్సల్ కవరేజీని సాధించిన ఏకైక రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ రికార్డు సృష్టించింది.

మార్గదర్శిలో 3వ రోజూ కొనసాగిన సోదాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాల్లో వరుసగా మూడవ రోజు కూడా సీఐడీ సోదాలు కొనసాగాయి. విశాఖపట్నం, రాజమహేంద్రవరం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, నరసరావుపేట, అనంతపురంలలోని మార్గదర్శి బ్రాంచి కార్యాలయాల్లో శుక్రవారం సోదాలు జరిపి కీలక ఆధారాలను సీఐడీ అధికారులు సేకరించారు. నిధుల మళ్లింపు, అక్రమ డిపాజిట్లు, అక్రమ పెట్టుబడులకు సంబంధించి పలు రికార్డులు, హార్డ్ డిస్క్‌లను స్వాధీనం చేసుకున్నారు.

మూడో రోజూ అవినాశ్‌రెడ్డిని విచారించిన సీబీఐ అధికారులు

నేటి విచారణపై స్పష్టతనివ్వని సీబీఐ

సాక్షి, హైదరాబాద్ : మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో భాగంగా శుక్రవారం మూడో రోజు కూడా ఎంపీ అవినాశ్‌రెడ్డి సీబీఐ అధికారుల ఎదుట హాజరయ్యారు. ఉదయం 9–45 గంటలకే కోఠిలోని సీబీఐ కార్యాలయానికి చేరుకున్న ఆయనకు అధికారులు లిఖితపూర్వకంగా ప్రశ్నలు అందించినట్టు సమాచారం. పలు అంశాలపై అడిగిన ప్రశ్నలన్నింటికీ ఆయన ఇచ్చిన సమాధానాలను అధికారులు ఆడియో, వీడియో రికార్డింగ్ చేశారు. కాగా, బుధ, గురువారాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 6–45 గంటల వరకు ప్రశ్నించిన సీబీఐ అధికారులు శుక్రవారం మాత్రం త్వరగా విచారణ పూర్తి చేశారు. సాయంత్రం 4 గంటలకే అవినాశ్‌రెడ్డి సీబీఐ కార్యాలయం నుంచి బయటకు వచ్చారు. శనివారంనాటి విచారణపై మాత్రం అధికారులు స్పష్టత ఇవ్వలేదు.

కొనసాగిన భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డిల విచారణ

ఇదే కేసులో సీబీఐ అధికారులు శుక్రవారం మరోమారు వైఎస్ భాస్కర్ రెడ్డి, ఉదయ్‌కుమార్ రెడ్డిలను చంచల్‌గూడ జైలు నుంచి కస్టడీకి తీసుకున్నారు. కోఠిలోని సీబీఐ కార్యాలయానికి ఉదయం 9–30 గంటలకు తీసుకువచ్చారు. ఇద్దరినీ వేర్వేరుగా ప్రశ్నించినట్టు తెలిసింది. మధ్యాహ్న భోజన సమయం తర్వాత కూడా విచారణ కొనసాగింది. మొత్తం ప్రక్రియను ఆడియో, వీడియో రికార్డింగ్ చేసినట్టు సమాచారం. విచారణ అనంతరం వారిద్దరినీ చంచల్‌గూడ జైలుకు తరలించారు.

రిజిస్ట్రేషన్ సేవలు ఇక సులభతరం

ఇ-స్టాంపింగ్ సేవలను ప్రారంభించిన సీఎం జగన్



ఇ-స్టాంపింగ్ సేవలను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: రిజిస్ట్రేషన్లను సులభతరం చేసే ఇ–స్టాంపింగ్ సేవలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం తన క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఎలాంటి సాంకేతిక సమస్యలు లేకుండా సురక్షితంగా రూపొందించిన ఇ–స్టాంపింగ్ విధానం వల్ల ప్రజలకు అనేక ప్రయోజనాలు అందనున్నాయి. www.shcilestamp.com వెబ్‌సైట్, ఇ–స్టాంపింగ్ మొబైల్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో ఇ–స్టాంపులను పొందవచ్చు. నగదు, చెక్కు, ఆన్‌లైన్ (నెఫ్ట్, ఆర్టీజీఎస్, పీఓఎస్, యూపీఐ) ద్వారా సులభంగా చెల్లింపులు చేసుకునే అవకాశం ఉంటుంది. ఎస్‌బీఐ, ఆప్కాబ్, యూనియన్ బ్యాంకులకు చెందిన ఎంపిక చేసిన బ్రాంచిలు, సీఎస్‌సీ కేంద్రాలు, స్టాంప్ అమ్మకందార్లు, స్టాక్ హోల్డింగ్ బ్రాంచ్‌లు కలిపి మొత్తం 1400 పైగా కేంద్రాల వద్ద ఇ–స్టాంపింగ్ సదుపాయం అందుబాటులోకి తీసుకువచ్చారు. మరో వెయ్యికిపైగా కేంద్రాల వద్ద త్వరలో ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయి. రాష్ట్రంలో ఆస్తుల క్రయవిక్రయాలు నిర్వహించే పౌరులందరూ 1400 పైగా ఎంపిక చేసిన కేంద్రాల్లో ఇ–స్టాంపింగ్ ద్వారా స్టాంప్ పేపర్లు కొనుగోలు చేసి సులభంగా స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు, యూజర్ చార్జీలను చెల్లించవచ్చు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ సెంట్రల్ రికార్డు నిర్వహించే ఏజెన్సీ స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు సులభంగా సేవలందించడంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఈ విధానంలో వినియోగదారులే స్వయంగా తమ డాక్యుమెంట్లను తయారు చేసుకుని ఇ–స్టాంపింగ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకునే అవకాశం ఉంటుంది. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రులు నారాయణ స్వామి, కొట్టు సత్యనారాయణ, బూడి ముత్యాలనాయుడు, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ధర్మాన ప్రసాదరావు, ఐటీ సలహాదారు శేషిరెడ్డి, రెవెన్యూ శాఖ స్పెషల్ సీఎస్ రజత్ భార్గవ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్ అండ్ ఐజీ రామకృష్ణ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ గుంటూరు డీఐజీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దేశీయ డేటా సెంటర్ సామర్థ్యంలో.. 25% వాటా లక్ష్యం



అదానీ సంస్థ కార్యకలాపాల కోసం విస్తరించనున్న రహదారి

▶ మొదటి పేజీ తరువాయి

ఉపాధి లభించనుంది.

ఐదు దశల్లో డేటా సెంటర్ అభివృద్ధి

భీమునిపట్నం కాపులుప్పాడ వద్ద 60.29 ఎకరాల్లో ఈ డేటా సెంటర్‌ను ఐదు దశల్లో అభివృద్ధి చేయనుంది. భూమి కేటాయించిన మూడు ఏళ్లలోగా 10 మెగావాట్లతో ప్రారంభించి నాలుగేళ్లకు 20 మెగావాట్లు, ఐదేళ్లకు 40 మెగావాట్లు, ఆరేళ్లకు 70 మెగావాట్లు, ఏడేళ్లకు 100 మెగావాట్ల సామర్థ్యం చేరుకునే విధంగా వైజాగ్ టెక్‌పార్క్ ప్రణాళికకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు ఫిబ్రవరి 7, 2022లో భూ కేటాయింపులు చేసింది. అక్కడే నివాసం ఉంటూ పనిచేసుకునేలా వాక్ టు వర్క్ విధానంలో నివాస ప్రాంతాలు, మౌలిక వసతుల కల్పనకు అవకాశం కల్పిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన రాయితీలు, ప్రోత్సాహకాలు ప్రత్యక్షంగా కల్పించే ఉద్యోగాల కల్పన ఆధారంగా ఉంటుందని ప్రభుత్వం స్పష్టంచేసింది. ఈ వైజాగ్ టెక్‌పార్క్ నిర్మాణ పనులను మే 3న సీఎం జగన్ చేతుల మీదుగా ప్రారంభించేందుకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ప్రణాళిక సిద్ధంచేసుకుంది.

సామాజిక న్యాయమే పరమావధి

సాక్షి, అమరావతి: ప్రపంచ స్థాయి రాజధాని కంటే కూడా పేదల సంక్షేమమే తమకు ముఖ్యమని రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం హైకోర్టుకు నివేదించింది. తమది సామాజిక న్యాయమే పరమావధిగా పని చేస్తున్న ప్రభుత్వమని స్పష్టం చేసింది. రాజధాని ప్రాంతంలోని మొత్తం విస్తీర్ణంలో కనీసం 5 శాతం భూమిని పేదల ఇళ్ల స్థలాలకు కేటాయించాలని సీఆర్‌డీఏ చట్టం స్పష్టంగా చెబుతున్నా, గత ప్రభుత్వం మాత్రం ధనికుల కోసం నిర్మిస్తున్న రాజధానిలో పేదలు ఉండకూడదన్న ఉద్దేశంతో ఆ చట్టాన్ని అమలు చేయలేదని తెలిపింది. కేవలం 44 ఎకరాలను మాత్రమే పేదల కోసం కేటాయించిందని, అలాంటి తప్పిదం పునరావృతం కాకూడదన్న ఉద్దేశంతోనే సీఆర్‌డీఏ చట్టాన్ని సవరించి.. మాస్టర్ ప్లాన్‌లో ఆర్ 5 జోన్‌ను సృష్టించామని చెప్పింది. 'ఈ జోన్‌లో పేదలకు 1,134 ఎకరాల భూమిని కేటాయించాం. ఈ భూమిని ఇళ్ల స్థలాల కింద పేదలకు పంచాలని నిర్ణయించాం. ఇది ఓర్వలేని గత ప్రభుత్వ పెద్దలు హైకోర్టులో పిటిషన్ల మీద పిటిషన్లు వేయించి పేదలకు ఇళ్ల స్థలాలు దక్కకుండా చేసేందుకు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం పాపమన్నట్లు ప్రభుత్వ తీరును అమరావతి రైతుల పేరుతో తప్పు పడుతున్నారు. సీఆర్‌డీఏ నుంచి ఈ 1,134 ఎకరాలను రూ.1,100 కోట్లకు పైగా మొత్తాన్ని వెచ్చించి రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. దీని వల్ల సీఆర్‌డీఏకు రూ.1,100 కోట్లపైగా మొత్తం సమకూరుతుంది. సీఆర్‌డీఏకు డబ్బు వస్తేనే రాజధాని అభివృద్ధి సాధ్యమవుతుంది' అని పేర్కొంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి హైకోర్టుకు నివేదించారు. హైకోర్టు విస్తృత ధర్మాసనం సైతం తన తీర్పులో ఇదే విషయాన్ని చెప్పిందని తెలిపారు.

అక్కడ పేదలకు ఇళ్ల స్థలాలివ్వొద్దు

రాజధాని ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు 1,134 ఎకరాల భూమిని ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల కలెక్టర్లకు బదలాయించేందుకు సీఆర్‌డీఏకు అనుమతినిస్తూ ప్రభుత్వం ఇటీవల జీవో 45 జారీ చేసింది. ఈ జీవోను సవాలు చేస్తూ అమరావతి రైతులు రకరకాల ఎత్తుగడలతో పిటిషన్లు దాఖలు చేశారు. జీవో 45 అమలును నిలుపుదల చేయడంతో పాటు పేదలకు ఎలాంటి ఇళ్ల స్థలాలు కేటాయించకుండా ప్రభుత్వాన్ని నిరోధిస్తూ మధ్యంతర ఉత్తర్వులివ్వాలంటూ అనుబంధ వ్యాజ్యాలు వేశారు. ఈ వ్యాజ్యాలపై శుక్రవారం సీజే జస్టిస్ ప్రశాంత్ కుమార్‌మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య ధర్మాసనం మరోసారి విచారణ జరిపింది.

పేదలకు ఇవ్వకుంటే వచ్చే నష్టమేమీ లేదు..

పిటిషనర్ల తరఫున తొలుత దేవ్‌దత్ కామత్ వాదనలు వినిపిస్తూ.. పేదలకు ఇప్పటికిప్పుడు ఇక్కడ ఇళ్ల స్థలాలు ఇవ్వకపోతే మిన్ను విరిగి మీద పడదన్నారు. పాత మాస్టర్ ప్లాన్ ప్రకారం సీఆర్‌డీఏ వద్ద ల్యాండ్ బ్యాంక్ ఉందని, అందులో నుంచి ఇళ్ల స్థలాలు ఇచ్చుకుంటే తమకు అభ్యంతరం లేదన్నారు. మరో సీనియర్ న్యాయవాది వీఎస్సార్ ఆంజనేయులు వాదనలు వినిపిస్తూ, మాస్టర్ ప్లాన్‌లో చాలా మార్పులు చేశారన్నారు. ఇళ్ల స్థలాల కేటాయింపు వ్యవహారం హైకోర్టులో పెండింగ్‌లో ఉండగా, క్షేత్ర స్థాయిలో పనులు ప్రారంభించడం కోర్టు ధిక్కారం కిందకే వస్తుందన్నారు. సీఆర్‌డీఏ ప్రతిపాదనలను రైతులు గ్రామ సభల్లో తిరస్కరించారని, అయినా ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయం తీసుకుందని అనుమోలు జ్యోతిరత్న వివరించారు.

అభివృద్ధిలో భాగంగానే ఇళ్ల స్థలాలు

ప్రభుత్వం తరఫున అదనపు ఏజీ సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. పాండవుల కోసం శ్రీకృష్ణుడు ఉన్నట్లు పేదల కోసం జగన్ ఉన్నారన్నారు. పేదల నివాసానికి కనీసం 5 శాతం భూములు ఇవ్వాలని సీఆర్‌డీఏ చట్టంలో స్పష్టంగా ఉండగా, మాస్టర్ ప్లాన్‌లో మాత్రం దానికి స్థానం కల్పించలేదన్నారు. ఈ తప్పును సరిదిద్ది చట్ట ప్రకారం పేదల నివాసం కోసం 5 శాతం భూమిని కేటాయిస్తున్నామని తెలిపారు. నిర్దిష్టంగా ఫలానా చోటే ఇవ్వాలని చట్టంలో ఎక్కడా లేదన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడాన్ని ఓర్చుకోలేక హైకోర్టు, తరువాత సుప్రీంకోర్టు, మళ్లీ హైకోర్టు.. అడ్డుకునేందుకు ఇలా తిరుగుతూనే ఉన్నారన్నారు. ఇటీవల సుప్రీంకోర్టుకెళ్లగా పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం ఎలా తప్పు అవుతుందంటూ రైతులను నిలదీసిందని, దీంతో వాళ్లు అక్కడ తమ పిటిషన్లను ఉపసంహరించుకున్నారని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. రాజధాని ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని హైకోర్టు విస్తృత ధర్మాసనం చెప్పిందని, అందులో భాగంగానే పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తున్నామన్నారు. అభివృద్ధి చేయకుంటే చేయలేదంటున్నారని, చేస్తుంటే ఎలా చేస్తారంటూ కోర్టులకెక్కుతున్నారని వివరించారు. వాదనలు విన్న ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించింది. లిఖితపూర్వక వాదనలు ఇవ్వాలనుకుంటే ఇవ్వొచ్చునని స్పష్టం చేసింది.

నవ్వుల పువ్వులు

హైకోర్టులో న్యాయవాదులకు మౌలిక సదుపాయాలు లేవని ధర్మాసనం నవ్వుతూ వ్యాఖ్యానించింది. సీఆర్‌డీఏ తరఫు న్యాయవాది కాసా జగన్‌మోహన్‌రెడ్డి స్పందిస్తూ.. 2024 వరకు హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా ఉందని, అయితే ఓ పెద్ద మనిషి తనపై క్రిమినల్ కేసు నమోదు కాగానే భయపడి అప్పటికప్పుడు రాజధానిని అమరావతికి మార్చారని తెలిపారు. దీంతో కోట్ల రూపాయల విలువైన ఆస్తులను వదులుకుని అందరూ హడావుడిగా అమరావతికి వచ్చారన్నారు. దాని పర్యవసానమే సౌకర్యాల కొరత అని వివరించారు. 'ఆ కోట్ల రూపాయల కోసమే అందరూ ప్రతి శుక్రవారం హైదరాబాద్ వెళుతున్నారా?' అంటూ ధర్మాసనం నవ్వుతూ వ్యాఖ్యానించింది.

అవినీతికి తావివ్వద్దు



ఉన్నత స్థాయి సమీక్షలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

▶ మొదటి పేజీ తరువాయి

ఆర్జించే శాఖల యంత్రాంగంలో మెరుగైన విధానాలు అమలు చేయడం ద్వారా సమర్థత పెంచాలని ఆదేశించారు. మానవ ప్రమేయాన్ని తగ్గించి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా సేవలందించే విధానాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని చెప్పారు. తద్వారా లీకేజీలు అరికట్టడమే కాకుండా పన్ను చెల్లింపుదారులకు సౌలభ్యంగా చక్కటి సేవలు అందుతాయని, ఆదాయాలు పెరుగుతాయని తెలిపారు. వీటన్నింటిపై అధ్యయనం చేసి, వచ్చే సమీక్షా సమావేశంలో తనకు నివేదించాలన్నారు. డ్రగ్స్, మత్తు పదార్థాలను నివారించడానికి, వాటి పంపిణీని అడ్డుకోవడానికి అధికారులు మరింతగా దృష్టి సారించాలని చెప్పారు. ఇందులో భాగంగా యూనివర్సిటీలు, కాలేజీలు, విద్యా సంస్థల వద్ద కచ్చితంగా టోల్ ఫ్రీ నంబర్ ఉండేలా హోర్డింగ్స్ ఉంచాలని, డ్రగ్స్ నివారణ కార్యక్రమాలు, టోల్ ఫ్రీ నంబర్ పనితీరుపై ప్రతి జిల్లాలో ప్రతి 15 రోజులకోసారి మాక్ డ్రిల్ చేపట్టాలని ఆదేశించారు. రవాణా శాఖలో మెరుగైన విధానాలు తీసుకువచ్చేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని చెప్పారు. ఈ సందర్భంగా ముగిసిన ఆర్థిక సంవత్సరంలో ఎంత మేర లక్ష్యాలు చేరుకున్నామనే విషయాన్ని, ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న లక్ష్యాలను వివిధ శాఖలకు చెందిన అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

వాణిజ్య పన్నులు, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ఆదాయంలో వృద్ధి

- గత ఏడాదితో పోలిస్తే వాణిజ్య పన్నుల ఆదాయ వృద్ధిలో ఏపీ మెరుగైన పనితీరు కనపరిచిందని ఆ శాఖ అధికారులు తెలిపారు. కర్ణాటక, మహారాష్ట్రల కంటే మెరుగైన స్థానంలో ఏపీ ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 25.29 శాతం వృద్ధి నమోదైందని తెలిపారు.
- 2022–23లో రాష్ట్రంలో వాణిజ్య పన్నుల ఆదాయం రూ.51,481 కోట్లుగా 93.24 శాతం లక్ష్యాన్ని చేరుకుందని, ఈ ఆర్థిక సంవత్సరంలో (2023–24) రూ.60,191 కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు.
- లీకేజీలను అరికట్టి, సమగ్ర పర్యవేక్షణ ద్వారా లక్ష్యాన్ని చేరుకునే మార్గాలపై దృష్టి పెట్టినట్లు అధికారులు తెలిపారు. సీఎం ఆదేశాల మేరకు డేటా అనలిటిక్స్, ఆటోమేషన్, శాఖలతో సమన్వయం, ఎగవేతల పట్ల అప్రమత్తత, సమర్థతను పెంచుకునే పద్ధతుల ద్వారా పని తీరును మెరుగు పరుచుకుంటున్నామన్నారు.
- స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ఆదాయం వృద్ధి చెందినట్టుగా ఆ శాఖ అధికారులు తెలిపారు. ఏడాదికేడాది స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ఆదాయం పెరుగుతూ వస్తోందన్నారు. 2018–19లో ఈ శాఖ ఆదాయం రూ.4,725 కోట్లు కాగా, 2022–23 నాటికి రూ.8071 కోట్లకు చేరిందని తెలిపారు.

గనుల ఆదాయంలో 26 శాతం వృద్ధి

- గత ఏడాదితో పోల్చితే గనుల ఆదాయంలో 26 శాతం వృద్ధి నమోదైనట్లు అధికారులు వివరించారు. గనులు ఖనిజాల శాఖలో 2022–23లో రూ.4,500 కోట్లు లక్ష్యం కాగా, రూ.4,756 కోట్ల ఆదాయం వచ్చిందని, ఈ ఆర్థిక ఏడాది రూ.6 వేల కోట్ల మేరకు లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు.
- రవాణా శాఖలో 2022–23లో ఆదాయం రూ.4,294.12 కోట్లు వచ్చిందని, తద్వారా 95.42 శాతం లక్ష్యాన్ని చేరుకున్నట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు. 2018–19లో రూ.3,224.98 కోట్ల ఆదాయం ఉండగా, 2023–24 లో రూ.6,999.42 కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.

ఈ సమీక్షా సమావేశంలో డిప్యూటీ సీఎం (ఎక్సైజ్) నారాయణ స్వామి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ధర్మాన ప్రసాదరావు, స్పెషల్ సీఎస్‌లు నీరబ్‌కుమార్ ప్రసాద్, రజత్ భార్గవ, భూగర్భ గనుల శాఖ ముఖ్యకార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, ముఖ్య కార్యదర్శి శ్యామలరావు, హోం శాఖ ముఖ్య కార్యదర్శి హరీష్‌కుమార్ గుప్తా, రవాణా శాఖ కార్యదర్శి ప్రద్యుమ్న, పీసీసీఎఫ్ వై.మధుసూదన్‌రెడ్డి, వాణిజ్య పన్నుల శాఖ కార్యదర్శి గుల్జార్, రవాణా శాఖ కమిషనర్ మనీష్ కుమార్ సిన్హా, పురపాలక శాఖ కమిషనర్ కోటేశ్వరరావు, స్టాంప్, రిజిస్ట్రేషన్స్ కమిషనర్ రామకృష్ణ, సేల్స్ ట్యాక్స్ స్పెషల్ కమిషనర్ అభిషిక్త్ కిషోర్, అడిషనల్ డీజీలు ఎస్.సంజయ్, రవిశంకర్ అయ్యన్నార్, ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డి, మైన్స్ డైరెక్టర్ వి.జి.వెంకటరెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

తగ్గిన లిక్కర్, బీరు వినియోగం

2018-19తో పోలిస్తే 2022-23లో లిక్కర్, బీరు వినియోగం 12.61 శాతం తగ్గుముఖం.
2018-19లో 384.3 లక్షల కేసుల లిక్కర్ వినియోగం.
2022-23లో 335.9 లక్షల కేసుల లిక్కర్ వినియోగం.
2018-19తో 277.1 లక్షల కేసుల బీరు వినియోగం.
2022-23లో 116.7 లక్షల కేసులు బీరు వినియోగం.
2018-19తో పోలిస్తే 2022-23లో 57.87 శాతం తక్కువగా బీరు వినియోగం.

24 వరకు అవినాశ్‌రెడ్డిని అరెస్టు చేయొద్దు

- సీబీఐకి సుప్రీం కోర్టు ఆదేశం
- తదుపరి విచారణ సోమవారానికి వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డిని ఈ నెల 24వ తేదీ వరకు అరెస్టు చేయొద్దని సీబీఐకి సుప్రీం కోర్టు ఆదేశించింది. ముందస్తు బెయిలు అంశంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులపై స్టే ఇచ్చింది. తెలంగాణ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులను సవాల్ చేస్తూ వివేకానందరెడ్డి కుమార్తె నర్రెడ్డి సునీత దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహాలతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారించింది. సునీత తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూత్రా వాదనలు వినిపిస్తూ.. అవినాశ్‌రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఆదేశాలు ఇబ్బందికరంగా ఉన్నాయని చెప్పారు. సీబీఐ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. వివేకా హత్య కేసులో అవినాశ్ పాత్రపై ఆధారాలు ఉన్నాయని తెలిపారు. ముందస్తు బెయిలు ఇస్తే విచారణపై ప్రభావం చూపుతుందని తెలిపారు. హైకోర్టు ఇలాంటి ఆదేశాలు ఇవ్వడం మరీ దారుణంగా లేదా అని అవినాశ్‌రెడ్డి తరఫు న్యాయవాది రంజిత్‌కుమార్‌ను ఉద్దేశించి సీజేఐ వ్యాఖ్యానించారు. హైకోర్టు ఉత్తర్వులపై స్టే విధించడంపై రంజిత్‌కుమార్ అభ్యంతరం వ్యక్తం చేశారు. తన క్లయింటు ప్రస్తుతం సీబీఐ విచారణలో ఉన్నారని, స్టే విధిస్తే వెంటనే అరెస్టు చేస్తే, ఇక నోటీసులు జారీ చేసి ప్రయోజనం ఏముందని ప్రశ్నించారు. ఈ కేసులో అన్ని అంశాలను పూర్తిగా పరిశీలించాల్సి ఉందని చెప్పారు. సోమవారానికల్లా కౌంటరు దాఖలు చేస్తామని తెలిపారు. దీంతో అవినాశ్, సీబీఐలకు నోటీసులు జారీ చేస్తున్నట్లు సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ చెప్పారు. హైకోర్టు ఆదేశాల్లోని పేరా 18లో ఇచ్చిన మార్గదర్శకాలపై స్టే ఇస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 24 (సోమవారం) వరకు అవినాశ్‌రెడ్డిని అరెస్టు చేయొద్దని సీబీఐకి సూచిస్తున్నామన్నార. తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేశారు.

దివ్యాంగుల కోటా పాలిటెక్నిక్ లెక్చరర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

ఈనెల 27 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లోని దివ్యాంగుల కోటాలో భర్తీ చేయాల్సిన 21 లెక్చరర్ పోస్టుల నియామకానికి ఏపీపీఎస్సీ శుక్రవారం నోటిఫికేషన్ జారీచేసింది. అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కమిషన్ కార్యదర్శి జె.ప్రదీప్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులను ఈ నెల 27వ తేదీ నుంచి మే 17వ తేదీ వరకు సమర్పించవచ్చని వివరించారు.

అన్ని కేజీబీవీలలో ఇక సీబీఎస్ఈ సిలబస్

పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ వెల్లడి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని కస్తూరిబా బాలికా విద్యాలయాలు (కేజీబీవీలు) అన్నిటిలో 2023–24 విద్యాసంవత్సరం నుంచి సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) సిలబస్‌ను అమలు చేయనున్నట్లు పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రపంచస్థాయి పోటీని ఎదుర్కొనేందుకు వీలుగా ఇంగ్లిష్ మీడియంలో వీరికి సీబీఎస్ఈ సిలబస్‌తో బోధన ఉంటుందని తెలిపారు. 2024–2025 విద్యాసంవత్సరంలో సీబీఎస్ఈ సిలబస్‌లో టెన్త్ పరీక్షలను రాసేలా విద్యార్థులను సిద్ధం చేయనున్నామన్నారు. ఈ దిశలో భాగంగా 8వ తరగతి విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల వనరులు సమకూర్చామన్నారు. ఎన్సీఈఆర్టీ సిలబస్‌తో ద్విభాషా పాఠ్యపుస్తకాలు అందించినట్లు వివరించారు. కాగా, పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం మండలం రేగులపాడు కేజీబీవీలో 8వ తరగతి విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీలో ప్రభుత్వ ఆదేశాలను పాటించలేదన్న ఆరోపణలపై నలుగురు అధికారులను సస్పెండ్ చేస్తూ ప్రవీణ్ ప్రకాష్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు



ప్రధాన కేంద్రాల్లో శుక్రవారం నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు(డిగ్రీల్లో)

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
అనంతపురం	40.1	21.9
రెంటచింతల	42.4	27.6
రాజమహేంద్రవరం	42.0	26.5
కర్నూలు	41.0	27.9
కనిగిరి	41.0	26.0
గుంటూరు	40.0	27.0
ఏలూరు	40.0	27.0
విజయనగరం	39.0	29.0
విజయవాడ	39.0	27.0
శ్రీకాకుళం	38.0	25.0
నెల్లూరు	37.8	27.5
అనకాపల్లి	36.5	24.0
తిరుపతి	36.0	25.0
విశాఖపట్నం	35.4	27.0
తెలంగాణలో..		
ఆదిలాబాద్	38.3	22.5
రామగుండం	37.6	23.0
హైదరాబాద్	35.3	25.1

సాయేష్ మృతదేహాన్ని తీసుకువచ్చేందుకు చర్యలు

హోంమంత్రి తానేటి వనిత వెల్లడి

కొవ్వూరు/ఏలూరు టౌన్: అమెరికాలో దుండగుల కాల్పుల్లో మృతి చెందిన పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన వీరా సాయేష్ (24) మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత తెలిపారు. సాయేష్ మృతిపై దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ శుక్రవారం ఆమె ప్రకటన విడుదల చేశారు. ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన సాయేష్ హత్యకు గురి కావడం బాధాకరమని పేర్కొన్నారు. విద్యార్థి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలిపారు. కాగా, అమెరికాలోని ఓహియో స్టేట్ పిన్స్ వర్సిటీలో ఎంఎస్ చదువుతోన్న సాయేష్ పార్ట్‌టైం జాబ్‌గా పెట్రోల్ బంక్‌లో పనిచేస్తుండగా గురువారం వేకువజామున ఒంటిగంట సమయంలో ఇద్దరు దుండగులు వచ్చి కాల్పులు జరిపి నగదు తీసుకుపోయిన విషయం తెలిసిందే. కాగా, ఏలూరు విద్యార్థి అమెరికాలో మృతిచెందాడని తెలిసిన వెంటనే ఎమ్మెల్యే ఆళ్ల నాని ఏలూరు అశోక్‌నగర్‌లోని మృతుని ఇంటికి వెళ్లి మృతుడి తల్లి జయశ్రీ,, అన్న వెంకటేష్‌లను, బంధువులను పరామర్శించారు. వారికి అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు.

భౌతికకాయం తరలింపునకు 'తానా' సహకారం : వెంకట్.ఎస్.మేడపాటి

సాయేష్ మృతి విచారకరమని ఏపీఎన్ఆర్‌టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ ఎస్.మేడపాటి శుక్రవారం పేర్కొన్నారు. అమెరికా నుంచి భౌతికకాయాన్ని స్వదేశానికి రప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పారు. అమెరికాలోని తానా ప్రతినిధులు తమ సహాయసహకారాలు అందిస్తున్నారని, ప్రభుత్వం నుంచి ఏమైనా సహాయం కావాలంటే తీసుకుంటామని కుటుంబ సభ్యులు తెలిపారని వివరించారు. భౌతికకాయం రెండు, మూడు రోజుల్లో స్వస్థలానికి చేరుకుంటుందని వెంకట్ తెలిపారు.

రేపు అప్పన్న చందనోత్సవం

సింహాచలం (పెందుర్తి): సింహగిరిపై శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం జరిగే ఈ కార్యక్రమానికి సుమారు లక్షన్నర మంది భక్తులు వస్తారని అంచనా. ఈ మేరకు అధికార యంత్రాగం ఏర్పాట్లను పూర్తి చేసింది. వరాహ, నారసింహ రూపాలను ఒక్కటిగా చేసుకుని ఏడాదంతా చందనం మణుగుల్లో నిత్యరూపంలో దర్శనమిచ్చే సింహాద్రినాథుడి నిజరూప దర్శనం లభించే సమయం ఆసన్నమవుతోంది. ఏడాదిలో కేవలం ఒక్క రోజులోని కొన్ని గంటలు మాత్రమే లభించే ఈ అరుదైన దర్శనం చేసుకునేందుకు తరలివచ్చే భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని జిల్లా యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేసింది. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చే సాధారణ భక్తులకే పెద్ద పీట వేస్తూ వారికి దర్శనాల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కలెక్టర్ మల్లికార్జున, సింహాచలం దేవస్థానం ఈవో త్రినాథరావు సారథ్యంలో అన్ని శాఖల అధికారులు ఏర్పాట్లు చేశారు.

అక్రమ మైనింగ్‌పై ఉక్కుపాదం మోపాం

- విజిలెన్స్ స్క్వాడ్, టోల్ ఫ్రీ నంబర్‌తో అక్రమాలకు అడ్డుకట్ట
- కుప్పం, ద్రవిడ వర్సిటీ భూముల్లో అక్రమ మైనింగ్ నియంత్రణ
- అయ్యన్నపాత్రుడి లేటరైట్ అక్రమ మైనింగ్‌పైనా చర్యలు
- మైనింగ్ డైరెక్టర్ వెంకటరెడ్డి



సాక్షి, అమరావతి : రాష్ట్రంలో అక్రమ మైనింగ్‌పై ప్రభుత్వం ఉక్కుపాదం మోపిందని గనుల శాఖ డైరెక్టర్ వీజీ వెంకటరెడ్డి చెప్పారు. ఆయన శుక్రవారం విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ.. గతంలో ఇష్టారాజ్యంగా అక్రమ మైనింగ్, రవాణా జరుగుతున్నా పట్టించుకోలేదనే ఆరోపణలు ఉన్నాయని, వాటిని పూర్తిస్థాయిలో నియంత్రించేందుకు సీఎం వైఎస్ జగన్ విజిలెన్స్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అక్రమ మైనింగ్, రవాణాను అరికట్టేందుకు టోల్ ఫ్రీ నంబర్ 1800 5994599 ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 2014–19 మధ్య అక్రమ మైనింగ్‌పై 424 కేసులు నమోదవగా, 2019–22 మధ్యలో 643 కేసులు నమోదైనట్లు చెప్పారు. అక్రమ మైనింగ్‌పై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందనడానికి ఇదే నిదర్శనమన్నారు. చిత్తూరు జిల్లా కుప్పం అటవీ భూములు, ద్రవిడ యూనివర్సిటీ భూముల్లో అక్రమ మైనింగ్‌ను పూర్తి స్థాయిలో నియంత్రించినట్లు తెలిపారు. ద్రవిడ విశ్వ విద్యాలయం భూముల్లో 131 గ్రానైట్ బ్లాకులను సీజ్ చేశామన్నారు. చిత్తూరు జిల్లాలో 2014 నుంచి 2019 వరకు అక్రమ మైనింగ్‌పై కేవలం 38 కేసులు నమోదు చేయగా, 2019 నుంచి 2023 వరకు విస్తృతంగా తనిఖీలు నిర్వహించడం వల్ల 96 కేసులు నమోదయ్యాయన్నారు. టీడీపీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న అయ్యన్నపాత్రుడు 2014–19 మధ్య కాలంలో బినామీల ద్వారా పెద్ద ఎత్తున లేటరైట్ అక్రమ మైనింగ్‌కు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయన్నారు. దానిపైనా చర్యలు తీసుకుని జరిమానా విధించామన్నారు. సీఎం వైఎస్ జగన్ ముందుచూపుతో ప్రవేశపెట్టిన పలు సంస్కరణల వల్ల మైనింగ్ ఆదాయం భారీగా పెరిగిందన్నారు. 2018–19 ఆర్థిక సంవత్సరంలో వార్షిక మైనింగ్ రెవెన్యూ రూ.1,950 కోట్లు కాగా, 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.4,756 కోట్లకు పెరిగిందని చెప్పారు. రాష్ట్రంలో గ్రావెల్, రోడ్ మెటల్ మైనింగ్‌లో అక్రమాలు జరుగుతున్నాయని కొందరు పనికట్టుకుని అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. 2014 నుంచి 2019 వరకు రాష్ట్రంలో 41.62 లక్షల క్యూబిక్ మీటర్ల గ్రావెల్‌కు తాత్కాలిక అనుమతులు ఇవ్వడం వల్ల ప్రభుత్వానికి రూ.12.62 కోట్ల మైనింగ్ ఆదాయం లభించిందని చెప్పారు. 2019–22 వరకు రాష్ట్రంలో 1.25 కోట్ల క్యూబిక్ మీటర్ల గ్రావెల్‌కు తాత్కాలిక అనుమతులు ఇవ్వడం వల్ల ప్రభుత్వానికి రూ. 65.24 కోట్ల ఆదాయం లభించిందన్నారు. గత ప్రభుత్వం కంటె ఈ ప్రభుత్వంలో మూడేళ్లలోనే నాలుగు రెట్లు అధికంగా ఆదాయాన్ని ఆర్జించినట్లు తెలిపారు.

ఎలాంటి కుట్రలైనా చేయగల సమర్థుడు బాబు

మంత్రి కొట్టు సత్యనారాయణ

సాక్షి, అమరావతి: వ్యవస్థలను మేనేజ్ చేయడంలో చంద్రబాబును మించిన ఘనాపాఠి మరొకరు లేరని ఉప ముఖ్య మంత్రి కొట్టు సత్యనారాయణ ఆరోపించారు. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు పదవిలో ఉంటే సీబీఐని రాష్ట్రంలోకి రాకుండా జీవోలు తెచ్చాడని.. అలాంటి వ్యక్తి అధికారం కోసం ఎలాంటి కుట్రలు చేసేందుకైనా అవకాశం ఉందన్నారు. దేవదాయ శాఖ మే 12 నుంచి 17 వరకు విజయవాడలో నిర్వహించతలపెట్టిన అష్టోత్తర శత కుండాత్మక చండీ రుద్ర రాజశ్యామల సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహా యజ్ఞం కోసం 14 కమిటీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

దళితులపైకి కార్యకర్తలను

రెచ్చగొట్టిన చంద్రబాబు

▶ మొదటి పేజీ తరువాయి

చంద్రబాబుకు నిరసన తెలుపుతూ రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆధ్వర్యంలో దళిత నాయకులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు నల్ల కండువాలు మెడలో వేసుకుని, బెలూన్లు, ప్లకార్డులతో మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద రోడ్డుకు ఒక పక్క నిలబడ్డారు. దళితులనుద్దేశించి నారా లోకేశ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, గో బ్యాక్ చంద్రబాబు, దళిత ద్రోహి చంద్రబాబు, నారా లోకేశ్ అంటూ నినాదాలు చేశారు. దళితులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేశ్ క్షమాపణ చెప్పిన తర్వాతే ఎస్సీ నియోజకవర్గంలోకి అడుగు పెట్టాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, దళితుల నిరసన విషయాన్ని తెలుసుకున్న టీడీపీ నాయకులు కొంతమంది.. దాడులు జరపాలన్న ప్రధాన ఉద్దేశంతో మంత్రి క్యాంపు కార్యాలయం వద్దకు ర్యాలీగా వచ్చారు. వీరిని పోలీసులు కొద్ది దూరంలోనే నిలిపివేశారు. ఆ తర్వాత చంద్రబాబు కాన్వాయ్ మంత్రి క్యాంపు కార్యాలయం వద్దకు వచ్చింది. కాన్వాయ్ వెళ్లేందుకు ఎటువంటి ఆటంకాలు లేకపోవడం వలన సజావుగా సాగుతుందని పోలీసులు భావించారు. అయితే, చంద్రబాబు హఠాత్తుగా తన కారు డోరు తీసుకొని బయటకు వచ్చారు. నిరసన తెలుపుతున్న మంత్రి సురేష్‌పైన, దళితుల పైన సీరియస్‌గా వేలు చూపిస్తూ దూషించడం మొదలుపెట్టారు. టీడీపీ కార్యకర్తలు రెచ్చిపోయేలా మాట్లాడారు. దీంతో టీడీపీ నేతలు, కార్యకర్తలు రాళ్లు, ఇనుప రాడ్లు, చెప్పులు మంత్రి సురేష్‌పైన, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, దళితులపైన విసరడం మొదలు పెట్టారు. పోలీసులు వెంటనే మంత్రిని క్యాంపు కార్యాలయంలోకి తీసుకెళ్లారు. టీడీపీ రాళ్ల దాడిలో ఇద్దరు వైఎస్సార్‌సీపీ నేతలకు, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితిని పోలీసులు చక్కదిద్ది, బాబు కాన్వాయ్‌ను అక్కడి నుంచి పంపించారు. గాయాలైన ముగ్గురికీ స్థానిక ప్రభుత్వ వైద్యులతో మంత్రి సురేష్ చికిత్స చేయించారు.



గాయపడిన వైఎస్సార్‌సీపీ నాయకులు



కేడర్‌ను రెచ్చగొడుతున్న చంద్రబాబు

అందరినీ చదివిస్తా : చంద్రబాబు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు/ మార్కాపురం: టీడీపీ అధికారంలోకి వస్తే పిల్లలందరినీ చదివిస్తానని ఆ పార్టీ అధినేత చంద్రబాబునాయుడు చెప్పారు. రైతుల సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు. అందరికీ ఉద్యోగాలు రావాలని, ఉద్యోగాలు వచ్చిన వారందరూ తనను బాగా చూసుకోవాలని అన్నారు. ఆయన శుక్రవారం రాత్రి యర్రగొండపాలెంలో రోడ్ షో నిర్వహించారు. అంతకుముందు మార్కాపురంలో రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. జగన్‌మోహన్‌రెడ్డి ఇంట్లో ఒకరికే అమ్మ ఒడి ఇస్తున్నారని, మిగతా ఇద్దరూ కూలి పనులకు వెళ్లాలా అంటూ ప్రశ్నించారు. పోలీసులు లా అండ్ ఆర్డర్ బాగా మెయింటైన్ చేస్తున్నారని చెప్పారు. వర్షం కూడా టీడీపీ అంటే భయపడింది తమ్ముళ్లూ.. వర్షమొస్తే కరెంటు పోతుందా అని కేడర్‌ను చంద్రబాబు అడగడంతో కేడర్ నోరెళ్లబెట్టింది.

మే 15 నుంచి బీజేపీ ప్రచార భేరి

- రాజమహేంద్రవరంలో నిర్వహించిన పార్టీ కోర్ సమావేశంలో నిర్ణయం



శ్రీరామచంద్రప్రభుకు కండువా కప్పి ఆహ్వానిస్తున్న సోము వీర్రాజు తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పరిపాలన, రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం అందిస్తున్న తోడ్పాటును వివరిస్తూ మే నెల 15వ తేదీ నుంచి జూన్ 15 వరకు ప్రచార భేరి కార్యక్రమం చేపట్టనున్నట్లు మాజీ ఎమ్మెల్సీ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి మాధవ్ తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై మే 5 నుంచి 15 వరకు పది రోజులపాటు పోరాటం చేయడంతో పాటు చార్జిషీట్ దాఖలు చేయాలని నిర్ణయించినట్లు ఆయన వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో కేంద్ర మంత్రి, పార్టీ ఏపీ ఇన్‌చార్జి మురళీధరన్ నేతృత్వంలో రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు రాష్ట్ర నాయకులతో చర్చలు జరిపారు. అనంతరం కోర్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ వివరాలను మాధవ్ మీడియాకు వివరించారు. వైఎస్సార్‌సీపీతో బీజేపీ కలిసి వెళ్తుందనే అసత్య ప్రచారం జరుగుతుందని.. దానిని తిప్పికొడతామని చెప్పారు. గతంలో తెలుగుదేశం కూడా రాష్ట్రంలో అరాచకాలు చేసిందన్నారు. అచ్చెన్నాయుడు, పితాని ఏదో ఊహించి మాట్లాడుతున్నారని చెప్పారు. పవన్ తమతోనే ఉన్నారని, వచ్చే ఎన్నికలకు జనసేనతోనే కలిసి వెళ్తామని పేర్కొన్నారు. రాష్ట్రప్రభుత్వంపై పోరాటం విషయంలో జనసేనతో కలిసి కార్యక్రమాల రూపకల్పనకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. కోర్ కమిటీ సమావేశంలో పురందేశ్వరి, టీజీ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన వ్యాపారవేత్త రామచంద్రప్రభు

గుంటూరుకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, తులసి సీడ్స్ అధినేత రామచంద్ర ప్రభు శుక్రవారం రాజమహేంద్రవరంలో కేంద్ర మంత్రి మురళీధరన్ సమక్షంలో బీజేపీలో చేరారు. ప్రధాని మోదీ సిద్ధాంతాలు, ఆశయాలు నచ్చి తన కుమారుడు తులసీ సీడ్స్ ఎండీ యోగేష్ చంద్రతో కలిసి బీజేపీలో చేరానని రామచంద్ర ప్రభు తెలిపారు. ఏపీలో బీజేపీ పటిష్టత కోసం కృషి చేస్తానని ఆయన ప్రకటించారు.

టీటీడీ విజిలెన్స్ వలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ సాబ్జీ

- ఒకే నెలలో 19 సిఫార్సు లేఖలు జారీ
- ఫోర్జరీ ఆధార్ కార్డులతో వేరే రాష్ట్రాల భక్తులకు దర్శనం చేయిస్తున్న వైనం
- డ్రైవర్‌తోపాటు ఎమ్మెల్సీని అదుపులోకి తీసుకున్న పోలీసులు



ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ

తిరుమల/సాక్షి ప్రతినిధి ఏలూరు: ఫోర్జరీ ఆధార్ కార్డులతో తన సిఫార్సు లేఖలపై వేరే రాష్ట్రాలకు చెందినవారికి తిరుమలలో శ్రీవారి దర్శనం చేయిస్తున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ శుక్రవారం టీటీడీ విజిలెన్స్ వలకు చిక్కారు. ఆయనే స్వయంగా ఫోర్జరీ ఆధార్ కార్డులతో భక్తులను దర్శనానికి తీసుకెళ్తుండగా విజిలెన్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఈ వ్యవహారంపై టీటీడీ విజిలెన్స్ అధికారి గిరిధర్‌రావు వెల్లడించిన వివరాలు... ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ ఇతర మతస్తుడైనా తరచూ శ్రీవారి దర్శనానికి సిఫార్సు లేఖలు జారీ చేస్తున్నారు. దీంతో అనుమానం వచ్చిన టీటీడీ ఉన్నతాధికారులు లోతుగా ఈ వ్యవహారాన్ని పరిశీలించారు. గత నెల రోజుల వ్యవధిలోనే ఎమ్మెల్సీ సాబ్జీ 19సార్లు సిఫార్సు లేఖలు జారీ చేశారని వెల్లడైంది. ఇందులో మూడు సార్లు ఎమ్మెల్సీయే స్వయంగా తిరుమలకు వచ్చారు. తన సిఫార్సు లేఖలపై దర్శనానికి పంపిన భక్తులంతా కూడా ఇతర రాష్ట్రాలకు చెందినవారే. ఈ క్రమంలో శుక్రవారం కూడా ఎమ్మెల్సీ సాబ్జీ స్వయంగా తిరుమలకు వచ్చారు. 14 మందికి బ్రేక్ దర్శనాలు కావాలని దరఖాస్తు చేశారు. ఆయన ఎమ్మెల్సీ కావడంతో టీటీడీ నిబంధనల మేరకు 10 మందికి అధికారులు బ్రేక్ దర్శన టికెట్లు ఇచ్చారు. అయితే అనుమానంతో ఆయనతో పాటు దర్శనానికి వెళ్తున్నవారిని విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. భక్తులు ఫోర్జరీ ఆధార్ కార్డులపై దర్శనానికి వెళుతున్నట్లు గుర్తించి వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. బెంగళూరుకి చెందిన భక్తుల ఆధార్ కార్డులను ఫోర్జరీ చేసి హైదరాబాద్‌కు చెందినవారిగా సృష్టించారని వెల్లడైంది. అంతేకాకుండా ఆరుగురు భక్తులకు దర్శనానికి సంబంధించి ఎమ్మెల్సీ డ్రైవర్ ఖాతాలో రూ.లక్షా 5 వేలు జమయ్యాయి. దీంతో వీరిపై విజిలెన్స్ అధికారులు ఫిర్యాదు చేయడంతో డ్రైవర్‌తో పాటు ఎమ్మెల్సీని టూటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

కఠినంగా వ్యవహరిస్తున్న టీటీడీ

2019 నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో దళారుల పట్ల టీటీడీ కఠినంగా వ్యవహరిస్తోంది. ఇందులో భాగంగా దళారీ వ్యవస్థను ప్రోత్సహిస్తున్న 16 మంది ప్రజాప్రతినిధుల చిట్టాను సిద్ధం చేసింది. భక్తులను మోసగిస్తూ వారి వద్ద దర్శనాలకు అధిక మొత్తంలో నగదు వసూలు చేస్తున్న వారి వివరాలు సేకరించింది.

ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని రద్దు చేయాలి

అధికార హోదాను అడ్డుపెట్టుకొని దర్శనాల్లో అక్రమాలకు పాల్పడిన ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ శాసనమండలి సభ్యత్వాన్ని రద్దు చేయాలని బీజేపీ డిమాండ్ చేసింది. మండలి చైర్మన్ ఈ సంఘటనపై వెంటనే స్పందించాలని ఆ పార్టీ నేతలు భానుప్రకాష్, విష్ణువర్ధన్ రెడ్డి వేర్వేరుగా డిమాండ్ చేశారు.

మా'మి'డి పోకుండా!

మామిడి పండ్ల నాణ్యత, రక్షణకు ఫ్రూట్ కవర్లు

- వీటితో వ్యాధి నిరోధక శక్తి, నాణ్యత, దిగుబడి అధికం
- అందుబాటులో 15.3 లక్షల ఫ్రూట్ కవర్లు
- ఫ్రూట్ కవర్ రైతు భరోసా కేంద్రాల్లో రూపాయికే లభ్యం
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



మామిడి పంటకు వేసిన ఫ్రూట్ కవర్లు

చిత్తూరు జిల్లాలోని ఖరీఫ్ ఉద్యాన పంటల్లో మామిడిదే అగ్రస్థానం. పంట దిగుబడి, నాణ్యత ఉంటేనే రైతుకు ఆదాయం. ఇందులో భాగంగానే మామిడి పండ్లు మంచి నాణ్యత, దిగుబడితోపాటు వాటి రక్షణ కోసం ఫ్రూట్ కవర్లను రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. కీటకాలు, పురుగులు ఆశించకుండా జాగ్రత్తలు తీసుకుంది. బయట మార్కెట్‌లో ఒక్కో ఫ్రూట్ కవర్ ధర రూ.2.5 ఉండగా రైతు భరోసా కేంద్రాల్లో సబ్సిడీ ద్వారా రూపాయికే రైతులకు అందుబాటులోకి తెచ్చింది. దీనిపై జిల్లా వ్యాప్తంగా సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

సాక్షి, చిత్తూరు: జిల్లాలోని ఉద్యాన పంటల్లో మామిడితే అగ్రస్థానం. ఈ ఖరీఫ్‌లో జిల్లా వ్యాప్తంగా 58 వేల హెక్టార్లలో మామిడి పంట సాగవుతోంది. ఇందులో ఎక్కువగా గుజ్జు పరిశ్రమకు ఉపయోగించే తోతాపూరి రకం సాగులో ఉంది. టేబుల్ వెరైటీస్‌గా పిలవబడే బంగినపల్లి, ఇమామ్ పసంద్, మల్గూబ, రసాలు, మల్లిక వంటి రకాలు సుమారు 40 వేల ఎకరాలలో సాగువుతోంది. గతంలో రసాయనిక ఎరువులు ఎక్కువగా వాడుతున్నారని యూరోపియన్ దేశాల వారు మామిడి ఎగుమతులను తిరస్కరించారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్లుగా సేంద్రీయ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించింది. మామిడిలోనూ అధిక దిగుబడులు సాధించేలా చర్యలు చేపట్టింది. తద్వారా విదేశాల నుంచి కూడా ముందస్తు ఆర్డర్లు వస్తున్నాయి.

సబ్సిడీతో రూపాయికే కవర్

మొదటి విడతలో జిల్లాకు రాష్ట్ర ప్రభుత్వం 15.3 లక్షల మ్యాంగో కవర్లు మంజూరు చేసింది. ఇదే కవర్ బయట మార్కెట్‌లో రూ.2.5 వెచ్చించి కొనుగోలు చేయాల్సి వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం 60 శాతం సబ్సిడీతో రూపాయికే రైతుకు కవర్ మంజూరు చేస్తోంది. ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా ఆయా రైతు భరోసా కేంద్రాల్లోనే కవర్లు అందుబాటులోకి తెచ్చింది. వీటిని సక్రమంగా వాడుకుంటే రెండు సార్లు ఉపయోగించవచ్చని యంత్రాంగం సూచిస్తోంది.

నాణ్యమైన దిగుబడి

మామిడిలో పూత దశ నుంచి పిందె.. కాయ దశ వరకు అనేక క్రిమికీటకాలు ఆశిస్తుంటాయి. మామిడి కాయలకు మచ్చతెగులు సోకుతుంటుంది. దీనిద్వారా పంట దిగుబడి దెబ్బతినే ప్రమాదం ఉంది. దీన్ని గుర్తించిన రైతులు మామిడి కాయలకు రక్షణగా కవర్లు కట్టి కాపాడుతున్నారు. వీటి వాడకం వల్ల మామిడి కాయలు వ్యాధి నిరోధక శక్తిని కలిగి ఉంటాయని, లోపలికి ఎటువంటి వ్యాధులు రాకుండా అడ్డుకుంటాయని అధికారులు పేర్కొంటున్నారు. కవర్ లోపల భాగం నలుపు రంగులో ఉండడం వల్ల మామిడికాయకు మంచి ఉష్ణోగ్రత కూడా లభిస్తుంది. దీంతో నాణ్యత గల మామిడి దిగుబడి అవుతుంది. ఆశించిన స్థాయిలో మామిడి ధర ఉంటుంది.

కవర్‌ను ఎలా ఉపయోగించాలంటే..

ఒక పెద్ద నిమ్మకాయ సైజు వచ్చిన మామిడికాయకు ఈ కవర్‌ను తొడగాలి. ఆపై కాండంకు కవరు మొదటి భాగం వేలాడదీయాలి. ఈ విధంగా చేయడం వల్ల కాయకు ఎటువంటి పురుగులు ఆశించవు. ఇలా దిగుబడి అయిన మామిడి పళ్లకు మార్కెట్లో 40 శాతానికిపైగా అధిక ధర లభిస్తుంది.



మామిడికి వేసిన ఫ్రూట్‌కవర్లు పరిశీలిస్తున్న ఉద్యానశాఖాధికారులు

మంచి లాభదాయకం



మామిడికి ఫ్రూట్ కవర్ వాడకం ఎంతో లాభదాయకం. గతంలో ఈ విధానంతో సాగుచేసిన రైతులకు మంచి ధర లభించింది. అందుకే ఈ ఏడాది మేము కూడా ఈ విధానాన్ని అనుసరించాం. కవర్ల వాడకం వల్ల ఎలాంటి క్రిమిసంహారక మందులు కూడా అవసరం లేదు. నాణ్యమైన పంట దిగుబడి పొందవచ్చు.

– ఈశ్వరబాబు, కొత్తపల్లి, గుడిపాల మండలం

అవగాహన పెరిగింది



అధికారుల సూచనల మేరకు రైతులకు మామిడి కవర్లను సరఫరా చేశాం. క్షేత్రస్థాయిలో ఈ కవర్లను ఏ విధంగా ఉపయోగించాలో అవగాహన కల్పించాం. ఒక రూపాయికే కవర్లు పంపిణీ చేశాం. వీటి వల్ల ఎలాంటి కీటకాలు చేరవు. ఎగుమతులకు ఉపయోగపడే విధంగా మామిడి పంట దిగుబడి చేయవచ్చు.

–అఖిల, వ్యవసాయకార్యదర్శి, చేర్లోపల్లి, చిత్తూరు మండలం

సలహా మండలి తీర్మానంతో..



మామిడిలో టేబుల్ వెరైటీస్‌లో ఎక్కువ భాగం విదేశాలకు ఎగుమతి చేయాల్సి వస్తుంది. వ్యవసాయ సలహా మండలి సమావేశంలో సభ్యులు ఫ్రూట్ కవర్లు కావాలని తీర్మానించారు. ఆమేరకు ప్రభుత్వానికి పంపాము. ప్రభుత్వ అనుమతితో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సబ్సిడీతో కూడిన కవర్లు అందజేస్తున్నాం.

– పి.రామచంద్రారెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, చిత్తూరు జిల్లా

నాణ్యమైన పంట దిగుబడి



జిల్లాలో మొదటి విడతగా 15.3 లక్షల ఫ్రూట్ కవర్లు మంజూరయ్యాయి. వీటి ద్వారా నాణ్యమైన పంట దిగుబడిని పొందవచ్చు. రైతుల ఉత్పత్తి వ్యయాలను తగ్గించవచ్చు. ఇటీవల మామిడిలో భారీ ఎత్తున ఎగుమతులు జరుగుతున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఈ సారి మామిడి కవర్లు అందుబాటులోకి తెచ్చాం.

–మధుసూదన్ రెడ్డి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి చిత్తూరు

మామిడి రైతుకు బాసట



రాష్ట్ర ప్రభుత్వం మామిడి రైతుకు నష్టం వాటిల్ల కూడదని అన్ని చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే సేంద్రియ వ్యవసాయ విధానాన్ని ప్రోత్సహించింది. మామిడిలో రక్షణ చర్యలు ప్రారంభించింది. కవర్లు వాడడం వల్ల ఎటువంటి క్రిమిసంహారక మందులు ఉపయోగించనవసరం లేదు. ఇలాంటి మామిడి కాయలను ఎక్కువగా ఎగుమతి చేయొచ్చు.

–పి.శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్, చిత్తూరు

వివేకాపై కక్ష గట్టింది ఆ ఇద్దరే..

▶ మొదటి పేజీ తరువాయి

వెల్లడించారు. షేక్ షమీమ్ వాంగ్మూలంలో పేర్కొన్న విషయాలు ఆమె మాటల్లోనే..

మా పెళ్లిని తీవ్రంగా వ్యతిరేకించారు

వైఎస్ వివేకానందరెడ్డి నన్ను 2010లో ముస్లిం సంప్రదాయం ప్రకారం వివాహం చేసుకున్నారు. మేం పెళ్లి చేసుకోవడాన్నే వివేకా కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, పెద్ద బావమరిది నర్రెడ్డి శివప్రకాశ్‌రెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారు. సునీత నాకు ఫోన్‌చేసి తీవ్రంగా బెదిరించారు. శివప్రకాశ్‌రెడ్డి మా బావగారికి ఫోన్‌చేసి తీవ్రంగా దూషించారు. దీంతో ఆయన కుటుంబం పులివెందుల వదిలివెళ్లిపోయింది. ఈ విషయాన్ని నేను వివేకానందరెడ్డికి చెప్పాను. దాంతో ఆయన శివప్రకాశ్‌రెడ్డి దగ్గరకు వెళ్లి కాలర్ పట్టుకుని మరీ మండిపడ్డారు. షమీమ్‌ను తాను రెండో పెళ్లి చేసుకున్నానని.. ఆమె నా భార్యని స్పష్టంచేశారు. అయినాసరే.. శివప్రకాశ్‌రెడ్డి మాత్రం వివేకా మాటలను ఏమాత్రం పట్టించుకోలేదు. మమ్మల్ని బెదిరిస్తూనే వచ్చారు.

ఆస్తి, రాజకీయ వారసత్వం కోసమే కక్ష

2013 నుంచి సునీత, నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, నర్రెడ్డి శివప్రకాశ్‌రెడ్డిల నుంచి నాకు వేధింపులు ఎక్కువయ్యాయి. 2014లో మాకు బాబు పుట్టాడు. షేర్ షా అనే పేరుపెట్టాం. మా కుమారుడికి ఆస్తిలో వాటా ఇస్తాననడంతోపాటు తన రాజకీయ వారసుడిగా ప్రకటిస్తానని కూడా వివేకానందరెడ్డి చెప్పారు. దాంతో నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి, నర్రెడ్డి శివప్రకాశ్‌రెడ్డిలలో ఆందోళన మొదలైంది. వివేకానందరెడ్డికి మొదటి భార్యతో కుమారుడు లేకపోవడంతో ఆయన ఆస్తికి ఏకైక వారసుడిని కావాలని అల్లుడు నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి భావించారు. ఆయన రాజకీయ వారసుడిని కావాలని నర్రెడ్డి శివప్రకాశ్‌రెడ్డి పట్టుదలగా ఉండేవారు. కానీ, మాకు పుట్టిన బిడ్డను వారసుడిగా ప్రకటిస్తానని చెప్పడంతో వారిద్దరూ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. వివేకానందరెడ్డిని మా ఇంటికి రాకుండా కట్టడి చేసేందుకు యత్నించేవారు. ఆయన్ను కూడా తీవ్రంగా బెదిరించేవారు.

ఆ నాలుగెకరాలను శివప్రకాశ్‌రెడ్డి రాయించుకున్నారు..

బెరైటీస్ గనులు ఉన్న నాలుగెకరాల భూమిని నా కుమారుడి పేరున రాయాలని వివేకానందరెడ్డి భావించారు. కానీ, అందుకు సునీత, నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, శివప్రకాశ్‌రెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారు. ఆ భూమిని శివప్రకాశ్‌రెడ్డి తన పేరున రాయించేసుకున్నారని వివేకానందరెడ్డే నాకు చెప్పి బాధపడ్డారు. అప్పటి నుంచి సునీత, నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, నర్రెడ్డి శివప్రకాశ్‌రెడ్డిల నుంచి నాకు బెదిరింపులు మరింత తీవ్రమయ్యాయి.

వివేకాకు ఆర్థిక ఇబ్బందులు.. ఆయన్ని ఒంటరిని చేశారు..

వివేకానందరెడ్డిని ఆయన మొదటి భార్య సౌభాగ్యమ్మ, కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, పెద్ద బావమరిది శివప్రకాశ్‌రెడ్డి తీవ్రంగా వేధించారు. కుటుంబానికి చెందిన కంపెనీలలో డైరెక్టర్‌గా ఆయనకు ఉన్న చెక్ పవర్‌ను తొలగించారు. ఆయన్ని ఒంటరిగా పులివెందులలో విడిచిపెట్టి కుటుంబసభ్యులు అందరూ హైదరాబాద్‌లో ఉండేవారు. దాంతో రోజువారి ఖర్చులకు కూడా ఆయన తీవ్ర ఇబ్బందులు పడేవారు. అప్పులు తీర్చడానికి హైదరాబాద్ మణికొండలో ఉన్న తన ఇంటిని కూడా 2018లో విక్రయించారు.

రూ.8 కోట్లు ఇస్తానన్నారు..

బెంగళూరులో ఓ భూ సెటిల్‌మెంట్ ద్వారా రూ.8 కోట్లు వస్తాయని వాటిని నాకు ఇస్తానని వివేకానందరెడ్డి చెప్పారు. కడపలోగానీ హైదరాబాద్‌లోగానీ ఓ ఇల్లు కొనిస్తానని.. మా కుమారుడిని బాగా చదివిస్తానని చెప్పారు. ఇది వివేకానందరెడ్డి స్నేహితుడు ఎర్ర గంగిరెడ్డి ద్వారా నర్రెడ్డి శివప్రకాశ్‌రెడ్డికి తెలిసే అవకాశం ఉంది. గంగిరెడ్డి, శివప్రకాశ్‌రెడ్డి మధ్య ఆర్థిక లావాదేవీలు ఉన్నాయి. వారిద్దరూ కుట్ర ప్రకారం వివేకానందరెడ్డి చుట్టూ తమ మనుషులనే పెట్టారు. దస్తగిరితోపాటు అందరూ వాళ్ల మనుషులే. హైదరాబాద్‌లో నేను ఉంటున్న ఇంటి అడ్రస్ కూడా దస్తగిరికి తెలియకుండా వివేకానందరెడ్డి జాగ్రత్తపడేవారు. ఓసారి దస్తగిరి మామిడిపళ్లు పట్టుకుని హైదరాబాద్ వస్తే.. మా ఇంటికి కాకుండా మరోచోట అప్పగించమని చెప్పారు. దస్తగిరి నుంచి నాకు ప్రమాదం ఉంటుందనే ఉద్దేశంతోనే అలా చేశారు. వివేకానందరెడ్డి హత్య తరువాత శివప్రకాశ్‌రెడ్డి ఆదేశాలతోనే ఎర్ర గంగిరెడ్డి ఆధారాలను ధ్వంసం చేశారు. వివేకానందరెడ్డి మృతదేహాన్ని బెడ్‌రూమ్ నుంచి హాలులోకి తేవడం, ఆధారాలను ధ్వంసం చేయడం అంతా దగ్గరుండీ చేయించింది ఎర్ర గంగిరెడ్డే. శివప్రకాశ్‌రెడ్డి చెప్పడంతోనే ఆయన అలా చేశారు.

భయంతోనే వెళ్లలేదు..

2019, మార్చి 15న ఉ.10గంటల సమయంలో వివేకానందరెడ్డి మరణించారని నాకు తెలిసింది. వెంటనే మా చెల్లితో కలిసి పులివెందుల వెళ్లాలని అనుకున్నా. కానీ, శివప్రకాశ్‌రెడ్డికి భయపడే వెళ్లలేదు. ఎందుకంటే 2012లో ఓసారి వివేకానందరెడ్డి ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. అప్పుడు ఆయన్ని చూసేందుకు ఇంటికి వెళ్తే నన్ను శివప్రకాశ్‌రెడ్డి అడ్డుకున్నారు. ఇంట్లోకి వెళ్లనివ్వకుండా బయటకు బలవంతంగా గెంటేశారు. అందుకే 2019లో ఆయన హత్యకు గురైనా సరే పులివెందుల వెళ్లేందుకు సాహసించలేకపోయాను.

ఐఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు

వివేకానందరెడ్డి 2017లో ఒక ఐఫోన్ కొని నాకు ఇచ్చారు. 2019లో ఆయన హత్యకు గురైన తరువాత పోలీసులు వచ్చి ఆ ఐఫోన్‌ను తీసుకెళ్లిపోయారు. దానిపై నాకు ఎలాంటి రశీదు కూడా ఇవ్వలేదు. నర్రెడ్డి శివప్రకాశ్‌రెడ్డే ఆ ఫోన్‌ను పోలీసుల ద్వారా నా దగ్గర నుంచి తీసుకున్నారేమోనని ఆ అనుమానం.

సాక్షి

శనివారం, 22 ఏప్రిల్ 2023

జవాబుదారీతనం అవసరం

ఒక పెద్ద ఘోరం చోటుచేసుకున్నప్పుడు... అకారణంగా కాల్పులు జరిపి అమాయక పౌరుల ఉసురు తీసినప్పుడు దోషులను కఠినంగా దండించాలని డిమాండ్ చేయటం, జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలని అడగటం గొంతెమ్మ కోర్కెలేమీ కాదు. కానీ ఈశాన్య రాష్ట్ర ప్రజానీకం ప్రారబ్ధమేమిటోగానీ ఆ కనీస ప్రజాస్వామిక డిమాండ్ నెరవేరటం కూడా వారికి కనాకష్టంగా మారింది. దశాబ్దాలుగా అమలవుతున్న ఈ ఆటవిక న్యాయంపై విసుగెత్తి అక్కడి ప్రజలు కమలనాథులను నెత్తినెత్తుకుని ఏడెనిమిదేళ్లు దాటుతోంది. కొన్నిచోట్ల సొంతంగా, మరికొన్నిచోట్ల మిత్రపక్షాలతో కలిసి బీజేపీ అధికారాన్ని పంచుకోవటం మొదలైంది. తాము అధికారంలోకొస్తే అవసరం లేని ప్రాంతాల్లో సైనిక దళాల ప్రత్యేకాధికారాల(ఏఎఫ్ఎస్పీఏ) చట్టాన్ని క్రమేపీ తొలగిస్తామని బీజేపీ మేనిఫెస్టో 2014లో హామీ ఇచ్చింది. అక్కడక్కడైనా ఆ దిశగా చర్యలు తీసుకుంటున్న వైనం కనబడింది. అస్సాం, నాగాలాండ్, మణిపూర్ వగైరాల్లో తిరుగుబాటుదార్ల బెడదలేని ప్రాంతాల్లో ఆ చట్టాన్ని వెనక్కి తీసుకున్నారు. ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అంతమాత్రాన ఆ చట్టం ఇంకా అమలవుతున్న ప్రాంతాల్లో ఎప్పటి మాదిరే ఏం చేసినా చెల్లుబాటవుతుందని పాలకులు చెప్పదల్చుకుంటే మాత్రం ప్రజలు సహించలేరు. తెల్లారిలేస్తే అదే పనిగా హోరెత్తే చానెళ్లు, అనేకానేక సామాజిక మాధ్యమాలు ప్రజల జ్ఞాపకశక్తికి పెద్ద పరీక్షే పెడుతున్నాయి. నిన్న మొన్న జరిగిన ఘటనలు సైతం జనం మస్తిష్కాల నుంచి సత్వరమే చిత్తగిస్తున్నాయి. కానీ నిష్కారణంగా అమాయక కూలీల నిండు ప్రాణాలు బలిగొన్న నెత్తుటి ఉదంతం కూడా జనం జ్ఞాపకాల్లో మసకబారివుంటుందని భావిస్తే ఎలా?

నాగాలాండ్లోని మాన్ జిల్లా ఓటింగ్లో 2021 డిసెంబర్ 4న చీకట్లు ముసురుకుంటున్నవేళ ఏం జరిగిందో గుర్తు తెచ్చుకుంటే ఒళ్లు గగుర్పొడుస్తుంది. అస్సాం సరిహద్దుల్లోని తిరు లోయ బొగ్గు గనిలో రోజంతా కాయకష్టం చేసి గూటికి చేరటానికి ట్రక్కులో వెళ్తున్న రోజు కూలీలపై హఠాత్తుగా గుళ్ల వర్షం కురిసింది. వాహనం ఎవరిదో, అందులో ఎవరున్నారో కూడా గమనించకుండా విచక్షణా రహితంగా కాల్పులు జరిపినవారు ఆర్మీ జవాన్లు. బహుశా కాల్పులు జరిగిన ప్రాంతం జనావాసాలకు దూరంగా ఉంటే ఎన్కౌంటర్ కథనం మీడియాలో వెలువడేది కావొచ్చు. కానీ అక్కడికి కూతవేటు దూరంలో ఉన్న గ్రామస్థులు కాల్పుల కలకలం, హాహాకారాలు వినబడి ఆత్రంగా పరుగెత్తుకుంటూ చేరుకున్నారు. అప్పటికే శవాలను తమ ట్రక్కులోకి తరలిస్తున్న జవాన్లను వారు నిలదీశారు. ఘర్షణ జరిగింది. మళ్లీ కాల్పులు జరిగి మరో ఏడుగురు గ్రామస్థులు బలయ్యారు. ఇదెంత సంచలనమైందో ఎవరూ మరిచిపోరు. దీనిపై సత్వరమే విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని బీజేపీ భాగస్వామిగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఈశాన్య రాష్ట్రాల ప్రజలకు హామీ ఇచ్చాయి. ఆ ప్రకారమే సైన్యం అంతర్గతంగా ప్రత్యేక విచారణ ప్రారంభించింది. నివేదిక కూడా రూపొందింది. అందులోని అంశాలేమిటో, ఎలాంటి నిర్ధారణకొచ్చారో బయటపడలేదు. దీనికి సమాంతరంగా నాగాలాండ్ పోలీసులు ఘటన జరిగిన మర్నాడే సిట్ ఏర్పాటుచేసి దర్యాప్తు మొదలుపెట్టారు. మాన్ జిల్లా సెషన్స్ కోర్టులో నిరుడు మే నెల 30న చార్జిషీటు దాఖలు చేశారు. ఒక మేజర్, ఇద్దరు సుబేదార్లు, ఎనిమిదిమంది హవల్దార్లు, నలుగురు నాయక్లు, ఆరుగురు లాన్స్ నాయక్లు, తొమ్మిదిమంది పారాట్రూపర్లు– మొత్తం 30 మందిని నిందితులుగా తేల్చారు. సెషన్స్ కోర్టులో విచారణ మొదలైవుంటే ఏమయ్యేదోగానీ నిరుడు జూలైలో జవాన్ల భార్యలు ఈ విచారణపై స్టే కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సర్వోన్నత న్యాయస్థానం వారి వినతిని మన్నించింది. ఈలోగా జవాన్ల ప్రాసిక్యూషన్కు అనుమతించాలన్న సిట్ విజ్ఞప్తిని తిరస్కరిస్తున్నట్టు రక్షణ మంత్రిత్వ శాఖ అధికారుల నుంచి నాగాలాండ్ పోలీసు ఉన్నతాధికారులకు వర్తమానం అందింది. ప్రజాస్వామిక రిపబ్లిక్ ఉనికిలో ఉంటున్నచోట భద్రతా బలగాలు 13 మంది సాధారణ పౌరుల ప్రాణాలు బలిగొంటే వారి కుటుంబాలకు కనీస న్యాయం అందించటంలో వ్యవస్థలన్నీ విఫలం కావటం ఊహించలేనిది.

తొందరపాటుతోనో, తప్పుడు అంచనాలతోనో విచక్షణారహితంగా వ్యవహరించేవారు సైన్యంలో అక్కడక్కడ ఉంటున్నారు. ఇలాంటి ఉదంతాలపై స్థానిక ప్రజల్లో నిరసనలు వెల్లువెత్తినాకే ఏఎఫ్ఎస్పీఏ చట్టం ఎత్తివేత అంశం తెరపైకొచ్చింది. మణిపూర్ యువతి ఇరోం షర్మిల సుదీర్ఘకాలం ఈ అంశంపైనే నిరవధిక నిరాహారదీక్ష చేసింది. ఆ చట్టాన్ని ఎత్తి వేస్తామని గతంలో కాంగ్రెస్ హయాంలోని యూపీఏ సర్కారు హామీ ఇచ్చినా సైన్యం నుంచి తీవ్ర వ్యతిరేకత రావటంతో వెనక్కు తగ్గింది. ఆ విషయంలో ఎన్డీఏ ప్రభుత్వం ఎంతో మేలు. మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానం మేరకు ప్రశాంతత నెలకొన్న ప్రాంతాల్లో ఆ చట్టాన్ని వెనక్కు తీసుకోవటం మొదలైంది. కానీ కూలీలను కాల్చిచంపిన ఉదంతం, అందుకు బాధ్యులైనవారిపై చర్యలు తీసుకోవటంలో చూపిస్తున్న అలసత్వం ఈ ప్రతిష్ఠను మసకబారుస్తోంది. దేశ రక్షణ యజ్ఞంలో జవాన్ల త్యాగనిరతి వెలకట్ట లేనిది. ఆ విషయంలో రెండో మాటకు తావులేదు. కానీ తప్పులు చేస్తున్న గుప్పెడుమంది వ్యవహార శైలిని చూసీచూడనట్టు వదిలేయటం సరికాదు. పొరపాటు చోటుచేసుకుంటే, అందునా ఆ పొరపాటు మూల్యం నిండు ప్రాణాలైతే ఎంతటివారిపైన అయినా కఠిన చర్యలుంటాయన్న అభిప్రాయం కలిగించినప్పుడే సాధారణ పౌరులకు భరోసా ఏర్పడుతుంది. చట్టబద్ధ పాలనపై విశ్వాసం కలుగుతుంది. అటు జవాన్లలో సైతం జవాబుదారీతనం పెరుగుతుంది. కేంద్రం పునరాలోచించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, తిథి: శు.విదియ ఉ.8.14 వరకు, తదుపరి తదియ, నక్షత్రం: కృత్తిక రా.12.05 వరకు, తదుపరి రోహిణి, వర్జ్యం: ఉ.11.50 నుండి 1.26 వరకు, దుర్ముహూర్తం: ఉ.5.43 నుండి 7.24 వరకు, అమృతఘడియలు: రా.9.36 నుండి 11.14 వరకు.

సూర్యోదయం : 5.44
సూర్యాస్తమయం : 6.13
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

సాయం కాదు, సంక్షోభాలు ఆపాలి!

విశ్లేషణ



అజయ్ ఛిబ్బర్

అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎంఎఫ్) సంస్థ వద్ద ఉన్న వనరులు ప్రపంచ జీడీపీలో 1.1 శాతం మాత్రమే. దేశాల మధ్య ద్వైపాక్షిక సహకారం ద్వారా లభించే మొత్తాలు ఐఎంఎఫ్ ఇచ్చే రుణాల కంటే ఎక్కువగా ఉంటున్నాయి. కాబట్టి ఐఎంఎఫ్ కేవలం పర్యవేక్షణకు, నిఘాకు మాత్రమే పరిమితం కావాలి. ఐఎంఎఫ్ తలకెత్తుకుంటున్న చాలా పనులు ఇతర సంస్థలు ఇంతకంటే మెరుగ్గా నిర్వహించగలవు. చేపట్టిన కార్యక్రమాల పరిమాణం, ఇచ్చిన రుణ మొత్తాల ఆధారంగా ఐఎంఎఫ్ విజయాలను లెక్క వేయకూడదు. అగ్నిమాపక దళం సమర్థతను ఎన్నిసార్లు మంటలు ఆర్పగలిగిందో చూడటం ద్వారా కాకుండా... అగ్ని ప్రమాదాలు జరక్కుండా నివారించగలగడంపై అంచనా వేయడమే సరైన పని. ఇదే సూత్రం ఐఎంఎఫ్కూ వర్తిస్తుంది.

ఎలాగైతే వాతావరణ మార్పుల మీద ప్రపంచ బ్యాంక్ ఏమీ చేయలేకపోతున్నదో, దాని కవల అయిన ఇంటర్నేషనల్ మానెటరీ ఫండ్ (అంతర్జాతీయ ద్రవ్య నిధి) సంస్థ కూడా దాని ప్రధాన కార్యకలాపాలపై చేష్టలుడిగి చూస్తోంది. ప్రపంచ ఆర్థిక, వాణిజ్య వ్యవహారాలపై ఓ కన్నేసి ఉంచేందుకు ఏర్పాటు చేసుకున్న సంస్థ ఇది. కానీ అమెరికాలో బ్యాంకులు కుప్ప గూలాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ భారీ కుదుపులకు లోనవుతోంది. ద్రవ్యోల్బణాన్ని అదుపు చేసేందుకు వడ్డీ రేట్లు పెంచడటంతో ఎదుగు తున్న మార్కెట్లలో రుణాలకు డిమాండ్ పెరిగిపోతోంది. అయినా వీటిని ఎదుర్కోవడంలో ఐఎంఎఫ్ ప్రధాన భూమిక పోషించడం లేదు. లింగవివక్ష, మానవాభివృద్ధి వంటి అంశాల మీద దృష్టి పెడుతూ– అభివృద్ధి చెందుతున్న మార్కెట్లు సంక్షోభాలను ఎదుర్కొనేలా, తక్కువ ఆదాయమున్న దేశాలు వృద్ధిని పెంచుకునేలా, పేదరికాన్ని తగ్గించుకునేలా రూపొందించే కార్యక్రమాల మీద ఐఎంఎఫ్ తన మొత్తం శక్తిని వెచ్చిస్తోంది. కానీ ఇతర సంస్థలు కూడా ఈ పనులు మెరుగ్గా నిర్వహించగలవు.

నిఘా నామమాత్రం

అభివృద్ధి చెందిన దేశాల్లోనూ ఐఎంఎఫ్పై ప్రధానంగా ఆరు అభ్యంతరాలు వినిపిస్తాయి! ఆర్థిక మార్కెట్ల అస్థిరత్వానికి దారితీసే ఓపెన్ కేపిటల్ మార్కెట్లకు అవసరానికి మించి మద్దతివ్వడం వీటిల్లో ఒకటి. ఇక రెండో విమర్శ... అభివృద్ధి చెందుతున్న, చెందిన దేశాలకు భిన్నమైన సలహాలివ్వడం. అభివృద్ధి చెందిన దేశాల ఆర్థిక వ్యవస్థలపై నిఘా నామమాత్రంగా సాగడం, ఆ దేశాల విధానాలపై విశ్లేషణ కూడా అంతంతమాత్రంగానే చేయడం మూడో విమర్శ. దీని ప్రభావం చిన్న దేశాలపై కూడా పడుతుందన్నది ఇక్కడ గమనించాల్సిన విషయం. ప్రపంచస్థాయి సంక్షోభాలను ముందుగానే గుర్తించగలిగే ఐఎంఎఫ్ అసమర్థత కూడా దీనికి జత కలుస్తుంది.

ఇప్పుడు నాలుగో విమర్శ విషయానికి వద్దాం. ఐఎంఎఫ్ చేపట్టే కార్యక్రమాల పరిమాణం ఏకపక్షంగా ఉంటుంది. గ్రీస్, పోర్చుగల్, ఐర్లాండ్ వంటి చిన్న యూరోపియన్ దేశాలు తమ కోటా కంటే 30 రెట్లు అదనంగా ఐఎంఎఫ్ ప్రయోజనాలు పొందుతూంటాయి. ఒక వైపు యుద్ధం జరుగుతూండగా, ఉక్రెయిన్లో సుమారు 1500 కోట్ల డాలర్ల విలువైన ప్రాజెక్టును హడావిడిగా ఆమోదించారు. ఇదే సమయంలో ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న శ్రీలంక కేవలం 300 కోట్ల డాలర్ల సాయం కోసం నెలలు వేచి చూడాల్సి వచ్చింది. శ్రీలంకకు మిత్రుడని చాటుకున్న చైనా కూడా సాయం కోసం ఏడాదిపాటు నిరీక్షింపజేసిన విషయం గమనార్హం. జీ7 దేశాల రాజకీయ మద్దతు లేకుంటే ఇంతకంటే చాలా తక్కువ మొత్తాలకు కూడా చిన్న దేశాలు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి. ఇలా చిన్న మొత్తాలను తీసుకున్నప్పుడు పొదుపునకు ప్రాధాన్యం ఎక్కువగా ఉంటుంది. అలాగే సంక్షోభం నుంచి పూర్తిగా బయటపడే అవకాశాలూ తక్కువగా ఉంటాయి.



బకాయిల వల్ల రుణాలివ్వడం నిలిపేసిన తరువాత కూడా ఐఎంఎఫ్ వరుసగా రుణాలిస్తోందన్నది ఐదవ విమర్శ. ఈ రుణాలు దివాళా తీయడానికే కాకుండా, ద్రవ్య లభ్యత లేమికీ ఇస్తూండటం గమనార్హం. ఐఎంఎఫ్ తరచూ ప్రైవేట్ రుణదాతలకూ డబ్బులిస్తూంటుంది. అది కూడా వారి వాణిజ్య ప్రభుత్వాలకిచ్చిన రుణాలు ప్రజా రుణంగా మారిన తరువాత కూడా. ఈ రుణాలను చెల్లించాల్సిన బాధ్యత పౌరులపై పడుతుంది. ఐఎంఎఫ్ సభ్యదేశాల్లో 25 శాతం (48) తమ సభ్యత్వ కాలంలో సగంకాలం రుణగ్రహీతలుగా కొనసాగుతున్నాయి. ఇంకోలా చెప్పాలంటే, ఐఎంఎఫ్ ప్రాపకంలో ఉన్నాయన్నమాట.

చివరిగా ఐఎంఎఫ్పై ఉన్న ఆరో విమర్శ... ఐక్యరాజ్య సమితిలోని పలు విభాగాలు లేదా బ్యాంకులు చేయదగ్గ పనుల్లో ఐఎంఎఫ్ వేలు పెడుతూండటం. రెసిలియన్స్ అండ్ ట్రస్ట్ ఫెసిలిటీ పేరుతో ఏర్పాటు చేసుకున్న కొత్త పథకం ద్వారా ఇరవై ఏళ్ల గరిష్ఠ పరిమితితో సామాజిక కార్యక్రమాలకు రుణాలిస్తోంది. ఇది కాస్తా ఐఎంఎఫ్ను ఏదో అంతర్జాతీయ సహాయ సంస్థ స్థాయికి మార్చేసిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రపంచస్థాయి సమస్యలకు పనికిరాదు?

2008–09 ఆర్థిక మాంద్యం, 2020 నాటి కోవిడ్, తాజాగా రష్యా– ఉక్రెయిన్ యుద్ధం... ఈ అంశాలపై ఐఎంఎఫ్ వ్యవహారశైలిని గమనిస్తే, తనకున్న నియమ నిబంధనలు, వనరులను దృష్టిలో ఉంచుకుంటే... అంతర్జాతీయ సంక్షోభాలను సమర్థంగా ఎదుర్కోగల సత్తా ఈ సంస్థకు లేదనే చెప్పాల్సి వస్తుంది. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సహకారం, ఆయా ప్రాంతాల్లోని దేశాలు చేసుకునే ఒప్పందాల ప్రకారం లభించే మొత్తాలు ఐఎంఎఫ్ ఇచ్చేదాని కంటే ఎన్నో రెట్లు ఎక్కువగా ఉంటున్నాయి. ఐఎంఎఫ్ వద్ద ఉన్న వనరులు ఇప్పుడు సుమారు లక్ష కోట్ల డాలర్లు లేదా ప్రపంచ జీడీపీలో 1.1 శాతం మాత్రమే. ఇది ఒకట్రెండు దేశాల ఆర్థిక సంక్షోభాలను గట్టెక్కించేందుకూ ఉపయోగపడని పరిస్థితి. అంతర్జాతీయ సంక్షోభాల మాట సరేసరి. ఈ మొత్తంలోనూ సగం సొంత వనరుల నుంచి సమకూర్చున్నవి కాగా, మిగిలిన సగం విచక్షణపై లభించే రుణ ఏర్పాట్లు.

ఐఎంఎఫ్ మూలధనాన్ని కనీసం రెట్టింపు చేయాల్సిన అవసరముంది. అలాగే జీడీపీ ఆధారంగా ఎప్పటికప్పుడు సర్దుబాట్లు చేయాలి. రుణాలపై సంక్షోభం ఏర్పడే పరిస్థితులున్న ఈ తరుణంలో ఇది మరీ ప్రాధాన్యం సంతరించుకుంటుంది. ఐఎంఎఫ్ ప్రాంతీయ స్థాయిలో లిక్విడిటీ ఏర్పాట్లు చేయడం ద్వారా సూక్ష్మ స్థాయిలో ఆర్థిక స్థిరత్వానికి తోడ్పాటునందించాలి. స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ (ఎస్డీఆర్) కింద సుమారు 660.7 బిలియన్లు ఉండగా(ఇది కరెన్సీ కాదు) ఇవి సుమారు 950 బిలియన్ డాలర్లకు సమానం. అంటే ప్రపంచ జీడీపీలో ఒక శాతం కంటే కొంచెం ఎక్కువ. ఒక్కో ఎస్డీఆర్ జారీ రాజకీయ ప్రభావానికి గురవుతూంటుంది. ఎస్డీఆర్లు ఐదేళ్లకు ఒకసారి ఆటోమెటిక్గా జారీ అయ్యేలా చూడాలి. అలాగే వీటి మొత్తం జీడీపీలో కనీసం ఒక్కశాతం ఉండేలా, తక్కువ ఆదాయమున్న దేశాలు ఎక్కువ షేర్లు కేటాయించేలా ఏర్పాట్లు చేయాల్సిన అవసరముంది. అయితే ఈ అంశాలపై ఏకాభిప్రాయం ఇప్పుడున్న పరిస్థితుల్లో చాలా కష్టం.

చిట్ట చివరి రుణ వితరణ సంస్థగా ఉండాలి

ఆర్థిక వ్యవస్థకు కేంద్రబిందువుగా సంస్కరణలకు లోనైన ఐఎంఎఫ్ ఉండాలి. అలాగే ఇది కేవలం పర్యవేక్షణకు, నిఘాకు మాత్రమే పరిమితం కావాలి. చేపట్టిన కార్యక్రమాల పరిమాణం, ఇచ్చిన రుణ మొత్తాల ఆధారంగా ఐఎంఎఫ్ విజయాలను లెక్క వేయకూడదు. సూక్ష్మస్థాయిలో వాతావరణ మార్పుల ప్రభావాన్ని అంచనా వేయాలే గానీ... సాయం చేసే సంస్థగా మారకూడదు. ఐఎంఎఫ్ను చిట్టచివరి రుణ వితరణ సంస్థగా మాత్రమే పరిగణించాలి. ఉనికిలో ఉండేందుకు మాత్రమే కొత్త కొత్త పథకాలను సృష్టించడం, రుణ వితరణ చేపట్టడం చేయరాదు. అగ్నిమాపక దళం సమర్థతను ఎన్నిసార్లు మంటలు ఆర్పగలిగిందో చూడటం ద్వారా కాకుండా... అగ్ని ప్రమాదాలు జరక్కుండా నివారించగలగడంపై అంచనా వేయడమే సరైన పని. సెంట్రల్ బ్యాంక్స్ పరస్పర సహకారాన్ని ఐఎంఎఫ్ ప్రోత్సహించాలి. అలాగే ప్రాంతీయ స్థాయిలో సహాయానికి కొన్ని వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలి. గతంలో ఇలాంటి ప్రయత్నాలను ఐఎంఎఫ్ నిరోధించిన మాట అందరికీ తెలిసిందే. అన్ని దేశాలకు సాయం చేసే ఏకైక సంస్థగా మారడం కాకుండా... ఆర్థిక సుస్థిరత కోసం బహుముఖీనంగా పని చేసే మరింత శక్తిమంతమైన వ్యవస్థగా ఎదిగేందుకు ఐఎంఎఫ్ ప్రయత్నించాలి.

వ్యాసకర్త జార్జ్ వాషింగ్టన్ యూనివర్సిటీలో విజిటింగ్ స్కాలర్
('ద బిజినెస్ స్టాండర్డ్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్సైట్లు ఫేస్బుక్, ట్విట్టర్లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

తగ్గితే పెరుగుతాం!



సివిల్ సర్వెంట్లు చెప్పుకోదగ్గ లక్షణం ఏమిటంటే, అహంకారం. యూపీఎస్సీ పరీక్ష పాసవ్వగానే అది అంటుకుంటుంది. కెరియర్లో వచ్చే అధికారం, ప్రతీ 'ఎస్ సర్'తో అది పెరుగుతూ పోతుంది. మనలోని కొంచెం అహంకారం అయినా తొలగించుకోగలిగినా సివిల్ సర్వీసెస్ డే(ఏప్రిల్ 21) మరింత అర్థవంతం అవుతుంది.

– పి.మణివణ్ణన్, సివిల్ సర్వెంట్

పూరించలేని బంధం



మాతృమూర్తిని కోల్పోయిన మమ్ముట్టితో మాట్లాడాను. నా ప్రగాఢ సంతాపం తెలియజేశాను. వయసు పెరుగుతున్నకొద్దీ నేను మా అమ్మకు మరింత సన్నిహితం అయ్యాను. కాబట్టి ఈ పూరించలేని విలువైన బంధం ఎలాంటిదో నాకు తెలుసు. ఈ నష్టాన్ని ఎదుర్కొనే మనో ధైర్యం ఆయనకు కలగాలి.

– శశి థరూర్, కాంగ్రెస్ ఎంపీ

ఉన్నవి ఇన్నే!



జనానికి బాగా తెలిసినవాళ్లు కూడా వాట్సాప్ జ్ఞానాన్ని ఫార్వార్డ్ చేస్తుండటం వినాశనకరం. మార్చ్ 23 వరకు దేశంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు– 464, డీమ్డ్ విశ్వవిద్యాలయాలు – 128, కేంద్ర విశ్వవిద్యాలయాలు– 54, రాష్ట్ర ప్రైవేటు విశ్వవిద్యాలయాలు– 432. మొత్తం విశ్వవిద్యాలయాల సంఖ్య– 1,078. (ఇండియాలో 5,288 విశ్వవిద్యాలయాలు ఉన్నాయని ఒక పారిశ్రామికవేత్త ఫార్వర్డ్ చేసిన నేపథ్యంలో.)

– మహేశ్వర్ పేరి, విశ్లేషకుడు

నివాళి



యశ్ చోప్రా భాగస్వామి పామ్ జీ (పమేలా చోప్రా) వెళ్లిపోయారు. ఆమె గొప్ప మహిళ. తెలివైనది, విద్యావంతురాలు. సరదా, ఆత్మీయత కలిసిన మనిషి. యశ్ జీతో సన్నిహితంగా పనిచేసిన నాలాంటివాళ్లకు ఆయన స్క్రిప్టులు, సంగీతంలో ఆమె తోడ్పాటు ఏంటో తెలుసు. ఆమె ఒక అసాధారణ మనిషి.

– జావేద్ అఖ్తర్, కవి

ఇలా పాడుకావాలా?



గత కొన్ని రోజులుగా కురిసిన వానలకు, పంజాబ్, హరియాణా మండిల్లోని గోధుమ సంచులు తడిసిపోయి, నీటి మడుగులో అలాగే ఉండిపోయాయి. ఇలాంటి దృశ్యం గత 30 సంవత్సరాలుగా మారలేదు. మండిల్లోని మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి ప్రజాధనాన్ని ఎందుకు వినియోగించడం లేదనేది సూటి ప్రశ్న.

– దేవీందర్ శర్మ, కాలమిస్ట్

మరో రాకుమారి



మా పాప క్లోయీ గ్రేస్ కల్లిస్ను లోకానికి పరిచయం చేస్తున్నాం. మా చిట్టి చిన్నారి రాకుమారి 2.88 కిలోల బరువు తూగింది. అప్పుడే తన చిటికెన వేలికి నాన్నను చుట్టేసుకుంది. తల్లి, కూతురు క్షేమంగా ఉన్నారు. జోషీ తన చెల్లెను ప్రేమిస్తోంది. మా హృదయాలు సంతోషంతో ఉప్పొంగిపోతున్నాయి.

– జాక్వెస్ కల్లిస్, దక్షిణాఫ్రికా మాజీ క్రికెటర్

ఇన్బాక్స్

భూమి ఉమ్మడి ఆస్తి

సాంకేతికంగా ఎంత ఎదిగినా మనిషికి ఆధారం భూమే. భూమంటే 84 లక్షల జీవరాశుల సముదాయం. నేడు మానవజాతి ధరిత్రీ దినోత్సవాన్ని జరుపుకుంటోంది. ప్రజల జీవనోపాధిని మెరుగుపరచడానికీ, వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికీ, జీవవైవిధ్యం పతనాన్ని ఆపడానికీ భూమిని రక్షించుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఈ ఏడాది ఎర్త్ డే థీమ్. 'మన గ్రహం కోసం ఖర్చు చేయండి' (ఇన్వెస్ట్ ఇన్ అవర్ ప్లానెట్). భూమికి ప్రమాదకారిగా మారిన మొట్ట మొదటి అంశం వాతావరణ మార్పులు. ఈ వాతావరణ మార్పులకు ముఖ్య కారణం గ్లోబల్ వార్మింగ్ (భూమి వేడెక్కడం). గ్లోబల్ వార్మింగ్ వలన సముద్రనీటి మట్టాలు పెరిగి, నేలభాగం అంతా కనుమరుగయ్యే అవకాశం ఉంది. అందుకే గ్లోబల్ వార్మింగ్ను నివారించడానికి శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గించి వాటి స్థానంలో సోలార్ విద్యుత్తు, పవన విద్యుత్, జియో థర్మల్ ఎనర్జీ (భూ ఉష్ణ శక్తి), జీవ ఇంధనాలు, గ్రీన్ హైడ్రోజన్ వంటి పునరుత్పాదక ఇంధనాలను వినియోగించాలి.

భూమికి ప్రమాదకారిగా మారిన మరొక అంశం ఘన, ద్రవ పదార్థ వ్యర్థాలను సరైన పద్ధతిలో పారవేయకపోవడం. ఇందువల్ల వాతావరణ, జల కాలుష్యాలు ఏర్పడుతున్నాయి. వస్తువుల వాడకాన్ని తగ్గించడం, వాడిన వస్తువులను తిరిగి ఉపయోగించడం, వాడిన వస్తువుల నుండి తిరిగి కొత్త వస్తువులను తయారు చేయడం ద్వారా హానిని కొంతవరకు నివారించవచ్చు. భూగోళాన్ని కాపాడుకోవాలి అంటే మానవ సమాజం 'ఎర్త్ సెంట్రిక్' ఆలోచనా విధానాన్ని అవలంభించాలి. అంటే మానవుడు తాను ఈ భూగోళంపై ఇతర జీవుల వలె ఒక జీవిగా భావించి తన చుట్టూ ఉన్న ప్రకృతికీ, జీవరాశికీ హానిచేయకుండా తాను బతకాలి, ఇతర జీవులను బతకనివ్వాలి.

– డా॥ శ్రీదరాల రాము; ఫ్యాకల్టీ, ఎస్ఐసీఇటీ, హైదరాబాద్
(నేడు ప్రపంచ ధరిత్రీ దినోత్సవం)

ఇటు పునాది రాళ్లు – అటు సమాధి రాళ్లు

అభిప్రాయం



కంకిపాటి రామ్

కొన్ని రాజకీయ పార్టీలు ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా... వారి బుట్టలో పడకుండా ఓటర్లు విచక్షణతో ఓటుహక్కు వినియోగించుకుంటారు. పార్టీల జెండాల కన్నా అజెండాలనే ఓటర్లు ఎక్కువగా పరిగణనలోకి తీసుకుంటారు. ఆయా పార్టీలు ఎన్నికల ప్రచారంలో ఏం హామీలు ఇచ్చారో తెలుసుకుంటారు. వాటిని నమ్మవచ్చో లేదో ఆలోచిస్తారు. పార్టీలు ఇచ్చిన హామీలు సమాజానికి ఎంత వరకు ఉపయోగకరంగా ఉంటాయో బేరీజు వేసుకొంటారు. సమస్త ప్రజానీకానికీ మంచి చేయగలవారికే బాధ్యతగల ఓటర్లు తమ ఓట్లు వేస్తారు.

అయితే ఇవాళ ఇలా ఆలోచించే ఓటర్లను సులువుగా తప్పుదోవ పట్టిస్తున్నాయి కొన్ని టీవీ ఛానళ్ళు, విషపు పత్రికలు. ఈ మీడియావాళ్లకి ఆర్థికంగా వెన్నుదన్నుగా ఉన్నదో తెలుగు ధనవంతుల పార్టీ. ఈ ముగ్గురు కలిసి ఓ బెర్ముడా ట్రయాంగిల్లా ఏర్పడి రాష్ట్రంలో జరుగుతున్న నిజాల్ని సమాధి చేస్తున్నారు. జరిగింది జరగనట్టు... జరగనిది జరిగినట్టుగా కనికట్టు చేస్తున్నారు. ఆ ఛానల్ బాక్సుకీ, ఆ పత్రికలకీ కాస్త పక్కకు జరిగి అసలు ఏం జరుగుతోందో గమనించాలి. బడుగు బలహీన వర్గాలు మెరుగుపడితేనే సామాజిక సమతుల్యం ఏర్పడుతుందని తెలుసుకోవాలి.

ఒక పక్క వీరిలా చేస్తుంటే, ఇంకో పక్క నుండి రాజకీయం చెయ్యటానికి ఇంకో బాబు వచ్చేస్తున్నాడు. ఆయన ఒకే ఒక పార్టీని... అది ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నా దానినే ప్రశ్నిస్తూ ఉంటాడు. అలా ఎందుకు చేస్తాడనేది మిలియన్ డాలర్ ప్రశ్న. ఇతనికి జెండా ఐతే ఉంది గానీ, తాను ముఖ్యమంత్రి అవ్వాలన్న అజెండా మాత్రం లేదు. ఎవరన్నా సొంత పార్టీ పెట్టేది అధికారాన్ని చేపట్టి తామనుకున్న మంచిని ప్రజలకు చేయడానికే. రాష్ట్ర ముఖ్యమంత్రి అయితే ప్రజలకు ఎంతో చేయగలుగుతారు. ఇతని వాలకం చూస్తే తాను ముఖ్యమంత్రి కావాలని అనుకుంటున్నట్లు కనిపించదు. పైగా 'కందకు లేని దురద కత్తి పీటకు ఎందుకు?' అన్న ఎదురు ప్రశ్నతో రాజకీయం కానిచ్చేస్తున్నాడు ఈ దత్తత పోయిన పుత్రుడు.

మరి ఇంకో పక్కేమో, అప్పుడే పక్క మీద నుండి



లేచిన ఉత్తి బాబొకడు, 'తెగ లావవుతున్నావు సన్నబడటానికి ఏంచేస్తావు? అనడిగితే నేను పాదయాత్ర చేస్తాన'ని బయలు దేరాడు. ఇతనికి భవిష్య వాణి బాగా తెలిసినట్టు... 'ఇక మేము వచ్చేస్తున్నం, మాకు వచ్చేస్తోంద'ని తెలిసినట్టుగా చెప్తున్నాడు. గతంలో ఉత్త మంత్రిగా ఉన్నప్పుడు ఏం చేశావో చెప్పమంటే 'నాకు తెలియదు, గుర్తు రావ ట్లేదు'... అని గారాలు పోతూ ట్రెండింగ్లో ఉన్న గజినీ అవుతున్నాడు. పైగా నాన్నారు చెప్పిందంతా చేశాననే తప్ప, తాము అధికారంలో ఉన్నప్పుడు ఇతమిద్ధంగా ఇది చేశామని చెప్పడానికి నోరు లేవట్లేదు. ఇదేంటని నిలదీస్తే 'మా మనోభావాలు దెబ్బ తినేలా మాట్లాడొద్దు' అని నొచ్చుకుంటున్నాడు. మొత్తం మీద తన పాదయాత్రను తెలుగు ధనవంతుల పార్టీ అంతిమ యాత్రలా చేస్తున్నాడు.

'వారిని ఇంటికి పంపండి', 'వారిని గద్దె దింపండి' అనే నినాదాలనివ్వడం మొక్కటే ఇప్పుడు సిండికేట్ చేస్తున్న పని. అంతేకానీ 'మేమున్నప్పుడు ఇది చేశాం, మేమొస్తే ఇది చేస్తా' మనటానికి వీరి నోరు పెగలడం లేదు ఎందుకు? అందరూ కలిసి ఒక్కడి మీద ఈ దండగ యాత్ర ఎందుకు? సమాజం మొత్తంతో ముడిపడి ఉన్న పత్రికలు ఒక్కడి మీద కక్ష కట్టడమేంటి? రీల్ లైఫ్ హీరో, రియల్ లైఫ్లో విలన్ పాత్ర పోషించడం ఏంటి? 'నలభై ఏళ్ల ఇండస్ట్రీ' అన్న లీడర్ నూట డెబ్భైకి నూట డెబ్భై స్థానాల్లో పోటీ చెయ్యలేక పోవడమేంటి? ఓటర్లు ఇన్ని ప్రశ్నలకు సమాధానాలు వెతకాలి. అప్పుడు కానీ వారికి అసలు నిజాలు తెలియవు.


ఆలోచించండి! ప్రజలు ఎన్నుకున్న పాలకులను ఇంత అవహేళన చేస్తే... ఎన్నుకున్న ఆ ప్రజలను నేరుగా కించ పరిచినట్లేగా. తాము బలపరిచిన పార్టీని గెలిపించలేదనీ 'ఆ టీవీలూ, పత్రికలూ'; తమను గెలిపించలేదన్న అక్కసు ఆ తెలుగు ధనవంతుల పార్టీ, వారి దత్తపుత్రుడూ అనైతికంగా కలిసి దుష్ప్రచారాలు చేస్తున్న సంగతి ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. 2024 కోసం ఆతృతగా వీరు ఎదురు చూస్తుంటే... ప్రజలూ కసిగా ఎదురు చూస్తున్నారు. ఈసారి ప్రజలు వేసే ఓట్లు సుదీర్ఘమైన పాలనకు పునాదిరాళ్ళు, సిండికేట్ ప్రతిపక్షాలకు శాశ్వత సమాధి రాళ్లు కానున్నాయి!

వ్యాసకర్త సామాజిక విశ్లేషకుడు

తొలి సంఘ సంస్కర్త

12వ శతాబ్దంలో కర్ణాటక రాష్ట్రంలో అవతరించిన బసవేశ్వరుడు గొప్ప దార్శనికుడు. కుల, వర్ణ, లింగ వివక్షలు లేని సమ సమాజ స్థాపనకు ఆనాడే అపారమైన కృషి చేసిన సమతామూర్తి. బాల్య వివాహాలు, సతీసహగమనం, విధవల దాసత్వం వంటి వాటికి వ్యతిరేకంగా పోరాడాడు. భారతీయ ఆధ్యాత్మిక ప్రపంచంలో 'వీరశైవం' స్థాపించి మతాన్ని విప్లవీకరించాడు.

బసవేశ్వరుడు 1134లో వైశాఖ శుద్ధ తదియ, అక్షయ తృతీయ శుభదినాన జన్మించాడు. తండ్రి తనకు ఉపనయనం సంకల్పించగా బసవడు వద్దని వాదించి ఇల్లు వదిలి వెళ్ళిపోయాడు. కూడల సంగమేశ్వరంలో పన్నెండేళ్లు అధ్యయనమూ, అధ్యాత్మిక సాధనలూ చేశాడు. దేవాలయాల్లోకి దళితుల ప్రవేశం లేని ఆ రోజుల్లో... బసవేశ్వరుడు సమ సమాజ స్థాపనకు దేవుణ్ణి భక్తుడి వద్దకు తీసుకురావడానికి 'ఇష్టలింగా'న్ని కనిపెట్టాడు. పరమశివునికి ప్రతి రూపమైన ఇష్టలింగాన్ని చేతికిచ్చి గుడి సంస్కృతి, కుల



వ్యవస్థకు ప్రత్యామ్నాయాన్ని ప్రతిపాదించాడు. జ్ఞానమే గురువు, ఆచారమే లింగం, అనుభవమే జంగమమని... చేసే పనిలో దేవుడిని చూసే మార్గాన్ని చూపించి 'కాయకమే కైలాసం' అనే కొత్త ఒరవడికి నాంది పలికాడు.

స్థానిక పాలకుడు బిజ్జలునికి ప్రధాన మంత్రిగా ఉండి సమాజ సంస్కరణకు కృషి చేశాడు. ఒక బ్రాహ్మణ కన్యకు, దళిత యువకుడికీ తలపెట్టిన వివాహాన్ని బసవేశ్వరుడు ప్రోత్సహించటం వల్ల బసవేశ్వరుడికీ– బిజ్జలుడికీ మధ్య తీవ్రమైన విరోధం కలిగింది. ఫలితంగా బసవేశ్వరుడు రాజధానిని వదిలిపెట్టి 1196లో తిరిగి కూడల సంగమేశ్వర క్షేత్రానికి వెళ్ళిపోయాడు. అదే ఏడాది శ్రావణ శుద్ధ పంచమి నాడు లింగైక్యం చెందాడు. నూతన సామాజిక సంస్కరణ విప్లవానికి నాంది పలికిన బసవేశ్వరుని పంథా నేటికీ అనుసరణీయం.

– సామల కిరణ్ । 99493 94688
(రేపు బసవ జయంతి)

ఉద్యోగం ఇప్పిస్తామని రూ.30లక్షలు స్వాహా

- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు
- నిందితుల అరెస్ట్

చిత్తూరు అర్బన్: గ్రామ వార్డు సచివాలయంలో ఉద్యోగాలు ఇప్పిస్తామని.. సుమారు రూ.30 లక్షలు స్వాహా చేసిన మోసగాళ్లను శుక్రవారం చిత్తూరు క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు జిల్లాకు చెందిన బత్తుల శ్రీనివాసులు, జయకృష్ణ ప్రియ తదితరులు ఓ గ్యాంగ్‌గా ఏర్పడ్డారు. అమాయక నిరుద్యోగులను టార్గెట్ చేశారు. 2019 నుంచి సచివాలయ ఉద్యోగం ఇప్పిస్తామని ఆశ చూపి ఒకొక్కరి నుంచి రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల చొప్పున వసూలు చేశారు. ఇలా 15 మంది దగ్గర రూ.30 లక్షల వరకు నిందితులు డబ్బు కాజేశారు. ఆ తర్వాత చేతులెత్తేశారు. మోసపోయిన చిత్తూరు నగరం మిట్టూరుకు చెందిన లక్ష్మీ అనే బాధితురాలు ఇటీవల చిత్తూరు క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు శుక్రవారం చిత్తూరు ఎఫ్‌సీఐ గోదాం వద్ద నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

పాఠాలు చెబుతూ ప్రాణాలు విడిచిన ఉపాధ్యాయుడు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా చెయ్యేరు ప్రాథమిక పాఠశాలలో ఘటన


ఆకొండి బంగారయ్య (ఫైల్)

కాట్రేనికోన: తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు చెబుతున్న ఓ ఉపాధ్యాయుడు ఉన్నట్టుండి కుప్పకూలి మృతి చెందిన ఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం చెయ్యేరు ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం జరిగింది. ఉపాధ్యాయుడు ఆకొండి బంగారయ్య (57) ప్రతి రోజులానే పాఠశాలకు వచ్చి విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. ఆ సమయంలో ఒక్కసారిగా గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయారు. దీంతో భయాందోళనకు గురైన విద్యార్థులు బోరున విలపిస్తూ పెద్ద పెట్టున కేకలు వేశారు. దీంతో సహచర ఉపాధ్యాయులు అక్కడకు చేరుకుని 108కు ఫోన్ చేశారు. 108 సిబ్బంది వచ్చి పరీక్షించి బంగారయ్య మృతి చెందారని నిర్ధారించారు. కాకినాడ జగన్నాథపురానికి చెందిన ఆకొండి బంగారయ్య 1995లో ఉపాధ్యాయునిగా ఉద్యోగంలో చేరారు. ఐదేళ్లుగా చెయ్యేరు ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్నారు. అమలాపురం భూపయ్య అగ్రహారంలో అద్దెకు ఉంటూ చెయ్యేరులో విధులు నిర్వహిస్తున్నారు. ఆయనకు భార్య సత్యవతి, కుమార్తె సీతామహాలక్ష్మి, కుమారుడు ఆదినారాయణమూర్తి ఉన్నారు. కుమార్తెకు వివాహమైంది.

భక్తులపై తేనెటీగల దాడి

- ఏడుగురికి గాయాలు
- అనకాపల్లి జిల్లా ఉపమాకలో ఘటన

నక్కపల్లి (అనకాపల్లి జిల్లా): అనకాపల్లి జిల్లా, ఉపమాక వెంకన్న దర్శనానికి వచ్చిన భక్తులపై శుక్రవారం తేనెటీగలు దాడిచేశాయి. ఈ ఘటనలో ఆలయ అర్చకుడు, మరో ఆరుగురు భక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స కోసం నక్కపల్లి 50 పడకల ఆస్పత్రికి తరలించారు. వివరాల్లోకి వెళితే... గరుడాద్రి పర్వతంపై కల్కి అవతారంలో వెలసిన మూలవిరాట్ సన్నిధిలో ఉదయం అర్చకులు హోమం చేస్తున్నారు. హోమం నుంచి వెలువడిన పొగకు పక్కనే ఉన్న తేనె తుట్టు నుంచి తేనెటీగలు చెదిరిపోయి సమీపంలోని భక్తులపై దాడి చేశాయి. ఈ దాడిలో ఉపమాకకు చెందిన అర్చకుడు గొట్టుముక్కల భరద్వాజ్, నక్కపల్లికి చెందిన రేజేటి సింగరాచార్యులు, యలమంచిలికి చెందిన శ్రీరంగం శ్రీనివాస్ తీవ్రంగా గాయపడ్డారు. అలాగే కె.మంగామణి, సాయమ్మ, బాలసుబ్రహ్మణ్యం, శ్రీవత్స తదితరులకు గాయాలు అయ్యాయి. పలువురు భక్తులు ప్రాణభయంతో కొండ దిగువకు పరుగులు తీశారు. మిగిలిన అర్చకులు గర్భగుడిలోకి వెళ్లి తలుపులు వేసుకోవడంతో ప్రాణాలతో బయట పడ్డారు. గాయపడ్డ వారందరినీ స్థానికులు నక్కపల్లి ఆస్పత్రికి తరలించారు. వీరి పరిస్థితి నిలకడగా ఉందని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు తెలిపారు.

తెలంగాణ

వందేభారత్ సూపర్ సక్సెస్

- సికింద్రాబాద్– విశాఖ, తిరుపతి రెండూ కిక్కిరిసే..
- విశాఖ సగటు ఆక్యుపెన్సీ రేషియో 128%, తిరుపతి 131% నమోదు
- దేశంలోనే టాప్ ప్లేస్‌లోకి రైళ్లు
- త్వరలో తిరుపతి సర్వీసు కోచ్‌ల సంఖ్య రెట్టింపు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్తగా పట్టాలెక్కిన రెండు వందేభారత్ రైళ్లు సూపర్ సక్సెస్ అయ్యాయి. టికెట్ ధర ఎక్కువైనా ప్రయాణికులు వాటిల్లో వెళ్లేందుకు ఎగబడుతున్నారు. దీంతో సికింద్రాబాద్–విశాఖపట్నం, సికింద్రాబాద్–తిరుపతి రైళ్లు కిక్కిరిసి పరుగులు పెడుతున్నాయి. సికింద్రాబాద్–తిరుపతి రైలు సగటు ఆక్యుపెన్సీ రేషియో 131 శాతం ఉండగా, తిరుపతి నుంచి సికింద్రాబాద్‌కు వచ్చేటప్పుడు 134 శాతం నమోదవుతోంది. సికింద్రాబాద్–విశాఖపట్నం వందేభారత్ సగటు ఆక్యుపెన్సీ రేషియో 128 శాతం ఉండగా, తిరుగు ప్రయాణంలో 106 శాతంగా నమోదవుతోంది. దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు పట్టాలెక్కిన వందేభారత్ రైళ్ల ఆక్యుపెన్సీలో ఇవే టాప్‌లో నిలవటం విశేషం.

వేగమే ప్రధానం..

కాచిగూడ–తిరుపతి మధ్య 2017లో డబుల్ డెక్కర్ రైలును ప్రారంభించారు. అది మధ్యాహ్నం పూట ప్రయాణించేది కావటంతో బెర్తులకు బదులు చైర్‌కార్ మాత్రమే ఉంటుంది. దీంతో దానికి ఏమాత్రం ఆదరణ లేక ఆక్యుపెన్సీ రేషియో 12 శాతానికి పడిపోయింది. ఫలితంగా దాన్ని రద్దు చేశారు. ఇప్పుడు దానిలాగే మధ్యాహ్నం వేళ, చైర్‌కార్‌తో ప్రయాణించే వందేభారత్‌ను ప్రవేశపెట్టినప్పుడు రైల్వే అధికారులకు డబుల్ డెక్కర్ రైలే గుర్తొచ్చింది. దీంతో తిరుపతి వందేభారత్‌కు కేవలం 8 కోచ్‌లను మాత్రమే ఏర్పాటు చేశారు. అయితే ప్రయాణికుల నుంచి అనూహ్య ఆదరణ లభించింది. అధిక ఛార్జీ, పగటి వేళ ప్రయాణం, బెర్తులు ఉండకపోయినప్పటికీ జనం ఎగబడుతున్నారు. విశాఖపట్నం వందేభారత్ విషయంలోనూ ఇదే జరిగింది. ఇందుకు వందేభారత్ వేగమే కారణమని స్పష్టమవుతోంది. విశాఖ, తిరుపతిలకు సాధారణ రైళ్లలో 12 నుంచి 14 గంటల సమయం పడుతుంటే వందేభారత్ కేవలం 8 గంటల్లో గమ్యం చేరుస్తోంది. ఉదయం బయలుదేరితే మధ్యాహ్నానికల్లా గమ్యం చేరుతుండటంతో ప్రయాణికులకు ఒక పూట ఆదా అవుతోంది. సికింద్రాబాద్–విశాఖ వందేభారత్‌లో.. విశాఖ వెళ్లేప్పుడు ఎక్కువ మంది ప్రయాణిస్తుండగా, సికింద్రాబాద్–తిరుపతి సర్వీసులో మాత్రం, తిరుపతి నుంచి వచ్చేటప్పుడు ఎక్కువ ఆక్యుపెన్సీ రేషియో నమోదవుతోంది. తిరుపతిలో దర్శనాలు పూర్తి చేసుకున్నాక, మధ్యాహ్నం రైలెక్కి అదే రోజు రాత్రికల్లా నగరానికి చేరుకోగలుగుతుండటం వారికి కలిసి వస్తోంది.

తిరుపతి రైలు ఆదాయం అదుర్స్

జనవరి 15న విశాఖ వందేభారత్ రైలు ప్రారంభమైంది. కాగా ఏప్రిల్ 1 నుంచి ఏప్రిల్ 19 వరకు దాని ద్వారా రైల్వేకు రూ.31 లక్షల ఆదాయం నమోదైంది. అయితే తిరుపతి సర్వీసులో 8 కోచ్‌లు మాత్రమే ఉన్నా, పది రోజుల్లో రూ.17.50 లక్షల ఆదాయం వచ్చింది. త్వరలో తిరుపతి రైలుకు కోచ్‌ల సంఖ్యను 16కు పెంచేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

పది లక్షల బిర్యానీలు.. 4 లక్షల హలీమ్‌లు

- రంజాన్ నెల రోజుల్లో ఆర్డర్ చేసిన హైదరాబాదీలు
- వివరాలు వెల్లడించిన ఫుడ్ డెలివరీ యాప్ స్విగ్గీ

సాక్షి, హైదరాబాద్: రంజాన్ మాసంలో హైదరాబాదీలు అభి'రుచి' తీరా పండుగ చేసుకున్నారు. తరచూ తినే బిర్యానీల నుంచి పండుగ స్పెషల్ హలీమ్, మిఠాయి వంటకాల దాకా భారీగా లాగించేశారు. కేవలం ఒక్క ఫుడ్ డెలివరీ యాప్ స్విగ్గీ ద్వారానే ఏకంగా పది లక్షల బిర్యానీలు, 4 లక్షల హలీమ్‌లు ఆర్డర్ చేసి తెప్పించుకున్నారు. అన్ని రకాల వంటకాలు కూడా గత ఏడాదితో పోలిస్తే 20 శాతం ఎక్కువగా తెప్పించుకుని తిన్నారు. గురువారం స్విగ్గీ ఈ వివరాలను వెల్లడించింది.

హలీమ్‌కు గులామ్..

రంజాన్ మాసంలో ఎప్పటిలాగే హలీమ్ కోసం ఆర్డర్లు వెల్లువెత్తాయి. తమ యాప్ ద్వారా 4 లక్షలకుపైగా హలీమ్‌లను ఆర్డర్ చేశారని స్విగ్గీ తెలిపింది. పండుగ స్పెషల్ హలీమ్ ఉన్నా బిర్యానీకి క్రేజ్ తగ్గలేదని పేర్కొంది. బిర్యానీ రాజధానిగా పేరును నిలబెట్టుకుంటూ తమ యాప్ ద్వారా 10లక్షల బిర్యానీలను ఆర్డర్ చేశారని.. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 20% ఎక్కువని వెల్లడించింది. చికెన్, పాలమూరు పాట్టేల్, పర్షియన్ స్పెషల్, ఇరానీ, డ్రైఫ్రూట్ వంటి హలీమ్‌లు అమ్ముడయ్యాయి.


చిత్తూరు నగరంలోని గంగనపల్లెలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు


పశ్చిమగోదావరి జిల్లా ములపర్రు శివారు పితానివారిపాలెం ఓ ఇంటి వద్ద మాట్లాడుతున్న ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు


తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం వడిశలేరులో ఇంటికి స్టిక్కరు అంటిస్తున్న గృహసారథులు

ఇంటింటా అపూర్వ ఆదరణ

పండుగ వాతావరణంలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం

- వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఊరూరా ఆత్మీయ స్వాగతం
- చంద్రబాబు చేసిన మోసాలను ఏకరవు పెడుతున్న జనం
- సీఎం వైఎస్ జగన్ చేస్తున్న మంచిని గుర్తు చేస్తున్న ప్రజలు
- ప్రభుత్వానికి మద్దతుగా 75 లక్షల మిస్డ్ కాల్స్

సాక్షి, అమరావతి : ఇంటింటా ఘన స్వాగతాలు, ఆత్మీయ పలకరింపులు, జగన్నినాదాల మధ్య పండుగ వాతావరణంలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం దిగ్విజయంగా కొనసాగుతోంది. ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలు, ప్రజాప్రతినిధులు, సచివాలయాల కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులు లక్షలాది కుటుంబాలను కలుస్తూ చరిత్ర సృష్టిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం కూడా ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. రాష్ట్రంలో 46 నెలలుగా సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలన ద్వారా సీఎం వైఎస్ జగన్ చేస్తున్న మేలును ఇంటింటా వివరించి.. ప్రభుత్వంపై ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడమే లక్ష్యంగా ఈ నెల 7న వైఎస్సార్‌సీపీ ప్రతిష్టాత్మకంగా 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. టీడీపీ సర్కార్ హయాంలో చంద్రబాబు చేసిన మోసాలను.. ఆ పార్టీ నేతల అరాచకాలను వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు గుర్తు చేస్తున్నారు. అప్పటి టీడీపీ సర్కార్‌కూ.. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మధ్య ఉన్న తేడాలను వివరించే కరపత్రాన్ని ప్రతి ఇంటా అందిస్తున్నారు.

అందరి నోటా ఒకే నినాదం

జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా ఇంటికి వస్తున్న ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలు, సచివాలయాల కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులకు ఆ కుటుంబ సభ్యులు ఎదురేగి ఘన స్వాగతం పలుకుతున్నారు. 2014 ఎన్నికల్లో 600 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఏ ఒక్క హామీ అమలు చేయకుండా మోసం చేస్తే.. సీఎం వైఎస్ జగన్ 98.5 శాతానికిపైగా హామీలను అమలు చేశారని అన్ని వర్గాల ప్రజలు గుర్తు చేస్తున్నారు. డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తానని హామీ ఇచ్చి చంద్రబాబు నాడు మోసం చేస్తే.. నేడు సీఎం వైఎస్ జగన్ వాటిని చెల్లిస్తున్నారని అక్క చెల్లెమ్మలు ప్రశంసిస్తున్నారు. అమ్మ ఒడి, విద్యా కానుక, గోరుముద్ద, విద్యా దీవెన, వసతి దీవెన వంటి పథకాల ద్వారా పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్ది.. వారి బంగారు భవితకు సీఎం వైఎస్ జగన్ బాటలు వేస్తున్నారని కొనియాడుతున్నారు.

నాడు అన్నీ అగచాట్లే..

చంద్రబాబు అధికారంలో ఉన్న ఐదేళ్లు దుర్భిక్ష పరిస్థితులతో తీవ్రంగా నష్టపోయామని.. ఏనాడూ బీమా పరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చి ఆదుకోలేదని రైతులు గుర్తు చేస్తున్నారు. సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయని.. విత్తనం నుంచి విక్రయం దాకా ఆర్బీకేల ద్వారా తోడునీడగా ఉంటున్నారని.. ఉచిత పంటల బీమా పథకాన్ని కూడా అమలు చేస్తున్నారని.. ఏ సీజన్‌లోనైనా పంట నష్టపోతే అదే సీజన్‌లోనే ఇన్‌పుట్ సబ్సిడీ అందిస్తున్నారని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పింఛన్ కోసం జన్మభూమి కమిటీల్లోని టీడీపీ నేతల ఇళ్ల చుట్టూ నాడు కాళ్లరిగేలా తిరిగినా, లంచాలు ఇచ్చినా మంజూరు చేసేవారు కాదని అవ్వాతాతలు గుర్తు చేస్తున్నారు. ప్రస్తుతం ఎవరి చుట్టూ తిరగకుండానే పింఛన్ మంజూరు చేస్తున్నారని.. ప్రతి నెలా ఒకటో తేదీన ఇంటి వద్దకే వలంటీర్లు వచ్చి పింఛన్ అందిస్తున్నారని ప్రశంసిస్తున్నారు. ఇలా అన్ని వర్గాల ప్రజలు 'మా నమ్మకం నువ్వే జగన్' అంటూ నినదిస్తున్నారు. మెగా ప్రజా సర్వేకు అన్ని వర్గాల ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ప్రజా మద్దతు పుస్తకంలో వారి అభిప్రాయాలను నమోదు చేస్తున్నారు. అనంతరం వైఎస్ జగన్ ప్రభుత్వానికి మద్దతు తెలుపుతూ 82960 82960 నంబర్‌కు మిస్డ్ కాల్స్ ఇస్తున్నారు. 20వ తేదీ వరకు ఏకంగా 75 లక్షల కుటుంబాలు ఇలా మిస్డ్ కాల్ ఇచ్చి మద్దతుగా నిలిచాయి. సీఎం వైఎస్ జగన్ మేలు చేస్తుండటం వల్లే ప్రభుత్వానికి ప్రజల్లో నానాటికీ మద్దతు పెరుగుతోందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

నిషేధిత జాబితా నుంచి 3 లక్షల ఎకరాలు తొలగింపు

- సుమారు 2 లక్షల రైతు కుటుంబాలకు మేలు
- రెండేళ్లుగా రెవెన్యూ శాఖలో సంస్కరణలు
- భవిష్యత్తులో రాష్ట్రంలోని భూమి అంతటికీ ఒకే డేటా బేస్
- రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్



సాక్షి, అమరావతి : రాష్ట్రంలో 3 లక్షల ఎకరాలను నిషేధిత జాబితా (22 ఏ) నుంచి తొలగించినట్లు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్ చెప్పారు. దీనివల్ల సుమారు 2 లక్షల రైతు కుటుంబాలకు ప్రయోజనం చేకూరిందని తెలిపారు. ఇందుకోసం రెవెన్యూ యంత్రాంగం 6 నెలలు అవిశ్రాంతంగా పని చేసిందని అభినందించారు. రెవెన్యూ శాఖలో రెండేళ్లుగా జరిగిన పురోగతిని సీనియర్ అధికారులు సిద్ధార్థజైన్, ఎండీ ఇంతియాజ్, వి. రామకృష్ణ, ప్రభాకర్‌రెడ్డి తదితరులతో కలిసి ఆయన శుక్రవారం వెలగపూడి సచివాలయంలో మీడియాకు వివరించారు. గతంలో రాష్ట్రంలోని 4 లక్షల ఎకరాలను 22ఏ కేటగిరీలో చుక్కల భూమిగా పెట్టారని, అందులో 2.08 లక్షల ఎకరాలను నిషేధిత జాబితా నుంచి ఒకేసారి తొలగించినట్లు తెలిపారు. ఇందులో యాజమాన్య మార్పును తాము చేయలేదని చెప్పారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం చుక్కల భూమి చట్టం కింద పట్టా మంజూరయ్యే అర్హత ఉన్నట్లు నిర్ధారించిన కేసులను మాత్రమే క్రోడీకరించి ప్రభుత్వానికి పంపామన్నారు. ప్రభుత్వం ఒక్కో జిల్లాకు ఒక్కో జీవో ఇచ్చి నిషేధిత జాబితా నుంచి తొలగించిందని తెలిపారు. తద్వారా రైతులు వారి భూములను ఇష్టానుసారం వాడుకునే అవకాశం వచ్చిందన్నారు. అనాధీనం, ఖాళీ కాలమ్ భూములను, కృష్ణా, గోదావరి జిల్లాల్లో 33 వేల ఎకరాల షరతుల పట్టాలను కూడ నిషేధిత జాబితా నుంచి తీసివేశామని చెప్పారు. ఇలా మొత్తం 3 లక్షల ఎకరాలను నిషేధిత జాబితా నుంచి తొలగించామని తెలిపారు. గత రెండేళ్లుగా రెవెన్యూ శాఖలో పలు సంస్కరణలు చేసినట్లు తెలిపారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

- ▲ ఇష్టానుసారం సర్వే నంబర్ల మార్పు, చేర్పులను నియంత్రించాం. ఆ అధికారాన్ని జేసీ లాగిన్‌కి తీసుకువచ్చాం.
- ▲ పట్టాదారుకు నోటీసు ఇచ్చి, విచారణ చేసిన తర్వాత రెవెన్యూ రికార్డులో మార్పులు జరిగేలా సాఫ్ట్‌వేర్‌ను కట్టుదిట్టంగా మార్చాం. గతంలో ఎలాంటి విధానం లేకుండా 1.7 కోట్ల కరెక్షన్లు జరిగాయి. సాఫ్ట్‌వేర్ మార్పుతో ఇవి నిలిచిపోయాయి.
- ▲ రికార్డుల్లో మార్పులన్నింటికీ గ్రామ సచివాలయం లేదా మీసేవ సెంటర్‌లో దరఖాస్తు చేయాలి. ఒక పద్ధతి ప్రకారం వాటిని ప్రాసెస్ చేస్తున్నాం.
- ▲ మ్యుటేషన్ దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా కచ్చితమైన ఆడిట్ చేస్తున్నాం. దీంతో గత సంవత్సర కాలంలో 10 లక్షల సర్వే నంబర్లకి మ్యుటేషన్ దరఖాస్తులు రాగా, నిర్దేశించిన సమయం దాటి పెండింగ్‌లో ఉన్నవి 2.98 శాతం కేసులే. మ్యుటేషన్లు తిరస్కరించే అధికారాన్ని తహసీల్దార్ నుంచి ఆర్డీవోకు అప్పగించాం
- ▲ 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం కోసం జిల్లా, రాష్ట్ర స్థాయిలో మానిటరింగ్ యూనిట్లు పెడుతున్నాం.
- ▲ పదో తరగతి విద్యార్థులు 10 లక్షల మందికి దరఖాస్తు చేయకుండానే కుల ధృవీకరణ పత్రాలు ఇస్తున్నాం.
- ▲ గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు ప్రారంభించాం. మొదటి దశ రీ సర్వే పూర్తయిన 2 వేల గ్రామాల్లో ఇప్పటివరకు 1,798 రిజిస్ట్రేషన్లు సచివాలయాల్లో చేశాం.
- ▲ రీ సర్వే జరిగిన గ్రామాల్లో మే 20 నుంచి ఆటోమ్యుటేషన్ ప్రారంభిస్తాం. రిజిస్ట్రేషన్ అయ్యాక రెవెన్యూ శాఖకి వెళ్లకుండా రిజిస్ట్రేషన్ డేటాతో ఆటోమేటిక్‌గా మ్యుటేషన్ జరుగుతుంది.
- ▲ త్వరలో రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలను ప్రారంభిస్తున్నాం.
- ▲ మొదటి దశ రీ సర్వే పూర్తయిన 2 వేల గ్రామాల్లో 2 లక్షల మ్యుటేషన్లు చేశాం. 4 లక్షల సబ్ డివిజన్లు చేశాం. మొదటిసారి లక్ష మందిని పట్టాల్లోకి ఎక్కించాం. 7.86 లక్షల మందికి హక్కుల పత్రాలు ఇస్తున్నాం. సీఎం ఆదేశానుసారం మే 20 కల్లా 2 వేల గ్రామాల్లో రాళ్లు కూడా పాతే పని కూడా పూర్తి చేస్తాం.
- ▲ ఈసీ, రెవెన్యూ రికార్డులు చెక్ చేసిన తర్వాతే రిజిస్ట్రేషన్ జరిగేలా చూస్తున్నాం. దీనివల్ల 2020 తర్వాత డబల్ రిజిస్ట్రేషన్స్ తగ్గాయి.
- ▲ 200 గ్రామకంఠాల్లో ఉండే వారికి 2 నెలల్లో హక్కు పత్రాలు ఇస్తున్నాం.
- ▲ ఇంటిగ్రేటెడ్ ల్యాండ్ మేనేజ్‌మెంట్ కోసం ప్రయత్నిస్తున్నాం. రాష్ట్రంలోని భూమి అంతా ఒకటే డేటా బేస్‌లో ఉండేలా ప్రయత్నిస్తున్నాం.
- ▲ గత సంవత్సర కాలంలో అవకతవకలకు పాల్పడిన 12 మంది తహసీల్దార్లను డిస్మిస్ చేశాం. 13 మంది తహసీల్దార్లను రివర్ట్ చేశాం.

కొండపై పెళ్లికి కంగారు లేదిక..!

రత్నగిరిపై వివాహాలు ఇక సింగిల్ విండోలో..!

- దేవస్థానం ద్వారానే పెళ్లికి కావాల్సినవన్నీ ఏర్పాటు
- విధివిధానాలు రూపొందిస్తోన్న అధికారులు



అన్నవరం: అన్నవరంలో కొలువైన శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో వివాహాలు చేసుకునే వారికిది శుభవార్తే. పెళ్లి మండపం (గుమ్మటం), పురోహితుడు, మంగళ వాయిద్యాలతో పాటు భోజనాలను కూడా దేవస్థానమే సింగిల్ విండో ద్వారా సమకూర్చేందుకు కసరత్తు జరుగుతోంది. సంబంధిత విధివిధానాల రూపకల్పనపై దేవస్థానం అధికారులతో ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్ చర్చలు జరుపుతున్నారు. అతి త్వరలోనే దీనిపై స్పష్టమైన ప్రకటన చేయనున్నారు.

ఏటా 6 వేల పెళ్లిళ్లు

సత్యదేవుని సన్నిధిన వివాహం చేసుకున్న జంట నిండు నూరేళ్లూ చిలుకాగోరింకల్లా వర్ధిల్లుతారన్నది భక్తుల విశ్వాసం. ఈ నేపథ్యంలోనే అతి సామాన్యుల నుంచి కోటీశ్వరుల వరకూ తమ స్తోమతకు తగ్గట్టుగా సత్యదేవుని సన్నిధిలో వివాహాలు చేసుకుంటూంటారు. ఏటా సుమారు 6 వేల వివాహాలు ఇక్కడ జరుగుతున్నాయి. చైత్రం, వైశాఖం, ఆశ్వయుజం, కార్తికం, మార్గశిరం, మాఘం, పాల్గుణ మాసాల్లో ఎక్కువగా పెళ్లిళ్లు నిర్వహించుకుంటున్నారు. ఏటా జరిగే వివాహాల్లో చైత్ర, వైశాఖ మాసాల్లో జరిగేవే 50 శాతం ఉంటాయంటే అతిశయోక్తి కాదు. ఒకే ముహూర్తంలో 500 వరకూ కూడా పెళ్లిళ్లు జరుగుతాయంటే ఆశ్చర్యపోనవసరం లేదు.

అధిక వసూళ్లపై ఆరోపణలు

అయితే రత్నగిరిపై వివాహం చేసుకోవాలంటే కనీసం రూ.లక్ష ఉండాలనే అభిప్రాయం పెళ్లిబృందాల్లో ఉంది. దీనికి ప్రధాన కారణం ఇక్కడ పెళ్లి గుమ్మటాల పాటదారులు, కేటరింగ్ చేసే క్యాంటీన్ పాటదారులు, పురోహితులు, సన్నాయి మేళం వారు పెళ్లిబృందాల నుంచి ఎక్కువ మొత్తం వసూలు చేస్తారనే విమర్శ బలంగా ఉంది. పెళ్లిమండపం ఏర్పాటుకు రూ.5 వేల నుంచి రూ.30 వేల వరకూ వసూలు చేయాల్సి ఉండగా అందుకు నాలుగు రెట్లు వసూలు చేస్తారనే ఆరోపణలున్నాయి. అలాగే కేటరింగ్ విషయంలో కూడా భోజనం ప్లేటుకు రూ.160 నుంచి రూ.250 వరకూ వసూలు చేస్తున్నారన్న విమర్శ ఉంది. సన్నాయి మేళం కూడా రూ.5 వేల నుంచి రూ.25 వేల వరకూ, పురోహితునికి రూ.5 వేల నుంచి రూ.25 వేల వరకూ వసూలు చేస్తున్నారు. తాము అధిక రేట్లకు వేలం పాడుకున్నామని, అధికంగా వసూలు చేయకపోతే పాట సొమ్ము చెల్లించలేమని ఆయా పాటదారులు అంటున్నారు. వాస్తవానికి వివాహ మండపాలు, క్యాంటీన్ల వేలం సుమారు రూ.కోటి వరకూ ఉంటోంది. పురోహితులైతే ఒక్కో కుల సంప్రదాయం ప్రకారం వివాహం చేయాల్సి ఉంటుందని, అందువలన ఆ తంతు ప్రకారం తాము పారితోషికం చెబుతామని చెబుతున్నారు. మంగళ వాయిద్యాల వారు కూడా ఇలాగే చెబుతున్నారు.

సింగిల్ విండోలో ఏం చేస్తారంటే..

దేవస్థానంలో వివాహం చేసుకోవడానికి వచ్చే వారికి రెండు సత్రం గదులు, ఒక హాలు, అందులో పెళ్లి బృందం కోరుకునే మండపంతో పాటు పెళ్లి భోజనాన్ని కూడా దేవస్థానమే సమకూరుస్తుంది. ఇందుకుగాను దేవస్థానం కొన్ని రేట్లు నిర్ణయించి, దాని ప్రకారం వివాహ గుమ్మటాలు, క్యాంటీన్ పాటదార్లకు అప్పగిస్తుంది. అలాగే పురోహితులు, సన్నాయి మేళం వారు కూడా దేవస్థానం నిర్ణయించిన రేట్లకే సేవలందించేలా చేస్తుంది. తద్వారా పెళ్లిబృందాల నుంచి పాటదారులు ఎక్కువ మొత్తం వసూలు చేయకుండా చూడాలని దేవస్థానం భావిస్తోంది. ఈ రేట్లను త్వరలోనే నిర్ణయించే అవకాశం ఉంది. పురోహితులు, మంగళవాయిద్యాల వారి సేవలకు వేలం పాట ద్వారా రేటు నిర్ణయించాలా లేక ప్రస్తుతం ఉన్న వారికే ఇవ్వాలా అనే అంశంపై కూడా చర్చలు జరుగుతున్నాయి.


దేవస్థానంలో పెళ్లి బృందాల సందడి

పెళ్లి బృందాలకు మేలు చేసేందుకే..

పెళ్లి బృందాలకు మేలు చేయాలనే ఉద్దేశంతోనే దేవస్థానంలో సింగిల్‌విండో విధానం అమలు చేయాలని భావిస్తున్నాం. అన్నింటికీ నిర్ణీత రేట్లు ఉంటాయి. దీనిపై విధివిధానాలు రూపొందిస్తున్నాం. అందరితో చర్చించి, త్వరలోనే ఈ విధానం అమలు చేయాలనుకుంటున్నాం.

– ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్, ఈఓ, అన్నవరం దేవస్థానం

పౌరులకు సత్వర సేవలే లక్ష్యంగా పనిచేయాలి

సివిల్ సర్వీసెస్ దినోత్సవంలో సీసీఎల్‌ఏ సాయిప్రసాద్ పిలుపు

సాక్షి, అమరావతి: పేదరిక నిర్మూలనకు సత్వర నిర్ణయాలు, పౌరులకు సకాలంలో సేవలందించడమే లక్ష్యంగా సివిల్ సర్వెంట్లు పనిచేయాలని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, సీసీఎల్ఏ జి.సాయిప్రసాద్ పిలుపునిచ్చారు. జాతీయ సివిల్ సర్వీసెస్(జాతీయ పౌర సేవల) దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో 16వ సివిల్ సర్వీసెస్ దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సాయిప్రసాద్ మాట్లాడుతూ సివిల్ సర్వెంట్స్ అంటే వివిధ విభాగాల్లో లేదా ప్రభుత్వంలోని వివిధ స్థాయిల్లో పనిచేస్తూ దేశ పరిపాలన వ్యవస్థకు మూలస్తంభాలుగా వ్యవహరిస్తారని చెప్పారు. ప్రజల కోసమే పరిపాలన అనే విషయాన్ని దృష్టిలో పెట్టుకుని.. వివిధ సమస్యలపై పౌరులు తరచూ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా సమస్యలను పరిష్కరించి సత్వర సేవలు అందించేందుకు కృషి చేయాలన్నారు. పౌరులకు ఏ విధంగా సులభంగా సేవలు, పాలన అందించాలన్న దానిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ జనరల్ ఆర్పీ సిసోడియా స్వాగతోపన్యాసం చేస్తూ.. ప్రతి ఉద్యోగీ తన ఉద్యోగానికి తగిన న్యాయం చేకూర్చేలా పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి, ఐఏఎస్ అధికారులు బాబు, అరుణ్‌కుమార్, వీరపాండ్యన్, బసంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అందరితో సాయిప్రసాద్ సివిల్ సర్వీసెస్ దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు.

భూదాన్ బోర్డు చైర్మన్‌గా విజయభాస్కరరెడ్డి



సాక్షి, అమరావతి: భూదాన్ యజ్ఞ బోర్డు చైర్మన్‌గా తాడి విజయభాస్కరరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. పలు వివాదాల కారణంగా ఉమ్మడి రాష్ట్రంలో భూదాన్ బోర్డు నియామకం జరగలేదు. రాష్ట్ర విభజన తర్వాత కూడా ఈ బోర్డు నియామకం జరగలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం భూ సమస్యలన్నింటినీ ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్న క్రమంలో తాజాగా భూదాన్ బోర్డు చైర్మన్‌గా విజయభాస్కరరెడ్డిని నియమించింది. 1965 ఏపీ భూదాన్ అండ్ గ్రామదాన్ బోర్డు చట్టం ప్రకారం ఆయన్ను నియమించారు. రెండేళ్లపాటు ఆయన ఈ పదవిలో ఉంటారు. విజయ్‌భాస్కరరెడ్డిది తూర్పుగోదావరి జిల్లా అనపర్తి.

ఆస్కార్ ఫిల్మ్ ఫెస్టివల్ ప్రారంభం

వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహణ



మాట్లాడుతున్న ఎస్.కె.మిశ్రో

సీతంపేట (విశాఖ ఉత్తర): 95వ ఆస్కార్ అకాడమీ అవార్డులు అందుకున్న మొదటి మూడు చిత్రాల ఫిల్మ్ ఫెస్టివల్ వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక పౌర గ్రంథాలయంలో ఘనంగా ప్రారంభమైంది. ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు, సీనియర్ నటులు ఎస్.కె.మిశ్రో ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. మిశ్రో మాట్లాడుతూ మొదటి సారిగా అవార్డు అందుకున్న నాటునాటు పాటకు, బెస్ట్ డాక్యుమెంటరీ ఫిల్మ్ అవార్డు అందుకున్న ఎలిఫెంట్ విస్పరర్స్‌కు అభినందనలు తెలిపారు. ఇటువంటి అపురూప ప్రపంచ సినిమాలను నగర ప్రజలు తిలకించేలా ప్రదర్శన ఏర్పాటు చేసిన వైజాగ్ ఫిల్మ్ సొసైటీకి అభినందనలు చెప్పారు. సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ ప్రపంచ సినిమాలను చూపడం ద్వారా మంచి సినిమాలు చూసే సంస్కృతిని ప్రేక్షకులలో కలిగించాలని గత 15 ఏళ్లుగా సొసైటీ కృషి చేస్తోందన్నారు. అనంతరం ఎలిఫెంట్ విస్పరర్స్ డాక్యుమెంటరీ, నాటు నాటు పాటను ప్రదర్శించారు. శనివారం మొదటి ఆస్కార్ అవార్డు పొందిన ఎవ్విరి థింగ్ ఎవ్విరి వేర్ ఆల్ ఎట్ వన్స్ చిత్రం ప్రదర్శిస్తామని తెలిపారు. బి.చిన్నారావు, బాల్జీ, కాశీ విశ్వేశ్వరరావు, ఎస్.ఎ.డి పాల్, అనూరాధ పాల్గొన్నారు.

తెలంగాణ

12వ శతాబ్దం నాటి వైద్య శాసనం గుర్తింపు

సేకరించిన ఎన్ఐఐఎంహెచ్

సైదాబాద్: పన్నెండో శతాబ్దానికి చెందిన కందూరి చోడ రాజుల వైద్య శాసనాన్ని సేకరించామని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్ (ఎన్ఐఐఎంహెచ్) సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ జీపీ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. కందూరి చోడరాజులు వేయించిన ఈ శాసనం తెలంగాణలోని నల్లగొండ జిల్లా వావిల్‌కోల్ గ్రామంలో ఉందని తెలిపారు. ఆ వంశం రాజు ఉదయన చోడ చేయించిన రాతి వైద్య శాసనాన్ని తమ బృందం శుక్రవారం ఆ గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో గుర్తించిందని వివరించారు. సర్పంచ్ దామోదర్‌రావు సహాయంతో శాసనం ఛాయాచిత్రాలు తీయించామని పేర్కొన్నారు. కందూరి చోడ రాజుల ఆరోగ్య పరిరక్షణకు అనుసరించిన విషయాలు శాసనంలో పొందుపరిచి ఉన్నాయని తెలిపారు. ఉదయచోడ రాజు అష్టాంగయోగలో సిద్ధహస్తుడని పేర్కొన్నారు. తమ సంస్థ ద్వారా పురాతన, మధ్య, రాతి యుగాలకు చెందిన రాతి, శిలా ఫలక శాసనాలు, శిల్పాలు, దేవాలయాలు, చారిత్రక కట్టడాల ద్వారా వైద్య సమాచారాన్ని సేకరిస్తున్నామని డాక్టర్ జీపీ ప్రసాద్ వెల్లడించారు.

క్లుప్తంగా...

నీట్ ప్రవేశపరీక్షకు రికార్డు దరఖాస్తులు

న్యూఢిల్లీ: వైద్య విద్యలో ప్రవేశాల కోసం ఉద్దేశించిన నీట్ ప్రవేశ పరీక్ష రాయడానికి ఈ ఏడాది 20 లక్షల మందికి పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. దేశంలోనే అతి పెద్దదైన ఈ ప్రవేశ పరీక్షకు ఈ ఏడాది రికార్డు స్థాయిలో 20.87 లక్షల మంది రిజిస్టర్ చేసుకున్నారని అధికారులు వెల్లడించారు. గత ఏడాదితో పోల్చి చూస్తే ఈ సంఖ్య 2.57 లక్షలు ఎక్కువ. ఈసారి అమ్మాయిలు ఎక్కువ మంది పరీక్ష రాస్తూ ఉండడం విశేషం. మొత్తం రిజిస్ట్రేషన్లలో అమ్మాయిలు 11.8 లక్షలున్నారు. అబ్బాయిల కంటే 2.8 లక్షలు అధికంగా మెడికల్ ఎంట్రన్స్ ప్రవేశ పరీక్షకి హాజరుకానున్నారు. మే 7న నీట్ పరీక్ష జరగనుంది. మహారాష్ట్ర నుంచి అత్యధికంగా అభ్యర్థులు ప్రవేశ పరీక్షలకు హాజరు కానుండగా, ఆ తర్వాత స్థానంలో యూపీ నిలిచింది.

గోధ్రా రైలు దహనం కేసులో దోషులకు బెయిల్

న్యూఢిల్లీ: గుజరాత్‌లో మత ఘర్షణలకు ఆజ్యం పోసిన 2002 నాటి గోధ్రా రైలు దహనం కేసులో 8 మంది దోషులకు సుప్రీంకోర్టు బెయిలిచ్చింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహల ధర్మాసనం శుక్రవారం దోషుల బెయిల్ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. సెషన్స్ కోర్టు విధించే నియమ నిబంధనలకు లోబడి ఎనిమిది మందికి బెయిల్ మంజూరు చేస్తున్నట్లు తెలిపింది. అయితే, ఇదే కేసులో మరో నలుగురు దోషుల బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది. కీలకంగా ఉన్నందున వీరికి బెయిలివ్వరాదని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు. ఈ నలుగురూ గోధ్రా రైలు బోగీకి వెలుపలి నుంచి బోల్టు వేశారని, మంటలు అంటుకుంటే అందులోని 59 మంది సజీవ దహనమయ్యే వారని ధర్మాసనానికి తెలిపారు.

కాలం చెల్లిన శాటిలైట్‌ను ధ్వంసం చేసిన ఇస్రో

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): కాలం చెల్లిన జీశాట్–12 ఉపగ్రహాన్ని అంతరిక్షంలోనే పేల్చివేసినట్లు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రకటించింది. 2011 జులై 15న పీఎస్ఎల్‌వీ సీ17 రాకెట్ ద్వారా జీశాట్–12 ఉపగ్రహాన్ని ఇస్రో ప్రయోగించింది. సుమారు 12 ఏళ్లపాటు సేవలందించింది. శుక్రవారంతో ఈ ఉపగ్రహానికి కాలం చెల్లింది. దీంతో, అంతరిక్ష వ్యర్థంగా మిగిలిపోకుండా ధ్వంసం చేసినట్లు ఇస్రో పేర్కొంది. అంతర్జాతీయ ఒప్పందాల మేరకు ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపింది. కాలం చెల్లిన ఉపగ్రహాలను తొలగించే పరిజ్ఞానాన్ని సొంతంగా అభివృద్ధి చేసుకున్న ఇస్రో స్వయంగా ఆ ప్రక్రియను చేపడుతోంది.

లోక్‌సభ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ హవా

ఇప్పటికిప్పుడు ఎన్నికలొస్తే ఏపీలో క్లీన్‌స్వీపే • టైమ్స్ నౌ–ఈటీజీ సర్వే వెల్లడి

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం అప్రతిహతంగా కొనసాగనుందని ప్రముఖ వార్తా చానల్ టైమ్స్ నౌ సర్వే వెల్లడించింది. ఇప్పటికిప్పుడు లోక్‌సభ ఎన్నికలు జరిగితే పార్టీ క్లీన్‌స్వీప్ చేయడం ఖాయమని పేర్కొంది. వైఎస్సార్‌సీపీ 24 నుంచి 25 స్థానాలు గెలుస్తుందని టైమ్స్ నౌ–ఈటీజీ చేసిన సర్వే తేల్చింది. ఏపీలో మొత్తం 25 లోక్‌సభ స్థానాలున్న విషయం తెలిసిందే. ఇక దేశవ్యాప్తంగా మోదీ మేనియా కొనసాగనుందని, కేంద్రంలో వరుసగా మూడోసారి బీజేపీ విజయం ఖాయమని సర్వే తేల్చింది. బీజేపీ కూటమికి 292 నుంచి 338 స్థానాలు రావచ్చని పేర్కొంది. కాంగ్రెస్ కూటమికి 106 నుంచి 144 వరకు, ఇతరులకు 66 నుంచి 96 దాకా సీట్లు లభిస్తాయని తెలిపింది. బీజేపీ కూటమికి 38.2 శాతం, కాంగ్రెస్ కూటమికి 28.7, ఇతరులకు 33.1 శాతం ఓట్లు వస్తాయని పేర్కొంది. బీజేపీ నిస్సందేహంగా 300 పై చిలుకు స్థానాలు గెలుస్తుందని సర్వేలో పాల్గొన్న వారిలో 42 శాతం మంది, కష్టమని 26 శాతం, ఎన్నికల నాటికే దీనిపై స్పష్టత వస్తుందని 19 శాతం మంది అభిప్రాయపడ్డారు. 13 శాతం ఏమీ చెప్పలేమన్నారు. మోదీ 2.0 పాలన తీరు అత్యంత సంతృప్తికరంగా ఉందని ఏకంగా 51 శాతం మంది చెప్పారు! చాలావరకు సంతృప్తికరమేనని 16 శాతం, ఓ మాదిరిగా ఉందని 12 శాతం చెప్పగా, బాలేదని 21 శాతం బదులిచ్చారు. మోదీ సర్కారు అతి పెద్ద వైఫల్యం ద్రవ్యోల్బణమని 34 శాతం, నిరుద్యోగమని 46 శాతం మంది పేర్కొన్నారు. నల్లధనాన్ని వెనక్కు తేలేకపోవడమని 13 శాతం, చైనా దూకుడును అడ్డుకోవడంలో వైఫల్యమని 7 శాతం చెప్పారు. దేశంలో ప్రజాస్వామ్యం, వాక్ స్వాతంత్ర్యం ప్రమాదంలో పడ్డాయా అన్న ప్రశ్నకు 41 శాతం మంది లేదని బదులిచ్చారు. చాలాసార్లు అలా అన్పించిందని 21 శాతం, అది విపక్షాల దృక్కోణమని 14 శాతం, ఏమీ చెప్పలేదని 24 శాతం అన్నారు. ప్రాంతీయ పార్టీల్లో పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌కు 20 నుంచి 22 సీట్లు, ఒడిశాలో బిజూ జనతాదళ్‌కు 11 నుంచి 13 సీట్లు వస్తాయని సర్వే పేర్కొంది.





'ప్రధానిగా మోదీకి పోటీయే లేదు

అత్యంత శక్తిమంతుడైన ప్రధాని అభ్యర్థిగా మోదీకి 64 శాతం మంది ఓటేశారు. రాహుల్‌కు 13, కేజ్రీవాల్‌కు 12, నితీశ్‌కు 6, కేసీఆర్‌కు 5 శాతం ఓట్లొచ్చాయి. ఇక వచ్చే ఎన్నికల్లో విపక్షాల సారథిగా రాహుల్‌కు 29 శాతం, కేజ్రీవాల్‌కు 19, మమతకు 13, నితీశ్‌కు 8, కేసీఆర్‌కు 7 శాతం ఓట్లొచ్చాయి. 2024 ఎన్నికలకు ముందే విపక్షాలు ఒక్కటవుతాయని 31 శాతం, లేదని 26 శాతం, ఎన్నికల అనంతర పొత్తులుండొచ్చని 26 శాతం అన్నారు.

రాహుల్‌పై వేటు కాంగ్రెస్‌కు లాభించదు

రాహుల్‌గాంధీపై అనర్హత వేటు కాంగ్రెస్‌కు ఎన్నికల్లో పెద్దగా లాభించదని సర్వేలో పాల్గొన్న వారిలో 39 శాతం మంది అభిప్రాయపడ్డారు. అది కేవలం న్యాయపరమైన అంశమని వారన్నారు. ఈ అంశానికి జాతీయ రాజకీయాల్లో ప్రాధాన్యతేమీ ఉండదని మరో 11 శాతం మంది అన్నారు. 23 శాతం మంది ఇది రాహుల్‌కు సానుభూతి తెస్తుందని చెప్పగా 27 శాతం ఏమీ చెప్పలేమన్నారు. దొంగలందరికీ ఇంటిపేరు మోదీయే ఎందుకు ఉంటుందంటూ గత లోక్‌సభ ఎన్నికల సందర్భంగా వ్యాఖ్యలు చేసినందుకు పరువు నష్టం కేసులో రాహుల్‌కు సూరత్ కోర్టు రెండేళ్ల జైలుశిక్ష విధించడం, తర్వాత 24 గంటల్లోపే ఆయన లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేస్తూ స్పీకర్ నిర్ణయం తీసుకోవడం, ఇది కక్షసాధింపని కాంగ్రెస్, విపక్షాలు దుయ్యబట్టడం తెలిసిందే.

రాహుల్ నుంచి అమితాబ్ వరకు... బ్లూ టిక్ కోల్పోయిన ప్రముఖులు

సబ్‌స్క్రిప్షన్ ఫీజు కట్టని వారి ఖాతాల నుంచి బ్లూ టిక్ తొలగిస్తున్న ట్విటర్



న్యూఢిల్లీ: సామాజిక మాధ్యమం ట్విటర్‌లో అధికారిక ఖాతాలకు ఇచ్చే బ్లూ టిక్‌ను మన దేశంలో చాలా మంది ప్రముఖులు కోల్పోయారు. సబ్‌స్క్రిప్షన్ చెల్లించకపోవడంతో భారత్‌లో రాహుల్ గాంధీ నుంచి అమితాబ్ బచ్చన్ వరకు రాజకీయ, సినీ, క్రీడా రంగాలకు చెందిన ప్రముఖుల అకౌంట్ల నుంచి బ్లూ టిక్‌లను తొలగించారు. ఎలాన్ మస్క్ ట్విటర్‌ను కొనుగోలు చేసిన తర్వాత ఆదాయాన్ని పెంచుకోవడానికి బ్లూటిక్ కావాలంటే సబ్‌స్క్రిప్షన్ ఫీజు కట్టాలన్న నిబంధన తీసుకువచ్చిన సంగతి తెలిసిందే. అలా డబ్బులు చెల్లించని వారి ఖాతాల నుంచి బ్లూటిక్‌లను తొలగించే కసరత్తు ట్విటర్ ప్రారంభించింది. దీంతో వేలాది మంది సెలబ్రిటీలు బ్లూటిక్‌ను కోల్పోయారు. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ, సోదరి ప్రియాంకా గాంధీ, యోగి ఆదిత్యనాథ్, మమతా బెనర్జీ, ఎంకే స్టాలిన్, నితీష్ కుమార్ సహా పలువురు సీఎంలు, బాలీవుడ్ నటులు అమితాబ్ బచ్చన్, షారూక్ ఖాన్, సల్మాన్ ఖాన్, అలియా భట్, అనుష్క శర్మ తదితరులు బ్లూ టిక్ కోల్పోయిన వారి జాబితాలో ఉన్నారు. బ్లూ టిక్ కోల్పోయిన అంతర్జాతీయ ప్రముఖుల్లో అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ ఉన్నారు. ట్విటర్‌లో బ్లూ టిక్ స్టేటస్ సింబల్‌గా మారింది. బ్లూటిక్‌కు వెబ్‌లో రూ.650, మొబైల్ ఫోన్లలో ఉండాలంటే నెలకి రూ.900 ఫీజుగా నిర్ణయించారు. ఏడాదికి ఒకేసారి కడితే రూ6,800 డిస్కౌంట్ రేటు పెట్టారు. దీనిపై గందరగోళం నెలకొనడంతో కొన్నాళ్లు దీనిని నిలిపివేశారు. ఇప్పుడు మళ్లీ బ్లూ టిక్‌లపై దృష్టి సారించారు.

సచిన్ తదితరులకు కూడా..

స్పోర్ట్స్ పేజీలో...


డబ్బులు కట్టినా.. ఏమిటిది?

బిగ్ బీ అమితాబ్ బచ్చన్‌కి వింత అనుభవం ఎదురైంది. సబ్‌స్క్రిప్షన్ కట్టినప్పటికీ ఆయన ఖాతా నుంచి బ్లూ టిక్‌ను తొలగించారు. దీనిపై అమితాబ్ ఫన్నీగా ట్వీట్ చేశారు. ''హే ట్విటర్ బ్రో, వింటున్నావా? నేను ఇప్పటికే డబ్బులు కట్టాను. నా పేరు ముందు ఆ బ్లూ టిక్ మళ్లీ పెట్టు. దాని వల్ల అది నేనేనని ప్రజలు గుర్తిస్తారు'' అని ట్వీట్ చేశారు. నటుడు ప్రకాశ్ రాజ్ బై బై బ్లూ టిక్ అంటూ ఒక హ్యాష్ ట్యాగ్‌ను జోడించారు. బ్లూ టిక్ లేకపోయినా తన జీవన ప్రయాణంలో సంగతులు, తన మదిలో భావాలు అందరితో పంచుకుంటానని స్పష్టం చేశారు.

దేశ ప్రయోజనాలే పరమావధిగా..

ప్రజల నమ్మకాన్ని అధికారులు నిలబెట్టుకోవాలి

సివిల్ సర్వీసెస్ దినోత్సవంలో మోదీ పిలుపు | జిల్లాలకు, సంస్థలకు ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానం



న్యూఢిల్లీ: ప్రభుత్వ అధికారులు తీసుకొనే ప్రతి నిర్ణయానికీ దేశ ప్రయోజనాలే పరమావధి కావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్బోధించారు. మీపై దేశ ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోండి అని అధికారులకు సూచించారు. సివిల్ సర్వీసెస్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాని మోదీ అధికారులను ఉద్దేశించి ప్రసంగించారు. 'వికసిత్ భారత్' అనే థీమ్‌తో ఈ కార్యక్రమం నిర్వహించారు. పన్ను చెల్లింపుదారుల సొమ్మును అధికారంలో ఉన్న పార్టీ సొంత ప్రయోజనాల కోసం ఖర్చు చేస్తోందా? లేక దేశ అభివృద్ధి కోసం వెచ్చిస్తోందా? అన్నది విశ్లేషించాల్సిన బాధ్యత సివిల్ సర్వీసెస్ అధికారులపై ఉందని మోదీ చెప్పారు. జాతి నిర్మాణంలో ఉన్నత స్థాయి అధికారుల పాత్ర ఎనలేనిదని కొనియాడారు. వారి క్రియాశీల భాగస్వామ్యం లేకపోతే దేశంలో వేగవంతమైన అభివృద్ధి సాధ్యమయ్యేది కాదని అన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో ప్రతి ప్రభుత్వ అధికారి దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని నిర్ణయాలు తీసుకోవాలని వెల్లడించారు. మీరు తీసుకొనే ప్రతి నిర్ణయానికి దేశ ప్రగతే ఆధారం కావాలన్నారు. ప్రపంచంలో భారత్ ప్రాధాన్యం నానాటికీ పెరుగుతోందని, అధికార యంత్రాంగం సమయం వృథా చేయకుండా దేశ అభివృద్ధి కోసం కృషి చేయాలని కోరారు.

'దేశం ప్రథమం, పౌరులు ప్రథమం'

ప్రజల ఆకాంక్షలకు ప్రభుత్వ పాలనా వ్యవస్థ అండగా నిలవాలని, వారి కలలు సాకారం అయ్యేందుకు ప్రభుత్వ అధికారులు సాయం అందించాలని ప్రధాని మోదీ సూచించారు. వికసిత భారతదేశానికి ఇది అత్యంత కీలకమని అన్నారు. గత ప్రభుత్వాల హయాంలో ప్రభుత్వ యంత్రాంగం చుట్టూ ప్రతికూలత ఆవరించి ఉండేదని, అది ఇప్పుడు సానుకూలతగా మారిందని వివరించారు. 'దేశం ప్రథమం, పౌరులు ప్రథమం' అనే నినాదంతో ముందుకు సాగుతున్నామని, దేశంలో బలహీనవర్గాల అభ్యున్నతికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని ఉద్ఘాటించారు. మీ కోసం మీరు ఏం చేసుకున్నారు అనే దాన్నిబట్టి కాకుండా ప్రజల కోసం ఏం చేశారన్న దాన్నిబట్టే మీ పనితీరు, ప్రతిభను గుర్తించవచ్చని సివిల్ సర్వీస్ అధికారులకు సూచించారు. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావాలన్న గాఢమైన ఆకాంక్షతో పనిచేస్తే చిరస్మరణీయమైన వారసత్వాన్ని మిగిల్చిన వారవుతారని చెప్పారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో భిన్నమైన సిద్ధాంతాలు, భావజాలాలున్న పార్టీలు ముఖ్యమని అభిప్రాయపడ్డారు. ప్రజల అంచనాలకు తగ్గట్టుగా అధికారులు పనిచేయాలని పేర్కొన్నారు. యువత కలలు ఛిద్రం కావడానికి వీల్లేదన్నారు. గత ప్రభుత్వాల హయాంలో కొనసాగిన విచ్చలవిడి అవినీతికి అడ్డుకట్ట వేశామని రూ.3 లక్షల కోట్లు అవినీతిపరుల జేబుల్లోకి వెళ్లకుండా అడ్డుకున్నామన్నారు.

సివిల్ సర్వెంట్ల సేవలు ప్రశంసనీయం: రాష్ట్రపతి

'సివిల్ సర్వీసెస్ డే' సందర్భంగా సంబంధిత అధికారులందరికీ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా శుభాకాంక్షలు తెలిపారు. దేశానికి వారి సేవలు ప్రశంసనీయమంటూ రాష్ట్రపతి ట్వీట్ చేశారు. దేశ ప్రగతిలో వారి కృషి, అంకిత భావం, సేవలను ప్రశంసించాలంటూ అమిత్ షా ట్వీట్ చేశారు. ఏటా ఏప్రిల్ 21న కేంద్రం సివిల్ సర్వీసెస్ దినోత్సవాన్ని నిర్వహిస్తోంది.

యూకే ఉప ప్రధాని రాబ్ రాజీనామా



లండన్: యునైటెడ్ కింగ్‌డమ్(యూకే) ప్రధానమంత్రి రిషి సునాక్‌కు అత్యంత సన్నిహితుడైన ఉప ప్రధానమంత్రి డొమినిక్ రాబ్(49) తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు శుక్రవారం ప్రధాని రిషి సునాక్‌కు లేఖ రాశారు. రాబ్ ఇప్పటిదాకా న్యాయ శాఖ మంత్రిగా వ్యవహరించారు. తన మంత్రిత్వ శాఖలో పనిచేస్తున్న సిబ్బందిని వేధింపులకు గురిచేశారని, బెదిరింపులకు పాల్పడ్డారని రాబ్‌పై ఆరోపణలు వెల్లువెత్తాయి. సివిల్ సర్వీసు అధికారులు సైతం ఆయనపై ఆరోపణలు చేశారు. దీనిపై ప్రధాని రిషి సునాక్ స్పందించారు. సీనియర్ న్యాయవాది ఆడమ్ టోలీ కేసీ నేతృత్వంలో స్వతంత్ర దర్యాప్తునకు ఆదేశించారు. దర్యాప్తు పూర్తిచేసిన ఆడమ టోలీ కేసీ తన నివేదికను గురువారం రిషి సునాక్‌కు అందజేశారు. నివేదికలో ఏం ఉందన్న విషయం ఇంకా బహిర్గతం కాలేదు. అయినప్పటికీ కొన్ని గంటల వ్యవధిలోనే తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు డొమినిక్ రాబ్ ప్రకటించారు. రిషి సునాక్‌కు తాను రాసిన రాజీనామా లేఖను శుక్రవారం ట్విట్టర్‌లో షేర్ చేశారు. మాటకు కట్టుబడి ఉప ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేశానని, ప్రభుత్వానికి తన మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. డొమినిక్ రాబ్‌పై తనకు పూర్తి విశ్వాసం ఉందని, నివేదికలోని అంశాలను క్షుణ్నంగా పరిశీలిస్తున్నానని రిషి సునాక్ తెలిపారు. మిత్రుడు రాబ్ రాజీనామా చేయడం విచారకరమని, ఆయన రాజీనామాను తాను ఆమోదిస్తున్నానని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, డొమినిక్ రాబ్ స్థానంలో న్యాయ శాఖ మంత్రిగా జూనియర్ మినిస్టర్ అలెక్స్ చాక్‌ను నియమించారు.

ఉగ్రవాదుల కోసం ముమ్మర వేట

పూంచ్: జమ్మూకశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో ఐదుగురు జవాన్లను పొట్టనపెట్టుకున్న ఉగ్రవాదుల కోసం భారత సైన్యం వేట ముమ్మరం చేసింది. డ్రోన్లు, జాగిలాలతోపాటు హెలికాప్టర్‌తో గాలింపు కొనసాగిస్తోంది. బాటా–డోరియా అటవీ ప్రాంతాన్ని భద్రతా సిబ్బంది జల్లెడ పడుతున్నారు. గాలింపు చర్యలను సైనిక, పోలీసు ఉన్నతాధికారులు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) బృందం శుక్రవారం ఘటనా స్థలాన్ని సందర్శించింది. గురువారం ముష్కరుల దాడిలో రాష్ట్రీయ రైఫిల్స్ విభాగానికి చెందిన ఐదుగురు చనిపోవడంతోపాటు మరొకరు గాయపడిన సంగతి తెలిసిందే. అమర జవాన్ల మృతదేహాలకు ఉన్నతాధికారులు శుక్రవారం నివాళులర్పించారు. అనంతరం మృతదేహాలను వారి స్వస్థలాలకు పంపించారు. రాజౌరీ, పూంచ్ జిల్లాల్లో హై అలర్ట్ విధించారు. నియంత్రణ రేఖ వద్ద నిఘాను పటిష్టం చేశారు. ముష్కరుల దుశ్చర్యను ఖండిస్తూ బీజేపీ, వీహెచ్‌పీ, రాష్ట్రీయ బజరంగ్ దళ్, శివసేన, డోగ్రా ఫ్రంట్, జమ్మూ స్టేట్‌హుడ్ ఆర్గనైజేషన్ జమ్మూలో భారీ ప్రదర్శనలు నిర్వహించాయి.



2022 మార్చి 9న ఉక్రెయిన్‌లోని మారియుపోల్ నగరంలో రష్యా బాంబు దాడిలో ఓ ప్రసూతి ఆస్పత్రి నేలమట్టం కాగా, తీవ్రంగ గాయపడ్డ గర్భిణిని శిథిలాల గుండా హుటాహుటిన తరలిస్తున్న ఎమర్జెన్సీ వర్కర్లు. యుద్ధ బీభత్సాన్ని కళ్లకు కట్టేలా అసోసియేటెడ్ ప్రెస్ ఫొటోగ్రాఫర్ ఎవగెనీ మలొలెక్టా తీసిన ఈ ఫొటోకు వరల్డ్ ప్రెస్ ఫొటో ఆఫ్ ద ఇయర్ అవార్డు లభించింది.

కర్ణాటక ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ రాజకీయ వేడి పెరిగిపోతోంది. ఎన్నికల బరిలో ఉన్న పదుల సంఖ్యలో చిన్న పార్టీలు ఎవరి ఓటు బ్యాంకుని చీలుస్తాయన్న చర్చ మొదలైంది. చిన్న పార్టీలకు సొంతంగా విజయం సాధించే బలం లేకపోయినప్పటికీ జయాపజయాలను మార్చే సత్తా కలిగి ఉన్నాయి. ఇంతకీ

ఈ చిన్న పార్టీలు ఎవరి ఓటు బ్యాంకుని కొల్లగొడతాయి? ప్రధాన పార్టీల్లో ఎవరికి నష్టం? ఎవరికి లాభం?


83 కర్ణాటక అసెంబ్లీ బరిలో ఉన్న పార్టీలు

50 చిన్న, కొత్త పార్టీల ప్రభావం పడే స్థానాలు

ప్రధాన పార్టీలకు తలనొప్పిగా మారిన చిన్న పార్టీలు

పార్టీలు చిన్నవి... ప్రభావం పెద్దది





కర్ణాటక ఎన్నికలు రసకందాయంలో పడ్డాయి. రాజకీయ పార్టీల ప్రచార హోరు తీవ్రతరమైంది. గత ఎన్నికల్లో కీలక స్థానాల్లో 3 వేల లోపు మెజార్టీయే లభించడంతో ప్రతీ ఓటు కీలకంగా మారింది. ఇలాంటి సమయంలో చిన్న పార్టీలు, ఎన్నికల బరిలో దిగిన కొత్త పార్టీలు ప్రధానపార్టీలైన బీజేపీ, కాంగ్రెస్, జేడీ(ఎస్)ల గుండెల్లో రైళ్లు పరిగెట్టిస్తున్నాయి. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) గత ఎన్నికల్లో బెంగుళూరులోని 18 నియోజకవర్గాల్లో పోటీ చేసినప్పటికీ అభ్యర్థులు డిపాజిట్లు కూడా దక్కించుకోలేకపోయారు. ఇప్పుడు ఆప్ పరిస్థితి వేరు. ఢిల్లీ, పంజాబ్‌లో అధికారంలో ఉండడంతోపాటు జాతీయ పార్టీ హోదా దక్కించుకుంది. కర్ణాటక ఓటరు మొదట్నుంచి ప్రాంతీయ పార్టీల కంటే, జాతీయ పార్టీలవైపు మొగ్గు చూపిస్తున్నాడు. కేజ్రీవాల్ ఢిల్లీ మోడల్ పాలన పట్ల యువత, మహిళల్లో విపరీతమైన ఆకర్షణ ఉంది. అందుకే ఈ సారి ఆప్‌ను కూడా ప్రధాన పార్టీలు ముప్పుగానే పరిగణిస్తున్నాయి. పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియాకి అనుబంధంగా పని చేసే సోషల్ డెమొక్రాటిక్ పార్టీ ఆఫ్ ఇండియాకు కోస్తా కర్ణాటకలో గట్టి పట్టుంది.

అధికార వ్యతిరేకతకు చిన్న పార్టీలతో చెక్!

కర్ణాటక ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొని ఉంది. 40% కమీషన్ల సీఎంగా పేరు పడడం, యడ్డీయూరప్ప స్థానంలో వచ్చి ఆ స్థాయిలో ప్రతిభ కనబరచలేకపోవడంతో ప్రభుత్వ వ్యతిరేక పవనాలు బలంగా వీస్తున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి వ్యక్తిగతంగా ఉన్న ఇమేజ్, హిందుత్వ కార్డుతో ఎన్నికల బరిలో దిగిన బీజేపీ చిన్న పార్టీలు, ఆమ్ ఆద్మీ పార్టీ, ఎంఐఎం తమ విజయావకాశాలను పెంచుతాయని ఆశల పల్లకిలో విహరిస్తోంది. గుజరాత్, యూపీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ, ఎంఐఎం, బీఎస్పీ కాంగ్రెస్ ఓటు బ్యాంకునే చీల్చడంతో బీజేపీ ఘన విజయం సాధించింది. కర్ణాటకలో కూడా అదే పునరావృతమై బహుముఖ పోటీ జరుగుతుందని, అది బీజేపీకి లాభం చేకూరుస్తుందని పార్టీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. కర్ణాటకలో గత ఎన్నికల ఫలితాలను విశ్లేషిస్తే అక్కడ ప్రజలు జాతీయ పార్టీలకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి. లేదంటే అతి పెద్ద ప్రాంతీయ పార్టీల వైపు మొగ్గు చూపిస్తున్నాయి. గత ఎన్నికల్లో చిన్న పార్టీలు, స్వతంత్రులు కలిపి 6% వరకు మాత్రమే ఓట్లను సంపాదించాయి. పార్టీ అనుసరించే సిద్ధాంతాలే ముఖ్యమైనవని, ప్రస్తుతమున్న పరిస్థితుల్లో అవినీతిని అంతమొందిస్తామంటూ రొటీన్ హామీలిస్తే ప్రజల నుంచి స్పందన కరువై చిన్న పార్టీలు మనుగడ సాధించడం కష్టమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు ఈ సారి ఎన్నికల్లో మొదటిసారిగా అదృష్టాన్ని పరీక్షించుకుంటున్న కేఆర్ఎస్ పార్టీ మాత్రం తాము ప్రజల మద్దతుతోనే ఎన్నికల బరిలో దిగామని చెబుతోంది. క్రౌడ్ ఫండింగ్ ద్వారా 40 వేల మంది ఆర్థిక సాయం చేసి పార్టీలో సభ్యులుగా చేరారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రవికృష్ణ రెడ్డి తెలిపారు.

50 స్థానాల్లో ప్రభావం

కర్ణాటకలో చిన్న పార్టీలు ఏకంగా 50 సీట్లలో ప్రభావం చూపించనున్నాయి. గాలి జనార్దన్ రెడ్డికి చెందిన కళ్యాణ రాజ్య ప్రగతి పక్ష (కేఆర్‌పీపీ), కర్ణాటక రాష్ట్ర సమితి (కేఆర్ఎస్), నటుడు ఉపేంద్రకు చెందిన ఉత్తమ ప్రజాకీయ పార్టీ (యూపీపీ)లతో పాటు అసదుద్దీన్ ఒవైసీకి చెందిన ఎంఐఎం గట్టి ప్రభావాన్ని చూపిస్తాయనే అంచనాలున్నాయి. 69 గుర్తింపులేని రిజిస్టర్డ్ పార్టీలు బరిలో ఉన్నాయి. గత ఎన్నికల్లో 30 స్థానాల్లో 5 వేల కంటే తక్కువ మెజార్టీ రావడం, చిన్న పార్టీల సంఖ్య బాగా పెరిగిపోవడంతో ప్రధాన పార్టీలు క్షేత్రస్థాయిలో బలం పెంచుకోవడానికి ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాయి.

సాక్షి, నేషనల్ డెస్క్

ఢిల్లీ కోర్టులో కాల్పుల కలకలం

న్యూఢిల్లీ: కట్టుదిట్టమైన భద్రత ఉండే ఢిల్లీలోని సాకేత్ కోర్టు ఆవరణలో తుపాకీ కాల్పులు కలకలం రేపాయి. లాయర్ దుస్తుల్లో వచ్చిన కామేశ్వర్ సింగ్ అనే వ్యక్తి ఓ మహిళపై కాల్పులు జరిపి పరారయ్యాడు. దాంతో అంతా పరుగులు తీశారు. మహిళకు ప్రాణాపాయం లేదని పోలీసులు తెలిపారు. ఆర్థిక విభేదాలే ఘటనకు కారణమని భావిస్తున్నామన్నారు. మాజీ లాయర్ అయిన నిందితుడు హరియాణా పోలీసులకు పట్టుబడ్డాడు. గత ఏడాది అతడిని ఢిల్లీ బార్ అసోసియేషన్ బహిష్కరించింది. ఆయన ఎం.రాధ(సుమారు 40 ఏళ్లు) అనే మహిళకు రూ.25 లక్షలు అప్పుగా ఇచ్చాడు. తిరిగివ్వకపోవడంతో చీటింగ్ కేసు పెట్టాడు. విచారణకు శుక్రవారం ఇద్దరూ కోర్టుకు వచ్చారు. 10.30 సమయంలో తగవుపడ్డారు. కామేశ్వర్ తన వెంట తెచ్చుకున్న తుపాకీతో రాధపై నాలుగు రౌండ్ల కాల్పులు జరిపాడు. రాధకు రెండు బుల్లెట్లు, పక్కనే ఉన్న లాయర్‌కు ఒక బుల్లెట్ తగిలాయి. ఈ ఘటనపై ఆమ్ ఆద్మీ పార్టీ మండిపడింది. ఢిల్లీలో సామాన్యులకు భద్రతే లేకుండా పోతుంటే లెఫ్టినెంట్ గవర్నర్ ఏం చేస్తున్నారని ప్రశ్నించింది.

2022లో మండిన ఎండలు

న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు నానాటికీ పెరిగిపోతూనే ఉన్నాయి. పారిశ్రామిక విప్లవ కాలం(1850–1900) ముందు నాటి ఉష్ణోగ్రత కంటే 2022లో ప్రపంచ ఉష్ణోగ్రత 1.15 డిగ్రీల సెల్సియస్ అధికంగా నమోదయ్యింది. 2022 సంవత్సరం ఇప్పటిదాకా ఆరో అత్యంత వేడి సంవత్సరంగా రికార్డుకెక్కిందని ప్రపంచ వాతావరణ సంస్థ(డబ్ల్యూఎంఓ) వెల్లడించింది. ఈ మేరకు 'స్టేట్ ఆఫ్ ద గ్లోబల్ క్లైమేట్–2022' నివేదికను శుక్రవారం విడుదల చేసింది. నివేదికలో ఏం వెల్లడించారంటే..

- 2015 నుంచి ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. తద్వారా కార్బన్ డయాక్సైడ్, మిథేన్, నైట్రస్ ఆక్సైడ్ ఉద్గారాలు పెరిగాయి. ఈ గ్రీన్‌హౌజ్ వాయువులు 2021లో రికార్డు స్థాయిలో వెలువడ్డాయి.
- అంటార్కిటికాలో, యూరప్‌ల్లో హిమానీనదాలు కరిగిపోతున్నాయి.
- 2013 నుంచి 2022 దాకా సముద్రాల నీటిమట్టం ప్రతిఏటా సగటున 4.62 మిల్లీమీటర్ల చొప్పున పెరిగింది. 1993– 2022 మధ్య రెట్టింపైంది.
- 2022లో అధిక ఉష్ణోగ్రతల వల్ల భారత్‌లో పంటల ఉత్పత్తి పడిపోయింది. పలు రాష్ట్రాల్లో అడవుల్లో కార్చిచ్చు వ్యాప్తించింది.
- పంటల ఉత్పత్తి పడిపోవడం, అదే సమయంలో ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం ప్రారంభం కావడంతో భారత్ నుంచి గోధుమలు, బియ్యం ఎగుమతులపై ఆంక్షలు విధించాల్సి వచ్చింది. దీనివల్ల చాలా దేశాలు ఇబ్బందులు తీవ్ర ఎదుర్కొన్నాయి.
- వాతావరణ మార్పుల వల్ల భారత్‌లో గతేడాది వరదలు కొండ చరియలు విరిగిపడడం వల్ల 700 మంది మరణించారు. వివిధ రాష్ట్రాల్లో పిడుగుపాటుకు 900 మంది బలయ్యారు.
- అస్సాంలో వరదల వల్ల 6.63 లక్షల మంది నిరాశ్రయులయ్యారు.
- గ్రీన్‌హౌజ్ వాయువుల ఉద్గారాలు పెరుగుతున్న కొద్దీ వాతావరణంలో ప్రతికూల మార్పులు కొనసాగుతూనే ఉంటాయని, అవి భూగోళంపై మానవళికి ముప్పుగా పరిణమిస్తాయని డబ్ల్యూఎంఓ సెక్రెటరీ జనరల్ ప్రొఫెసర్ పెటిరీ తలాస్ చెప్పారు.
- కరువు, వరదలు వంటి ప్రకృతి విపత్తులను తట్టుకొనే శక్తి ప్రపంచంలో 100కుపైగా దేశాలకు ఏమాత్రం లేదని అధ్యయనంతో తేలింది.

కాక్‌పిట్‌లోకి స్నేహితురాలు

ఎయిరిండియా పైలట్ నిర్వాకం

న్యూఢిల్లీ: విమానంలో కాక్‌పిట్‌లో పైలట్లు మాత్రమే ఉండాలి. ఇతరులు అందులోకి ప్రవేశించడం నిబంధనలకు విరుద్ధమే. దుబాయి నుంచి ఢిల్లీకి బయలుదేరిన ఎయిర్ ఇండియా ప్యాసింజర్ విమానంలో పైలట్ కాక్‌పిట్‌లో తన స్నేహితురాలిని ఆహ్వానించాడు. ఈ ఏడాది ఫిబ్రవరి 27న జరిగిన ఈ వ్యవహారంపై విమానంలోని సిబ్బంది ఒకరు పౌర విమానయాన డైరెక్టర్ జనరల్(డీజీసీఏ) లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. కాక్‌పిట్‌లో పైలట్ సీటు వెనుక జంప్ సీటు ఉంటుంది. అతను తన మిత్రురాలిని కూర్చోబెట్టాడు. ఆమెకు ఆహారం, మద్యం అందజేయాలంటూ సిబ్బందిని ఆదేశించాడు. దీన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని ఎయిర్ ఇండియా చెప్పింది. తమ ప్రయాణికుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపింది. విమానం నడిపే పైలట్లు, అదే విమానంలో పనిచేసే సిబ్బంది, డీజీసీఏ అధికారులకు, భారత వాతావరణ శాఖ సిబ్బందికి, పౌర విమానయాన శాఖ అధికారులకు మాత్రమే విమానం కాక్‌పిట్‌లోకి ప్రవేశించేందుకు అనుమతి ఉంటుంది.

సొంత నగరంపైనే రష్యా బాంబింగ్

మాస్కో: ఉక్రెయిన్‌తో యుద్ధం జరుగుతున్న వేళ రష్యా వైమానిక దళం పొరపాటున సరిహద్దుల్లోని సొంత నగరంపైనే భారీ బాంబు వేసింది. ఉక్రెయిన్ సరిహద్దుకు 25 మైళ్ల దూరంలోని బెల్గొరొడ్ నగరంలోని అపార్టుమెంట్‌కు సమీపంలో తమ బాంబర్లు అనుకోకుండా ఒక బాంబు వేసినట్లు రష్యా మిలటరీ ధ్రువీకరించింది. ఈ ఘటనతో నగరవాసులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. సుమారు 500 కిలోల బరువైన శక్తివంతమైన బాంబు పేలి 20 మీటర్ల లోతు గొయ్యి ఏర్పడింది. పలు కార్లు ధ్వంసమయ్యాయి. ఇద్దరు వ్యక్తులు గాయపడగా ఒక వ్యక్తి హైబీపీతో ఆస్పత్రి పాలయ్యాడని అధికారులు తెలిపారు.

సాక్షి 24|7
తమిళనాడు
TAMILNADU
శనివారం । 22 । ఏప్రిల్ । 2023

ఐఐటీ మద్రాసులో విద్యార్థి ఆత్మహత్య

సాక్షి, చెన్నై: ఐఐటీ మద్రాసులో బీటెక్ రెండో సంవత్సరం విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఐఐటీ మద్రాసులో నెలకు ఒకరు చొప్పున విద్యార్థుల బలవన్మరణాలు కొనసాగుతున్నాయి. మధ్యప్రదేశ్‌కు చెందిన కేదార్ సురేష్(20) ఐఐటీలో కావేరి హాస్టల్‌లో ఉంటూ చదువుతున్నాడు. శుక్రవారం అతడు తన గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న కోట్టూరుపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. నెలల వ్యవధిలో ఐదో విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడడం గమనార్హం.

న్యూస్‌రీల్

పుదుచ్చేరిలో 1 టూ 8 ఆల్‌పాస్

సాక్షి, చెన్నై: కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరిలో భానుడి తాపం దృష్ట్యా, 1–8 తరగతులకు ఆల్ పాస్ ప్రకటన చేశారు. 8వ తరగతి విద్యార్థులకు మాత్రం త్రైమాసికం, అర్ధ సంవత్సరం పరీక్ష ఫలితాల ఆధారంగా తుది మార్కుల జాబితాకు ఆదేశించారు. పుదుచ్చేరిలో ప్లస్‌టూ, ప్లస్ ఒన్, తొమ్మిది, పదో తరగతి పరీక్షలు ముగిశాయి. 1నుంచి 8వ తరగతి విద్యార్థులకు పరీక్షల నిర్వహణకు చర్యలు తీసుకున్నారు. అయితే, ఎండలు రెట్టింపు స్థాయిలో పదుచ్చేరిలో రెండు మూడు రోజులుగా ఉండడంతో ముందుగానే వేసవి సెలవులు ప్రకటించారు. విద్యార్థులకు బడులకు వచ్చి పరీక్ష రాసే అవకాశాలు లేని దృష్ట్యా, 1 నుంచి 8వ తరగతి వరకు ఆల్‌పాస్ చేస్తూ శుక్రవారం ఆ రాష్ట్ర విద్యాశాఖ ప్రకటించింది.

మీనాక్షి అమ్మవారికి బంగారు చిలుక కానుక


కానుకగా వచ్చిన బంగారు చిలుక

అన్నానగర్: మదురై మీనాక్షి అమ్మన్ దేవాలయం ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఆలయం. ఇక్కడ స్థానికంగానే కాకుండా విదేశాల నుంచి కూడా చాలా మంది భక్తులు వస్తుంటారు. అలా వచ్చిన భక్తులు తమ మొక్కులు తీర్చుకునేందుకు హుండీలో డబ్బులు, విరాళాలు ఇస్తారు. కొన్ని రోజుల క్రితం తిరుపతి దేవస్థానంలో సహాయ అధికారిగా పని చేసి పదవీ విరమణ పొందిన నాగరాజరావు మీనాక్షి అమ్మన్ ఆలయ భక్తుల సౌకర్యార్థం రూ.10 లక్షల విలువైన 20 కదిలే గొడుగులను అందజేశారు. అదే విధంగా మీనాక్షి అమ్మన్ ఆలయ వీధుల్లో భక్తుల కోసం చెన్నై సిల్క్స్ కంపెనీ గత వారం రూ.కోటితో షెల్టర్ ఏర్పాటు చేసింది. ఈ స్థితిలో శుక్రవారం చెన్నైకి చెందిన రాజరత్నం అమ్మన్ మీనాక్షి అమ్మవారికి 235 గ్రాముల (29.5 సవర్ల) బరువున్న బంగారు చిలుకను విరాళంగా ఇచ్చారు.

నటుడు సురేష్‌కు కోర్టులో చుక్కెదురు


ఆర్‌కే సురేష్

సాక్షి, చెన్నై: సినీ నటుడు ఆర్కే సురేష్ మెడకు ఆరుద్రా గోల్డ్ మోసం కేసు విచారణ ఉచ్చు బిగుస్తోంది. ఆర్థిక నేర విభాగం పంపిన సమన్లను వ్యతిరేకిస్తూ ఆయన హైకోర్టును ఆశ్రయించారు. స్టే ఇవ్వడానికి కోర్టు నిరాకరించడంతో విచారణను ఎదుర్కోవాల్సిన పరిస్థితి సురేష్‌కు తప్పడం లేదు. చెన్నై కేంద్రంగా రాష్ట్రంలో ఆరుద్రా గోల్డ్ పెట్టుబడుల పేరిట రూ. రెండు వేల కోట్లకు పైగా మోసాలకు పాల్పడిన విషయం తెలిసిందే. ఈ కేసులో కీలక నిందితులను ఆర్థిక నేర విభాగం పోలీసులు అరెస్టు చేశారు. వీరి వద్ద జరిపిన విచారణలో బీజేపీ నేతల పేర్లు తెరపైకి వస్తున్నాయి. ఆరుద్రా గోల్డ్‌లో డైరెక్టర్లుగా ఉన్న వాళ్లు బీజేపీకి చెందిన వారుగా తేలడంతో విచారణ వేగం పుంజుకుంది. అదే సమయంలో ఈ కేసుతో సినీ నటుడు ఆర్కే సురేష్‌కు సంబంధాలు ఉన్నట్టు వెలుగు చూశాయి. దీంతో ఆయన్ను విచారించేందుకు గత నెల పోలీసులు సమన్లు జారీ చేశారు. తాను విదేశాలలో షూటింగ్‌లో ఉన్నట్టుగా సాకులు చెబుతూ విచారణను ఆయన దాట వేస్తూ వచ్చారు. చివరకు ఆ సమన్లను వ్యతిరేకిస్తూ హైకోర్టును ఆశ్రయించాడు. పోలీసుల సమన్లకు స్టే విధించాలని కోరారు. శుక్రవారం పిటిషన్ విచారణకు రాగా, స్టే ఇవ్వడానికి కోర్టు నిరాకరించింది. దీంతో సురేష్ విచారణను ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

మరో 30 రోజులు గడువు కావాలి

కోర్టులో సీబీసీఐడీ పిటిషన్

సాక్షి, చెన్నై: వేంగై వయల్ గ్రామంలోని వాటర్ ట్యాంక్‌లో మలం కలిపిన వ్యవహారం విచారణ తుది దశలో ఉందని, మరో 30 రోజులు తమకు కేటాయించాలని పుదుకోట్టై కోర్టును సీబీసీఐడీ విజ్ఞప్తి చేసింది. పుదుకోట్టై జిల్లా వేంగై వయల్ గ్రామంలో చోటు చేసుకున్న ఈ వ్యవహారం వివాదాస్పదంగా మారిన విషయం తెలిసిందే. ఈకేసులో 11 మంది రక్తాన్ని సేకరంచి డీఎన్ఏ పరీక్షకు ఏర్పాట్లు చేపట్టారు. అలాగే, ఈ వ్యవహారానికి సంబంధించి వాట్సాప్ ద్వారా ఆడియో విడుదల చేసినట్టుగా భావిస్తున్న ఓ పోలీసుతో పాటు ఇద్దరు అనుమానితుల గళాన్ని పరిశీలించేందుకు చెన్నైలో ప్రత్యేక పరీక్ష జరుగుతోంది. ఈ పరిస్థితులలో కేసును సీబీసీఐడీ తన గుప్పెట్లోకి తీసుకని వంద రోజులకుపైగా అవుతోంది. ఇంతవరకు నిందితులను గుర్తించలేదు. అనమానితుల వద్ద పరిశోధనలు జరుగుతున్నాయి. ఈ పరిస్థితులలో కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు అనివార్యమైంది. దీంతో కేసు తుది దశలో ఉందని, తమకు మరో 30 రోజులు కేటాయిస్తే, సమగ్ర వివరాలను సమర్పిస్తామని పుదుకోట్టై కోర్టును విజ్ఞప్తి చేస్తూ సీబీసీఐడీ అధికారులు శుక్రవారం పిటిషన్ దాఖలు చేశారు.

శాంతివనంగా తమిళనాడు


అసెంబ్లీలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి స్టాలిన్

- పోలీసులకు 101 వరాలు
- స్కాట్లాండ్‌తో సమానంగా పోలీసు సేవ
- అసెంబ్లీలో సీఎం స్టాలిన్

సాక్షి, చెన్నై: అల్లర్లు, కుల, మతఘర్షణలు, తుపాకీ కాల్పులు, లాకప్ డెత్‌లు వంటి ఘటనలకు చోటులేకుండా రాష్ట్రం శాంతివనంగా మారిందని సీఎం ఎంకే స్టాలిన్ ధీమా వ్యక్తం చేశారు. స్కాట్లాండ్ పోలీసులతో సమానంగా తమిళనాడు పోలీసుల పనితీరు ఉందని కొనియాడారు. పోలీసు, అగ్నిమాపక శాఖల బలోపేతం లక్ష్యంగా 101 వరాలను అసెంబ్లీ వేదికగా సీఎం ప్రకటించారు.

అసెంబ్లీ సమావేశాలలో భాగంగా శుక్రవారం పోలీసు, అగ్నిమాపక శాఖలకు నిధుల కేటాయింపులపై సీఎం స్టాలిన్ ప్రసంగించారు. సభ్యుల ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. రాష్ట్ర పోలీసు యంత్రాంగం పనితీరును పొగడ్తలతో ముంచెత్తారు. నేరాల కట్టడిలో, నేరగాళ్లను పట్టుకోవడంలో పోలీసులు విశిష్ట ప్రతిభ కనబరుస్తున్నారని వివరించారు. అన్నాడీఎంకే హయాంలో రాష్ట్రంలో గంజాయి వంటి మాదక ద్రవ్యాల విక్రయం రాష్ట్రంలో జోరుగా సాగిందని, వీటిని కట్టడి చేయడం లక్ష్యగా తాము తీవ్రంగా శ్రమిస్తున్నామని పేర్కొన్నారు. తూత్తుకుడిలో జరిగిన తుపాకీ కాల్పులకు అనుమతి ఎవరు ఇచ్చారో అనే ప్రశ్నకు ఇక్కడ సమాధానం ఇచ్చే వారు లేరని మాజీ సీఎం పళనిస్వామిని ఉద్దేశించి విమర్శలు చేశారు. కొడనాడు కేసు విచారణపై పళనిస్వామికి ఎ ందుకు అంత తడబాటో అర్థం కావడం లేదని, సీబీసీఐడీ విచారణలో వాస్తవాలు త్వరలో వెలుగులోకి రాబోతున్నాయని సీఎం వ్యాఖ్యలు చేశారు. వలస కార్మికులను అడ్డం పెట్టుకుని రాష్ట్రంలో అతిపెద్ద అల్లర్లకు కొందరు చేసిన కుట్రలను తమిళనాడు పోలీసు భగ్నం చేశారని, కార్మికుల భద్రతకు భరోసా కల్పించారని గుర్తు చేస్తూ ప్రశంసలు కురిపించారు.

101 వరాలు...

నేరాల కట్టడిలో పోలీసుల పాత్రను గుర్తు చేస్తూ, రాష్ట్రంలో అల్లర్లు, మత, కుల ఘర్షణలు వంటి ఘటనలకు ఆస్కారం ఇవ్వకుండా శాంతివనంగా మారిందని వ్యాఖ్యలు చేశారు. పోలీసులు ఆ విధంగా శ్రమిస్తున్నారని, తప్పు చేసిన వారు ఎంతటి వారైనా సరే ఉపేక్షించకుండా కఠినంగా వ్యవహరించి శిక్షలపడేలా చేస్తున్నారని పేర్కొన్నారు. అందుకే పోలీసు విభాగాన్ని మరింత బలోపేతం చేయడం, నిఘాపెంపునకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొంటూ 101 వరాలను ప్రకటించారు. ఇందులో కొత్త పోలీసుస్టేషన్ల ఏర్పాటు, క్వార్టర్స్‌ల నిర్మాణాలు, అగ్నిమాపక కేంద్రాల బలోపేతం అంశాలు ఉన్నాయి. అలాగే, చెన్నైలో మహిళలు, బాలికలకు రక్షణగా రూ.5 కోట్లతో 3,500 నిఘా నేత్రాలను ప్రత్యేకంగా కొన్ని చోట్ల ఏర్పాటు చేయనున్నామని ప్రకటించారు. పోలీసులకు ఏడాదికి గాను యూనిఫాం భత్యంగా రూ. 4,500 అందజేస్తామన్నారు. అలాగే, పోలీసు పిల్లలకు విద్యా ప్రోత్సాహకంగా రూ. 35 వేలు అందజేయనున్నామని ప్రకటించారు. పోలీసు శునకాలకు రోజుకు ఆహారం ఖర్చు రూ. 200 నుంచి రూ.300లకు పెంచుతున్నామని తెలిపారు. క్రిప్టో కరెన్సీ, ఆన్‌లైన్ మోసాలు, ఫైనాన్స్ సంస్థల మోసాలను కట్టడి చేయడం లక్ష్యంగా ఆయా సంస్థలపై నిఘా వేయడానికి ప్రత్యేక కార్యాచరణపై దృష్టి పెట్టనున్నామని తెలిపారు. ఖైదీలు తప్పించుకోకుండా ఉండే విధంగా రిమోట్ లాక్ సిస్టమ్‌పై దృష్టి పెట్టనున్నామని వివరించారు. నేరాలకు పాల్పడే వారు ఎవరైనా, ఎంతటి వారైనా సరే ఉపేక్షించమని, శిక్షించి తీరుతామని సీఎం హెచ్చరించారు. ఇదిలా ఉండగా, సీఎం స్టాలిన్ ప్రసంగం వినేందుకుగాను ప్రేక్షకుల గ్యాలరీలో ఆయన సతీమణి దుర్గా స్టాలిన్ ఆశీనులయ్యారు. అలాగే, డీఎంకే పార్లమెంటరీ నేత టీఆర్ బాలు కూడా గ్యాలరీలో నుంచి సభా వ్యవహారాలను వీక్షించారు.

స్పీకర్ ఆవేదన..

అన్నాడీఎంకే తీరుపై స్పీకర్ అప్పావు ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ వ్యవహారాల ప్రత్యక్ష ప్రసారంపై ఇప్పటికే సభా వేదికగా వివరాలను వెల్లడించామని స్పీకర్ గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రశ్నోత్తరాలను మాత్రం ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నామని, దశల వారీగా అన్నీ కార్యక్రమాలను ప్రసారం చేస్తామన్నారు. సభా వేదికగా అన్నాడీఎంకే సభ్యులు వాడిన పదాలు, చేసిన వ్యాఖ్యలు తీవ్ర ఆవేదనకు గురి చేశాయని, ఇది తప్పుడు సంకేతాలకు మార్గం అవుతుందని పేర్కొన్నారు. తాను కక్ష సాధిస్తున్నట్లుగా అన్నాడీఎంకే వర్గాలు చెప్పడం శోచనీయమని విమర్శించారు. తాను కక్ష సాధించాలనుకుంటే అన్నాడీఎంకే–1, అన్నాడీఎంకే–2 అని వారి శిబిరాలను విభజించి ఉండేవాడినని వ్యాఖ్యలు చేశారు.

అన్నాడీఎంకే వాకౌట్..

సీఎం ప్రసంగాన్ని అన్నాడీఎంకే సభ్యులు వాకౌట్ చేశారు. ప్రధాన ప్రతి పక్ష నేత , అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళనిస్వామి ప్రసంగాన్ని సభలో ప్రత్యేక్ష ప్రసారం చేయడం లేదని, శాసన సభా పక్ష ఉపనేత పదవి నుంచి పన్నీరు సెల్వంను తొలగించి ఉదయకుమార్‌ను నియమించడంలో స్పీకర్ నిర్లక్ష్యం వహిస్తున్నారని, సభా పద్దుల కమిటీని తమకు ఇవ్వకుండా స్పీకర్ రాజకీయం చేశారని ఆరోపిస్తూ సభ నుంచి అన్నాడీఎంకే సభ్యులు వాకౌట్ చేశారు. స్పీకర్ అప్పావు ఏకపక్షంగా సభలో వ్యవహరిస్తున్నారని, తమగళాన్ని నొక్కేస్తున్నారని ఆ పార్టీ విప్ ఎస్పీ వేలుమణి ఆగ్రహం వ్యక్తం చేశారు.

5న కళ్లలగర్ వైగై నదీ ప్రవేశం

- నీళ్లు చల్లడంపై ఆంక్షలు


కళ్లలగర్ స్వామి

సాక్షి, చెన్నై: మదురై మీనాక్షి అమ్మవారి బ్రహ్మోత్సవాలలో భాగంగా కళ్లలగర్ వైగై నదీ ప్రవేశం మే 5వ తేదీ జరగనుంది. ఈ సమయంలో స్వామి వారిపై భక్తులు పసుపు నీరు, సాధారణ నీరు చల్లడంపై ఆలయ అధికారులు కొన్ని ఆంక్షలు విధించారు. మదురై మీనాక్షి అమ్మవారి ఆలయంలో చిత్తిరై బ్రహ్మోత్సవాలు ఈనెల 23వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాలలో అమ్మవారి పట్టాభిషేం, కల్యాణ మహోత్సవం కనులపండువగా జరుగుతాయి. ఈ ఉత్సవాలతో పాటు మదురై అలగర్ మలైలోని కళ్లలగర్ స్వామి ఆలయ ఉత్సవాలకు విశిష్టత ఉంది. మే 1వ తేదీ నుంచి కళ్లలగర్ ఆలయంలో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఈ ఉత్సవాలలో అత్యంత ముఖ్య ఘట్టం కళ్లలగర్ స్వామి వారు మీనాక్షి అమ్మవారి కల్యాణం తిలకించేందుకు వెళ్లడం, మార్గమధ్యలో ఎదురైన పరిస్థితులతో ఆ వేడుకను చూడకపోవడం జరుగుతుంది. ఈ ఘట్టాన్ని కళ్లకు గట్టినట్టుగా చూపించే విధంగా కళ్లగర్ వైగై నదీ ప్రవేశ ఉత్సవం లక్షలాది మంది భక్తులు సమక్షంలో జరుగుతుంది. ఈ ఉత్సవం మే 5వ తేదీ మదురైలోని వైగై నదీ తీరంలో కోలాహలంగా జరుగుతుంది. ఈ ఉత్సవంలో భాగంగా భక్తులు స్వామి వారిపై పసుపు నీళ్లు, వాటర్ పంపుల ద్వారా, వాటర్ ప్యాకెట్లు, బాటిళ్ల ద్వారా నీటిని చల్లడం ఆనవాయితీగా వస్తున్నది. అయితే, ఈ సారి ఇందుకు కొన్ని ఆంక్షలు విధించారు. రసాయనం కలిపిన నీళ్లను చల్ల కూడదని, పంటితో వాటర్ ప్యాకెట్‌ను కొరికి ఆ నీటిని చల్ల రాదని, ప్రధానంగా ప్రెజర్ పంపులను వినియోగించి నీటిని చల్లడాన్ని నిషేధిస్తున్నామని ఆలయ అధికారులు శుక్రవారం ప్రకటించారు.

రూటు మార్చిన ఓపీఎస్

- అన్నాడీఎంకే జెండాలో రెండాకులు
- పళని శిబిరం ఆగ్రహం
- కోర్టులో పిటిషన్‌కు నిర్ణయం


పన్నీరుసెల్వం,


పళనిస్వామి

సాక్షి, చెన్నై : అన్నాడీఎంకే వ్యవహారంలో మాజీ సీఎం పన్నీరుసెల్వం రూటు మార్చారు. తమ పార్టీ జెండాను ఉపయోగించకూడదని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి పళనిస్వామి వర్గం నుంచి హెచ్చరికలు రావడంతో జెండాకు కొత్త మెరుగులు దిద్దారు. ఆ పార్టీ జెండాలో రెండాకులను జోడించి ఉపయోగించేందుకు నిర్ణయించడం చర్చనీయాంశంగా మారింది.

అన్నాడీఎంకే వర్గాల అమ్మ జయలలిత మరణంతో పార్టీలో చీలిక ఏర్పడిన విషయం తెలిసిందే. టీటీవీ దినకరన్ నేతృత్వంలో అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం ఆవిర్భవించింది. ఆ పార్టీ జెండా అన్నాడీఎంకే జెండాను పోలిన వర్ణంతో తీసుకొచ్చినా, జెండా మధ్యలో అన్నాదురై ఫొటోను తొలగించి జయలలిత ఫొటోను పొందు పరిచారు. తాజాగా పళనిస్వామి, పన్నీరుసెల్వం మధ్య వివాదాల నేపథ్యంలో మళ్లీ ఆ జెండా వివాదానికి దారి తీసింది.

జెండాలో రెండాకులు..

ప్రస్తుతం కేంద్ర ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు, కోర్టు తీర్పులతో అన్నాడీఎంకే పళనిస్వామి గుప్పెట్లోకి చేరింది. దీంతో తమ పార్టీ పేరును, జెండాను ఉపయోగించకూడదని పన్నీరుసెల్వంకు హెచ్చరికలు జారీ అయ్యాయి. ఒక వేళ ఉపయోగించిన పక్షంలో చట్ట పరంగా చర్యలు తప్పవని పళనిస్వామి శిబిరం స్పష్టం చేసింది. అదే సమయంలో తిరుచ్చి వేదికగా ఈనెల 24న జరగనున్న పన్నీరు సెల్వం నేతృత్వంలోని మహానాడులో పార్టీ జెండా వినియోగం వివాదానికి దారి తీసే అవకాశాలు కనిపించాయి. దీనిని ముందుగానే పసిగట్టిన పన్నీరు శిబిరం జెండాను తమకు అనుకూలంగా మలుచుకోవడం గమనార్హం. అన్నాడీఎంకే జెండా నలుపు, ఎరుపు వర్ణాలతో ఉంటుంది. మధ్యలో దివంగత నేత అన్నాదురై ఫొటో ఉంటుంది. అయితే, ఈ జెండాను అలాగే వాడేసుకుంటూ, అన్నాదురైకు పైభాగంలో రెండాకుల చిహ్నం పన్నీరు శిబిరం పొందుపరచడం చర్చకు దారి తీసింది. పన్నీరు కొత్త పార్టీ పెట్టేనా అన్న చర్చ తెరపైకి వచ్చింది. అయితే, న్యాయపోరాటంలో తుది గెలుపు తమదే అని, అందుకే ప్రస్తుతానికి జెండాలో పార్టీ గుర్తు రెండాకుల చిహ్నంను పొందు పరిచినట్టు పన్నీరు శిబిరం నేతలు పేర్కొంటున్నారు. ఈవ్యవహారంపై పన్నీరు శిబిరం సీనియర్ నేత బన్రూటి రామచంద్రన్ పేర్కొంటూ అన్నాడీఎంకే పేరును, జెండాను, చిహ్నంను తాము వినియోగిస్తామని, ఇది తమ హక్కుగా వ్యాఖ్యలు చేశారు.

చట్టపరంగా చర్యలు...

పన్నీరు సెల్వం శిబిరం తీరుపై పళనిస్వామి తీవ్రంగా స్పందించారు. ఎన్నికల కమిషన్, కోర్టు స్పష్టంగా పార్టీ, జెండా, చిహ్నం తమకే చెందుతుందని చెప్పాయని, అలాంటప్పుడు ఆయన రాజకీయ నాగరికతకు అనుగుణంగా నడుచుకోకపోవడం శోచనీయమని విమర్శించారు. పార్టీ పేరు, జెండాను ఆయన వినియోగించడం అనాగరిక చర్యగా వ్యాఖ్యలు చేశారు. పార్టీ కోసం విశ్వాసంగా ఉండే వాళ్లను చేర్చుకునేందుకు సిద్ధంగా ఉన్నట్టు, అయితే, ద్రోహులకు అన్నాడీఎంకేలో చోటు లేదని పరోక్షంగా పన్నీరును ఉద్దేశించి పళనిస్వామి వ్యాఖ్యలు చేశారు. అన్నాడీఎంకే సీనియర్‌నేత జయకుమార్ స్పందిస్తూ, పన్నీరు తన ధోరణి మార్చుకోకుంటే చట్టపరంగా చిక్కులు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. పార్టీ పేరు, జెండాను ఆయన వినియోగించడంపై కోర్టులో పిటిషన్ దాఖలు చేయబోతున్నామన్నారు.

రంజాన్ సందడి

- నేడు పండుగ
- ప్రత్యేక ప్రార్థనలకు మసీదులు ముస్తాబు
- ముస్లింలకు నేతల శుభాకాంక్షలు


ఆభరణాల కొనుగోళ్లలో మహిళలు


నగరంలో కాంతులీనుతున్న మసీదులు

సాక్షి, చెన్నై: నెలవంక కన్పించడంతో శనివారం రంజాన్ పండుగను జరుపుకునేందుకు రాష్ట్రంలోని ముస్లింలు సిద్ధమయ్యారు. ప్రత్యేక ప్రార్థనలకు మసీదులు ముస్తాబయ్యాయి. ముస్లింలు అత్యధికంగా ఉండే ప్రాంతాల్లో పండుగ సందడి మిన్నంటుతోంది.

మహ్మద్ ప్రవక్త సూక్తుల మేరకు పుణ్య కార్యాలకు, సమత మమతలకు నెలవుగా రంజాన్ మాసం నిలుస్తున్న విషయం తెలిసిందే. ఈ మాసంలో నరక ద్వారాలు మూసుకుని, స్వర్గ ద్వారాలు తెరచుకుంటాయన్నది ముస్లింల నమ్మకం. అందుకే పాప కర్మల నుంచి విముక్తి పొందడానికి ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఈ మాసంలో ఉపవాస దీక్షల్ని (రోజా) ఆచరించారు. పేద, గొప్ప అన్న బేధం లేకుండా అల్లాకు విశ్వాసపాత్రులుగా ఉంటూ సేవల్లో నిమగ్నమయ్యారు. ధాన ధర్మాలు చేస్తూ ఈద్ ముబారక్ వేళకు సన్నద్ధమయ్యారు.

నేడు పండుగ..

శుక్రవారం రాత్రి ఆకాశంలో నెలవంక కనిపించడంతో శనివారం పండుగను జరుపుకునే విధంగా ప్రభుత్వ ఖాజీ ప్రకటించారు. దీంతో పరస్పరం ముస్లింలు మసీదుల వద్ద శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. ఉదయాన్నే పండుగను జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. పవిత్ర రంజాన్ కోసం కొత్త బట్టల కొనుగోళ్లను ఇప్పటికే పూర్తి చేశారు. వస్తువుల కొనుగోళ్ల నిమిత్తం షాపింగ్ సెంటర్లకు తరలివచ్చారు. దీంతో ముస్లింలు అత్యధికంగా ఉండే నగరాలు, పట్టణాలు, ప్రాంతాలలో పండుగ వాతావరణం మిన్నంటుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉదయం కొన్ని చోట్ల ఉదయం తొమ్మిది గంటలకు, మరికొన్ని చోట్ల తొమ్మిదిన్నర, పది గంటలకు రంజాన్ ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు చేశారు. కొన్ని చోట్ల ఈద్గా మైదానాల్లో మరికొన్ని మసీదుల్లో ప్రార్థనలు జరగనున్నాయి. రాష్ట్రంలోని అన్ని మసీదులను విద్యుద్దీప కాంతులతో అలంకరించి ఉండడం విశేషం. మరికొన్ని చోట్ల ఎండ వేడి నుంచి ఉపశమనం కల్గే విధంగా షామియానాలను, పందిళ్లను ఏర్పాటు చేశారు. అలాగే, రంజాన్ రోజున మాంసం విందు కోసం రాష్ట్రంలోని సంతలలో శుక్రవారం ఒక్క రోజు రూ.20 కోట్ల విలువ గల మేకలు, గొర్రెల విక్రయాలు జరిగాయి. ఇదిలా ఉండగా సౌదీ అరేబియాలో శుక్రవారం రంజాన్ పండుగ జరగడంతో ఆ కాలమానాన్ని అనుసరిస్తూ రాష్ట్రంలో కొన్ని మైనారిటీ సంఘాల నేతృత్వంలో ఈద్ ప్రార్థనలు జరిగాయి.

నేతల శుభాకాంక్షలు..

రంజాన్ పండుగను పురస్కరించుకుని రాష్ట్రంలోని ముస్లింలకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, ప్రధాన ప్రతి పక్ష నేత, అన్నాడీఎంకే ప్రధానకార్యదర్శి పళనిస్వామి, మాజీ సీఎం పన్నీరు సెల్వం తమ వేర్వేరు ప్రకటనలలో ముస్లింలు అందరూ ఆనందోత్సాహాలతో పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. రంజాన్ ప్రత్యేక ప్రార్థనలతో కుటుంబసమేతంగా పండుగను జరుపుకోవాలని సూచించారు. ప్రేమానురాగాలు, సోదరభావం, సమానత్వం వికసించాలని ఆకాంక్షించారు. అలాగే డీఎండీకే అధ్యక్షుడు విజయకాంత్, పీఎంకే నేత రాందాసు, ఎండీఎంకే నేత వైగో, వీసీకే నేత తిరుమావళవన్, ఎస్ఎంకే నేత శరత్‌కుమార్, ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ నేత ఖాదర్ మొహిద్దీన్, మనిద నేయ మక్కల్ కట్చి నేత జవహరుల్లా, తమిళ మానిల కాంగ్రెస్ అధినేత జీకే వాసన్, అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం నేత దినకరన్, చిన్నమ్మ శశికళ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ అళగిరి శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

డీఎంకే మిత్రుల్లో 'పని' చిచ్చు

- 12 గంటల పని వేళలకు వ్యతిరేకత
- అయినా ఆమోదం

సాక్షి, చెన్నై: డీఎంకే మిత్రపక్షాలలో ప్రైవేటు సంస్థలలో పని వేళల పొడిగింపు వ్యవహారం చిచ్చు రేపింది. ప్రైవేటు సంస్థలలో 8 గంటలకు బదులుగా 12 గంటల పని వేళలు అన్న ప్రభుత్వ నిర్ణయాన్ని మిత్రపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. డీఎంకే అధ్యక్షుడు, సీఎం ఎంకే స్టాలిన్ నిర్ణయానికి అనుగుణంగా గత కొన్నేళ్ల పాటు మిత్ర పక్షాలైన కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, వీసీకే, ఎండీఎంకే పార్టీలు అడుగులు వేస్తూ వచ్చిన విషయం తెలిసిందే. అయితే, అసెంబ్లీ వేదికగా మిత్ర పక్షాలు తమ కూటమిలో ప్రధాన పార్టీగా ఉన్న డీఎంకే ప్రభుత్వ నిర్ణయాన్ని శుక్రవారం తీవ్రంగా వ్యతిరేకించాయి. మంత్రులు సీవీ గణేషన్, తంగం తెన్నరసు సభలో ఓ ముసాయిదా ప్రవేశపెట్టారు. ప్రైవేటు సంస్థలు, పరిశ్రమలలో ఇక 8 గంటలకు బదులుగా 12 గంటల పనివేళలు నిర్ణయిస్తున్నామని ఆ తీర్మానంలో వివరించారు. దీనిని సభలో ఉన్న కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, వీసీకే, ఎండీఎంకే డీఎంకే మిత్రపక్ష పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయి. 8 గంటల పనివేళలను 12 గంటలుగా నిర్ణయించడం కార్మికులతో చెలగాటం ఆడినట్టేనని, ఈ ప్రయత్నాన్ని వీడాలని డిమాండ్ చేశాయి. ఇందుకు మంత్రులు వివరణ ఇచ్చే ప్రయత్నం చేసినా, ఆ పార్టీలు అంగీకరించ లేదు. దీంతో సభలో ఆ తీర్మానాన్ని డీఎంకే మెజారిటీ సభ్యుల నిర్ణయంతో ఆమోదించారు. అయితే, డీఎంకే మిత్రపక్షాలు మాత్రం ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సభలో నినదించడం గమనార్హం. అనంతరం వెలుపల మంత్రులు మీడియాకు ఈ చట్టం గురించి వివరించారు. ఇది బలవంతం కాదని, ఆయా సంస్థలు, అక్కడి సిబ్బంది నిర్ణయం మేరకు అమల్లో ఉంటుందని వివరించారు. పని వేళలను పొడిగించడం ద్వారా రాష్ట్రంలోకి పెట్టుబడుల వరద మరింతగా పెరగనున్నాయని, లక్షలాది మందికి ఉపాధి దక్కబోతోందని వివరించారు. 12 గంటల పని వేళ అనేది పరిశ్రమల యాజమాన్యం, కార్మికుల పరస్పరం అంగీకారం మేరకు అమలు అవుతుందని, ఇందులో బలవంతం లేదని స్పష్టం చేశారు. ఏదేని సంస్థ, పరిశ్రమల బలవంతంగా 12 గంటలు పనిచేయాలని ఒత్తిడి తెచ్చిన పక్షంలో ఆసంస్థలపై చర్యలు తీసుకునేలా ఈ చట్టంలో అంశాలను పొందుపరిచినట్టు వివరించారు. ఈ చట్టం ఎలక్ట్రానిక్ ఆధారిత, క్లస్టర్ ఎలక్ట్రానిక్స్, నాన్ లెదర్ పరిశ్రమలకు ఉపయోగకరంగా ఉంటుందని, ఇక్కడ కార్మికులు అధిక గంటలు పనిచేస్తున్నారని వివరించారు. ఈ చట్టం ఆధారంగా కార్మికులకు అదనపు పని వేళలకు తగ్గ ప్రయోజనాలు కూడా ఉంటాయని వివరించారు.

సిరువానిలో చెక్ డ్యాంలు

- కోవైకు నీటి గండం
- కేరళ తీరుపై విమర్శలు


సిరువాని జలాశయం

సాక్షి, చెన్నై: సిరువాని నదీ తీరంలో చెక్‌డ్యాంల నిర్మాణాలను కేరళ వేగవంతం చేసింది. సిరువాని జలాశయానికి నీటి రాక తగ్గుతుండడంతో ముందు కోయంబత్తూరు నీటి ఎద్దడిని ఎదుర్కోవాల్సి ఉంటుందన్న ఆందోళన మొదలైంది. కేరళ చర్యలకు అడ్డుకట్టవేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి రైతు సంఘాలు, కోవై వాసులు విజ్ఞప్తి చేశారు. కోయంబత్తూరు నగరానికి తాగునీటి అవసరాలను సిరువాని జలాశయం, భవానీ సాగర్ నదులు తీరుస్తున్నాయి. ఈ రెండు నదులు కేరళ నుంచి తమిళనాడు వైపు ప్రవహిస్తున్నాయి. అయితే, ఇటీవల కేరళ అధికారులు సిరువాని, భవనీసాగర్ నదులపై చెక్ డ్యాంల నిర్మాణాలకు కసరత్తులు చేపట్టారు. ఇప్పటికే భవనీసాగర్ నదీ తీరంలో రెండు చోట్ల చెక్ డ్యాంలను నిర్మించగా, రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర వ్యతిరేకతను వ్యక్తం చేసింది. ఈ పరిస్థితులలో సిరువాని నదీ తీరంలోని అట్టపాడినెల్లి మది వద్ద ఐదు నుంచి ఏడు అడుగుల మేరకు ఓ చెక్ డ్యాం నిర్మాణాన్ని 90 శాతం కేరళ అధికారులు పూర్తిచేయడం శుక్రవారం వెలుగులోకి వచ్చింది. అలాగే, నెల్లిమదికి కూతవేటు దూరంలో మరోచోట పనులకు సర్వం సిద్ధం చేసిన సమాచారంతో ఆ పరిసర కోయంబత్తూరు రైతులు వ్యవహారాన్ని వెలుగులోకి తెచ్చారు. అటవీ ప్రాంతంలో నిండిన ఈ నదీ తీరంలో కేరళ చెక్ డ్యాంలను చాప కింద నీరులా నిర్మిస్తుండడం వివాదాలకు దారి తీసింది. ఇప్పటికే కోయంబత్తూరులోని సిరువాని డ్యాంకు నీటి రాక క్రమంగా తగ్గింది. వేసవిలో ఈ జలాశయం పూర్తిగా అడుగంటే పరిస్థితి నెలకొంది. ఈ సమయంలో వరుసగా చెక్ డ్యాంలను కేరళ నిర్మించుకుంటూ వెళ్తే, భవిష్యత్తులో సిరువాని జలా శయానికి నీరు కరువైనట్టేనని, ఇది కోయంబత్తూరులో నీటి ఎద్దడి పరిస్థితులను కల్పిస్తుందని రైతు సంఘాల నేతలు హెచ్చరిస్తున్నారు. ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

మానసిక చిన్నారులకు బహుమతులు



క్రీడల్లో విజేతలకు బహుమతులు అందిస్తున్న డాక్టర్ సోనియాసింగ్

కొరుక్కుపేట: సదరన్ రైల్వే ఉమెన్స్ హెడ్ క్వార్టర్స్ ఆర్గనైజేషన్ తరఫున ఎగ్మూర్‌లో నిర్వహిస్తున్న మానసిక చిన్నారుల ప్రత్యేక పాఠశాల ఆశ్రయ 30వ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. సదరన్ రైల్వే ఉమెన్స్ హెడ్ క్వార్టర్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు సోనియాసింగ్ అధ్యక్షత వహించిన ఈ క్రీడల్లో పాల్గొన్న 23 మంది మానసిక చిన్నారులకు బహుమతులు అందజేశారు.

ప్రొడాప్ట్ ఫైబర్ సేవలకు బోల్ట్ స్పీడ్

సాక్షి, చెన్నై: ప్రొడాప్ట్ ఫైబర్ సర్వీసు ప్రొవైడర్ల కోసం బీఎస్ఎస్ సొల్యూషన్స్ బోల్ట్ స్పీడ్‌ను ప్రారంభించిందని ఆ సంస్థ చీఫ్ ఇన్నోవేషన్ అధికారి బ్రెండన్ ఓ బ్రియాన్ తెలిపారు. ఈ సొల్యూషన్ బోల్ట్ స్పీడ్ గురించి ఆయన శుక్రవారం స్థానికంగా వివరించారు. కనెక్టెడ్‌నెస్ పరిశ్రమల అతిపెద్ద, అత్యంత వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న సంస్థ ప్రొడాప్ట్ అని గుర్తు చేశారు. క్లౌడ్ – నేటివ్ సొల్యూషన్ వ్యాపారాలు వేగంగా మార్కెట్‌లోకి వెళ్లడంలో సహాయ పడడానికి కన్వర్జ్ సర్వీస్ డెలివరీ, అతుకులు లేని ఇంటిగ్రేషన్ కోసం ఎస్ఏఏఎస్ ప్లాట్‌ఫాం మిళితం చేస్తుందని వివరించారు. డిజిటల్ యుగంలో ఫైబర్ వ్యవహారాలు, సాఫ్ట్‌వేర్ అవసరాల కోసం విస్తృతమైన లైసెన్సింగ్ ఏర్పాటు, సుదీర్ఘ సాధనాలు, సామర్థ్యాలకు బోల్ట్ స్పీడ్ ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

ర్యాపిడో బైక్‌లను నిషేధించండి

కొరుక్కుపేట: చెన్నైలో ర్యాపిడో బైక్‌లను నిషేధించాలని ఆటోకార్మికులు చెన్నై పోలీసు కమిషనర్‌కు వినతి పత్రం అందించారు. యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో ర్యాపిడో బైక్ సదుపాయం అందుబాటులోకి వచ్చింది. దీంతో ఆటో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారు. ర్యాపిడో బైక్‌లు అందుబాటులో ఉండడంతో ఆటోలు ఎక్కేవారు కరువయ్యారు. చాలా మంది రాపిడో బైక్‌ను వినియోగించడం ప్రారంభించారు. ఇటీవలే మెట్రో రైల్వేస్టేషన్లలో మహిళా ప్రయాణికుల కోసం ర్యాపిడో సౌకర్యాన్ని కూడా ప్రవేశపెట్టింది. ర్యాపిడో బైక్ సౌకర్యం రోజురోజుకు పెరుగుతుండడంతో ఆటో, ట్యాక్సీ కార్మికులపై ప్రభావం పడుతోంది. దీంతో చెన్నైలో ర్యాపిడో బైక్ సౌకర్యాన్ని నిషేధించాలని ఆటో కార్మిక సంఘాలన్నీ నిరసన తెలిపాయి. ఈ నేపథ్యంలో అన్ని ఆటో ఫెడరేషన్లు ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ నిర్మలారాజ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించాయి. స్పందించిన ఆయన సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఎంఎస్‌ఎంఈలను ప్రోత్సహిస్తోంది

- జాయింట్ డైరెక్టర్ ఎస్ శక్తివేల్



శక్తివేల్‌ను సత్కరిస్తున్న డాక్టర్ ఇందిరాదత్

కొరుక్కుపేట: సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమ(ఎంఎస్ఎంఈ)లను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని తమిళనాడు ప్రభుత్వం ఫేమ్ టీఎన్ జాయింట్ డైరెక్టర్ ఎస్ శక్తివేల్ తెలిపారు. ఈ మేరకు ఆంధ్రా చాంబర్ ఆఫ్ కామర్స్ (ఏసీసీ), ఫ్రెడ్రిచ్ నౌమన్ ఫౌండేషన్ ఫర్ ఫ్రీడమ్ (జర్మన్ ఫౌండేషన్) సంయుక్త ఆధ్వర్యంలో ఎంపవరింగ్ ఎంఎస్ఎంఈ ఆన్ క్యాపిటల్ మార్కెట్ ఎక్స్‌పోసర్ అనే అంశంపై సదస్సును శుక్రవారం నగరంలో నిర్వహించారు. ఆంధ్రాచాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షురాలు డాక్టర్ వీఎల్ ఇందిరాదత్ మాట్లాడుతూ ఆంధ్రా చాంబర్ ఆఫ్ కామర్స్‌లో ప్రస్తుతం 1,200 మంది సభ్యులు, 25కి పైగా ట్రేడ్ అసోసియేషన్‌లు అనుబంధంగా ఉన్నాయని అన్నారు. జాయింట్ డైరెక్టర్ శక్తివేల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంఎస్ఎంఈల అభ్యున్నతికి కృషిచేస్తోందని అన్నారు. ఈక్రమంలోనే అనేక పథకాలను వారికీ అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు. ప్రభుత్వ అందిస్తున్న పథకాలను ఎంఎస్ఎంఈలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంఎస్ఎంఈ చైర్మన్ ఎంకే ఆనంద్, బీఎస్ఈ ఎంఎస్ఈ ఎక్సేంజ్ ప్లాట్‌ఫామ్–ముంబయి డిప్యూటీ జనరల్ మేనేజర్ ఆనంద్ చారి, సృజన్ ఆల్ఫా కేపిటల్ అడ్వైజర్స్ ఎల్ఎల్‌పి రాజత్ బైడ్, ఆంధ్రా చాంబర్ ఆఫ్ కామర్స్ సెక్రటరీ జనరల్ ఆర్ విజయలక్ష్మి, ఉపాధ్యక్షుడు సీహెచ్ వెంకటేశ్వరరావు, పబ్లిక్ రిలేషన్స్ కమిటీ చైర్మన్ కేఎన్ సురేష్‌బాబు, ఎంఎస్ఎంఈ సబ్ కమిటీ కో చైర్మన్ ప్రశాంత్ కుమార్, ఏసీసీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎంకె ముత్తువేలు పాల్గొన్నారు.

రైతులకు అండగా నిలుస్తున్నాం



రవీంద్రన్‌ను అభినందిస్తున్న కార్తీక్ జయరామన్

సాక్షి, చెన్నై: రైతులకు అండగా నిలుస్తూ వే కూల్ ఫుడ్ సంస్థ ముందుకెళుతోందని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కార్తీక్ జయరామన్ తెలిపారు. దక్షిణాది రాష్ట్రాల్లో బ్రాండ్ నెక్స్ట్ పేరుతో వాణిజ్యకార్యకలాపాలను విస్తరింపజేసే విధంగా వేకూల్ ఫుడ్స్ సంస్థ దృష్టిపెట్టింది. అందులో భాగంగా చెన్నైలో ఏర్పాటు అయిన ప్రత్యేక సమావేశంలో కొత్త ఆహార ఉత్పత్తులను ఆవిష్కరించారు. అలాగే సంస్థకు సీఈఓగా బీపీ రవీంద్రన్‌ను నియమించారు. ఆయన మాట్లాడుతూ.. నేరుగా రైతుల నుంచి నాణ్యమైన ఉత్పత్తులను తీసుకుని వచ్చి విక్రయాలు చేస్తున్నామని అన్నారు. ఈ క్రమంలో రైతులు లాభ పడుతున్నట్లు తెలిపారు. రెండు లక్షలకు పైగా రైతులతో తమ సంస్థతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయన్నారు.

స్వచ్ఛ కార్పొరేషన్‌గా మారుద్దాం



చెత్త సేకరణపై విచారిస్తున్న కమిషనర్ రత్నస్వామి

వేలూరు: వేలూరు కార్పొరేషన్‌ను అందంగా తీర్చిదిద్దేందుకు అందరి సహకారం అవసరమని కమిషనర్ రత్నస్వామి అన్నారు. మొత్తం 60 వార్డుల్లో పారిశుద్ధ్య కార్మికులతో సేకరించే చెత్తను మహిళా సంఘాలతో వేరుచేసి సేంద్రియ ఎరువులుగా తయారు చేసి విక్రయం చేస్తున్నారు. ఇదిలా ఉండగా కొన్ని వార్డుల్లో పారిశుద్ధ్య కార్మికులు చెత్తను సక్రమంగా ఇంటింటికి వెళ్లి సేకరించడం లేదని ఫిర్యాదులు వచ్చాయి. దీంతో కార్పొరేషన్ కమిషనర్ రత్నస్వామి శుక్రవారం ఉదయం 6 గంటలకు కాటాప్డి జోన్ పరిధిలోని మూడో వార్డులో ఇంటింటికి వెళ్లి చెత్తను సక్రమంగా సేకరిస్తున్నారా? ప్రతి రోజూ పారిశుద్ధ్య కార్మికులు వస్తున్నారా అనే విషయాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సేకరించిన చెత్తను సేంద్రియ ఎరువుగా తయారు చేసి ఎక్కడ విక్రయం చేస్తున్నారు అనే కోణంలో విచారణ జరిపారు. అనంతరం వార్డులోని ప్రజల వద్దకు వెళ్లి తాగునీరు సక్రమంగా వస్తుందా, పరిశుభ్రంగా ఉంచుతున్నారా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు అర్బన్ ఆరోగ్య అధికారి గణేష్, వార్డు ఆరోగ్య అధికారి శివకుమార్, కార్పొరేషన్ సిబ్బంది ఉన్నారు.

రూ.80 లక్షలతో విజ్ఞానపార్క్

- పూర్తయిన పనులు
- త్వరలో అందుబాటులోకి



కొత్త హంగులతో తీర్చిదిద్దిన పార్క్

తిరువళ్లూరు: జిల్లాలో ప్రధాన పర్యాటక కేంద్రమైన పూండిలో విద్యార్థులు, ప్రజలు, పర్యాటకులను ప్రత్యేకంగా ఆకర్షించడానికి రూ.80 లక్షలతో మర్మమతులు చేసిన విజ్ఞాన పార్క్‌ను త్వరలో ప్రారంభించి అందుబాటులోకి తీసుకురానున్నట్టు అధికారులు వెల్లడించారు. తిరువళ్లూరు జిల్లా పూండిలో సత్యమూర్తి సాగర్ రిజర్వాయర్‌తో పాటు ప్రధాన పర్యాటక కేంద్రంగా వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఇక్కడ పురావస్తు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్క్‌తో పాటు వివిధ డ్యామ్‌ల నమూనాలను చూడడానికి నిత్యం వేలాది మంది వస్తుంటారు. ఈ నేపథ్యంలో పూండిలో సత్యమూర్తిసాగర్ విగ్రహంతో పాటు నాలుగు ఎకరాల విస్తీర్ణంలో పార్క్ వుంది. అయితే గత పదేళ్లుగా పార్క్‌ను సరిగ్గా పర్యవేక్షించకపోవడంతో పలు బొమ్మలు, సెల్ఫీపాయింట్, డైనోసర్, పాముల విగ్రహాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. దీంతో పూండికి పర్యాటకులు ఎక్కువగా వచ్చినా సేద తీరడానికి ఎక్కువగా ఆసక్తి చూపడం లేదు. ఈ నేపథ్యంలోనే పూండిలోని పార్క్‌లను ప్రత్యేకంగా అభివృద్ధి చేసి పర్యాటకులకు అందుబాటులోకి తేవాలని నిర్ణయించారు. ఇందులో భాగంగానే ప్రభుత్వం రూ.80 లక్షలు కేటాయించింది. ఈ నిధులతో విజ్ఞానపార్క్ మర్మమతు పనులను చేపట్టారు. పార్క్‌కు అన్ని వైపులా ప్రహరీగోడలు, బొమ్మలను ఏర్పాటు చేశారు. పాత బొమ్మలకు రంగులు అద్ది ప్రత్యేక ఆకర్షణగా తీర్చిదిద్దారు. దీంతో పార్క్ కళకళలాడుతోంది. త్వరలోనే పార్క్‌లను ప్రారంభించి పర్యాటకులకు అందుబాటులోకి తేనున్నట్టు అధికారులు వెల్లడించారు.

సంక్షేమ పథకాలకు తొలగిన అడ్డు



తిరుత్తణి యూనియన్ సమితి సమావేశం

- ఆరు నెలల తరువాత సమావేశానికి హాజరైన సభ్యులు
- రూ.1.84 కోట్లతో అభివృద్ధి పనులకు ఆమోదముద్ర

తిరుత్తణి: తిరుత్తణి యూనియన్ సమితిలో చైర్‌పర్సన్, సభ్యుల మధ్య తలెత్తిన విభేదాలతో ఆరు మాసాలుగా సంక్షేమ పథకాలకు ఏర్పడ్డ అడ్డు తొలగడంతో అధికారులతో పాటు గ్రామీణులు హర్షం వ్యక్తం చేశారు. తిరుత్తణి యూనియన్ సమితి చైర్‌పర్సన్ తంగధనంకు వ్యతిరేకంగా వైస్ చైర్మన్ ఈఎన్.కండ్రిగ రవి సహా పది మంది సభ్యులు ఆమె పదవీ నుంచి తొలగించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో పాటు ఆరు మాసాలుగా సమావేశాలకు సభ్యులు హాజరు కాకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో కనీస సదుపాయాలు కల్పించేందుకు సైతం నిధులు కేటాయింపునకు వీలులేక అధికారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ క్రమంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ సహా పది మంది యూనియన్ కౌన్సిలర్లు పాల్గొన్నారు. బీడీఓ రాజేంద్రబాబు ఆధ్వర్యంలో సమావేశం సజావుగా సాగింది. అభివృద్ధి పనులు, ఖర్చులకు సంబంధించి సభ్యులు చర్చల్లో పాల్గొన్నారు. చర్చల్లో రూ.1.84 కోట్లతో తాగునీరు, రోడ్లు, పాఠశాల,అంగన్‌వాడీ, పంచాయతీ భవనాల నిర్మాణానికి నిధుల కేటాయింపునకు అనుమతించి తీర్మానం ఆమోదించారు. దీంతో యూనియన్ సమితిలోనెలకొన్న సమస్య పరిష్కారం కావడంతో అభివృద్ధి పనులు ఊపందుకోనున్నాయి.

డీఎంకే కొత్త సభ్యత్వానికి ఆదరణ



తిరుత్తణిలో సభ్యత్వ నమోదు చేస్తున్న నేతలు

తిరుత్తణి: డీఎంకే నూతన సభ్యత్వానికి యువతీ, యువకుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. దీంతో ఆ పార్టీ శ్రేణులు రెట్టింపు ఉత్సాహంతో ఇంటింటికి వెళ్లి నూతన సభ్యత్వానికి కృషిచేస్తున్నారు. డీఎంకే సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని ఆ పార్టీ అధ్యక్షుడు, సీఎం స్టాలిన్ పార్టీ క్యాడర్‌కు పిలుపునిచ్చారు. తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి పట్టణ కార్యదర్శి వినోదోకుమార్ ఆధ్వర్యంలో పట్టణ వ్యాప్తంగా పార్టీ శ్రేణులు సభ్యత్వ నమోదు శిబిరాలు నిర్వహిస్తున్నారు. శిబిరాలకు యువతీ, యువకుల నుంచి స్పందన రావడంతో ఇంటింటికి వెళ్లి పార్టీ సభ్యత్వం స్వీకరించేందుకు అవగాహన కల్పిస్తున్నారు. మురుగప్పనగర్‌లో శుక్రవారం నిర్వహించిన సభ్యత్వ శిబిరంలో ఆపార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు తిరుత్తణి భూపతి, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ సామిరాజ్, గణేశన్, కుమరేశన్ పాల్గొన్నారు.

కోలీవుడ్ టాక్స్



మహారాజా చిత్ర వర్కింగ్ స్టిల్

విజయ్‌సేతుపతి @50

తమిళసినిమా: బహుముఖ నటుడు, బహుబాషా నటుడు విజయ్‌సేతుపతి. తమిళంలో చిన్న చిన్న పాత్రలతో నటుడిగా కెరీర్ ప్రారంభించిన ఆ తరువాత కథానాయకుడు స్థాయికి ఎదిగి ఆ మూసలోనే ఇరుక్కోకుండా పాత్ర నచ్చితే హీరోగా అయినా, విలన్‌గా అయినా నటించడానికి సిద్ధమవుతూ విలక్షణ నటుడిగా పేరు తెచ్చుకున్నారు. అలా ఎప్పుడూ తమిళం, తెలుగు బాషా చిత్రాలను దాటి బాలీవుడ్‌లోనూ నటిస్తున్నారు. అలా విజయ్‌సేతుపతి 50 చిత్రాల మైలురాయిని టచ్ చేశారు. నటిస్తున్న 50వ చిత్రాన్ని కురంగు బొమ్మై చిత్రం ఫేమ్ నిథిలన్ తెరకెక్కిస్తున్నారు. దీనికి మహారాజా అనే టైటిల్ నిర్ణయించినట్లు ప్రచారం జరుగుతుంది. ఫ్యాషన్ స్టూడియోస్ పతాకంపై సుదన్ నిర్మిస్తున్న ఇందులో నట్టి, మునీష్కాంత్, అరుల్‌దాస్, బాయ్స్ మణికంఠన్ ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. చిత్ర వివరాలను నిర్మాత తెలుపుతూ ఇది నటుడు విజయ్‌సేతుపతి 50వ చిత్రం అనే విషయం తమకే ఆశ్చర్యాన్ని కలిగిస్తోందన్నారు. యాక్షన్ డ్రామాతో రూపొందుతున్న ఈ చిత్ర షూటింగ్‌ను 85 రోజుల్లో పూర్తిచేయడానికి ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. గత ఫిబ్రవరిలో షూటింగ్ ప్రారంభించినట్లు, ఇప్పటికే 50 శాతం షూటింగ్ పూర్తి అయినట్లు తెలిపారు. మరో పదిరోజుల్లో విజయ్‌సేతుపతికి సంబంధించిన షూటింగ్ పూర్తి అవుతుందని చెప్పారు. ఇందులో విజయ్‌సేతుపతి రెండు గెటప్పులలో కనిపిస్తారని తెలిపారు. ప్రస్తుతం హిందీ చిత్రం జవాన్‌తో పాటు మెర్రి క్రిస్మస్ చిత్రం మణికంఠన్ దర్శకత్వంలో రూపొందుతున్న వెబ్‌సిరీస్‌లో నటిస్తూ బిజీగా ఉన్నారు.

సందేశాత్మకంగా విళంబరం



విళంబరం లఘు చిత్ర యూనిట్

తమిళసినిమా: గత 35 ఏళ్లుగా తన హాస్యభరిత నటనతోను, ఇతరులకు సాయం చేసే గుణంతోనూ ప్రత్యేక గుర్తింపు పొందిన నటుడు మయిల్‌సామి. ఈయన గత నెలలో గుండెపోటు కారణంగా కన్నుమూసిన విషయం తెలిసిందే. కాగా మయిల్‌సామి చివరిసారిగా నటించిన లఘుచిత్రం విళంబరం. నటి రేఖ ముఖ్యపాత్రను పోషించారు. అశోక్‌కుమార్ నిర్మించిన ఈ లఘు చిత్రానికి ఆయన కొడుకు ఎ.రాహుల్ దర్శకత్వం వహించారు. సెలబ్రిటీలు వాణిజ్య ప్రకటనల్లో నటించడం వలన ప్రజలకు జరిగే బాధింపునకు ఆవిష్కరించే చక్కని సందేశంతో కూడిన లఘు చిత్రం ఇది. కాగా ఈ లఘు చిత్ర యూనిట్ గురువారం సాయంత్రం చెన్నైలోని ప్రసాద్‌ల్యాబ్‌లో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో దర్శకుడు ఆర్వీ.ఉదయకుమార్, పేరరసు, చిత్రా లక్ష్మణన్, మయిల్‌సామి కొడుకు అన్బు పాల్గొన్నారు. చిత్ర నిర్మాత అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఇది తన కొడుకు తొలి ప్రయత్నం అని పేర్కొన్నారు. ఈ లఘు చిత్రాన్ని చూస్తున్నప్పుడు తన కొడుకు తన లాగే ఉన్నాడన్న సంతృప్తి కలిగిందన్నారు. ఈ లఘు చిత్రం ద్వారా తనకు లాభం రాకపోయినా పర్వాలేదని, ప్రజల్లోకి వెళితే చాలని అన్నారు. అందుకే దీనిని ఉచితంగానే ప్రేక్షకుల్లోకి తీసుకెళ్లమని చెప్పానన్నారు. దర్శకుడు పేరరసు మాట్లాడుతూ జీవితంలో మంచి మనుషులను సంపాదించుకుంటే అదే పెద్ద ఆస్తి అని పేర్కొన్నారు. అలా మంచి మనుషులను సంపాదించుకున్న నటుడు మయిల్‌సామి అని అన్నారు. ఆయన శివ భక్తుడే కాకుండా ఎంజీఆర్ వీర భక్తుడని పేర్కొన్నారు. రాజకీయాల్లో ఎంజీఆర్ పేరు చెప్పుకుని ముఖ్యమంత్రులు, మంత్రులు అయిన తరువాత ఆయన పేరు చెప్పడం మరచిపోయారని, అయితే మయిల్‌సామి మాత్రం బతికి ఉన్నంతకాలం ఎంజీఆర్ కార్యకర్తగానే ఉన్నారని గుర్తు చేశారు. అలాంటి వ్యక్తి నటించిన చివరి సందేశాత్మక లఘు చిత్రం విళంబరం అని అన్నారు. ప్రముఖ తారలు వాణిజ్య ప్రకటనలలో నటించే ముందు వారి బాధ్యతను గుర్తించాలని అన్నారు.

విష్ణువిశాల్‌తో ఆదితిశంకర్ రొమాన్స్

తమిళసినిమా: ప్రముఖ సినీ దర్శకుడు శంకర్ కూతురు ఆదితిశంకర్. ఆయన వారసురాలిగా సినీ రంగప్రవేశం చేసిన విషయం తెలిసిందే. ఎంబీబీఎస్ చదివి హీరోయిన్‌గా నటించడానికి సిద్ధమైంది. తొలిసారిగా కార్తీకి జంటగా ముత్తయ్య దర్శకత్వంలో విరుమాన్ చిత్రంలో నాయకిగా నటించి ప్రశంసలు అందుకుంది. చెన్నైలో పుట్టి పెరిగిన ఆదితి శంకర్ ఆ చిత్రంలో పక్కా గ్రామీణ యువతిగా మారిపోయింది. మొదటి చిత్రంలోనే విజయాన్ని సొంతం చేసుకున్న ఈ బ్యూటీ రెండవ చిత్రంలో శివకార్తికేయన్ సరసన మావీరన్ చిత్రంలో నటిస్తోంది. మడోనా అశ్విన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం షూటింగ్‌ను పూర్తిచేసుకుని ప్రస్తుతం నిర్మాతానంతర కార్యక్రమాలు జరుపుకుంటోంది. తదుపరి నటుడు అధర్వ తమ్ముడు ఆకాష్ మురళి కథానాయకుడిగా పరిచయం అవుతున్న చిత్రంలో ఆయనతో జతకట్టనున్నారు. కాగా నటుడు విష్ణువిశాల్‌తో రొమాన్స్ చేసే అవకాశం ఆదితిశంకర్‌ను వరించిందన్నది తాజా సమాచారం. విష్ణువిశాల్ దర్శకుడు రామ్‌కుమార్‌ల హిట్ కాంబినేషన్‌లో ఒక చిత్రం తెరకెక్కనుంది. ఈ కాంబినేషన్‌లో ఇంతకుముందు మీండాసుపట్టి, రాత్ససన్ వంటి విజయవంతమైన చిత్రాలు వచ్చాయి. తాజాగా ఈ కాంబినేషన్ హ్యాట్రిక్ కొట్టడానికి సిద్ధమవుతోంది. ఇది ముండాసుపట్టి చిత్రానికి సీక్వెల్ అనే ప్రచారం జరుగుతోంది. ఇందులో నటి ఆదితిశంకర్ కథానాయకిగా నటించనున్నట్లు సమాచారం. ఒక్క చిత్రం సక్సెస్‌తో వరుసగా అవకాశాలను దక్కించుకుంటున్న ఈ అమ్మడి అదృష్టం గురించే ఇప్పుడు కోలీవుడ్‌లో చర్చ. ఈ చిత్ర షూటింగ్ మే నెలలో ప్రారంభం కానున్నట్లు తెలిసింది.



అదితిశంకర్



విష్ణువిశాల్

డ్రీమ్ ప్రాజెక్టులు చాలా ఉన్నాయి!

తమిళసినిమా: నటి పూజాహెగ్డే గురించి ఇప్పుడు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం ఉండదు. బాలీవుడ్‌లో నటిగా ప్రారంభించి ఆ తరువాత తెలుగు, తమిళ భాషల్లో నటించి పేరు తెచ్చుకుంది. ముఖ్యంగా తెలుగులో అత్యధిక పారితోషికం డిమాండ్ చేస్తున్న క్రేజీ హీరోయిన్‌గా రాణిస్తోంది. అయితే హిందీ, తమిళ భాషల్లో ఇప్పటి వరకు సరైన హిట్ పడలేదు. తమిళంలో 10 ఏళ్ల క్రితం నటించిన ముఖముడి, ఇటీవల విజయ్ సరసన నటించిన చిత్రం బీస్ట్ పూజాహెగ్డేకు పూర్తిగా నిరాశపరిచిందనే చెప్పాలి. ఆ విధంగా ఇక్కడ ఆమెకు కలిసి రాలేదు. ఇక తెలుగులో ఆ మధ్య వరుసగా రెండు చిత్రాలు ఫ్లాప్ అయినా అవకాశాలు మాత్రం వస్తూనే ఉన్నాయి. ప్రస్తుతం మహేష్‌బాబు సరసన భారీ చిత్రంలో నటిస్తోంది. అదే విధంగా హిందీలో సల్మాన్‌ఖాన్‌తో జతకట్టిన కిసికి భాయ్ కిసీకి జాన్ చిత్రం త్వరలో తెరపైకి రానుంది. ఇది తమిళంలో అజిత్ కథానాయకుడుగా నటించిన వీరం చిత్రానికి రీమేక్ అన్నది గమనార్హం. కాగా పూజాహెగ్డే ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పేర్కొంటూ తనకు సక్సెస్ ఒక రాత్రిలో వచ్చింది కాదని పేర్కొంది. తెలుగు తమిళ భాషల్లో నటిస్తున్న తొలి రోజుల్లో భాష రాకపోవడంతో చాలా కష్టపడ్డానని చెప్పింది. అప్పుడు సంభాషణలను సహాయదర్శకులను ముందుగా చెప్పమని ఆ తరువాత తాను మాట్లాడే ప్రయత్నం చేసినట్లు తెలిపింది. ఇటీవల తాను నటించిన చిత్రాలు సరిగా ఆడకపోవడంతో ఒక ఏడాది పాటు అవకాశాలు రాకపోవడంతో ఇంట్లోనే కూర్చొన్నానని చెప్పింది. అలాంటిది మళ్లీ అనూహ్యంగా కొత్త చిత్రాలు అవకాశాలు వస్తుండడంతో బిజీగా ఉన్నానని పేర్కొంది. ప్రస్తుతం నటిగా మంచి స్థాయిలో ఉన్న ఆరంభ కాలంలో పడ్డ కష్టాలను మరచిపోలేదని చెప్పింది. తనకు డ్రీమ్ ప్రాజెక్టులు చాలా ఉన్నాయని ముఖ్యంగా మహిళల్లోని ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే కథా పాత్రల్లో నటించాలని ఆశిస్తున్నట్లు పూజాహెగ్డే పేర్కొంది.



పూజాహెగ్డే

ఆ చిత్రాన్ని మహిళలు చూడాలి



మీడియాతో మాట్లాడుతున్న రాజా

తమిళసినిమా: కేఎస్ఆర్ మూవీస్ పతాకంపై కేఎస్ఆర్ రాజా స్వీయ దర్శకత్వంలో నిర్మించి కథానాయకుడిగా నటించిన చిత్రం మావీరన్ పిళ్లై. ఈ చిత్రం ద్వారా వీరప్పన్ కూతురు విజయలక్ష్మి కథానాయకిగా వెండితెరకు పరిచయమవుతున్నారు. ఇందులో నటుడు రాధారవి ముఖ్యపాత్రలో నటించిన ఈ చిత్రం శుక్రవారం తెరపైకి వచ్చింది. ఇది మద్యం కారణంగా బాధింపునకు గురవుతున్న ప్రజలకు అవగాహన కలిగించే కథా చిత్రం. కాగా ఈ చిత్రాన్ని ఇటీవల సినీ రాజకీయ ప్రముఖుల కోసం ప్రత్యేకంగా చెన్నైలోని ఒక ప్రివ్యూ థియేటర్లో ప్రదర్శించారు. నటుడు రాధారవి బీజేపీ నాయకుడు హెచ్ రాజా ఈ చిత్రాన్ని తిలకించారు. అనంతరం హెచ్ రాజా మీడియాతో మాట్లాడుతూ కలైంజ్ఞర్ పాలనలో తమిళనాడు మద్యం ఏరులై పారే రాష్ట్రంగా మారిందని ఆరోపించారు. ప్రస్తుతం మద్యాన్ని టార్గెట్ విధించి విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. ఆదాయం తక్కువగా వచ్చిందంటూ 40 మంది అధికారులను సస్పెండ్ చేశారని ఇంతకంటే హీన సంఘటన మరోటి లేదని అన్నారు. ఇలాంటి అరాచకాలకు వ్యతిరేకంగా మహిళలు పోరాటం చేస్తేనే తమిళనాడు బాగుపడుతుందన్నారు. మద్యానికి వ్యతిరేకంగా రూపొందించిన మావీరన్ పిళ్లై చిత్రాన్ని మగవాళ్లు అడ్డగించినా మహిళలు చూడాలని బీజేపీ నేత రాజా పేర్కొన్నారు.

క్లుప్తంగా

హత్య కేసులో ఇద్దరికి యావజ్జీవం

అన్నానగర్: తిరువెంకటంలో వాచ్‌మన్ హత్య కేసులో ఇద్దరికి యాజవజ్జీవం శిక్ష విధిస్తూ నెల్లై కోర్టు తీర్పు వెలువరించింది. తెన్‌కాశి జిల్లా తిరువెంకటం సమీపంలో మదుపట్టి లోష కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఉంది. ఆ ప్రాంతానికి చెందిన రామరాజు (47) అక్కడ వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. 2011 అక్టోబర్ 25న రాత్రి సహకార సంఘంలో సెక్యూరిటీ పనిలో నిమగ్నమై ఉన్నాడు. ఆ తరువాత ఆలంగుళం కరిసల్‌పట్టికు చెందిన శివ (48), సురంద అల్లాడిపట్టికి చెందిన రాజేష్ (37), ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సోను అక్కడ చోరీకి వచ్చారు. ఇది చూసిన రామరాజు అప్రత్తమై దోపిడీని అడ్డుకునే ప్రయత్నం చేశాడు. దీంతో ఆగ్రహించిన ముఠా రామరాజును కాల్చి చంపింది. అనంతరం అక్కడి నుంచి పారిపోయారు. తిరువెంకటం పోలీసులు కేసు నమోదు చేసి ముగ్గురిని అరెస్టు చేశారు. నెల్లై 3వ అదనపు జిల్లా కోర్టులో కేసు పెండింగ్‌లో ఉంది. ఈ కేసును శుక్రవారం విచారించిన జస్టిస్ పన్నీర్‌సెల్వం నిందితులు నరేంద్ర సింగ్, సోనూశలకు జీవత ఖైదు విధిస్తూ తీర్పు చెప్పారు. ఇందులో మిగతా నిందితులకు నరేంద్రసింగ్‌కు రూ.6వేలు, సోనూకు రూ.1000 జరిమానా విధించారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి


ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న సంస్థ ప్రతినిధి

వేలూరు: నిరుద్యోగులు వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి పరమేశ్వరి అన్నారు. జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ప్రైవేటు కంపెనీలో ఉద్యోగాల కోసం శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. వేలూరు జిల్లాతో పాటు ఇతర జిల్లాలకు చెందిన ప్రైవేటు కంపెనీ ప్రతినిధులు హాజరై అభ్యర్థులను ఇంటర్వ్యూ చేశారు. నిరుద్యోగ యువతీ యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. టెక్నాలజీ పెరిగిన ఈ రోజుల్లో చదివిన ప్రతి ఒక్కరికీ ఉద్యోగాలు రావాలంటే కష్టమని.. ప్రైవేటు కంపెనీలు నిర్వహించే ఉద్యోగ మేళాలో పాల్గొని అవకాశాలను అందిపుచ్చుకోవాలని కోరారు.

ప్రజాసేవలో ఉపాధ్యాయుల సంఘం


పాదటూరుపేటలో ఏర్పాటు చేసిన చలివేంద్రం

పళ్లిపట్టు: ప్రజా సేవలో మేము సైతం అని నిరూపించే విధంగా ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం చలివేంద్రం ప్రారంభించారు. తమిళనాడు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో పళ్లిపట్టు మండలం పాదటూరుపేట బస్టాండులో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఆ సంఘం మండల అధ్యక్షుడు కృష్ణన్, తిరువళ్లూరు జిల్లా విద్యాశాఖ అధికారి మేగన ప్రయాణికులు, పట్టణ ప్రజలకు పండ్లు, మజ్జిగ పంపిణీ చేశారు. సంఘం మండల కార్యదర్శి శివ, హంస, మాదవన్, శరవనన్, ఈశ్వరన్ పాల్గొన్నారు.

చెరువులో చేపలు మృతి


మృతి చెందిన చేపలు

అన్నానగర్: సమయపురంలోని చెరువులో శుక్రవారం చేపలు మృతిచెందాయి. తిరుచ్చి జిల్లా సమయపురంలో ఎస్.కన్ననూర్ మున్సిపల్ కార్యాలయం వెనుక పెరువెల చెరువు ఉంది. ఈ చెరువు ద్వారా వచ్చే నీటిని సమయపురం, మరుదూరు, మాగలిగుడి, వి.సత్యయూర్‌లోని ప్రజలు, అలాగే సమయపురం మారియమ్మన్ దర్శనం కోసం ఇతర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు స్నానానికి ఉపయోగిస్తారు. ఈ స్థితిలో శుక్రవారం కాలువలో అనేక చేపలు చనిపోయి తేలియాడాయి. దుర్వాసన సైతం వ్యాపించింది. దీంతో స్థానికులు ఎస్.కన్ననూర్ మున్సిపల్ కార్యనిర్వాహణాధికారికి తెలియజేసినా చర్యలు తీసుకోలేదని చెబుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మెరీనాలో యువకుడు హత్య

తిరువొత్తియూరు: చెన్నై మెరినా తీరంలో ఓ యువకుడు హత్యకు గురయ్యాడు. చెన్నై మెరీనా తీరంలో గురువారం రాత్రి కొంతమంది యువకులు పుట్టినరోజు వేడుక జరుపుకుంటున్నారు. ఆ సమయంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ ఏర్పడింది. దీంతో రెండు వర్గాల యువకులు ఒకరిపై ఒకరికొకరు దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో తిరువళ్లూరు జిల్లా ఆరంభాక్కంకు చెందిన విఘ్నేష్ కత్తిపోటుకు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. దాడిలో గాయపడిన యువకులను ఒమందూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని శవపరీక్ష కోసం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంగం కాలంనాటి బావి గుర్తింపు


లభించిన ఆధారాలను శుభ్రపరుస్తున్న మహిళలు


పట్రపెరంబదూరు వద్ద జరుగుతున్న మూడో దఫా తవ్వకాలు

తిరువళ్లూరు: పురావస్తుశాఖ ఆధ్వర్యంలో ప్రారంభించిన మూడోదఫా తవ్వకాల్లో 2 వేల ఏళ్ల నాటి ఇటుకతో నిర్మించిన బావిని గుర్తించారు. తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు జిల్లాలో గతంలో జరిగిన తవ్వకాల్లో రాతి యుగం నాటి ఆనవాళ్లు ఎక్కువగా ఉన్నట్లు తెలిసింది. జిల్లాలోని ఆత్రంబాక్కం, గూడియం, వడమదురై, నైవేలి, పారికుళం సహా సుమారు 50 పైగా ప్రాంతాల్లో రాతియుగం కాలంలో మానవులు జీవించినట్లు గతంలో పురావస్తుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన తవ్వకాల్లో ఆధారాలు లభించాయి. ఈ నేపథ్యంలోనే చరిత్రకు సంబంధించిన మరిన్ని ఆధారాల అన్వేషణ కోసం తిరువళ్లూరు జిల్లా పూండి యూనియన్ పట్టరై పెరంబదూరు, నత్తంబేడు, ఇరుళంతోపు, అనైమేడు తదితర గ్రామాల్లో పురవాస్తుశాఖ ఆధ్వర్యంలో 2015-16వ సంవత్సరం 300 చదరపు మీటర్లు విస్తీర్ణంలో 12 గుంతలను తవ్వి ఆధారాలను సేకరించారు. ఈ తవ్వకాల్లో సుమారు 208 రకాల పురాతన వస్తువులు లభించాయి. పట్టరై పెరుంబదూరులో ఎక్కువగా లభించడంతో అక్కడ మరిన్ని తవ్వకాలను చేపట్టాలని నిర్ణయించారు.

1,201 వస్తువులు లభ్యం:
పురావస్తు శాఖ చేపట్టిన తవ్వకాల్లో లభించిన ఆధారాలతో మరిన్ని తవ్వకాలకు అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగానే 2017-18వ సంవత్సరంలో 525 చదరపు మీటర్లు విస్తీర్ణంలో 21 గుంతలతో రెండోదఫా తవ్వకాలను చేపట్టారు. ఈ తవ్వకాల్లో 1201 రకాల కళాఖండాలు, ఆధారాలు లభించాయి. పురాతన శిలాయుగం, మధ్య శిలాయుగం, రాతియుగం కాలంలో ఉపయోగించిన రాతి పనిముట్లు, ఇనుము, ఎముకలు, గాజులు, నల్లపూసలు, పగడపు పాలరాయి, అమెథిస్ట్, చెకుముకిబొమ్మలు, చెవిపోగులు, ఏనుగు దంతాలు, అమ్మికలు, రుబ్బురాయితో పాటు రాజరాజచోళుడు కాలం నాటి రాగినాణేలు, మట్టికుండలు లభించాయి. వీటిని మ్యూజియంలో ఉంచారు.

మూడోదఫా తవ్వకాలు
పట్టపెరంబదూరు గ్రామంలో తవ్వకాలు చేపట్టి మరిన్ని అధారాలను సేకరించాలని అధికారులు నిర్ణయించారు. ఇందు కోసం ప్రభుత్వం రూ. 30 లక్షల నిధులను కేటాయించింది. ఈ నిధులతో రెండు వారాల క్రితం తవ్వకాలు ప్రారంభించారు.


తవ్వకాల్లో బయటపడిన పురాతన బావి

తవ్వకాల్లో 2 వేల సంవత్సరం క్రితం సంగం కాలంలో ఉపయోగించిన బావి బయల్పడింది. 2.85 మీటర్ల లోతులో కనిపించిన బావి 3.91 మీటర్లు లోతు ఉంది. ఇటుకతో నిర్మించిన బావి వృత్తాకారంలో 2.60 మీటర్లతో ఉన్నట్టు నిర్ధారించారు. రాష్ట్రంలో మరెక్కడా లేని విధంగా పట్టపెరంబదూరులో కనిపించిన బావిని చూడడానికి సమీప ప్రాంతాల నుంచి ప్రజలు, విద్యార్థులు నిత్యం తరలివస్తున్నారు. దీంతో పాటు మరిన్ని ఆధారాల కోసం తవ్వకాలను మరింత ముమ్మరం చేశారు.

విద్యార్థులను కొట్టిన టీచర్‌పై చర్యలు తీసుకోండి


విచారణ చేస్తున్న పోలీసులు

వేలూరు: తిరుపత్తూరు జిల్లా జోలార్‌పేట సమీపంలోని అత్తనవూరు గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి 5వ తరగతి వరకు సుమారు 135 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఇక్కడ ముగ్గురు టీచర్‌లు మాత్రమే ఉన్నారు. రెండు రోజుల క్రితం ఒక టీచర్ మూడో తరగతి విద్యార్థులకు ఆంగ్ల పరీక్ష పెట్టినట్లు.. అందులో విద్యార్థులు సక్రమంగా పరీక్ష రాయలేదని తెలుస్తోంది. దీంతో ఆగ్రహించిన టీచర్ విద్యార్థుల తల, కాలుపై కర్రతో కొట్టినట్లు సమాచారం. సాయంత్రం పాఠశాల ముగించుకుని ఇంటికి వెళ్లిన విద్యార్థులు జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు తెలిపారు. తల, కాలుపై గాయాలు గమనించిన తల్లిదండ్రులు వెంటనే చికిత్స నిమిత్తం ఏలగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. సుమారు పది మందికి పైగా విద్యార్థులకు గాయాలు కావడంతో తల్లిదండ్రులు ఏలగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న టీచర్ సెలవు పెట్టి రెండు రోజులుగా పాఠశాలకు రావడంలేదు. వీటిపై పోలీసులు కేసు నమోదు చేసి విద్యార్థులతో పాటు పాఠశాల టీచర్ వద్ద విచారణ చేస్తున్నారు. ఇదిలా ఉండగా చిన్నారులను కొట్టి గాయపరిచిన టీచర్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని, టీచర్ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

మూలిక నీరు పంపిణీ



నీటిని అందజేస్తున్న సిద్ధ వైద్యులు

వేలూరు: వేలూరు సత్‌వచ్చారిలోని పుర్టు మహర్షి సేవా కేంద్రం ఆధ్వర్యంలో వేసవి వేడిమితో పాటు కరోనా నుంచి ప్రజలను కాపాడేందుకు వన మూలికలతో కూడిన నీటిని ప్రజలకు అందజేశారు. ఈ చలివేంద్రాన్ని చెన్నై ఇన్‌ఫోకాప్స్ డైరెక్టర్ డాక్టర్ భాస్కరన్, జిల్లా సిద్ధ వైద్యాధికారి వెంకట్ ప్రకాశం ముఖ్య అతిథులుగా ప్రారంభించారు. జిల్లా సిద్ధ వైద్యాధికారి మాట్లాడుతూ.. కరోనా కాలంలోనే సిద్ధ వైద్యం కేంద్రం ఆధ్వర్యంలో ప్రజలకు అవసరమైన వన మూలికలతో కూడిన మాస్కులు, కషాయం వంటి వాటిని వేలూరు, తిరుపత్తూరు, రాణిపేట జిల్లాలోని అన్ని ఆసుపత్రిలకు సరఫరా చేసినట్లు గుర్తు చేశారు. ప్రస్తుతం కరోనా నుంచి ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ మాస్కులు ధరించడం వల్ల కొంత వరకు నివారించవచ్చన్నారు. ప్రస్తుతం వనమూలిక నీటితో పాటు మజ్జిగ, కలబంద రసం, జీలకర్ర నీరు తదితర వాటిని అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సిద్ధ వైద్య డిప్యూటీ డైరెక్టర్ శివకుమార్, సిద్ధ వైద్యులు సెల్వం, తంబాచ్చారి, కార్పొరేటర్ గణేష్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

లైంగికదాడి కేసులో కూలీకి యావజ్జీవ శిక్ష

అన్నానగర్: స్నేహితుడి ఆరేళ్ల కుమార్తెపై లైంగికదాడికి పాల్పడిన కూలీకి తంజావూరు పోక్సో ప్రత్యేక కోర్టు శుక్రవారం యావజ్జీవ శిక్ష విధించింది. తిరువారూరు జిల్లా ముత్తుప్పేటకు చెందిన వేలుస్వామి (49) కూలీ. ఇతను తంజావూరు జిల్లాలో మార్చి 5, 2016న పట్టుకోట్టై సమీపంలోని ఓ గ్రామంలో స్నేహితుడి ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో స్నేహితుడి ఆరేళ్ల కుమార్తె ఒంటరిగా ఉంది. దీంతో వేలుస్వామి లైంగికదాడికి పాల్పడ్డాడు. విషయం తెలిసి తల్లిదండ్రి పట్టుకోట్టై తాలూకా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు వేలుస్వామిని అరెస్టు చేశారు.
గురువారం కేసు విచారించిన న్యాయమూర్తి సుందరరాజన్ వేలుస్వామికి యావజ్జీవ శిక్ష, రూ.2 లక్షల జరిమానా, చెల్లించని పక్షంలో ఏడాది జైలు శిక్ష విధిస్తూ తీర్పు నిచ్చారు. బాధిత బాలికకు రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని ప్రభుత్వానికి సిఫారసు చేశారు.

దేవునితో సహవాసం శ్రేయస్కరం


పాల్ దినకరన్‌తో రెవరెండ్ ఎస్ ప్రకాష్‌రాజ్

కొరుక్కుపేట: పరిశుద్ధాత్మ దేవునితో సహవాసం కలిగి ఉండడం శ్రేయస్సుకరమని జీసస్ కాల్ అంతర్జాతీయ సువార్తకులు డాక్టర్ పాల్ దినకరన్ ఉపదేశించారు. చెన్నై సమీపంలోని అత్తిపుట్టు పుదునగర్‌లో నూతనంగా నిర్మించిన కల్వరి బాప్టిస్టు ప్రార్థన తోట సంఘ ప్రతిష్ట ఆరాధన కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. క్రైస్ట్ ఫర్ ఆల్ మిషన్స్ వ్యవస్థాపకులు, కల్వరి బాప్టిస్టు ప్రార్థనా తోట సంఘం నిర్వాహకులు బిషప్ రెవరెండ్ డాక్టర్ ఎస్ ప్రకాష్ రాజ్, దయానా రోజ్ అధ్యక్షతన ఏర్పాటైన ఈ కార్యక్రమంలో పాల్గొన్న జీసస్ కాల్స్ అంతర్జాతీయ సువార్తకులు డాక్టర్ పాల్ దినకరన్ చేతులమీదుగా రిబ్బన్ కట్ చేసి సంఘప్రతిష్టను గావించారు. అనంతరం ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇందులో రెవరెండ్ కల్లై అబ్రహం, రెవరెండ్ జే ఇశ్రాయేల్, సోషల్ వర్కర్ రెవరెండ్ జీవరత్నం, పాస్టర్ పాల్ రావు, బిషప్ బి మోహనదాస్, రెవరెండ్ టి .యేసు దాసు , రెవరెండ్ ఆర్ జాన్సన్ పాల్గొన్నారు .

పాఠ్యపుస్తకాల విక్రయాలు ప్రారంభం

తిరువొత్తియూరు: రాష్ట్రంలో 2023-2024 విద్యా సంవత్సరానికి చెందిన పాఠ్యాంశాలకు పాఠ్యపుస్తకాలు విక్రయం ప్రారంభమైంది. తమిళనాడు పాఠ్యాంశం విద్యా పనుల విభాగం 2023-24 విద్యా సంవత్సరం కోసం 9 నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు 2 కోట్లకుపైగా పుస్తకాలు సిద్ధం చేశారు. ఈ పుస్తకాలు చెన్నైలో ఉన్న డీపీఐ ప్రాంగణంలోను, అడయారు అన్నా శతోధక గ్రంథాలయంలోనూ పుస్తకాలు విక్రయానికి ఉంచారు. ఈ పుస్తకాలు పొందడానికి ప్రైవేటు పాఠశాలలు ఆన్‌లైన్‌లో నగదు చెల్లించి పుస్తకాలను పొందవచ్చు. డీపీఐ ప్రాంగణంలో కౌంటర్లను ప్రారంభించారు. ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలకు అందజేసే ఉచిత పుస్తకాలు ఆయా జిల్లాలకు విద్యాశాఖ కార్యాలయాలకు పంపిణీ చేస్తారని పాఠశాల విద్యాశాఖ అధికారులు తెలిపారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

తిరువొత్తియూరు: చెన్నై వ్యాసార్పాడిలో భార్య గర్భంలో ఉన్న ఆరు నెలల బిడ్డ మృతి చెందడంతో భర్త ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వ్యాసార్పాడి ముల్‌లైనగర్ 82వ బ్లాక్ ప్రాంతానికి చెందిన వెల్‌లై ప్రకాష్ (27)కు నాలుగేళ్ల క్రితం పవిత్రతో వివాహమైంది. వీరికి రెండేళ్ల కుమారుడు ఉన్నారు. ఈ క్రమంలో పవిత్ర మళ్లీ గర్భం దాల్చింది. కొద్ది రోజుల క్రితం పవిత్రకు అనారోగ్యం ఏర్పడింది. దీంతో ఆమెను పరీక్ష కోసం చెన్నై ఎగ్మోర్ ప్రసూతి ఆస్పత్రికి తీసుకెళ్లారు. డాక్టర్లు పరీక్ష చేయగా గర్భంలో ఉన్న ఆరు నెలల బిడ్డ మృతి చెందినట్లు తెలిపారు. కడుపులో ఉన్న బిడ్డను సిజేరిన్ ద్వారా బయటకు తీశారు. దీంతో ప్రకాష్ తీవ్ర ఆవేదన చెందాడు. ఈ క్రమంలో ఇంటికి వచ్చిన వెల్‌లై ప్రకాష్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై సమాచారం అందుకున్న ఎంకేబీ నగర్ పోలీసులు విచారణ చేస్తున్నారు.

85 కిలోల జలగలు స్వాధీనం

అన్నానగర్: మండపం నుంచి శ్రీలంకకు స్మగ్లింగ్ కోసం నిల్వ ఉంచిన 85 కిలోల జలగలను గురువారం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రామనాథపురం జిల్లా మండపంలోని ఇండియన్ కోస్ట్‌గార్డు ఉత్తర ఒడరేవు సముద్ర ప్రాంతంలో గురువారం ఉదయం సాధారణ పెట్రోలింగ్‌లో నిమగ్నమైంది. ఆ సమయంలో వల్యర్ వాడి సముద్ర ప్రాంతంలో ఐదు ప్లాస్టిక్ క్యాన్‌లలో నిల్వ ఉంచిన ప్రభుత్వం నిషేధించిన జలగలను ఇండియన్ కోస్టు గార్డ్ స్వాధీనం చేసుకుని విచారణ చేస్తున్నారు.

పిల్లలు వద్దు.. ప్రియుడే కావాలి!

సేలం: భర్త.. పిల్లలు వద్దని.. తనకు ప్రియుడే కావాలని అతనితో పెళ్లి చేయండి అంటూ ఓ మహిళ పట్టుబట్టిన సంఘటన సేలం పోలీస్ స్టేషన్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. సేలం అమ్మాపేట పోలీస్‌స్టేషన్‌కు గురువారం ఒక యువ జంట వచ్చింది. తమకు పెళ్లి చేయాలంటూ పోలీసులను కోరారు. దీంతో పోలీసులు మీ తల్లిదండ్రులు ఎవరు? మెడలో తాళిబొట్టు ఉందే? అంటూ ప్రశ్నించారు. అందుకు తామిద్దరం ప్రేమించుకుంటున్నామని, తమకు పెళ్లి చేయాలని కోరారు. విచారణలో అక్కడికి వచ్చిన మహిళ (24)కు వివాహమై భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారని, దుస్తుల దుకాణంలో పని చేస్తుండగా 21 ఏళ్ల యువకుడు పరిచయమై, వారి మధ్య సన్నిహితం ఏర్పడినట్లు తెలిసింది. విషయం తెలిసిన భర్త మందలించడంతో ఆమె ప్రియుడితో కలిసి పోలీసుస్టేషన్‌కు వచ్చినట్లు గుర్తించారు. భర్తతో కాపురం చేయడం ఇష్టం లేదని, అతనితో పుట్టిన పిల్లలు తనకు వద్దని, ప్రియుడితో పెళ్లి చేయించాలని ఆ మహిళ పట్టుబట్టింది. దీంతో పోలీసులు ఆమెకు సర్దిచెప్పి తల్లిదండ్రుల ఇంటికి పంపించారు. అందుకు ప్రియుడూ అంగీకరించాడు.

బంగ్లాదేశ్ యువకుడు అరెస్ట్

కొరుక్కుపేట: నకిలీ పాస్‌పోర్ట్‌తో చెన్నై నుంచి విమానంలో ప్రయాణించేందుకు ప్రయత్నించిన బంగ్లాదేశ్ యువకుడిని అధికారులు అరెస్ట్ చేసి చెన్నై సెంట్రల్ క్రిమినల్ పోలీసులకు అప్పగించారు. చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఢాకాకు బంగ్లా ఎయిర్‌లైన్స్ ప్రయాణికుల విమానం గురువారం రాత్రి బయలుదేరడానికి సిద్ధంగా ఉంది. చెన్నై విమానాశ్రయానికి చెందిన అధికారులు ప్రయాణికుల పాస్‌పోర్టు, పత్రాలను తనిఖీ చేసి విమానంలోకి పంపించారు. ఆ సమయంలో ఢాకాకు వచ్చిన హైవుల్ అలీ మహ్మద్ షేక్ (28) వద్ద భారత పాస్‌పోర్టు, పత్రాలు ఉన్నాయి. అధికారులకు అతనిపై అనుమానం రావడంతో పాస్‌పోర్టును కంప్యూటర్‌లో పరిశీలించగా అది నకిలీదని తేలింది. వెంటనే అధికారులు విచారణ చేపట్టగా అతను బంగ్లాదేశ్‌కు చెందినవాడని, కొన్ని నెలల క్రితం రోడ్డు మార్గంలో భారత్‌లోకి చొరబడ్డాడని తేలింది. ఇక్కడి ఏజెంట్లకు డబ్బులు చెల్లించి నకిలీ భారత పాస్‌పోర్టును కొనుగోలు చేసినట్లు తెలిసింది. ఆ తర్వాత హైవుల్ అలీ మహ్మద్ షేక్‌ను అరెస్టు చేసి శుక్రవారం ఉదయం చెన్నై సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ పోలీసులకు అప్పగించారు.

మహాకుంభాభిషేకానికి ఆలయం ముస్తాబు


ఆలయ కొలను మధ్యలో ఏర్పాటు చేసిన ధ్యానేశ్వరర్ విగ్రహం

తిరుత్తణి: తిరుత్తణిలో ఆదివారం సదాశివ లింగేశ్వరాలయం మహాకుంభాభిషేకానికి ముస్తాబైంది. తిరుత్తణి పాత ధర్మరాజుల ఆలయం పరిధిలోని సదాశివ లింగేశ్వరర్ ఆలయ ప్రాంగణంలో కొలనుకు మధ్యలో ధ్యానేశ్వరర్ విగ్రహాన్ని ప్రతిష్టించారు. దీంతో పాటు ఆలయ జీర్ణోద్ధరణ పనులు చేపట్టి సిద్ధం చేశారు. ఆదివారం మహాకుంభాభిషేకం సందర్భంగా ఆలయం పరిసర ప్రాంతాలను విద్యుద్దీపాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. కొలనుకు మధ్యలో 15 అడుగుల ఎత్తైన ధ్యానేశ్వరర్ విగ్రహాన్ని ప్రతిష్టించి మహాకుంభాభిషేకానికి ఏర్పాట్లు చేశారు. డీఎంకే రాష్ట్ర కమిటీ సభ్యుడు తిరుత్తణి భూపతి రూ. 16 లక్షల వ్యయంతో ధ్యానేశ్వరర్ విగ్రహాన్ని ప్రతిష్టించి కొలనుకు మధ్యలో వెళ్లి స్వామి దర్శనానికి వీలుగా కొలను నుంచి పిల్లర్లు ఏర్పాటు చేసి ఫుట్‌పాత్ సౌకర్యాలు కల్పించారు. మహాకుంభాభిషేకానికి ఆలయం ముస్తాబు కావడంతో సందడి నెలకొంది.

విద్యార్థులకు వర్క్‌షాప్


ఎస్‌సీఎల్‌ఏఎస్ నేతృత్వంలో రెజ్యూమ్ రైటింగ్ అండ్ పర్సనాలిటీ డెవలప్ మెంట్ అంశంపై శుక్రవారం వర్క్‌షాప్ జరిగింది. ఇందులో ప్రొఫెసర్ డాక్టర్ అరుల్ మేరీ రెక్సీ, డాక్టర్ విజయలక్ష్మీ, డాక్టర్ ఎల్ఎన్ జయంతి విద్యార్థులకు వ్యక్తిత్వ లక్షణాల గురించి సమగ్రంగా వివరించారు. అలాగే, ప్రత్యేక శిక్షణ, అవగాహన కార్యక్రమాలు జరిగాయి. 60 మంది విద్యార్థులు ఈ వర్క్‌షాప్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎస్‌సీఎల్‌ఏఎస్ ప్రిన్సిపల్ గుణిత అరుణ్‌చందోక్ విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. - సాక్షి, చెన్నై

బతికున్నోడికి డెత్ సర్టిఫికెట్

- కాంచీపురంలో అధికారుల నిర్వాకం
- బాధితులు గగ్గోలు

సాక్షి, చెన్నై: బతికున్న వ్యక్తికి డెత్ సర్టిఫికెట్‌ను సైతం ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన కాంచీపురం అధికారుల నిర్వాకం శుక్రవారం వెలుగుచూసింది. కాంచీపురం జిల్లా ఉత్తర మేరుకు చెందిన మురుగన్, దేవి దంపతులకు గణపతి, తంగరాజ్ ఇద్దరు కుమారులు. 2017లో అనారోగ్యంతో గణపతి మరణించాడు. తంగరాజ్‌కు ఇటీవల వివాహమైంది. వేరు కాపురం పెట్టిన తంగరాజ్ తనకంటూ ఓ రేషన్ కార్డు తీసుకునేందుకు నిర్ణయించాడు. తల్లిదండ్రుల కార్డులో ఉన్న తన పేరును తొలగించి, కొత్త కార్డుకు ఈ సేవా కేంద్రానికి వెళ్లి దరఖాస్తు చేసుకున్నాడు. అయితే, ప్రభుత్వ రికార్డుల మేరకు తంగరాజ్ మరణించినట్టు ఈ- సేవా కేంద్రం వర్గాలు సమాచారం ఇచ్చారు. అతడు 2017లో మరణించినట్టుగా డెత్‌సర్టిఫికెట్ కూడా మంజూరు చేసి ఉండడం తో షాక్‌కు గురయ్యాడు. తాను బతికే ఉన్నానని, అయితే, తనకు డెత్ సర్టిఫికెట్ మంజూరుపై ఆగ్రహానికి లోనైన తంగరాజ్, తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించగా సరైన సమాధానం లేదు. తనకు ప్రభుత్వ పథకాలు దరి చేరకుండా వచ్చాయని, ఇప్పుడేమో తాను మరణించినట్టు ఏకంగా డెత్ సర్టిఫికెట్ చూపిస్తున్నారని తంగరాజ్ మీడియా ముందుకొచ్చి వివరించాడు. దీంతో కాంచీపురం జిల్లా యంత్రాంగం కదిలింది. ఎక్కడ ఈ పొరబాటు జరిగిందో పరిశీలించి తంగరాజ్‌కు న్యాయం చేకూర్చే విధంగా స్థానిక అధికారులకు ఆదేశాలు వెళ్లాయి. అయితే, తంగరాజ్ సోదరుడు మురుగన్ మరణిస్తే, అతడి పేరు మీద కాకుండా తంగరాజ్ పేరిట డెత్ సర్టిఫికెట్ మంజూరు చేసి ఉండ వచ్చునని భావిస్తున్నారు. అయితే, ఇప్పటికే మురుగన్ పేరిట డెత్ సర్టిఫికెట్ మంజూరు చేసినట్టుగా ఆన్‌లైన్‌లో సమాచారాలు ఉండడం గమనార్హం.

శ్మశాన వాటిక తనదంటూ నిరసన


శ్మశానవాటికలో గుంతలో పడుకుని నిరసన తెలుపుతున్న రైతు

అన్నానగర్: శ్మశాన వాటికకు చెందిన భూమి తనదంటూ ఓ వ్యక్తి వినూత్న రీతిలో నిరసన తెలిపాడు. తూత్తుకుడి జిల్లా ఒట్టపిడారం సమీపం పచ్చై పెరుమాళ్ పురం గ్రామానికి చెందిన అప్పావు (80) గురువారం మృతిచెందాడు. దీంతో అతని మృతదేహాన్ని ఖననం చేసేందుకు బంధువులు పచ్చై పెరుమాళ్‌పురం గ్రామ సమీపంలోని శ్మశానవాటికలో గొయ్యి తవ్వారు. ఈ క్రమంలో వల్కులం గ్రామానికి చెందిన మారియప్పన్ (45) మృతదేహాన్ని ఖననం చేసేందుకు ప్రయత్నించగా అడ్డుకున్నాడు. గొయ్యి తవ్విన భూమిని తనదంటూ గొడవ చేశాడు. ఖననం కోసం తవ్విన గుంతలో పడుకుని రెండు గంటలపాటు నిరసన తెలిపాడు. మృతుని బంధువులు ఒట్టపిడారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గుంతలోపల నిరసన చేస్తున్న మారియప్పన్‌ను బయటకు రమ్మని పిలిచి చర్చలు జరిపారు. అనంతరం గ్రామ పరిపాలన అధికారిణి మహాలక్ష్మి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వసంతకుమార్‌లను సంఘటన స్థలానికి పిలిపించారు. మృతులను పూడ్చేందుకు గొయ్యి తీసిన ప్రాంతాన్ని పరిశీలించారు. అది శ్మశానవాటికకు చెందిన భూమి అని తేలింది. దీంతో పోలీసులు మారియప్పన్‌ను మందలించి అక్కడి నుంచి వెళ్లగొట్టారు. దీంతో 3 గంటల తరువాత ఆ గొయ్యిలో మృతదేహాన్ని పాతి పెట్టారు.

ఏజెంట్ వైల్డ్‌గా ఉంటాడు

– అక్కినేని అఖిల్


మాట్లాడుతున్న హీరో అక్కినేని అఖిల్

తిరుపతి కల్చరల్: తన గత సినిమాల కంటే ఏజెంట్ చిత్రం కొత్తగా ఉంటుందని, తనను తాను నిరూపించుకునేందుకు ఏజెంట్ సినిమాలో వైల్డ్‌గా ప్రయత్నించానని యువ హీరో అక్కినేని అఖిల్ తెలిపారు. అక్కినేని అఖిల్, సాక్షి వైద్య హీరో హీరోయిన్స్లుగా, మమ్మూటి ప్రత్యేక పాత్రలో సురేందర్ రెడ్డి దర్శకత్వంలో నిర్మితమైన ఏజెంట్ చిత్రం ప్రమోషన్‌లో భాగంగా చిత్ర బృందం శుక్రవారం రాత్రి తిరుపతిలోని ఓ ప్రైవేట్ హోటల్లో సందడిచేసింది. మీడియా సమావేశంలో అఖిల్ మాట్లాడుతూ ఈ చిత్రం ట్రైలర్‌కు విశేష స్పందన రావడం సంతోషకరమన్నారు. ఈ సినిమాలో హీరోయిన్ సాక్షి వైద్యతో కెమిస్ట్రీ బాగా కుదిరిందని, అవసరం మేరకే సినిమాలో లవ్ స్టోరీ ఉంటుందన్నారు. అక్కినేని వారసుడిగా కాకుండా తనను తానుగా ప్రమోట్ చేసుకునేందుకే తాను ఇష్టపడతానని తెలిపారు.

ప్రమాదంలో పుదుచ్చేరి మాజీ మంత్రి సురక్షితం

తిరువొత్తియూరు: చెన్నైలో జరిగిన కారు ప్రమాదంలో పుదుచ్చేరికి చెందిన ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి, మాజీ మంత్రి మల్లాది కృష్ణారావు అదృష్టవశాత్తూ సురక్షితంగా బయటపడ్డారు. పుదుచ్చేరిలో ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి, టీటీడీ బోర్డు మాజీ మంత్రి కృష్ణారావు. ఇతను గురువారం ఉదయం పుదుచ్చేరి నుంచి చెన్నై విమానాశ్రయానికి కారులో వెళుతున్నారు. తురైప్పాకం సిగ్నల్ వద్ద కారు ఆగిఉన్న సమయంలో వెనక నుంచి వచ్చిన ట్యాంకర్ కారును ఢీకొంది. కారు ముందు ఉన్న లారీని ఢీకొంది.
ఈ ప్రమాదంలో మల్లాది కృష్ణారావు, అతని సెక్యూరిటీ అధికారి, డ్రైవర్ అదృష్టవశాత్తు ఎటువంటి గాయాలు లేకుండా ప్రమాదం నుంచి బయటపడ్డారు. సెక్యూరిటీ శివకుమార్ ట్యాంకర్ డ్రైవర్ పల్లావరం ప్రాంతానికి చెందిన రాజ్‌కుమార్‌ను పట్టుకుని గిండి ట్రాఫిక్ పోలీసులు అప్పగించారు. పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.



సాధారణంగా అందరూ కాఫీ లేదా గరం గరం చాయ్‌తో రోజును ప్రారంభిస్తారు. అందులో కొత్తేమీ లేదు. బండిలో పెట్రోలు పోయకపోతే బండి ముందుకు కదలనని మొరాయించినట్లే ఇది కూడా! అయితే ఇది వేసవి కాబట్టి అలా కాఫీ, టీ లకు బదులుగా పోషకాలతో సమృద్ధిగా ఉన్న ఒక గ్లాసు ఆరోగ్యకరమైన పానీయం తాగటం చాలా మంచిదని అంటున్నారు నిపుణులు. కావాలంటే ఓ అరగంట గ్యాప్ ఇచ్చి, యథావిధిగా కాఫీనో, టీనో తాగచ్చు. అలా తాగడం ద్వారా ఉదయం పూట రిఫ్రెషింగ్ గా ఉంటుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఉత్సాహంగా పనులు చేసుకోగలుగుతారు. అలాంటి గుడ్ మార్నింగ్ డ్రింక్స్ కొన్నింటిని చూద్దాం.

మార్నింగ్ డ్రింక్‌తో రోజంతా హుషారుగా



తేనె- దాల్చిన చెక్క పానీయం

ఉదయం లేవగానే గ్లాసు గోరువెచ్చని నీటిలో రెండు చెంచాల తేనె, చిటికెడు దాల్చిన చెక్క పొడిని వేసి తాగాలి. ఇది మిమ్మల్ని రిఫ్రెష్ చేస్తుంది. కడుపును శుభ్రం చేస్తుంది.



నిమ్మరసం

ఒక గ్లాసు నిమ్మరసం సహజంగా శరీరంలో టాక్సిన్స్ ఏమీ లేకుండా చేస్తుంది. ఇది ఉదయం వేళ టీ లేదా కాఫీకి కూడా మంచి ప్రత్యామ్నాయం. గోరు వెచ్చని నీటిలో నిమ్మరసం కలుపుకొని తాగాలి, రుచి కోసం కొంచెం తేనెను కూడా కలపవచ్చు.



దాల్చిన చెక్క గ్రీన్ టీ

గ్రీన్ టీ తాగితే చాలా ప్రయోజనాలు ఉన్నాయి. జీర్ణక్రియ, కడుపు సమస్యలను నివారించడానికి, మీరు శుభోదయ పానీయంగా కప్పు గ్రీన్ టీ తాగవచ్చు. గ్రీన్ టీ రుచి ఇష్టం లేకపోతే అందులో ఒక చిటికెడు దాల్చిన చెక్క పొడి, తేనె కలిపితే సరి. ఆ పానీయాన్ని ఆస్వాదించవచ్చు.



కొబ్బరి నీరు

కొబ్బరి నీరు చాలా ఆరోగ్యకరమైన పానీయం. అప్పుడప్పుడూ ఉదయం పూట కొబ్బరి నీరు తాగుతుంటే మీకు మార్నింగ్ ఎనర్జీ డ్రింక్‌గా మాత్రమే కాదు, మీ శరీరాన్ని తక్షణమే హైడ్రేట్ చేసే రుచికరమైన పానీయం. సాదా కొబ్బరి నీరు తాగండి, ఇందులో ఏమీ కలపాల్సిన అవసరం లేదు.



అలోవెరా జ్యూస్

చాలారకాల చర్మ సంరక్షణ ఉత్పత్తులు కలబంద ఆధారితమైనవే ఉంటాయి. ఉదయం పూట కలబంద జ్యూస్ తాగటం ఎంతో ఉత్తమం. ఈ పానీయం ఉదయాన్నే తాగిన తరువాత, మీ శరీరం తక్షణమే చైతన్యం అవుతుంది. మీరు మీ రోజును ప్రారంభించడానికి తగిన తక్షణ శక్తి వస్తుంది. అంతేకాదు, చర్మసమస్యలు అన్నీ పోయి, మెరిసే చర్మం వస్తుంది.

దోసకాయ... పుదీనా జ్యూస్

దోసకాయ పుదీనా నీరు జ్యూస్ డిటాక్సింగ్ డ్రింక్. మీ శరీరం నుంచి మలినాలను, విషపదార్థాలను తొలగిస్తుంది. ఉదయం పూట మిమ్మల్ని లోపలి నుంచి శుభ్రపరుస్తుంది. మీ ఆరోగ్యకరమైన ఉదయం దినచర్యకు ఇది మంచి డ్రింక్. ముఖ్యంగా వేసవిలో పుదీనాతో కలిసిన దోసకాయ డ్రింక్ మీ శరీరాన్ని చల్లబరుస్తుంది.

రోజ్ షర్బత్

ముందుగా సబ్జా గింజలను నీటిలో నానబెట్టండి, ఈ లోపు రోజ్ సిరప్ సిద్ధం చేసుకోండి. ఒక గుప్పెడు తాజా గులాబీ పువ్వు రెమ్మలను తీసుకొని ఒక గిన్నె నీటిలో ఉడికించండి. మరొక గిన్నెలో చక్కెర, నీరు కలిపి చక్కెర పాకం తయారు చేయండి. చక్కెర పాకంలో ఉడికించిన గులాబీ నీరు ఫిల్టర్ చేసుకొని బాగా కలిపేస్తే రోజ్ సిరప్ రెడీ. ఇప్పుడు మెత్తగా నానబెట్టిన సబ్జా గింజలను వడకట్టి ఒక గ్లాసులోకి తీసుకోండి.అందులో రోజ్ సిరప్, ఐస్ క్యూబ్స్, కోల్డ్ వాటర్ వేసి కలపండి, పై నుంచి నిమ్మరసం పిండుకోండి. అంతే, రోజ్ షర్బత్ రెడీ.



వేసవి అంతా రోజూ ఉదయం పూట ఇలాంటి ఏదైనా ఒక పానీయం తాగటం ద్వారా మీరు రోజంతా చురుకుగా, హుషారుగా ఉంటారు.

మీకు తెలుసా?

మొలకెత్తిన బంగాళదుంపలు తింటే మన ఆరోగ్యానికే పెను ముప్పు తెచ్చిపెడతాయి. బంగాళదుంపలపై వచ్చే మొలకలు విషపూరితమైనవని చెబుతున్నారు నిపుణులు. ఒక్కోసారి ఫుడ్ పాయిజన్‌కి దారి తీసి ప్రాణాల మీదకు కూడా తెస్తుంది. బంగాళదుంపలపై ఏర్పడే మొలకల్లో గ్లైకో అల్కాయిడ్స్ అనే విషపూరితమైన రసాయన పదార్థాలు ఉంటాయి. మొలకెత్తిన బంగాళదుంపల్లో అధిక స్థాయిలో ఈ రసాయన పదార్థం ఉంటుంది. వీటిని తినడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. ఇవి తిన్న కొద్ది గంటలలోనే వాంతులు, విరోచనాలు, పొత్తి కడుపులో నొప్పి వంటి అనారోగ్య సమస్యలతో బాధపడాల్సి ఉంటుంది. అంతేకాకుండా లో బీపీ, పల్స్ ఎక్కువగా కొట్టుకోవడం, జ్వరం, తల నొప్పి, మతిమరుపు.. కడుపులో నొప్పి, గుండె సంబంధిత వ్యాధులు, నాడీ వ్యవస్థ దెబ్బతినడం వంటి అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. మొలకెత్తిన ఆలుగడ్డలను గర్భిణీలు తింటే పుట్టబోయే బిడ్డపై కూడా తీవ్ర ప్రభావం పడుతుందని అంటున్నారు. బంగాళదుంపలను చల్లని, చీకటి ప్రదేశాల్లో నిల్వ ఉంచడం ద్వారా అవి మొలకెత్తడాన్ని నివారించవచ్చు.



ఎండలో కంటికి అండగా...



వేసవి కాలంలో చర్మానికి సంబంధించిన సమస్యలే కాదు, కళ్లకు సంబంధించిన సమస్యలు కూడా ఆందోళన కలిగిస్తాయి. ఎండవేడిమికి గురికావడం వల్ల కళ్లు పొడిబారడం లేదా మంటలు పుట్టడం, ఎర్రబారడం వంటి సమస్యలు వస్తాయి. అలా కాకుండా ఉండాలంటే కొన్ని జాగ్రత్తలు పాటించడంతోపాటు కొన్ని రకాల ఆహార పానీయాలు తీసుకోవడం మంచిది. అవేమిటో చూద్దాం.

కంటి ఆరోగ్యాన్ని కాపాడే వాటిలో నిమ్మరసం కీలకమైన పాత్ర పోషిస్తుంది. ఇది ఎండలనుంచి ఉపశమనాన్ని ఇవ్వడమే కాకుండా, కళ్ల ఆరోగ్యాన్ని మెరుగుపరిచే పనిని కూడా చేస్తుంది.

ఎందుకంటే, నిమ్మరసంలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది, ఇది ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టం నుంచి కళ్ళను రక్షిస్తుంది. అంతే కాదు, నిమ్మకాయలో విటమిన్ ఎ కూడా ఉంటుంది, ఇది దృష్టిని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. నిమ్మరసంలో ఉండే లుటిన్, జియాక్సంతిన్ అనే ముఖ్యమైన పోషకాలు మాక్యులర్ డీ జనరేషన్, కంటిశుక్లం నుండి కళ్ళను రక్షించడంలో సహాయపడతాయి. నిమ్మకాయలో ఉండే విటమిన్ సి కళ్ల రక్తనాళాలను బలోపేతం చేయడంలో సహాయపడుతుంది. ఇది రెటీనాకు రక్త ప్రసరణ జరిగేలా చూస్తుంది. తద్వారా కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.

ఇంకా పుచ్చకాయ, కర్బూజ, మామిడి, బొప్పాయి పండ్లు తినడం, కొబ్బరినీళ్లు తాగడం, ఆహారంలో ఉల్లిపాయలను బాగా ఉపయోగించడం వల్ల కళ్లు ఆరోగ్యంగా ఉంటాయి.

కళ్లు మంటలు ఉన్నప్పుడు కాసిని మల్లెపూలను ఒక గ్లాసు నీళ్లలో వేసి అరగంట తర్వాత ఆ నీటితో కళ్లను కడుక్కుంటే ఉపశమనం కలుగుతుంది. అలాగే, చక్రాలుగా తరిగిన కీరాముక్కలను లేదా బంగాళదుంప ముక్కలను కళ్ల మీద ఉంచుకోవడం కూడా ప్రయోజనకరం. కొంతమందికి రాత్రిపూట కళ్లు కనిపించవు. ఈ వ్యాధిని రేచీకటి అంటారు. ఆహారంలో విటమిన్ ఎ ఆధారిత ఆహారాన్ని తక్కువగా తీసుకోవడం వల్ల ఈ సమస్య ఎదురవుతుంది. దీనిని నివారించాలంటే పాలకూర, బొప్పాయి, క్యారెట్ ఎక్కువగా తీసుకోవాలి. ఆకుకూరల్లో తోటకూర, పొన్నగంటి కూర కంటికి చాలా మంచిది.

ఈ కాలంలో వీచే వడగాలులు చాలా ప్రమాదకరం. వేడిమికి కళ్లల్లో ఉండే తేమ ఆవిరైపోతుంది. ఫలితంగా కంటి వద్ద చర్మం పొడిబారి, కళ్లల్లో ఇసుక వేసినట్లుగా ఉంటుంది. గాలులకు దుమ్ము, ధూళి కంట్లో పడడం వల్ల కళ్ల దురద, మంటలు వస్తాయి. అందువల్ల బయటకు వెళ్లాల్సి వస్తే తప్పనిసరిగా సన్ గ్లాసులు పెట్టుకోవాలి. ఇంటికి చేరిన వెంటనే చల్లని నీటితో ముఖం కడుక్కోవాలి.

హెల్త్ టిప్స్



అల్లం అంగుళం ముక్క, బెల్లం చిన్న ముక్క తీసుకుని రెండూ కలిపి రాత్రి పడుకోబోయేముందు నమిలి తింటే మలబద్ధకం పోతుంది.



మెంతికూర చిన్నదిగాని, పెద్దదిగాని కూర చేసుకుని రోజూ కనీసం మూడు నెలలు తింటే రక్తహీనత తగ్గుతుంది.



వేపనూనె, కర్పూరం కలిపి రాస్తే తలలోని కురుపులు మాడిపోతాయి, చుండ్రు తగ్గుతుంది.

మొదటి విమాన ప్రయాణమా?



మొదటిసారి విమాన ప్రయాణం చేస్తున్నప్పుడు చాలా ఆసక్తిగా ఉంటుంది. విమాన ప్రయాణం చేసేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా ఆహారం విషయంలో అలర్ట్‌గా ఉండాలి. ఏమీ తినకుండా లేదా ఫుల్లుగా తిని విమాన ప్రయాణం చేయకూడదు. ముఖ్యంగా కొన్ని ఆహారపదార్థాలకి దూరంగా ఉండాలి. అవేంటో చూద్దాం...

విమానంలో ప్రయాణించే ముందు బిర్యానీ, ఊరగాయలు వంటి ఆయిల్, స్పైసీ ఫుడ్ తింటే కడుపు నొప్పి వస్తుంది. గుండె మంట, మూత్రాశయం చికాకు సమస్యలు వస్తాయి. ఇవిఅధిక కేలరీలను కలిగి ఉండటంతోబాటు వీటి మూలాన నోటి నుంచి వాసన వస్తుంది. అదేవిధంగా ఎయిర్‌పోర్ట్‌లో కంటికి ఇంపుగా నోరూరిస్తూ కనిపించే రకరకాల ప్యాకేజ్డ్ ఫుడ్ తీసుకోవడం అసలు మంచిది కాదు. ప్రయాణించే ముందు బర్గర్ లేదా ఫ్రెంచ్ ఫ్రైస్ తినడం వల్ల అరుగుదల సరిగా లేక గుండెల్లో మంట వస్తుంది. అలాగే ఆపిల్ తినడమూ అంత మంచిది కాదు. ఎసిడిటీ లేదా గ్యాస్ సమస్య ఏర్పడుతుంది. యాపిల్స్‌లో చక్కెర అధికంగా ఉండటం వల్ల అది పేగు ఆరోగ్యానికి హాని కలిగిస్తుంది. అయితే బొప్పాయి లేదా నారింజ పండ్లను తినవచ్చు. చాలామంది ఫ్లైట్ ఎక్కే ముందు ఏదో ఒక రకమైన స్నాక్స్ తింటారు. అయితే ఆరోగ్యనిపుణుల అభిప్రాయం ప్రకారం స్నాక్స్ అజీర్ణం, వికారం లేదా ఉబ్బరం కలిగిస్తాయి. అలాగే విమాన ప్రయాణానికి ముందు బ్రోకలీతో చేసిన ఆహారాలు కూడా తినకూడదని గుర్తుంచుకోండి.

సినిమా

ఆటకు వేళాయె అంటూ కొందరు స్టార్స్ ప్లేయర్స్‌గా మారారు. క్రికెటర్లుగా, కోచ్‌లుగా మౌల్డ్ అయిపోయారు. అయితే ఈ ఆట అంతా సినిమాల కోసమే. ప్రస్తుతం క్రికెట్ బ్యాక్‌డ్రాప్‌లో కొన్ని చిత్రాలు రూపొందుతున్నాయి. కొన్ని కాల్పనిక కథలు కాగా, కొన్ని బయోపిక్స్ కూడా ఉన్నాయి. ఇక వెండితెరపై క్రికెటర్లుగా అలరించనున్న స్టార్స్ గురించి తెలుసుకుందాం.

ఆటకు వేళాయె



● రజనీకాంత్

● సూపర్ స్టార్ రజనీకాంత్ ఓ క్రికెట్ మ్యాచ్ నిర్వహణ మీద ఉన్నారు. 'లాల్ సలామ్' చిత్రం కోసమే ఇదంతా. రజనీకాంత్ కుమార్తె ఐశ్వర్యా రజనీకాంత్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం ఇది. క్రికెట్ నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో విష్ణువిశాల్, విక్రాంత్ లీడ్ రోల్స్‌లో, రజనీకాంత్, జీవితా రాజశేఖర్ కీలక పాత్రలు చేస్తున్నారు. ఈ చిత్రంలో రజనీకాంత్ క్రికెట్ కోచ్ పాత్రలో కనిపిస్తారనీ, తమిళనాడు క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధిగా కనిపిస్తారనీ ప్రచారం జరుగుతోంది. మరి.. రజనీ ఏ పాత్రలో కనిపిస్తారో చూడాలి. 'లాల్ సలామ్' చిత్రం ఈ ఏడాదే రిలీజ్ కానుంది.



● సిద్ధార్థ్



● నయనతార



● మాధవన్

● క్రికెట్ గ్రౌండ్‌లో బిజీగా ఉంటున్నారు మాధవన్, సిద్ధార్థ్, నయనతార. ఈ ముగ్గురూ కలిసి సిల్వర్ స్క్రీన్‌పై ఆడనున్న మ్యాచ్ 'ది టెస్ట్'. తమిళ నిర్మాత శశికాంత్ దర్శకుడిగా పరిచయం అవుతున్న సినిమా ఇది. ఈ చిత్రంలో నయనతార, మాధవన్, సిద్ధార్థ్ లీడ్ రోల్స్ చేస్తున్నారు. టెస్ట్ క్రికెట్ ఫార్మాట్‌లో ఈ చిత్రం తెరకెక్కుతున్నట్లు సమాచారం. పాన్ ఇండియా స్పోర్ట్స్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రం తమిళ్, తెలుగు, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో విడుదల కానుంది.

● శ్రీలంక మాజీ క్రికెటర్, స్పిన్ మాంత్రికుడు ముత్తయ్య మురళీధరన్ బయోపిక్ '800' టైటిల్‌తో తెరకెక్కుతోంది. 'స్లమ్ డాగ్ మిలియనీర్' చిత్రంలో సలీమ్ మాలిక్ పాత్ర చేసిన మధుర్ మిట్టల్ ఈ చిత్రంలో మురళీధరన్ పాత్ర చేస్తున్నారు. ముత్తయ్య భార్య మదిమలర్ పాత్రను మహిమా నంబియార్ చేస్తున్నారు. ''మురళీధరన్ జీవితంలోని పలు కోణాలను ఈ చిత్రంతో వెండితెరపై ఆవిష్కరించనున్నాం. 800 వికెట్లు తీసిన ఏకైక ఆఫ్ స్పిన్ బౌలర్‌గా మురళీధరన్ పేరిట రికార్డు ఉంది. తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో ఈ సినిమాను రిలీజ్ చేయనున్నాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.



● మధుర్ మిట్టల్

● భారత ప్రముఖ మాజీ క్రికెటర్ జులన్ గోస్వామి జీవితం ఆధారంగా రూపొందిన వెబ్ మూవీ 'చక్దా ఎక్స్‌ప్రెస్'. ఇందులో జులన్ గోస్వామిగా అనుష్కా శర్మ నటించారు. ప్రోసిత్ రాయ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ ఏడాది చివర్లో నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. పశ్చిమ బెంగాల్ చక్దా ప్రాంతానికి చెందిన జులన్ గోస్వామి దాదాపు రెండు దశాబ్దాలు మహిళా క్రికెటర్‌గా, కెప్టెన్‌గా సక్సెస్‌ఫుల్ కెరీర్‌ను లీడ్ చేశారు. ఉమెన్స్ వన్ డే ఇంటర్‌నేషనల్ క్రికెట్ ఫార్మాట్‌లో అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్‌గా జులన్ రికార్డు సాధించారు.



● అనుష్కా శర్మ

● యంగ్ బ్యూటీ జాన్వీ కపూర్ సైతం క్రికెట్ బ్యాట్ పట్టారు. 'మిస్టర్ అండ్ మిస్సెస్ మహి' సినిమాలో జాన్వీ కపూర్ క్రికెటర్‌గా నటిస్తున్నారు. రాజ్‌కుమార్ రావ్ మరో లీడ్ రోల్ చేస్తున్నారు. శరణ్ శర్మ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా త్వరలోనే విడుదల కానుంది. రియల్ క్రికెటర్స్ దగ్గర శిక్షణ తీసుకుని జాన్వీ కపూర్ ఈ సినిమా చేశారు. వీరితోపాటు మరికొందరు క్రికెటర్ల బయోపిక్‌లు, క్రికెట్ ఆధారంగా సినిమాలకు చర్చలు జరుగుతున్నాయి.



● జాన్వీ కపూర్

టైమ్‌లెస్ లవ్!

హీరో నాగచైతన్య–డైరెక్టర్ వెంకట్ ప్రభు కాంబినేషన్‌లో రూపొందుతున్న తెలుగు–తమిళ చిత్రం 'కస్టడీ'. కృతీ శెట్టి కథానాయిక. శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్న ఈ సినిమా మే 12న రిలీజ్ కానుంది. ఇళయరాజా, ఆయన కుమారుడు యువన్‌శంకర్ రాజా స్వరపరచిన ఈ చిత్రంలోని 'టైమ్‌లెస్ లవ్..' అంటూ సాగే పాటని రేపు (ఆదివారం) రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించి, పోస్టర్ రిలీజ్ చేశారు. ''భారీ నిర్మాణ విలువలు, సాంకేతిక ప్రమాణాలతో 'కస్టడీ' తెరకెక్కుతోంది'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సమర్పణ: పవన్ కుమార్, కెమెరా: ఎస్ఆర్ కదిర్.



● నాగచైతన్య, కృతీ శెట్టి

వీళ్లందరూ మిస్ అవలేదు..


'నిన్న రాత్రి నుంచి మా నాన్న కనిపించడం లేదు సార్', 'రెండు వారాల నుంచి మా అబ్బాయి కనిపించడం లేదు సార్' అనే డైలాగులతో 'ఉగ్రం' సినిమా ట్రైలర్ విడుదలైంది. 'నాంది' వంటి హిట్ తర్వాత హీరో 'అల్లరి' నరేశ్, డైరెక్టర్ విజయ్ కనకమేడల కాంబినేషన్‌లో తెరకెక్కిన చిత్రం 'ఉగ్రం'. మిర్నా మీనన్ కథానాయికగా నటించారు. సాహు గారపాటి, హరీష్ పెద్ది నిర్మించిన ఈ చిత్రం మే 5న విడుదల కానుంది. ఈ సందర్భంగా శుక్రవారం ట్రైలర్ విడుదల చేశారు. 'వీళ్లందరూ మిస్ అవలేదు.. మిస్ చేయబడ్డారు. అందులో నా భార్య, కూతురు కూడా ఉన్నారు ('అల్లరి' నరేశ్), 'చీకట్లో జరిగే వ్యాపారం.. చీకట్లోనే వదిలెయ్. (విలన్ పాత్రధారి)' వంటి డైలాగులు ట్రైలర్ ఉన్నాయి. ''యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రం 'ఉగ్రం'. నరేశ్ పాత్రను విజయ్ కనకమేడల ఇంటెన్స్‌గా చూపించారు. 'నాంది'లా 'ఉగ్రం' కూడా మంచి హిట్ అవుతుంది'' అన్నారు నిర్మాతలు. ఈ చిత్రానికి కెమెరా: సిద్, సంగీతం: శ్రీచరణ్ పాకాల.



● 'అల్లరి' నరేశ్


వినోదాత్మకంగా...

'బలగం' ఫేమ్ సుధాకర్ రెడ్డి, అంజి వల్లమాన్ ప్రధాన పాత్రల్లో రూపొందిన చిత్రం 'భీమదేవరపల్లి బ్రాంచి'. రమేష్ చెప్యాల దర్శకత్వంలో డా. బత్తిని కీర్తిలత గౌడ్, రాజా నరేందర్ చెట్లపెల్లి నిర్మించిన ఈ చిత్రంలో రాజకీయ విశ్లేషకులు ప్రొఫెసర్ నాగేశ్వర్, సీబీఐ మాజీ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, సీనియర్ నేత అద్దంకి దయాకర్ కీలక పాత్రలు పోషించారు. త్వరలో ఈ చిత్రం విడుదల కానుంది. బత్తిని కీర్తిలత మాట్లాడుతూ– ''ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ ద్వారా ఈ చిత్రం రిలీజ్ కానుంది. ఈ మధ్య ప్రివ్యూ షో చూసిన సినీ, రాజకీయ ప్రముఖులు బాగుందని అభినందించారు. ఇటీవల రిలీజ్ చేసిన ఈ చిత్రంలోని 'ఎల్లమ్మ..' పాట అందర్నీ ఆకట్టుకుంటోంది. మంచి కథను కామెడీగా చెప్పడంతో ప్రేక్షకులకు మా సినిమా రీచ్ అవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు.



● సుధాకర్ రెడ్డి

వాస్తవ ఘటన ఆధారంగా....



● రాజీవ్ కనకాల

అనిరుధ్, యశస్విని జంటగా, రాజీవ్ కనకాల, జీవా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'యాద్గిరి అండ్ సన్స్'. భిక్షపతి రాజు పందిరి దర్శకత్వంలో చంద్రకళ పందిరి నిర్మించిన ఈ చిత్రం మే 5న రిలీజ్ కానుంది. భిక్షపతి రాజు మాట్లాడుతూ– ''వాస్తవ ఘటన స్ఫూర్తితో రూపొందిన చిత్రం ఇది. ఈ చిత్రంలోని పాత్రలన్నీ సహజంగా ఉంటాయి. సీనియర్ నటులు జీవా, రాజీవ్ కనకాల నటన హైలైట్‌గా ఉంటుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి'' అన్నారు.

డాక్టర్ రేణు

వెంకటేశ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'సైంధవ్'. శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్. వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్నారు. కాగా ఈ చిత్రంలో డాక్టర్ రేణు పాత్రలో హీరోయిన్ రుహానీ శర్మ నటిస్తున్నట్లు మేకర్స్ ప్రకటించి, ఆమె లుక్ రిలీజ్ చేశారు. 'చిలసౌ, హిట్: ది ఫస్ట్ కేస్, డర్టీ హరి, నూటొక్క జిల్లాల అందగాడు' వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులను అలరించారు రుహానీ శర్మ. 'శైలేష్ కొలను దర్శకత్వం వహించిన తొలి చిత్రం 'హిట్: ది ఫస్ట్ కేస్'లో హీరోయిన్‌గా నటించారు రుహానీ. ఇప్పుడు మరోసారి ఆయన దర్శకత్వంలో 'సైంధవ్'లో డాక్టర్ రేణుగా కీలక పాత్ర పోషిస్తున్నారు. బాలీవుడ్ యాక్టర్ నవాజుద్దీన్ సిద్దిఖీని ఈ చిత్రంతో తెలుగుకి పరిచయం చేస్తున్నాం. ప్రస్తుతం 'సైంధవ్' షూటింగ్ వైజాగ్‌లో జరుగుతోంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: సంతోష్ నారాయణ్, కెమెరా: ఎస్. మణికందన్.



● రుహానీ శర్మ

చూపు తిప్పిందేంటి?

'తెలుగు ఇండస్ట్రీ కన్నడపై చూపు తిప్పిందేంటి?' అనే డైలాగ్‌తో 'మళ్ళీ పెళ్లి' సినిమా టీజర్ విడుదలైంది. వీకే నరేష్, పవిత్రా లోకేష్ జోడీగా నటిస్తున్న ఈ చిత్రానికి ఎంఎస్ రాజు దర్శకత్వం వహిస్తున్నారు. విజయకృష్ణ మూవీస్ బ్యానర్‌పై వీకే నరేష్ నిర్మిస్తున్నారు. తెలుగులో 'మళ్ళీ పెళ్లి', కన్నడలో 'మత్తే మదువే' పేరుతో రూపొందుతోన్న ఈ చిత్రం టీజర్‌ని శుక్రవారం విడుదల చేశారు. 'అతను భార్యని ఎలా చూసుకోవాలో, భార్య విలువేంటి? అని తెలియని ఒక మృగం' (వనితా విజయ్ కుమార్), 'చుట్టూ అప్పులు, ఒంటినిండా రోగాలు పెట్టుకున్న నీతో సరసం ఏంటి?' (వీకే నరేశ్) వంటి డైలాగులు టీజర్‌లో ఉన్నాయి. ''ఆసక్తికరమైన కథలను ఎంచుకుంటున్న ఎంఎస్ రాజు మరో విభిన్న కథాంశంతో తెరకెక్కిస్తున్న చిత్రం 'మళ్ళీ పెళ్లి'. ఈ వేసవిలో తెలుగు, కన్నడ భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నాం'' అని యూనిట్ పేర్కొంది. జయసుధ, శరత్ బాబు, అనన్య నాగళ్ల, రోషన్, రవివర్మ, అన్నపూర్ణ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సురేష్ బొబ్బిలి, నేపథ్య సంగీతం: అరుల్ దేవ్, కెమెరా: ఎంఎన్ బాల్ రెడ్డి.



● పవిత్ర, నరేశ్

సాక్షి బిజినెస్

శనివారం
22-04-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ
23	0
59,655	17,624

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	12,077	▲	20
డోజోన్స్	33,876	▲	8
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,914	▲	12
డాక్స్	15,882	▲	86
షాంఘై	3,301	▼	2
నికాయ్	28,564	▲	93

అమెరికా · బ్రిటన్ · జర్మనీ · చైనా · జపాన్

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (24 క్యారెట్)		
60,191	▼	425
బంగారం (22 క్యారెట్)		
59,950	▼	423
వెండి (కిలో)		
74,773	▼	646

సింఫనీ బీఎల్‌డీసీ ఎయిర్‌కూలర్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రపంచంలో తొలిసారిగా బ్రష్‌లెస్ డీసీ ఎలక్ట్రిక్ మోటార్ (బీఎల్‌డీసీ) టెక్నాలజీతో పనిచేసే ఎయిర్ కూలర్లను సింఫనీ భారత మార్కెట్లోకి విడుదల చేసింది. సంప్రదాయ ఎయిర్‌కూలర్లతో పోలిస్తే ఇవి 60 శాతం తక్కువ విద్యుత్‌ను వినియోగిస్తాయని కంపెనీ వెల్లడించింది. 30, 55, 80 లీటర్ల సామర్థ్యంతో మూడు మోడళ్లను అందుబాటులోకి తెచ్చినట్టు సింఫనీ సీఎండీ అచల్ బకేరీ తెలిపారు.

తనిష్క్ నుంచి 'స్టన్నింగ్ ఎవ్రీ ఇయర్' చెవి రింగులు



హైదరాబాద్: టాటా గ్రూప్ కంపెనీ తనిష్క్ అక్షయ తృతీయ సందర్భంగా బంగారం, వజ్రాలతో తీర్చిదిద్దిన చెవి రింగులను 'స్టన్నింగ్ ఎవ్రీ ఇయర్' పేరిట విడుదల చేసింది. ఈ నూతన కలెక్షన్‌లో సంప్రదాయ ఝుంకీలు, ఆకర్షణీయ స్టడ్‌లు, డ్రాప్ ఇయర్ రింగ్స్ మరెన్నో ఉన్నాయి. వీటిని 18 క్యారెట్, 22 క్యారెట్లలో రూపొందించారు. పండుగ వేళ బంగారు ఆభరణాల మేకింగ్, డైమండ్ జ్యువెలరీ విలువపై 20% తగ్గింపు అందిస్తుంది. ఈ ఏప్రిల్ 24 వరకు ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

22-4-2023	
విశాఖ	375-00
చిత్తూరు	418-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	365-00
విజయవాడ	365-00
రిటైల్ ధర (డజను)	60.00
21-4-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	358-00
వరంగల్	360-00
రిటైల్ ధర	4.20

రిలయన్స్ లాభాల రికార్డ్!

- క్యూ4లో నికర లాభం రూ. 19,299 కోట్లు
- కంపెనీ చరిత్రలోనే అత్యధికం
- రూ. 10 లక్షల కోట్లకు ఆదాయం

న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్(ఆర్ఐఎల్) గత ఆర్థిక సంవత్సరం(2022-23) చివరి త్రైమాసికంలో సరికొత్త రికార్డును సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి-మార్చి(క్యూ4)లో నికర లాభం 19 శాతం ఎగసి రూ. 19,299 కోట్లను తాకింది. ఒక త్రైమాసికానికి కంపెనీ చరిత్రలోనే ఇది అత్యధికంకాగా.. అంతక్రితం ఏడాది(2021-22) క్యూ4లో రూ. 16,203 కోట్లు మాత్రమే ఆర్జించింది. రిటైల్, టెలికం విభాగాలతోపాటు చమురు, పెట్రోకెమికల్స్ బిజినెస్ వృద్ధి ఇందుకు దోహదం చేసింది. మొత్తం ఆదాయం సైతం రూ. 2.14 లక్షల కోట్ల నుంచి రూ. 2.19 లక్షల కోట్లకు బలపడింది. ఇక మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి రూ. 66,702 కోట్ల నికర లాభం ఆర్జించింది. ఇది కూడా సరికొత్త రికార్డుకాగా.. 2021-22లో రూ. కేవలం 60,705 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం దాదాపు రూ. 10 లక్షల కోట్లకు చేరింది. 2021-22లో రూ. 7.36 లక్షల కోట్ల ఆదాయం మాత్రమే అందుకుంది. పూర్తి ఏడాదికి ఆర్ఐఎల్ నిర్వహణ లాభం(ఇబిటా) తొలిసారి రూ. 1,54,691 కోట్లను తాకింది. ఇది 23 శాతం వృద్ధి. ఈ కాలంలో పెట్టుబడి వ్యయాలు రూ. 1,41,809 కోట్లుకాగా.. కంపెనీవద్దగల రూ. 1,93,282 కోట్ల నగదు బ్యాలెన్స్‌ను మినహాయిస్తే నికర రుణ భారం వార్షిక ఇబిటాకంటే తక్కువగా రూ. 1,10,218 కోట్లుగా నమోదైంది.

అన్ని విభాగాల జోరు: క్యూ4లో ఆర్ఐఎల్ ఇబిటా 22 శాతం జంప్‌చేసి రూ. 41,389 కోట్లను తాకింది. రిఫైనింగ్, పెట్రోకెమికల్స్(ఓటూసీ) ఇబిటా 14 శాతంపైగా ఎగసి రూ. 16,293 కోట్లకు, టెలికంసహా డిజిటల్ సర్వీసులు 17 శాతం మెరుగుపడి రూ. 12,767 కోట్లకు, రిటైల్ విభాగం 33 శాతం దూసుకెళ్లి రూ. 4,769 కోట్లకు, ఆయిల్, గ్యాస్ ఇబిటా రెట్టింపై రూ. 3,801 కోట్లకు చేరాయి. డీజిల్, ఏటీఎఫ్ ఎగుమతులపై విండ్‌ఫాల్ ట్యాక్స్ లాభాలపై రూ. 711 కోట్లమేర ప్రభావం చూపినట్లు ఆర్ఐఎల్ పేర్కొంది. అంతక్రితం క్యూ4లో రూ. 1,898 కోట్లమేర ప్రభావం పడినట్లు ప్రస్తావించింది.

ఆర్ఐఎల్ షేరు స్వల్ప వృద్ధితో 2,351 వద్ద క్లోజైంది. మార్కెట్ ముగిశాక ఫలితాలు వెలువడ్డాయి.



ఆర్థిక వృద్ధిలో భాగం

డిజిటల్ కనెక్టివిటీ, ఆర్గనైజ్‌డ్ రిటైల్ విభాగాలలో కంపెనీ కార్యకలాపాలు వ్యవస్థాగత సామర్థ్యాలకు బలాన్నిస్తున్నాయి. తద్వారా ప్రపంచంలోనే వేగవంత వృద్ధిని సాధిస్తున్న ఆర్థిక వ్యవస్థలో భాగమవుతున్నాయి. ఫైనాన్షియల్ సర్వీసుల విభాగాన్ని విడదీసి జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ పేరుతో లిస్ట్ చేయనున్నాం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023-24)లో ఎంజే ఫీల్డ్, ఆర్‌క్లస్టర్ తదితరాలతో కలిపి కేజీ-డీ6 బ్లాకులో గ్యాస్ ఉత్పత్తి రోజుకి 3 కోట్ల ప్రామాణిక ఘనపుమీటర్లకు చేరే వీలుంది.

-ముకేశ్ అంబానీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్, ఎండీ

రిలయన్స్ రిటైల్ భళా

గతేడాది(2022-23) క్యూ4(జనవరి-మార్చి)లో రిలయన్స్ రిటైల్ నికర లాభం 13 శాతం వృద్ధితో రూ. 2,415 కోట్లను తాకింది. 2021-22 క్యూ4లో రూ. 2,139 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం మరింత అధికంగా 21 శాతం ఎగసి రూ. 61,559 కోట్లకు చేరింది. అంతక్రితం క్యూ4లో రూ. 50,834 కోట్ల అమ్మకాలు సాధించింది. ఆదాయంలో డిజిటల్, న్యూ కామర్స్ బిజినెస్ వాటా 17 శాతానికి చేరింది. ఇక మొత్తం స్టోర్ల సంఖ్య 18,040కు చేరింది. క్యూ4లో 2,844 స్టోర్లను జత చేసుకుంది. సర్వీసులతో కలిపి క్యూ4లో ఆదాయం రూ. 69,267 కోట్లను తాకగా.. ఇబిటా 33 శాతం వృద్ధితో రూ. 4,914 కోట్లకు చేరింది. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి మొత్తం ఆదాయం 32 శాతం జంప్‌చేసి రూ. 2,30,931 కోట్లను తాకింది. నికర లాభం 30 శాతం ఎగసి రూ. 9,181 కోట్లయ్యింది. సర్వీసులతో కలిపి స్థూల ఆదాయం రూ. 2,60,364 కోట్లుగా నమోదైంది. దేశీయంగా రిటైల్ రంగంలో రిలయన్స్ అత్యుత్తమ వృద్ధిని చూపుతున్నట్లు కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఈషా ఎం.అంబానీ పేర్కొన్నారు.

జియో లాభం జూమ్

క్యూ4లో రూ. 4,984 కోట్లు



న్యూఢిల్లీ: ఆర్ఐఎల్ అనుబంధ సంస్థ, డిజిటల్ సర్వీసుల దిగ్గజం జియో ప్లాట్‌ఫామ్స్ గత ఆర్థిక సంవత్సరం(2022-23) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి-మార్చి(క్యూ4)లో నికర లాభం 16 శాతం బలపడి రూ. 4,984 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2021-22) క్యూ4లో రూ. 4,313 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 14 శాతం పుంజుకుని రూ. 25,465 కోట్లను తాకింది. అంతక్రితం క్యూ4లో రూ. 22,261 కోట్ల ఆదాయం నమోదైంది. ఒక్కో వినియోగదారునిపై సగటు ఆదాయం (ఏఆర్‌పీయూ) 6.7 శాతం మెరుగై రూ. 178.8కు చేరింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం 23 శాతం జంప్‌చేసి రూ. 19,124 కోట్లయ్యింది. 2021-22లో రూ. 15,487 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం 20 శాతం ఎగసి రూ. 1,15,099 కోట్లకు చేరింది. క్యూ4లో 2.9 కోట్లమంది జత కలవడంతో మొత్తం కస్టమర్ల సంఖ్య 7 శాతం పెరిగి 43.93 కోట్లను తాకింది.

సంపదలో 6 శాతం పుత్తడికి..



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: భారత్‌తోపాటు చైనాకు చెందిన అల్ట్రా-హై నెట్ వర్త్ వ్యక్తులు (యూహెచ్ఎన్‌డబ్ల్యూఐ) గత సంవత్సరం పెట్టుబడి పెట్టదగిన సంపదలో 6 శాతం బంగారంలో ఉంచారని ప్రాపర్టీ కన్సల్టెంట్ నైట్ ఫ్రాంక్ ఇండియా నివేదిక వెల్లడించింది. '8 శాతం కేటాయింపులతో ఆస్ట్రేలియాకు చెందిన యూహెచ్ఎన్‌డబ్ల్యూఐలు తొలి స్థానంలో నిలిచారు. ప్రపంచవ్యాప్తంగా సగటు 3 శాతం కాగా, ఆసియా పసిఫిక్ ప్రాంతంలో ఇది 4 శాతంగా ఉంది. పెట్టుబడి పెట్టదగిన సంపదలో బంగారానికి భారతీయులు చేసిన కేటాయింపులు 2018లో 4 శాతం నమోదైంది. సంవత్సరాలుగా పుత్తడి అందించిన గణనీయమైన రాబడి ఈ పెరుగుదలకు కారణం. 2018-19 నుంచి 2022-23 మధ్య పసిడి 69 శాతం కంటే ఎక్కువగా రాబడిని అందించింది. మహమ్మారి తక్కువ వడ్డీ రేటుకు దారితీసింది. అంతర్జాతీయ కేంద్ర బ్యాంకులు అనుసరించిన సులభ నగదు లభ్యత వ్యూహం ధరలను భారీగా పెంచింది' అని నివేదిక వివరించింది. ఆర్థిక అనిశ్చితి నేపథ్యంలో స్థిరత్వాన్ని అందించే, ద్రవ్యోల్బణానికి వ్యతిరేకంగా పనిచేసే సాధనాలను ఆశ్రయిస్తున్నారని నైట్ ఫ్రాంక్ ఇండియా సీఎండీ శిశిర్ బైజల్ తెలిపారు.


హింద్ జింక్ లాభం క్షీణత

క్యూ4లో రూ. 2,583 కోట్లకు పరిమితం

న్యూఢిల్లీ: హిందుస్తాన్ జింక్ గత ఆర్థిక సంవత్సరం(2022-23) చివరి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి-మార్చి (క్యూ4)లో నికర లాభం 12 శాతం క్షీణించి రూ. 2,583 కోట్లకు పరిమితమైంది. పెరిగిన వ్యయాలు ప్రభావం చూపాయి. అంతక్రితం ఏడాది(2021-22) క్యూ4లో రూ. 2,928 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 9,074 కోట్ల నుంచి రూ. 8,863 కోట్లకు నీరసించింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం రూ. 10,511 కోట్లకు ఎగసింది.

సెన్సెక్స్ లాభం, నిఫ్టీ అక్కడే

- ట్రేడింగ్‌లో ఒడిదుడుకులు
- ఆటో, మెటల్ షేర్లలో అమ్మకాలు



ముంబై: జాతీయ, అంతర్జాతీయంగా ట్రేడింగ్ ప్రభావితం చేసే కీలకాంశాలేవీ లేకపోవడంతో స్టాక్ సూచీలు శుక్రవారం మిశ్రమంగా ముగిశాయి. ఫ్లాటుగా ప్రారంభమైన సూచీలు క్రమంగా నష్టాల్లోకి జారుకున్నాయి. మిడ్ సెషన్ నుంచి మెటల్, ఎఫ్ఎంసీజీ, ఐటీ షేర్లు రాణించడంతో ఆరంభ నష్టాలను భర్తీ చేసుకోగలిగాయి. ఉదయం సెన్సెక్స్ 94 పాయింట్ల నష్టంతో 59,538 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 369 పాయింట్ల పరిధిలో 59,413 వద్ద కనిష్టాన్ని, 59,781 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 23 పాయింట్లు పెరిగి 59,655 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 16 పాయింట్ల లాభంతో 17,640 ప్రారంభమైంది. ఇంట్రాడేలో 17,554 - 17,663 వద్ద రేంజ్‌లో కదలాడింది. ఆఖరికి ఎలాంటి లాభనష్టాలకు లోనవకుండా గురువారం ముగింపు 17,624 వద్దే స్థిరపడింది. ఎఫ్ఎంసీజీ, ఐటీ, మీడియా, ఫార్మా షేర్లకు రాణించాయి. మెటల్, ఆటో, ఫైనాన్స్, బ్యాంకింగ్, రియల్టీ, వినిమయ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి.

సాక్షి స్పోర్ట్స్



ఆధిక్యంలో అర్జున్

సాటీ జుల్డిజ్ ఓపెన్ అంతర్జాతీయ ర్యాపిడ్ చెస్ టోర్నీలో ఎనిమిది రౌండ్ల తర్వాత తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ ఏడు పాయింట్లతో ఒంటరిగా ఆధిక్యంలో నిలిచాడు. శుక్రవారం జరిగిన నాలుగు గేముల్లో మూడింట గెలిచిన అర్జున్, మరో గేమ్‌ను 'డ్రా' చేసుకున్నాడు. వఖిదోవ్ (ఉజ్బెకిస్తాన్), బిబిసారా (కజకిస్తాన్), బోరిస్ గెల్ఫాండ్ (ఇజ్రాయెల్)లపై నెగ్గిన అర్జున్ జర్మనీ గ్రాండ్‌మాస్టర్ విన్సెంట్ కీమెర్‌తో జరిగిన గేమ్‌ను 'డ్రా'గా ముగించాడు. 12 మంది అగ్రశ్రేణి ప్లేయర్ల మధ్య 11 రౌండ్లపాటు ఈ టోర్నీని నిర్వహిస్తున్నారు. నేడు చివరి మూడు రౌండ్‌లు జరుగుతాయి.

'పారిస్' టికెట్ల కోసం 40 లక్షల మంది దరఖాస్తు

వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్ క్రీడలను ప్రత్యక్షంగా తిలకించేందుకు రెండో దశలో 40 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. వచ్చే నెలలో ఆన్‌లైన్ లాటరీ ద్వారా 13 లక్షల మందిని ఎంపిక చేస్తారు. తొలి దశలో 32 లక్షల టికెట్లు అమ్ముడుపోయాయి.

పసిడి పోరుకు జ్యోతి సురేఖ జోడీ


జ్యోతి సురేఖ, ఓజస్ ప్రవీణ్

అంటాల్యా (తుర్కియే): ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్-1 టోర్నీలో కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత్‌కు పతకం ఖరారైంది. భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ, మహారాష్ట్ర ప్లేయర్ ఓజస్ ప్రవీణ్ దేవ్‌తలె ద్వయం ఫైనల్లోకి దూసుకెళ్లింది. తొలి రౌండ్‌లో 'బై' పొందిన సురేఖ-ఓజస్ రెండో రౌండ్‌లో 159-157తో మరియా-గైల్స్ (లక్సెంబర్గ్)లపై... క్వార్టర్ ఫైనల్లో 159-156తో సోఫీ-అడ్రియన్ గోంటీర్ (ఫ్రాన్స్)లపై... సెమీఫైనల్లో 157-155తో ఫాతిన్ నూర్‌ఫతే-జువైది (మలేసియా)లపై గెలిచారు. నేడు జరిగే ఫైనల్లో చెన్ యి సువాన్-చెన్ చియె లున్ (చైనీస్ తైపీ)లతో జ్యోతి సురేఖ-ఓజస్ తలపడతారు. రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో మాత్రం అతాను దాస్-భజన్ కౌర్ (భారత్) ద్వయం తొలి రౌండ్‌లో 3-5తో డెన్మార్క్ జోడీ చేతిలో ఓడిపోయింది.



ధీరజ్ అద్భుతం...
పురుషుల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ ధీరజ్ బొమ్మదేవర అద్భుత ప్రదర్శనతో సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. తొలి రౌండ్‌లో ధీరజ్ 6-0తో థియో కార్బొనెటి (బెల్జియం)పై, రెండో రౌండ్‌లో 6-4తో కెజియా చాబిన్ (స్విట్జర్లాండ్)పై, మూడో రౌండ్‌లో 6-4తో జిగా రావ్నికర్ (స్లొవేనియా)పై, నాలుగో రౌండ్‌లో 6-5తో అమెరికా దిగ్గజం బ్రాడీ ఇలిసన్‌పై, క్వార్టర్ ఫైనల్లో 6-4తో తరుణ్‌దీప్ రాయ్ (భారత్)పై గెలుపొందాడు. ప్రపంచ మాజీ చాంపియన్, మూడు ఒలింపిక్ పతకాలు నెగ్గిన ఇలిసన్‌తో జరిగిన మ్యాచ్‌లో ధీరజ్ 'షూట్ ఆఫ్'లో గెలిచాడు. ఇద్దరూ 10 పాయింట్లు స్కోరు చేసినా ధీరజ్ కొట్టిన బాణం 10 పాయింట్ల లక్ష్యబిందువుకు అతి సమీపంలో ఉండటంతో విజయం ఖరారు చేసుకున్నాడు.

మే 28న అహ్మదాబాద్‌లో ఐపీఎల్ ఫైనల్



న్యూఢిల్లీ: ఐపీఎల్ 16వ సీజన్ ప్లే ఆఫ్ దశ షెడ్యూల్‌ను బీసీసీఐ శుక్రవారం ప్రకటించింది. మే 23న క్వాలిఫయర్-1 మ్యాచ్‌కు... మే 24న ఎలిమినేటర్ మ్యాచ్‌కు చెన్నైలోని ఎం.ఎ.చిదంబరం స్టేడియం వేదికగా నిలుస్తుంది. మే 26న అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం క్వాలిఫయర్-2 మ్యాచ్‌కు, మే 28న ఫైనల్ మ్యాచ్‌కు ఆతిథ్యం ఇస్తుందని బీసీసీఐ కార్యదర్శి జై షా తెలిపారు.

సందీప్ లమిచానె రికార్డు



కీర్తిపూర్ (నేపాల్): వన్డే క్రికెట్‌లో అత్యంత వేగంగా 100 వికెట్లు పడగొట్టిన బౌలర్‌గా నేపాల్ స్పిన్నర్ సందీప్ లమిచానె రికార్డు నెలకొల్పాడు. ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) ప్రీమియర్ కప్ టోర్నీలో భాగంగా ఒమన్‌తో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో సందీప్ మూడు వికెట్లు తీశాడు. తద్వారా 42 మ్యాచ్‌లోనే 100 వికెట్ల మైలురాయిని అందుకున్న తొలి బౌలర్‌గా సందీప్ నిలిచాడు. ఇప్పటి వరకు ఈ రికార్డు అఫ్గానిస్తాన్ స్పిన్నర్ రషీద్ ఖాన్ (44 మ్యాచ్‌లు) పేరిట ఉండేది.

సెమీస్‌లో బోపన్న జోడీ



బార్సిలోనా: బార్సిలోనా ఓపెన్ ఏటీపీ-500 టెన్నిస్ టోర్నీలో రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో బోపన్న-ఎబ్డెన్ ద్వయం 6-2, 6-4తో సాంటియాగో గొంజాలెజ్ (మెక్సికో)-ఎడ్వర్డ్ రోజర్ వాసెలిన్ (ఫ్రాన్స్) జంటను ఓడించింది. 64 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో బోపన్న, ఎబ్డెన్ రెండు ఏస్‌లు సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. తమ సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశారు.

చెన్నై చమక్...

బాధ్యత లేని బ్యాటింగ్, పసలేని బౌలింగ్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్ భంగపడింది. పటిష్టమైన బౌలింగ్, కట్టుదిట్టమైన ఫీల్డింగ్‌తో ప్రత్యర్థిని కట్టడి చేసిన చెన్నై సూపర్ కింగ్స్ ... సులభమైన లక్ష్యాన్ని ఎలాంటి ఇబ్బంది లేకుండా ఛేదించింది. జడేజా స్పిన్ మ్యాజిక్, కాన్వే విలువైన ఫిఫ్టీతో చెన్నై ఈ సీజన్‌లో నాలుగో విజయాన్ని నమోదు చేసింది.

- సన్‌రైజర్స్‌పై ఏడు వికెట్లతో విజయం
- తిప్పేసిన జడేజా
- మెరిపించిన కాన్వే


కాన్వే


జడేజా

చెన్నై: ఐపీఎల్‌లో చెన్నై దూకుడు పెరుగుతోంది. హైదరాబాద్‌ను బౌలింగ్, ఫీల్డింగ్, బ్యాటింగ్ ఇలా అన్నిరంగాల్లో కట్టడి చేసిన సూపర్‌కింగ్స్ 7 వికెట్లతో జయభేరి మోగించింది. మొదట సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 134 పరుగులు చేసింది. అభిషేక్ శర్మ (26 బంతుల్లో 34; 3 ఫోర్లు, 1 సిక్స్) మెరుగ్గా ఆడాడు. చెన్నై బౌలర్లలో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రవీంద్ర జడేజా 3 వికెట్లు తీశాడు. అనంతరం సూపర్ కింగ్స్ 18.4 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 138 పరుగులు చేసి గెలిచింది. కాన్వే (57 బంతుల్లో 77 నాటౌట్; 12 ఫోర్లు, 1 సిక్స్) అజేయంగా నిలిచాడు. మార్కండేకు 2 వికెట్లు దక్కాయి.

జడేజా మాయ...
హైదరాబాద్ ఇన్నింగ్స్‌ను ఎక్కడికక్కడ చెన్నై బౌలర్లు కట్టడి చేశారు. పవర్ ప్లేలో ఓపెనర్ హ్యారీ బ్రూక్ (13 బంతుల్లో 18; 3 ఫోర్లు) బౌండరీలతో వేగం పెంచినా... అంతలోనే ఆకాశ్ సింగ్ కళ్లెం వేశాడు. తర్వాత హిట్టర్ రాహుల్ త్రిపాఠి (21 బంతుల్లో 21; 1 ఫోర్, 1 సిక్స్) ఆడినా, కెప్టెన్ మార్క్‌రమ్ (12 బంతుల్లో 12; 1 ఫోర్) బ్యాటింగ్‌కు దిగినా... క్లాసెన్ (16 బంతుల్లో 17; 1 ఫోర్) క్రీజులోకి వచ్చినా... నిలిచింది కాసేపే! ధాటైన ఇన్నింగ్స్, చితగ్గొట్టే ఓవర్ ఒక్కటైన కనిపించలేదు. ఉన్నంతలో అభిషేక్ శర్మ చేసిన స్కోరే కాస్త మెరుగనిపించింది. అనుభవజ్ఞుడైన స్పిన్నర్ జడేజా కీలకమైన అభిషేక్, రాహుల్ త్రిపాఠి, మయాంక్ అగర్వాల్ (2) వికెట్లతో సన్‌రైజర్స్ స్కోరు ఏమాత్రం పెరగకుండా అడ్డుకున్నాడు.

కాన్వే ధనాధన్...
చెన్నై ముందున్న సులువైన లక్ష్యాన్ని రుతురాజ్ గైక్వాడ్ (30 బంతుల్లో 35; 2 ఫోర్లు) బౌండరీతో మొదలుపెట్టాడు. డెవాన్ కాన్వే ధనాధన్ ఆటతో పరుగులు వేగంగా వచ్చాయి. మార్కో జాన్సెన్ వేసిన ఆరో ఓవర్‌ను కాన్వే ఆదేపనిగా దంచేశాడు. ఎదుర్కొన్న 5 బంతుల్ని 4, 4, 6, 4, 4లుగా బౌండరీలకు తరలించడంతో 23 పరుగులొచ్చాయి. దీంతో పవర్‌ప్లేలో చెన్నై స్కోరు 60/0. టార్గెట్‌లో అటుఇటుగా సగం పనైపోయింది. 11వ ఓవర్లో రుతురాజ్ రనౌట్ కావడంతో 87 పరుగుల ఓపెనింగ్ భాగస్వామ్యానికి తెరపడింది. తర్వాత వచ్చిన అజింక్య రహానే (10 బంతుల్లో 9; 1 ఫోర్), ఇంపాక్ట్ ప్లేయర్ అంబటి రాయుడు (9 బంతుల్లో 9; 1 ఫోర్) విఫలమైనా కాన్వే అజేయంగా నిలబడి జట్టును గెలిపించాడు.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
రాజస్తాన్	6	4	2	8	1.043
లక్నో	6	4	2	8	0.709
చెన్నై	6	4	2	8	0.355
గుజరాత్	5	3	2	6	0.192
బెంగళూరు	6	3	3	6	-0.068
ముంబై	5	3	2	6	-0.164
పంజాబ్	6	3	3	6	-0.298
కోల్‌కతా	6	2	4	4	0.214
హైదరాబాద్	6	2	4	4	-0.794
ఢిల్లీ	6	1	5	2	-1.183

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

గుజరాత్ x లక్నో (మ. గం. 3:30 నుంచి)
ముంబై x పంజాబ్ (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

స్కోరు వివరాలు

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: బ్రూక్ (సి) రుతురాజ్ (బి) ఆకాశ్ 18; అభిషేక్ శర్మ (సి) రహానే (బి) జడేజా 34; రాహుల్ త్రిపాఠి (సి) ఆకాశ్ (బి) జడేజా 21; మార్క్‌రమ్ (సి) ధోని (బి) తీక్షణ 12; క్లాసెన్ (సి) రుతురాజ్ (బి) పతిరణ 17; మయాంక్ (స్టంప్డ్) ధోని (బి) జడేజా 2; జాన్సెన్ (నాటౌట్) 17; సుందర్ (రనౌట్) 9; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 134. వికెట్ల పతనం:** 1-35, 2-71, 3-84, 4-90, 5-95, 6-116, 7-134. **బౌలింగ్:** ఆకాశ్ 3-0-17-1, తుషార్ దేశ్‌పాండే 3-0-26-0, తీక్షణ 4-0-27-1, మొయిన్ అలీ 2-0-18-0, జడేజా 4-0-22-3, పతిరణ 4-0-22-1.

చెన్నై సూపర్ కింగ్స్ ఇన్నింగ్స్: రుతురాజ్ (రనౌట్) 35; కాన్వే (నాటౌట్) 77; రహానే (సి) మార్క్‌రమ్ (బి) మార్కండే 9; రాయుడు (బి) మార్కండే 9; అలీ (నాటౌట్) 6; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (18.4 ఓవర్లలో 3 వికెట్లకు) 138. వికెట్ల పతనం:** 1-87, 2-110, 3-122. **బౌలింగ్:** భువనేశ్వర్ 2-0-10-0, జాన్సెన్ 3-0-37-0, మార్క్‌రమ్ 1-0-11-0, సుందర్ 2.4-0-16-0, మార్కండే 4-0-23-2, ఉమ్రాన్ 3-0-18-0, డాగర్ 3-0-21-0.


సచిన్, కోహ్లి, రోహిత్‌ల 'బ్లూ టిక్' మార్క్ తొలగింపు

- ఈ జాబితాలో ధోని, సింధు, సైనా, సానియా, నిఖత్ జరీన్ తదితరులు
- డబ్బులు చెల్లిస్తేనే 'బ్లూ టిక్' సౌకర్యం కల్పిస్తున్న ట్విట్టర్



న్యూఢిల్లీ: ప్రముఖ సోషల్ నెట్‌వర్క్ సైట్ 'ట్విట్టర్' సెలబ్రిటీలకు మింగుడు పడని నిర్ణయం తీసుకుంది. క్రికెట్ దిగ్గజాలు సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లి, బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు తదితర తారల ట్విట్టర్ ఖాతాలకు 'బ్లూ టిక్' మార్క్‌లను తొలగించింది. ఈ మార్క్‌లు అధికారిక ఖాతా (వెరిఫైడ్ ఐడెంటిటీ) అనే ముద్ర కలిగి ఉంటాయి. ఇన్నాళ్లు సెలబ్రిటీలు, జర్నలిస్టులు, ఉన్నతస్థాయి ప్రభుత్వ ఉద్యోగులకు ఉచితంగా 'బ్లూ టిక్' మార్క్‌లను కల్పించింది. అయితే ఈ మైక్రో బ్లాగ్ సైట్‌ను టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ కొనుగోలు చేశాక నిబంధనలు మార్చారు. ఇందులో భాగంగా ఇకపై (ఏప్రిల్ 20 నుంచి) చెల్లింపు ఖాతాలకే 'బ్లూ టిక్' మార్క్‌లు కేటాయించాలని ట్విటర్ నిర్ణయించడంతో క్రీడా దిగ్గజాలు, సినీ తారలు 'బ్లూ టిక్'ను కోల్పోయారు. సచిన్, కోహ్లిలే కాదు... ధోని, రోహిత్ శర్మ, సైనా నెహ్వాల్, నీరజ్ చోప్రా, బజరంగ్ పూనియా, వినేశ్ ఫొగాట్, బాక్సర్ నిఖత్ జరీన్, సానియా మీర్జా, సునీల్ ఛెత్రి, పీఆర్ శ్రీజేశ్, అంతర్జాతీయ దిగ్గజాలు ఫెడరర్, రాఫెల్ నాదల్ (టెన్నిస్), క్రిస్టియానో రొనాల్డో, ఎంబాపె (ఫుట్‌బాల్), ఖాతాలకు కూడా 'బ్లూ మార్క్'లు కనిపించవు.

ఏమిటీ 'బ్లూ టిక్'?



సచిన్ లేదంటే ఇంకే హీరో పేరు మీద ఇతరులు కూడా నకిలీ ఖాతాలు తెరుస్తారు. కానీ అసలైన సచిన్ టెండూల్కర్ ట్విట్టర్ ఖాతా ఏదంటే మాత్రం 'బ్లూ టిక్'తో వెరిఫైడ్ ఐడెంటిటీ తేలిపోతుంది. ఇప్పుడీ అధికారిక ముద్ర కోసం డబ్బులు చెల్లించాల్సి వస్తోంది. వెరిఫైడ్ ఐడెంటిటీ కావాలంటే వెబ్ పోర్టల్‌కు రూ. 650, మొబైల్ ఫోన్లకు రూ. 900 ప్రతి నెలా చెల్లించాలి. 'బ్లూటిక్' మార్క్ తొలగించడంతో సచిన్ తన అధికారిక ఖాతాలో జాతీయ పతాకాన్ని పెట్టుకొని ఇదే నా 'బ్లూ టిక్ వెరిఫికేషన్' అని కామెంట్ జత చేశాడు.

చంద్రబాబుపై దాడిని ఖండించిన పవన్



సాక్షి, అమరావతి: ప్రతిపక్ష పార్టీలను చూసి అధికార పార్టీ అభద్రతా భావానికి లోనవుతోందని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అన్నారు. ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంలో ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబుపై అధికార పార్టీ నేతలు రాళ్లతో దాడి చేయడాన్ని ఖండిస్తున్నట్లు శుక్రవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిపక్ష నాయకుల పర్యటనలకు పోలీసులు భద్రత కల్పించాలని కోరారు.

జగన్ లండన్‌లో కాపురం పెట్టడం ఖాయం: లోకేశ్



కర్నూలు(సెంట్రల్): మూడు రాజధానులంటూ సీఎం జగన్ ఊసరవెల్లి రాజకీయాలు చేస్తున్నారని, ఎక్కడా ఒక ఇటుక కూడా వేసింది లేదని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ధ్వజమెత్తారు. 'యువగళం' పాదయాత్రలో భాగంగా శుక్రవారం ఆదోని నియోజకవర్గంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్ర ప్రజలు ఊసరవెల్లి జగన్‌ను ఇటీవల ఎమ్మెల్సీ ఎన్నికల్లో చాచికొట్టినా బుద్ధి రాలేదని, ఇప్పుడు మళ్లీ సెప్టెంబర్‌లో వైజాగ్‌లో కాపురం పెడతానని సీఎం చెప్పడం విడ్డూరమని విమర్శించారు. ఇప్పటికే జగన్ బెంగళూరు, తాడేపల్లి, ఇడుపులపాయ, హైదరాబాద్‌లలో కాపురం పెట్టారని, కొత్తగా వైజాగ్‌లో కాపురం పెడతానని చెబుతున్నారని, 2024లో ప్రజలిచ్చే తీర్పుతో లండన్‌లో కాపురం పెట్టడం ఖాయమని ఎద్దేవా చేశారు. సీఎం జగన్ తెచ్చిన శాశ్వత గృహ హక్కు పథకం, రూ.10 వేలు కడితే ఇళ్ల రిజిస్ట్రేషన్.. పనికిరాని పథకాలని లోకేశ్ అన్నారు. నన్ను గో బ్యాక్ అన్న వైఎస్సార్‌సీపీ నేతలు కర్నూలు అభివృద్ధిపై చర్చకు సిద్ధమా? అని లోకేశ్ ప్రశ్నించారు. ఆదోనిలో ముగ్గురు ఎమ్మెల్యేలు ఉన్నారని, ఒకరూ సాయిప్రసాదరెడ్డి, ఇంకొకరు ఆయన కుమారుడు, మరొకరు ఆయన అల్లుడని, ప్రతిరోజూ వారు ఆదోనిని కేకులా కోసుకొని తింటున్నారని ఆరోపించారు.

'పీఎస్ఎల్‌వీ-సీ55' కౌంట్‌డౌన్ ప్రారంభం

నేడు మధ్యాహ్నం 2.20 గంటలకు ప్రయోగం

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో), న్యూ స్పేస్ ఇండియా సంయుక్తంగా తిరుపతి జిల్లా సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి శనివారం మధ్యాహ్నం 2.20 గంటలకు పీఎస్ఎల్‌వీ-సీ55 ఉపగ్రహ వాహకనౌకను ప్రయోగించనున్నారు. ఈ మేరకు శుక్రవారం మధ్యాహ్నం 12.50 గంటలకు కౌంట్‌డౌన్ ప్రక్రియను ప్రారంభించారు. మొత్తం 25.30 గంటల కౌంట్‌డౌన్ అనంతరం పీఎస్ఎల్‌వీ-సీ55 రాకెట్ ప్రయోగాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. కౌంట్‌డౌన్ ప్రక్రియను ఇస్రో చైర్మన్ సోమనాథ్ పర్యవేక్షిస్తున్నారు. ఈ ప్రయోగంలో సింగపూర్‌కు చెందిన 741 కిలోల బరువు కలిగిన టెలియోస్-2, 16 కిలోల బరువు కలిగిన లూమిలైట్-4 అనే రెండు ఉపగ్రహాలను భూమికి 570 కిలోమీటర్ల ఎత్తులోని సూర్యానువర్తన ధ్రువ కక్ష్య (సన్ సింక్రనస్ ఆర్బిట్)లోకి ప్రవేశపెట్టనున్నారు. 44.4 మీటర్ల పొడవు కలిగిన రాకెట్... 228.355 టన్నుల బరువుతో భూమి నుంచి నింగికి పయనమై 20.35 నిమిషాల్లో ప్రయోగాన్ని పూర్తి చేసే విధంగా ఇస్రో శాస్త్రవేత్తలు డిజైన్ చేశారు. అదేవిధంగా ఈ రాకెట్‌లోని నాలుగో దశ (పీఎస్-4)తో ఒక ప్రత్యేక ప్రయోగం చేస్తున్నారు. 20.35 నిమిషాల వ్యవధిలో ఉపగ్రహాలను నిర్ణీత కక్ష్యలోకి వదిలిపెట్టిన తర్వాత 1.33 నిమిషాలకు పీఎస్-4ను రీస్టార్ట్ చేస్తారు. అది కొద్దిసేపటి తర్వాత ఆరిస్-2, పైలెట్, అర్కా-200, స్టార్‌బెర్రీ, డీఎస్‌వోఎల్, డీఎస్‌వోడీ-3యూ, డీఎస్‌వోడీ-06యూ అనే చిన్నపాటి పేలోడ్లను వివిధ రకాల కక్ష్యల్లో వదిలిపెడుతుంది. ఈ తరహా ప్రయోగం ఇక్కడి నుంచి తొలిసారి చేస్తున్నారు.

వైద్య పీజీసీట్ల పెంపులో రికార్డు

- ప్రభుత్వ చర్యల ఫలితంగా 2019 నుంచి ఇప్పటికి 627 పీజీ సీట్లు పెరిగాయి
- వచ్చే విద్యాసంవత్సరంలో 5 వైద్య కళాశాలల ప్రారంభం
- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి రజిని



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్యకళాశాలల్లో పీజీ సీట్ల పెంపులో సీఎం జగన్ ప్రభుత్వం రికార్డు సృష్టించిందని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. వైద్య కళాశాలల్లో మెరుగుపరిచిన వసతులు, చేపట్టిన నియామకాల ఫలితంగా 2019లో 966 ఉన్న పీజీ సీట్ల సంఖ్య ఇప్పుడు 1,593కు చేరిందని తెలిపారు. 2019 నుంచి ఇప్పటివరకు 627 సీట్లు పెంచుకోగలిగామన్నారు. ఆమె శుక్రవారం మంగళగిరి ఏపీఐఐసీ భవనంలోని తన కార్యాలయంలో ప్రాధాన్యత వైద్య కళాశాలల ఏర్పాటు, నాడు-నేడు పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చే విద్యాసంవత్సరం నుంచి రాజమహేంద్రవరం, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల, విజయనగరం వైద్యకళాశాలల్లో అడ్మిషన్లు చేపట్టాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఇప్పటికే విజయనగరం కళాశాలకు అనుమతులు వచ్చాయన్నారు. మిగిలిన నాలుగు కళాశాలలకు అనుమతులు వస్తాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర చరిత్రలో తొలిసారి ఒకే ఏడాది ఐదు ప్రభుత్వ వైద్యకళాశాలలు ప్రారంభమవుతాయని, ఇది సీఎం జగన్ ప్రభుత్వం సాధించబోయే విజయాల్లో ఒకటిగా నిలుస్తుందని చెప్పారు. 2024-25లో ఆదోని, పులివెందుల, పాడేరు వైద్యకళాశాలలు ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నామన్నారు. పిడుగురాళ్ల కళాశాల నిర్మాణం శరవేగంగా జరుగుతోందని చెప్పారు. ఇక్కడ తొలుత 250 పడకల ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. తుదిదశలో ఈ బెడ్ల సంఖ్య 600కు పెరుగుతుందని చెప్పారు. ఈ ఆస్పత్రిని రెండునెలల్లో ప్రారంభించబోతున్నామన్నారు. పలాసలో కిడ్నీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని జూన్‌లో ప్రారంభించనున్నట్లు తెలిపారు. కర్నూలులో నిర్మాణంలో ఉన్న స్టేట్ క్యాన్సర్ ఆస్పత్రి పనులు తుదిదశకు చేరాయని, ఈ ఆస్పత్రి కూడా రెండునెలల్లో ప్రజలకు అందుబాటులోకి రానుందని చెప్పారు. కడపలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయన్నారు. విజయవాడ, తిరుపతి, విశాఖపట్నంలో నిర్మాణంలో ఉన్న స్టేట్ డయాగ్నొస్టిక్ సెంటర్లను కూడా మరో రెండునెలల్లో ప్రారంభిస్తామని ఆమె చెప్పారు. ఈ సమీక్షలో ఏపీఎస్ఎంఐడీసీ ఎండీ మురళీధర్‌రెడ్డి, అకడమిక్ డీఎంఈ సత్యవరప్రసాద్ పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్సీ అండర్ 'కంట్రోల్'!

- పరీక్షల విభాగానికి కంట్రలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సహా మూడు పోస్టులు మంజూరు
- కొత్తగా న్యాయ విభాగం ఏర్పాటు
- మొత్తం 10 కొత్త పోస్టులకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్
- టీఎస్‌పీఎస్సీ ప్రతిపాదనలకు ఆమోదం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ)ను పటిష్టం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఉద్యోగ నియామకాల ప్రక్రియలో కీలకమైన పరీక్షల నిర్వహణ, ఫలితాల ప్రకటన, అర్హుల ఎంపిక ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, జవాబుదారీగా నిర్వహించేందుకు వీలుగా పత్యేక విభాగాలు, పోస్టుల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా కొత్తగా 10 పోస్టులను మంజూరు చేసింది. ముఖ్యంగా పరీక్షల విభాగంపై దృష్టి పెట్టి కీలకమైన కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సహా మూడు పోస్టులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

లీకేజీల కలకలంతో..

వివిధ అర్హత పరీక్షలకు సంబంధించి ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంతో టీఎస్‌పీఎస్సీ ఉక్కిరిబిక్కిరి అయ్యింది. ఓ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి ఇందులో కీలకంగా వ్యవహరించగా, ప్రధాన నిందితుల్లో కమిషన్‌కు చెందిన పలువురు ఉద్యోగులు కూడా ఉండటం సంచలనం సృష్టించింది. కమిషన్‌లో ఉద్యోగులపై అజమాయిషీ తగ్గిందని, నియామకాల్లో పలు స్థాయిలో పారదర్శకత లోపించిందనే విమర్శలు వెల్లువెత్తాయి. లీకేజీలతో ప్రతిష్ట మసకబారడంతో టీఎస్‌పీఎస్సీ నష్టనివారణ చర్యలు మొదలుపెట్టింది. పర్యవేక్షణ కట్టుదిట్టం చేసే దిశలో వివిధ స్థాయిల్లో అధికారులను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం, కమిషన్ ప్రతిపాదించిన 10 పోస్టులను మంజూరు చేసింది. వీటిల్లో పరీక్షల నిర్వహణ విభాగంలో మూడు పోస్టులు, సమాచార విభాగంలో రెండు పోస్టులు, నెట్‌వర్కింగ్ వ్యవస్థలో రెండు పోస్టులు, ప్రోగ్రామింగ్ విభాగంలో రెండు పోస్టులున్నాయి. కమిషన్‌లో ప్రత్యేకంగా న్యాయ విభాగం ఏర్పాటు చేస్తూ ఆ విభాగానికి ప్రత్యేక న్యాయ అధికారిని నియమించాలని కోరగా ప్రభుత్వం వెంటనే ఆమోదం తెలిపింది. ఈ 10 పోస్టులు కొత్తగా నియామకాలు చేపట్టాల్సినవే. ఇతర ప్రభుత్వ శాఖల నుంచి డిప్యుటేషన్ పద్ధతిలోనో లేక, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతిలోనో నియమించేలా కాకుండా శాశ్వత పద్ధతిలో భర్తీ చేయాలని ప్రభుత్వం సూచించింది. ఈ మేరకు పోస్టుల వారీగా స్కేలును సైతం ఖరారు చేస్తూ ఉత్తర్వులిచ్చింది. పరీక్షల నిర్వహణ ప్రత్యేక విభాగంపై అజమాయిషీకి ముగ్గురు అధికారులు ఉంటారు. సమాచారం గోప్యత తదితరాలకు మరో ఇద్దరు అధికారులు.. కమిషన్‌లో కంప్యూటర్లు, నెట్‌వర్కింగ్ వ్యవస్థ, ప్రోగ్రామింగ్ వ్యవస్థలో కీలకంగా పనిచేసేందుకు నలుగురు అధికారులు ఉంటారు. జూనియర్ సివిల్ జడ్జి స్థాయి అధికారి లా ఆఫీసర్‌గా కొనసాగుతారు. ఈ మేరకు శాశ్వత ప్రాతిపదికన నియామకాలకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

టీఎస్‌పీఎస్సీకి ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన పోస్టులు

డిజిగ్నేషన్	పోస్టు
కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్	1
డిప్యూటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్	1
అసిస్టెంట్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్	1
చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్	1
చీఫ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్	1
సీనియర్ నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్	1
జూనియర్ నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్	1
సీనియర్ ప్రోగ్రామర్	1
జూనియర్ ప్రోగ్రామర్	1
లా ఆఫీసర్ (జూనియర్ సివిల్ జడ్జి కేడర్)	1

ఎస్సీలకు చంద్రబాబు క్షమాపణలు చెప్పాల్సిందే: ఎంపీ నందిగం



సాక్షి, అమరావతి: ఎస్సీలను కించపరుస్తూ మాట్లాడిన మాటలకు ప్రతిపక్ష నేత చంద్రబాబు, అతని కుమారుడు లోకేశ్‌లు క్షమాపణ చెప్పాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ నందిగం సురేష్ శుక్రవారం డిమాండ్ చేశారు. ఎస్సీలను కించపరుస్తూ మాట్లాడిన మాటలకు వ్యతిరేకంగా ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంలో ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలుపుతుంటే టీడీపీ కార్యకర్తలు రాళ్లతో దాడి చేయడాన్ని ఆయన ఖండించారు. కుప్పం, మంగళగిరిలలో ఓడిపోతున్న ఆందోళనతో తండ్రీకొడుకులు ఇటువంటి దాడులకు దిగుతున్నారంటూ దుయ్యబట్టారు.

పేదల ఇళ్ల స్థలాలను అడ్డుకోవడం దుర్మార్గం

- 936వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



తాడికొండ: రాజధానిలో పేదవాడికి జానెడు జాగా ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుని చదును చేస్తుంటే రైతుల ముసుగులో బాబు అండ్‌తో కులవాదులు అడ్డుకోవడం దుర్మార్గమని బహుజన పరిరక్షణ సమితి నాయకులు ధ్వజమెత్తారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 936వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో శుక్రవారం పలువురు మాట్లాడారు. చట్టసభల సాక్షిగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుని సీఆర్డీయే చట్టంలో పొందుపరచిన విధంగానే 5 శాతం భూమిని పేదలకు కేటాయిస్తుంటే అడ్డుకునే హక్కు కులవాదులకు ఎవరిచ్చారని మండిపడ్డారు. ప్రభుత్వానికి భూములిచ్చేసిన తరువాత రైతులకు వాటిపై అధికారం ఎలా ఉంటుందో చెప్పాలని, పేదలంటే అలుసుగా ప్రవర్తిస్తూ దుర్మార్గంగా అడ్డుకుంటున్న కులవాదులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సీఎంగా వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అమరావతి అభివృద్ధికి అడుగులు వేస్తుంటే కులవాదులంతా అడ్డుతగలడం సిగ్గుచేటన్నారు. నాయకులు గురునాథం, జోషి, వరప్రసాద్, దాసు, సాంబయ్య, ఆదాం తదితరులు పాల్గొన్నారు.

అక్షయ తృతీయపైనే ఆశలన్నీ

గత నెల రోజులుగా పసిడి అమ్మకాలు ఢీలా.. అక్షయ తృతీయపై వ్యాపారుల నమ్మకం

పసిడి ధరలు మిడిసి పడుతున్నాయి. నెల రోజుల నుంచి బంగారం ధరలు పరుగులు పెడుతున్నాయి. దీంతో కొనుగోలుదారులే కాకుండా బులియన్ వర్తకులు కూడా ఆందోళన చెందుతున్నారు.



నరసాపురం: ధరలు ఆకాశాన్ని తాకుతున్న సమయంలో శనివారం అక్షయ తృతీయ పర్వదినం వచ్చింది. దీంతో వ్యాపారులు అమ్మకాలపై నమ్మకం పెట్టుకున్నారు. శుక్రవారం ట్రేడింగ్ ముగిసే సరికి నరసాపురం బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ 61,150, 916 క్యారెట్ల బంగారం 56,050గా ట్రేడయ్యింది. కాసు వస్తువు కొనాలంటే తరుగు, మజూరీతో లెక్కతో దగ్గరగా రూ.50 వేలు ఖర్చుపెట్టాల్సిందే. దీంతో ఈ అక్షయ తృతీయ అమ్మకాలు ఎలా సాగుతాయనే విషయంలో బులియన్ వర్గాల్లో సందిగ్ధత నెలకొంది. సెంటిమెంట్‌తో ఎంతోకొంత బంగారం కొనడానికి మొగ్గుచూపుతారని.. వచ్చేనెల నుంచి పెళ్లిళ్ల సీజన్ ప్రారంభం కానుండడంతో ఈ ఏడాది అక్షయతృతీయ అమ్మకాలు బాగుంటాయని ఆశతో ఉన్నారు.

నెలరోజులుగా అమ్మకాలు డౌన్

గత నెలరోజుల నుంచి బంగారం ధరలు పెరుగుతూనే ఉన్నాయి. దీంతో ఉమ్మడి పశ్చిమలో బంగారం షాపులు కొనుగోళ్లు లేక వెలవెలబోతున్నాయి. మరోవైపు పండుగలు లేవు. ప్రస్తుతం మూఢం నడుస్తుండటంతో పెళ్లిళ్ల జరగడంలేదు. దీంతో అసలు జ్యూయలరీ షాపుల వైపు చూసే పరిస్థితి లేదన్నట్టుగా తయారైంది. ఉమ్మడి పశ్చిమలో రోజుకు రూ.3 కోట్ల వరకూ అమ్మకాలు తగ్గాయి. పెళ్లిళ్లు వంటి వాటికి బంగారం కొందామనుకున్న వారు అక్షయ తృతీయ రోజు కొందామని వాయిదా వేసుకుంటూ వచ్చారు. దీంతో గత నెలరోజులగా బంగారం మార్కెట్ డల్‌గా నడిచింది.

అక్షయ తృతీయ ఉత్తర భారతదేశంలో ప్రసిద్ధమైన పండుగ. కొన్ని సంవత్సరాలుగా తెలుగు రాష్ట్రాల్లో కూడా ప్రాచుర్యం పొందింది. అక్షయ తృతీయరోజు బంగారం కొనుగోలు చేస్తే ఇల్లంతా స్వర్ణశోభితం అవుతుందని, మరింతగా బంగారం కొనుగోలు చేసే అవకాశం వరిస్తుందని ఓ నమ్మకం. అక్షయం అంటే నాశనం కానిదని అర్థం. అక్షయ తృతీయ అంటే నాశనం కాకుండా వర్ధిల్లేదని నమ్మకం. లక్ష్మీదేవిని విష్ణుమూర్తి పెళ్లి చేసుకున్న రోజు. కుబేరుడిని ధనానికి అధిపతిగా నియమించిన రోజు ఇదేనని పురాణాల గాథలు ప్రాచూర్యంలో ఉన్నాయి. దీంతో అక్షయ తృతీయ రోజు పెద్ద ఎత్తున బంగారం కొనుగోళ్లు చేయడం సంప్రదాయంగా వస్తోంది. ఈ రోజున కనీసం గ్రాము అయినా కొనాలని ప్రయత్నం చేస్తారు. జ్యూయలరీ షాపులు కూడా పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహిస్తుంటాయి. శనివారం అక్షయ తృతీయ సందర్భంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని అన్ని పట్టణాల్లో ప్రధాన జ్యూయలరీ షాపులను ముస్తాబు చేశారు. కొన్ని పట్టణాల్లో తరుగు, మజూరీలో డిస్కౌంట్స్ ప్రకటించి ఆకర్షిస్తున్నారు.

ఈ ఏడాది అమ్మకాలు బాగుంటాయి

గత మూడేళ్ల నుంచి కరోనా కారణంగా అక్షయ తృతీయరోజు అమ్మకాలు సాగలేదు. గత ఏడాది కరోనా ఎఫెక్ట్ లేనప్పటికీ అమ్మకాలు గతంఓ పోలిస్తే పెద్దగా సాగలేదు. కానీ ఈ ఏడాది అమ్మకాలు బాగుంటాయిని అనుకుంటున్నాము. ధరలు పెరుగుదల కలవరపెడుతుంది. అయితే పెళ్లిళ్ల సీజన్ ప్రారంభం కాబోతుండటం అమ్మకాలు బాగుంటాయని అనుకుంటున్నాము. అక్షయతృతీయరోజు ఎంతోకొంత బంగారం కొనాలన్న సెంటిమెంట్ ఉంది.

పాలూరి బాబ్జి, జ్యూయలరీ షాపు యజమాని, నరసాపురం

విరబూసిన పాల సంపంగి

మన్యంలో ప్రకృతి అందాలకు తోడు సీజన్ల వారీగా అద్భుత దృశ్యాలు కనువిందు చేస్తుంటాయి. హుకుంపేట మండలంలోని తీగలవలస పంచాయతీ కేంద్రంలో ఓ గిరిజనుడి ఇంటివద్ద పాలసంపంగి చెట్టు ఇలా పూలతో విశేషంగా ఆకట్టుకుంటోంది.

- హుకుంపేట (అల్లూరి సీతారామరాజు జిల్లా)



తెలంగాణ

గొంతు నులిమి చంపి.. పెయింట్ డబ్బాలో కుక్కి

ఎనిమిదేళ్ల బాలుడి దారుణ హత్య

హైదరాబాద్‌లోని అల్లావుద్దీన్ కోఠిలో దారుణ ఘటన



వహీద్‌ఖాన్ (ఫైల్)

సనత్‌నగర్ (హైదరాబాద్): ఎనిమిదేళ్ల బాలుడు.. నమాజ్ కోసమంటూ ఇంట్లోంచి వెళ్లాడు.. అతడి తండ్రితో గొడవలు ఉన్న ఓ హిజ్రా ఆ బాలుడిని చూశాడు. అనుచరుడిని పంపి ఇంటికి రప్పించుకున్నాడు. గొంతు నులిమి చంపేశాడు. పెయింట్ బకెట్‌లో కుక్కి, గోనె సంచీలో మూటకట్టాడు. చెత్త సంచీ అని చెప్పి నాలాలో పడేయించాడు. బాలుడి ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు గాలిస్తుంటే.. ఏమీ తెలియనట్టు వారి వెంట తిరిగాడు. కానీ పోలీసులు సీసీ కెమెరాల సాయంతో దురాగతాన్ని తేల్చారు. హైదరాబాద్‌లోని సనత్‌నగర్ అల్లావుద్దీన్ కోఠిలో గురువారం రాత్రి ఈ ఘటన జరిగింది.

డబ్బుల కోసం గొడవలతో..

అల్లావుద్దీన్ కోఠిలో నివాసముండే వసీంఖాన్ సనత్‌నగర్ ప్రధాన రోడ్డులోని ఆల్విన్ కంపెనీ సమీపంలో వస్త్ర దుకాణం నిర్వహిస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన ఇమ్రాన్‌ఖాన్ (30) రెండేళ్ల క్రితం ట్రాన్స్‌జెండర్‌గా మారి, తన పేరును ఫిజా జాన్‌గా మార్చుకున్నాడు. స్థానికంగా చిట్టీల వ్యాపారం చేసే ఫిజా జాన్‌కు వసీంఖాన్‌తో ఆర్థిక లావాదేవీలు ఉన్నాయి. కోవిడ్ సమయంలో వసీంఖాన్ నుంచి ఇమ్రాన్‌ఖాన్ పెద్ద మొత్తంలో డబ్బు తీసుకుని తిరిగివ్వక పోవడంతో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం కూడా గొడవ జరిగింది. దీనితో ఫిజా జాన్ కక్ష పెంచుకున్నాడు. స్థానికంగా ఓ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న వసీంఖాన్ కుమారుడు వహీద్‌ఖాన్.. గురువారం సాయంత్రం తన స్నేహితుడితో కలసి నమాజ్‌కు వెళ్తుండగా చూసిన ఫిజా జాన్ ఆ బాలుడిని చంపి తండ్రిపై కక్ష సాధించాలని అనుకున్నాడు. మసీదు నుంచి బయటికి వచ్చిన వహీద్‌ను తన అనుచరుడి ద్వారా ఇంటికి రప్పించుకున్నాడు. ఇంట్లోనే బాలుడి గొంతు నులిమి హత్య చేశాడు. తర్వాత పెయింట్ బకెట్‌లో మృతదేహాన్ని కుక్కాడు. దానిని ఓ గోనె సంచిలో పెట్టి మూటకట్టాడు. తనకు తెలిసిన ఆటోడ్రైవర్‌కు ఫోన్‌చేసి ఇంట్లో చెత్త ఉందని, తీసుకెళ్లి నాలాలో పడేయాలని కోరాడు. ఆటోడ్రైవర్ ఆ మూటను జింకలవాడ వద్ద నాలాలో పడేసి వెళ్లిపోయాడు. నమాజ్ కోసం వెళ్లిన వహీద్ రాత్రయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. బాలుడికోసం గాలింపు చేపట్టారు. ఫిజా జాన్ కూడా ఏమీ తెలియనట్టుగా గాలింపులో వారి వెంట తిరిగాడు. ఎంతకీ బాలుడి ఆచూకీ దొరక్కపోవడంతో తల్లిదండ్రులు సనత్‌నగర్ పోలీసులను ఆశ్రయించగా.. వారు సీసీకెమెరా ఫుటేజీలను పరిశీలించారు. ఫిజా జాన్ ఇంట్లోకి వెళ్లిన బాలుడు తిరిగి బయటికి రాలేదని గుర్తించారు. ఫిజా జాన్‌ను గట్టిగా విచారించడంతో విషయం బయటపెట్టాడు. గజ ఈతగాళ్ల సాయంతో నాలాలో గాలింపు చేపట్టగా.. మూట దొరికింది. దానిని విప్పిచూడగా పెయింట్ డబ్బాలో వహీద్ మృతదేహం కనిపించింది. అమావాస్య కావడంతో ఇది నరబలి అని స్థానికులు అనుమానిస్తుండగా.. కక్ష సాధింపులో భాగంగా నిందితుడు హత్యకు పాల్పడినట్టు పోలీసులు భావిస్తున్నారు.

మైత్రి మూవీ మేకర్స్ నిర్మాత నవీన్‌కు అస్వస్థత

మూడోరోజూ ఐటీ తనిఖీలు

సాక్షి, హైదరాబాద్: అక్రమమార్గాల్లో పెట్టుబడులు తీసుకోవడం, పన్ను ఎగవేత వంటి ఆరోపణలపై మైత్రి మూవీ మేకర్స్ సంస్థ కార్యాలయం, సినీ దర్శకుడు సుకుమార్ ఇళ్లలో ఐటీ అధికారుల తనిఖీలు శుక్రవారం వరుసగా మూడోరోజూ కొనసాగాయి. ఇటీవల విడుదలైన కొన్ని భారీ బడ్జెట్ సినిమాల పెట్టుబడుల కోసం విదేశాల నుంచి నిబంధనలకు విరుద్ధంగా పెద్దమొత్తంలో డబ్బులు తీసుకోవడం, జీఎస్టీ చెల్లింపుల్లోనూ అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై ఈ సోదాలు కొనసాగుతుండటం తెలిసిందే. ఓ వైపు ఐటీ అధికారుల తనిఖీలు కొనసాగుతుండగానే, మైత్రి మూవీ మేకర్స్ నిర్మాతల్లో ఒకరైన ఎర్నేని నవీన్ అస్వస్థతకు గురయ్యారు. దీంతో వెంటనే ఆయనను కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. బీపీ ఎక్కువ కావడంతో అస్వస్థతకు గురయ్యారని, ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్టు వైద్యులు తెలిపారు. మైత్రి మూవీస్ కార్యాలయం, నిర్మాతల ఇళ్లల్లో ఐటీ జరిపిన సోదాల్లో.. ఇప్పటికే పెద్ద మొత్తంలో జరిపిన ఆస్తుల కొనుగోలుపైనా ఆరా తీస్తున్నట్టు తెలిసింది. ముంబైకి చెందిన ఓ ఫైనాన్షియర్ హవాలా లింకులతో ఐటీ అధికారులు మూడు రోజులుగా నగరంలో తనిఖీలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

కొబ్బరి చెట్టు ఎక్కే యంత్రానికి పేటెంట్

ఉద్యాన వర్సిటీ విద్యార్థి ఆవిష్కరణ



పేటెంట్ పత్రాన్ని రూపకర్త మేరుగు చంద్రసూర్యారావుకు అందజేస్తున్న వర్సిటీ వీసీ టి.జానకీరామ్. చిత్రంలో సీనియర్ సైంటిస్టు డీవీ స్వామి

తాడేపల్లిగూడెం: కొబ్బరిచెట్లు ఎక్కడానికి డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయ పరిశోధనా విద్యార్థి రూపొందించిన పరికరానికి పేటెంట్ దక్కింది. చెట్ల కాండానికి నష్టం కలిగించకుండా కొబ్బరి చెట్లు ఎక్కవచ్చు.

ఆవిష్కరణ జరిగింది ఇలా..

20 నుంచి 30 మీటర్లు ఎత్తు పెరిగే కొబ్బరి చెట్లు ఎక్కడం అంత సులువు కాదు. కొబ్బరి తోటల్లో వందలాది చెట్లు ఎక్కి మోకు సాయంతో కాయలు తీయడం చాలా కష్టం. కొన్ని కొన్ని సందర్భాలలో ప్రమాదాలు జరగడంతో పాటు కార్మికులు ఆరోగ్యపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఈ పరిస్థితిని అధిగమించడానికి కొబ్బరి చెట్ల స్వర్గం కేరళను ఆదర్శంగా తీసుకొని చెట్లు ఎక్కే పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. కేవీకే మార్గదర్శనంలో వీటి వినియోగంపై శిక్షణా తరగతులు జరిగాయి. ఉద్యాన వర్సిటీ సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ డీవీ స్వామి, డాక్టర్ పి.అశోక్‌ల మార్గదర్శనంలో వర్సిటీ పీహెచ్‌డీ విద్యార్థి డాక్టర్ మేరుగు చంద్ర సూర్యారావు ఎలాంటి ప్రమాదం లేకుండా కొబ్బరి చెట్లు ఎక్కే యంత్రం తయారు చేశారు.

చెట్టుకు నష్టం లేకుండా

కొబ్బరి చెట్టుకు ఏ విధమైన నష్టం కలుగకుండా ఎక్కడానికి వీలుగా ఉండే యంత్రానికి రూపకల్పన చేశారు. ఉపకులపతి డాక్టర్ తోలేటి జానకీరామ్ ప్రోత్సాహంతో భారత ప్రభుత్వ పేటెంట్ డిజైన్స్‌కు పంపించగా ఆమోదం లభించింది. ఈ మేరకు పేటెంట్ హక్కులు నిర్ధారిస్తూ జారీ చేసిన సర్టిఫికెట్‌ను వీసీ జానకీరామ్ ఆవిష్కర్త చంద్రసూర్యారావుకు శుక్రవారం అందచేశారు. ఈ పరికరం అందుబాటులోకి వచ్చిన తర్వాత రైతులకు ఎంతో మేలుకలుగుతుందని వీసీ అన్నారు. రైతులకు,కొబ్బరి తీత కార్మికులకు కొబ్బరి చెట్లు ఎక్కేటప్పుడు భద్రత లభిస్తుందన్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943